అనుదినం... జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
www.navatelangana.com
బుధవారం 29-01-2025
సంపుటి : 11 సంచిక : 29 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు వెల : 6.50

రూపాయి దిగాలు..
మరో 25 పైసలు పతనమై రూ. 86.56కి..



ముంబయి : అంతర్జాతీయ మార్కెట్‌లో రూపాయి విలువ ఆందోళనకరంగా రోజు రోజుకు పడిపోతోంది. మంగళవారం డాలర్‌తో రూపాయి విలువ 25 పైసలు పతనమై 86.56 స్థాయికి దిగజారింది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వాణిజ్య టారిఫ్ భయాలు రూపాయిపై ఒత్తిడిని కొనసాగిస్తున్నాయి. ఇంటర్ ...13లో



సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శిగా
జాన్‌వెస్లీ

15 మందితో రాష్ట్ర కార్యదర్శివర్గం
60 మందితో రాష్ట్ర కమిటీ
కొత్తగా ఏడుగురికి చోటు
ఆహ్వానితులుగా ఏడుగురు
ప్రత్యేక ఆహ్వానితులుగా ఐదుగురు

సంగారెడ్డి నుంచి అచ్చిన ప్రశాంత్


సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా జాన్‌వెస్లీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ పార్టీ నూతన రాష్ట్ర కమిటీ 60 మందితో ఏర్పడింది. అందులో 15 మంది రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. రాష్ట్రకమిటీకి ఆహ్వానితులుగా ఏడుగురు, ప్రత్యేక ఆహ్వానితులుగా ఐదుగురిని ఎన్నుకున్నారు. సంగారెడ్డి ...14లో

సమరశీల పోరాటాలతో ప్రజలకు చేరువకండి

నివాస ప్రాంతాల్లో కృషిని పెంచండి | ప్రపంచ ఆర్థిక మాంద్యాన్ని వివరించండి

సరళీకరణను ఉపేక్షించొద్దు : సీపీఐ(ఎం) శ్రేణులకు పొలిట్ బ్యూరో సభ్యులు రాఘవులు పిలుపు

సంగారెడ్డి నుంచి బీవీఎన్ పద్మరాజు



దేశంలోని వ్యవసాయం, పరిశ్రమలతో పాటు అనేక ఇతర రంగాల్లో పలు కొత్త రకాల పరిస్థితులు నెలకొంటున్నాయనీ, వాటిని అర్థం చేసుకుని ఆందోళనలకు శ్రీకారం చుట్టాలని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ.రాఘవులు ఆ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. సరళీకృత, ఆర్థిక విధానాలపై సమరశీల పోరాటాలను సాధించడం ద్వారా ప్రజలకు చేరువ కావాలని సూచించారు. ముఖ్యంగా పట్టణాలు, గ్రామాల్లోని నివాస ప్రాంతాల్లో ప్రజా సమస్యలపై మన కృషి పెరగాలని ఆయన సూచించారు. ఇలాంటి ఆయుధాలన్నింటికీ పదును పెట్టడం ద్వారా రానున్న మూడేండ్లలో సీపీఐ(ఎం)ను ఒక ప్రభావిత శక్తిగా రూపొందించాలని ఆయన పిలుపునిచ్చారు. సంగారెడ్డిలో మంగళవారం ముగిసిన సీపీఐ(ఎం) నాలుగో రాష్ట్ర మహాసభలో ప్రతినిధులనుద్దేశించి ఆయన ప్రసంగించారు. హిందూత్వ, మతోన్మాద వ్యతిరేక పోరాటంలో సైద్ధాంతిక పోరాటాలను మిళితం చేయాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. సామాజిక రంగంలో వైవిధ్యంగా కృషి చేయాలని కోరారు. ప్రస్తుతం వివిధ ...3లో

ముగిసిన సీపీఐ(ఎం) రాష్ట్ర నాలుగో మహాసభ
వివరాలు 3లో



13లో..

అమెరికాకు హాని కలిగిస్తే చర్యలే

మన ప్రజలపై కన్నా బయటి వారిపై పన్నులు వేయాలి : ట్రంప్ వ్యాఖ్యలు
చైనా, భారత్, బ్రెజిల్ సహా పలు దేశాల్లో సుంకాలు ఎక్కువ అంటూ విమర్శలు

30న అఖిలపక్ష సమావేశం

31 నుంచి పార్లమెంట్ బడ్జెట్ భేటీ
తొలిరోజు ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి ప్రసంగం 13లో..
ఫిబ్రవరి 1న బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్

డిస్కంల రెవెన్యూ లోటు రూ.20,151 కోట్లు

ఐనా కరెంటు చార్జీల పెంపు లేదు :
టీజీఈఆర్సీకి 2025-26 ఏఆర్ఆర్‌ల సమర్పణ 3లో..

పెట్టుబడులన్నీ పారదర్శకమే..

ఆయా సంస్థల నుంచే వివరాలు తెప్పించుకోవచ్చు

వరల్డ్ ఎకనామిక్ ఫోరం ద్వారా రూ.1.80 లక్షల కోట్లు సాధించాం
1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం :
సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు


మీడియా సమావేశంలో సీఎం, మంత్రులు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం ద్వారా వచ్చిన పెట్టుబడులు అన్నీ పారదర్శకమే అని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. ఒప్పందాలకు సంబంధించిన సమస్త సమాచారాన్ని పబ్లిక్ డొమైన్‌లో పెడతామనీ, ఎవరికైనా ఏవైనా సందేహాలు ఉంటే ఆయా సంస్థల నుంచే వివరాలు తెప్పించుకోవచ్చని తేల్చిచెప్పారు. రాష్ట్ర ప్రభుత్వంపై విశ్వాసం ఉంచి పెట్టుబడులు పెట్టిన సంస్థలన్నింటికీ ధన్యవాదాలు తెలిపారు. పెట్టుబడులు, ఉద్యోగ, ఉపాధి అవకాశాల సృష్టే తమ తొలి ప్రాధాన్యత అని చెప్పారు. మంగళవారంనాడిక్కడి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మంత్రులు దనసరి అనసూయ సీతక్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు తదితరులతో కలిసి వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దెబ్బతీయాలని కొందరు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారనీ, దాన్ని ప్రపంచ పారిశ్రామికవేత్తలు పటాపంచలు చేశారని అన్నారు. ఈ పెట్టుబడులు ఆషామాషీగా ...13లో

టెంపుల్, హెల్త్ ఏకో టూరిజానికి ప్రాధాన్యత 3లో..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
ఎక్స్‌పీరియమ్ ప్రారంభోత్సవంలో మంత్రి జూపల్లి
సినీ నటులు చిరంజీవి, పద్మశ్రీ వనజీవి రామయ్య
ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు

ఇసుక మాఫియాపై ఉక్కుపాదం

ఇందిరమ్మ ఇండ్లకు సరఫరాపై అధ్యయనం : సీఎం 13లో.

బీజేపీ ఆదాయం ఫుల్లు



ఈబీల ద్వారా కాషాయ పార్టీకే అధిక విరాళాలు
రెండో స్థానంలో కాంగ్రెస్
బీఆర్ఎస్, తృణమూల్‌కూ భారీగానే డొనేషన్లు

కేంద్రంలోని అధికార బీజేపీ వార్షిక ఆదాయం రోజురోజుకూ పెరిగిపోతోంది. 2022-23లో రూ.2,360.8 కోట్లుగా ఉన్న ఆ పార్టీ ఆదాయం మరుసటి సంవత్సరానికి ఏకంగా 83 శాతం పెరిగి రూ.4,340.5 కోట్లకు చేరింది. ఇందులో రూ.1,685.6 కోట్లు ఎన్నికల బాండ్ల రూపంలో వచ్చినవేనని ఎన్నికల కమిషన్‌కు బీజేపీ సమర్పించిన తాజా వార్షిక ఆడిట్ నివేదిక చెబుతోంది. ఏ ఇతర పార్టీ కూడా బాండ్ల రూపంలో ఇంత భారీగా వార్షిక ఆదాయం పొందలేదు. ఇదే కాలంలో కాంగ్రెస్ ఆదాయం కూడా రూ.452.4 కోట్ల నుండి రూ.1,225 కోట్లకు....అంటే 170 శాతం పెరిగింది. ప్రధాన ప్రతిపక్ష పార్టీ అయిన కాంగ్రెస్ ఎన్నికల బాండ్ల రూపంలో తన ఆదాయాన్ని 384 శాతం మేర పెంచుకుంది. 2022-23లో కాంగ్రెస్‌కు ఎన్నికల బాండ్ల ద్వారా రూ.171 కోట్ల ఆదాయం లభిస్తే 2023-24లో రూ.828.4 కోట్లు వచ్చింది. బాండ్లకు సంబంధించినంత వరకూ బీజేపీ తర్వాత కాంగ్రెస్‌కే ఎక్కువ ఆదాయం లభించింది.

న్యూఢిల్లీ : 2023-24లో బాండ్ల రూపంలో బీఆర్ఎస్‌కు రూ.685.5 కోట్లు, తృణమూల్ కాంగ్రెస్‌కు రూ.612.4 కోట్ల ఆదాయం సమకూరింది. ఇక ఖర్చుల విషయానికి వస్తే గత ఆర్థిక సంవత్సరంలో బీజేపీ 2,211.7 కోట్లు ఖర్చు చేసింది. 2022-23లో పెట్టిన ఖర్చుతో పోలిస్తే ఇది 62 శాతం అధికం. ఇందులో ఎన్నికలు, సాధారణ ప్రచారంపై ఆ పార్టీ రూ.1,754 కోట్లు ఖర్చు చేసింది. గత ఆర్థిక సంవత్సరంలో కాంగ్రెస్ వార్షిక వ్యయం రూ.1,025.20 కోట్లు. రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ్ యాత్ర కోసం ఆ పార్టీ రూ.49.6 కోట్లు ఖర్చు చేసింది. తొలి విడత భారత్ జోడో యాత్రకు రూ.71.8 కోట్లు ఖర్చయ్యాయి. 2023-24 ఆడిట్ నివేదికలో బీజేపీ ప్రకటించిన స్వచ్ఛంద విరాళాలు ...13లో

కేసీఆర్ ఆనవాళ్లు చెరిపే కుట్ర



రైతులను నిలువునా మోసం చేశారు

కోమటిరెడ్డికి దమ్ముంటే ఏం అభివృద్ధి చేశారో చెప్పాలి
నల్లగొండ బీఆర్ఎస్ రైతు మహాధర్నాలో కేటీఆర్

నవ తెలంగాణ- నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్రంలో రైతులకు సాగు నీరు, పెట్టుబడి సహాయం అందజేసి వ్యవసాయాన్ని పండుగగా మార్చిన కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేందుకు ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతుబంధుపై కుట్ర చేస్తున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రెండు లక్షల రుణమాఫీ, పంటకు పెట్టుబడి సహాయంగా ఏడాదికి రూ.15000 ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందంటూ.. మంగళవారం నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించిన రైతు మహాధర్నాలో ఆయన మాట్లాడారు. ధాన్యం దిగుబడుల్లో తెలంగాణను దేశంలో మొదటి స్థానంలో నిలబెట్టింది కేసీఆర్ అని చెప్పారు. పంట పెట్టుబడి కోసం రైతుబంధు పథకాన్ని అమలు చేసి ఏడాదికి రూ.10000 చొప్పున అందజేసిన ఘనత కేసీఆర్‌ది అన్నారు. రేవంత్‌రెడ్డి మాత్రం రైతు భరోసాపై మాట తప్పారు.. రైతులను నిలువునా మోసం చేశారు అని ...13లో

నాగోబాకు మహాజలాభిషేకం

గోదావరి జలాలతో మెస్రం వంశీయుల పూజలు

హాజరైన కలెక్టర్, ఐటీడీఏ పీఓ, ఎస్పీ, ఎమ్మెల్యే
దర్బార్‌కు హాజరుకానున్న రాష్ట్ర మంత్రులు



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

రాష్ట్రంలో సమ్మక్క సారలమ్మ జాతర తర్వాత రెండో అతి పెద్ద జాతరైన ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కెస్లాపూర్‌లోని నాగోబా జాతర బుధవారం నుంచి ప్రారంభం కానుంది. దీనికి ముందు మంగళవారం అర్ధరాత్రి మెస్రం వంశీయులు గంగాజలంతో జలాభిషేకం చేశారు. తర్వాత మహా జాతర ప్రారంభమవుతుంది. ఈ జాతరకు మెస్రం వంశీయులు పక్షం రోజుల ముందు నుంచే శ్రీకారం చుట్టారు. మంచిర్యాల జిల్లాలోని హస్తిన మడుగు నుంచి గంగాజలాన్ని తీసుకొచ్చారు. గంగాజలంతో నాగోబాకు జలాభిషేకం చేయడం ఆనవాయితీ. మంగళవారం రాత్రి 9గంటల నుంచి 11గంటల వరకు మెస్రం వంశం ఆచార సంప్రదాయం ప్రకారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజలకు మెస్రం వంశీయుల ఖటోడ(పూజారులు) దేవ్‌రావ్, హన్మంతు, కోసేరావ్, పీఠాధిపతి మెస్రం వెంకట్ రావ్, ఆలయ కమిటీ చైర్మెన్ మెస్రం ఆనంద్‌రావ్ ఆధ్వర్యంలో ఆలయాన్ని శుద్ధి చేశారు. అనంతరం కోలికోమ్, పెప్రే, తూమ్, డోలు ...13లో

హైదరాబాద్ నగరంలో ప్రభుత్వ ప్రధాన ప్రభుత్వాస్పత్రుల విస్తరణ పనుల పరిస్థితి ఆగుతూ..! సాగుతూ..! అన్న చందంగా తయారైంది. మెరుగైన వైద్య సేవలు అందించడం, రోగుల సంఖ్యకనుగుణంగా సౌకర్యాల కల్పన కోసం చేపట్టిన భవన నిర్మాణ పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. రెండు, మూడేండ్లుగా పనులు జరుగుతున్నా.. నిధులు సకాలంలో విడుదల కాక భవన నిర్మాణాలు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. అటు సర్కార్ పట్టించుకోక.. ఇటు సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేక పనుల్లో స్తబ్ధత నెలకొంది. దీంతో పంజాగుట్ట నిమ్స్, నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి, ఎర్రగడ్డ మెంటల్ హాస్పిటల్‌లో రోగులతోపాటు సహాయకులకు ఇబ్బందులు తప్పడం లేదు. నిలోఫర్‌లో పనులు పూర్తయినా భవనం ప్రారంభానికి నోచుకోవడం లేదు.

ఆగుతూ.. సాగుతూ..!

నత్తనడకన ఆస్పత్రుల నిర్మాణ పనులు


ఏండ్లు గడుస్తున్నా అందుబాటులోకి రాని భవనాలు
నిధుల విడుదలలో జాప్యం.. రోగులకు అవస్థలు
నిమ్స్, ఎర్రగడ్డ, ఫీవర్ ఆస్పత్రులు సహా అన్నింటా అదే పరిస్థితి
నిర్మాణం పూర్తయినా ప్రారంభం కాని నీలోఫర్ భవనం

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రభుత్వాస్పత్రులకు నిత్యం వచ్చే రోగుల తాకిడి రోజురోజుకూ పెరుగుతోంది. వర్షాకాలం సీజనల్ వ్యాధులతో ప్రభుత్వాస్పత్రుల్లోని ఓపీ, ఐపీ బ్లాకులు రోగులతో కిటకిటలాడుతాయి. పడకలు సైతం సరిపోని పరిస్థితి ఉంటుంది. నగరంలోని ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రులకు నగరం నుంచే కాకుండా ఆయా జిల్లాల నుంచి కూడా భారీ సంఖ్యలో రోగులు వస్తుండటంతో వడకలు దొరకడం కష్టతరంగా మారింది. రోగుల సంఖ్యకనుగుణంగా సదుపాయాలను పెంచడంలో విపరీతమైన జాప్యం జరుగుతోంది. మరోవైపు రోగుల సంఖ్యకు అనుగుణంగా ఓపీ బ్లాక్‌లు, ల్యాబ్‌లు, రోగి సహాయకులకు బ్లాక్‌లు, ఐపీ రోగులకు వార్డులు ఇలా నిర్మాణాలు మూడు, నాలుగేండ్లుగా నిర్మాణ దశలోనే ఉన్నాయి. నల్లకుంట ఫీవర్ ఆస్పత్రిలో నిధుల్లేక దాదాపు రెండేండ్ల నుంచి పనులు ముందుకు సాగడం లేదు. ఎర్రగడ్డ మెంటల్ ఆస్పత్రిలో సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ బిల్డింగ్ పనులు నత్తనడకనను తలపిస్తున్నాయి. నిమ్స్‌లో మాతా శిశు సంరక్షణ ఆరోగ్య కేంద్రం (ఎంసీహెచ్‌సీ) నిర్మాణ పనులు ఆపసోపాలు పడుతున్నాయి. నిలోఫర్‌లో భవన నిర్మాణం పూర్తయినా అందుబాటులోకి రాకపోవడం గమనార్హం.

పునాదిలోనే పురిటి నొప్పులు..!

నిమ్స్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్మించ తలపెట్టిన ఎంసీహెచ్‌సీ భవన సముదాయ నిర్మాణ పనుల ఆరంభం అట్టహాసంగా జరిగినప్పటికీ కొంత కాలంగా అసంపూర్తి దశలోనే దర్శనమిస్తున్నాయి. 200 పడకల సామర్థ్యంతో జీ-7 భవన సముదాయాన్ని నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించారు. నిమ్స్ విస్తరణ పనులకు ఎర్ర మంజిల్‌లో 33 ఎకరాల్లోని ప్రభుత్వ భూమిలో ఐదెకరాలను ప్రభుత్వం కేటాయించింది. రూ.490 కోట్ల అంచనాతో కూడిన భవన నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. పూర్తిగా ప్రభుత్వ నిధులతో ...13లో


ఫీవర్ హాస్పిటల్

మూడేండ్లయినా ముహూర్తం కుదర్లే

రోగి సహాయకుల అవసరాలను తీర్చేందుకు నిలోఫర్ ఆస్పత్రిలో అటెండర్స్ బ్లాక్‌ను జీహెచ్ఎంసీ ఎమ్మెల్యే నిధులతో చేపట్టారు. గ్రౌండ్ ఫ్లోర్ మూడంతస్తులతో దీని నిర్మాణం పూర్తయి మూడేండ్లు కావస్తున్నా ఇంకా అందుబాటులోకి రాలేదు. ఏండ్లు గడుస్తున్నా జీహెచ్ఎంసీ నీలోఫర్‌కు భవనాన్ని అప్పగించకపోవడంతో అటెండర్స్ బ్లాక్ ప్రారంభానికి నోచుకోలేదు. ఈ బ్లాక్ అందుబాటులోకి రాక జీ-3 భవనం నిరుపయోగంగా మారింది.

సంస్థ ఉద్యోగులే మోసం చేశారు

- 22 మందిపై కేసు నమోదు..

దర్యాప్తు ప్రారంభం

నకిలీ బిల్లులు సృష్టించి రూ.102 కోట్లు కాజేశారు : సీఎస్‌బీకి అమెజాన్ ప్రతినిధి జి.ఎస్ అర్జున్ కుమార్ ఫిర్యాదు



నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

ప్రముఖ ఈ- కామర్స్ సంస్థ అమెజాన్‌ను సంస్థ ఉద్యోగులే మోసం చేశారని అమెజాన్ ప్రతినిధి జి.ఎస్ అర్జున్ కుమార్ ఆరోపించారు. వినియోగదారులకు సరుకులను అందించే క్రమంలో నకిలీ బిల్లులు సృష్టించి రూ.102 కోట్లను కాజేశారన్నారు. ప్యాకేజీపై పేర్కొన్న చిరునామాలో వినియోగదారుడు లేడని చెప్తూ రవాణా చార్జీలు క్లెయిమ్ చేసుకున్నారని వివరించారు. హైదరాబాద్ ఆఫీసు కేంద్రంగా జరిగిన ఈ మోసంలో సంస్థ సిబ్బందితో పాటు గతంలో పనిచేసి మానేసిన వారి ప్రమేయం కూడా ఉన్నదని ఆయన ఆరోపించారు. అమెరికాలో సరుకులు సరఫరా చేసే వారితో కలిసి ఈ మోసానికి పాల్పడ్డారని వివరించారు. ఈమేరకు సైబర్ సెక్యూరిటీ బ్యూరో(సీఎస్‌బీ)కు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు మొత్తం 22 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తును ప్రారంభించారు.

జరిగిన మోసం ఇది

సీఎస్‌బీకి అందిన ఫిర్యాదు ప్రకారం.. హైదరాబాద్‌లో అమెజాన్ రిలే ఆపరేషన్ సెంటర్ ఉంది. ప్రపంచంలో ఎక్కడ, ఏ వస్తువును డెలివరీ చేస్తున్నది ఈ సెంటర్ నుంచే పర్యవేక్షిస్తారు. గోడౌన్ నుంచి బయటకు వెళ్లినప్పటి నుంచి ప్యాకేజీ కస్టమర్‌కు చేరేవరకు సంస్థ.. సిబ్బంది కదలికలను జీపీఎస్ ఆధారంగా పర్యవేక్షిస్తుంటారు. ఈ డెలివరీ వ్యవహారాన్ని థర్డ్ పార్టీకి కాంట్రాక్ట్ ఇస్తారు. సంస్థ గోడౌన్ నుంచి కస్టమర్ చిరునామా వరకు దూరాన్ని బట్టి రవాణా ఖర్చును అమెజాన్ చెల్లిస్తుంది. ఒకవేళ కస్టమర్ ఆ సమయంలో ఆ చిరునామాలో లేకుంటే ప్యాకేజీ డెలివరీ చేయకపోయినా రవాణా ఖర్చు చెల్లించాల్సిందే. ఇందులో లొసుగును పసిగట్టిన మాజీ సిబ్బంది కొంతమంది మోసానికి తెరలేపారు. ప్రస్తుతం రిలే సెంటర్‌లో పనిచేస్తున్న వారితో పాటు అమెరికాలోని సిబ్బందితో కలిసి నకిలీ ట్రిప్పులను నమోదు చేసి బిల్లులు దండుకున్నారు.

31న ఉస్మానియా ఆస్పత్రి నూతన భవనాల నిర్మాణాలకు సీఎం శంకుస్థాపన



-నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉస్మానియా ఆస్పత్రి నూతన భవనాల నిర్మాణాలకు ఈ నెల 31న హైదరాబాద్ గోషామహల్లో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేస్తారని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ఈ నేపథ్యంలో మంగళవారం హైదరాబాద్‌లో ఉస్మానియా హాస్పిటల్ నూతన భవనాల డిజైన్లు, శంకుస్థాపన కార్యక్రమానికి సంబంధించిన పనులపై ఆయన సమీక్షించారు.

శంకుస్థాపన కార్యక్రమానికి వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఉస్మానియా ఆస్పత్రి డిజైన్లలో సీఎం సూచించిన ఆర్కిటెక్ట్ మార్పులు చేసిన అధికారులు మంత్రికి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రోగులు, వైద్యులు, వైద్య విద్యార్థులు, ఇతర సిబ్బందిని దష్టిలో ఉంచుకుని అన్ని సదుపాయాలతో భవనాలు అందుబాటులోకి తేనున్నట్టు చెప్పారు. ఇందులో అన్ని రకాల సూపర్ స్పెషాలిటీ వైద్యసేలుంటాయని తెలిపారు. దశాబ్దాల ఉస్మానియా కొత్త బిల్డింగ్ కల నెరవేరుతున్నందుకు చాలా సంతోషంగా ఉన్నదని హాస్పిటల్ సూపరింటెండెంట్ రాకేశ్ కుమార్ సహాయ్ తెలిపారు. హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, సీఎం సెక్రెటరీ సంగీత సత్యనారాయణ, ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవో శివ శంకర్ లోతేటి, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ హేమంత్, డీఎంఈ నరేంద్ర కుమార్, ఆర్అండ్‌బీ చీఫ్ ఇంజనీర్ రాజేశ్వర్‌రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ ఎలా ఇచ్చారు?

- కేంద్రమంత్రి బండి సంజయ్‌కు దేవని సతీష్ మాదిగ ప్రశ్న

నవతెలంగాణ - హైదరాబాద్

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగకు పద్మశ్రీ ఎలా ఇచ్చారని కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేవని సతీష్ మాదిగ ప్రశ్నించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గద్దర్ మావోయిస్టు అని, ఎంతో మంది బీజేపీ నాయకులను, రాజకీయ నాయకులను హత్య చేసిన ఆయనకు పద్మశ్రీ ఎలా ఇస్తామని కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రశ్నించడాన్ని ఆయన ఖండించారు. గద్దర్, మంద కృష్ణ మాదిగ ఇద్దరూ మావోయిస్టు నాయకులుగా పని చేసిన వారేనని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సిఫారసు చేసిన గద్దర్‌కు పద్మశ్రీ ఇవ్వకపోవడానికి మావోయిస్టు భావజాలమే కారణమని ఎలా చెబుతారని ప్రశ్నించారు. మాల, మాదిగల మధ్య వైషమ్యాలు పెంచే విధంగా చేస్తున్నారని విమర్శించారు. గద్దర్, మంద కృష్ణ మాదిగ ఇద్దరూ గతంలో మావోయిస్టులేననీ, వారిద్దరూ జన జీవన స్రవంతిలో కలిసి ఉద్యమాలు చేస్తున్నారని తెలిపారు. మంద కృష్ణ మాదిగకు పద్మశ్రీ ప్రకటించడం వెనుక బీజేపీ రాజకీయ లబ్ది పొందాలని చూస్తున్నదని విమర్శించారు.

బెయిల్‌పై విడుదలైన అదనపు ఎస్పీ తిరుపతన్న

- చంచల్‌గూడ జైలు నుంచి బయటకు

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి :

రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్‌ట్యాపింగ్ కేసులో నిందితుడైన ఇంటెలిజెన్స్ విభాగం అదనపు ఎస్పీ తిరుపతన్న.. చంచల్‌గూడ జైలు నుంచి బెయిల్‌పై విడుదలయ్యారు. ఈయనకు సుప్రీంకోర్టు సోమవారం బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. బెయిల్‌పై విడుదలైన తిరుపతన్న.. జైలు నుంచి బయటకు రాగానే ఎవరితో మాట్లాడకుండా అక్కడి నుంచి వెళ్లిపోయారు. దాదాపు పది నెలల క్రితం ఫోన్‌ట్యాపింగ్ కేసులో నాలుగో నిందితుడైన తిరుపతన్నను పంజాగుట్ట స్పెషల్‌టీం పోలీసులు ఆయనను అరెస్ట్ చేసిన విషయం విదితమే. కాగా, ఈ కేసులో మిగతా నిందితులు ఎస్ఐబీ మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు, అదనపు ఎస్పీ బుజంగరావు, నగర టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావులకు కూడా బెయిల్ లభించే అవకాశాలున్నాయని భావిస్తున్నారు. తిరుపతన్నకు బెయిల్ నేపథ్యంలో.. ఈ కేసులో ఇప్పటికే ప్రత్యేక దర్యాప్తు బృందం కోర్టులో చార్జ్‌షీట్ వేసినందున జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న ఈ ముగ్గురికి కూడా న్యాయస్థానం బెయిల్ ఇచ్చే అవకాశమున్నదని భావిస్తున్నారు.

టెంపుల్, హెల్త్ ఏకో టూరిజానికి ప్రాధాన్యత

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
ఎక్స్‌పీరియమ్ ప్రారంభోత్సవంలో
మంత్రి జూపల్లి కృష్ణారావు
సినీ నటులు చిరంజీవి, పద్మశ్రీ వనజీవి రామయ్య, ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు



నవతెలంగాణ-శంకర్‌పల్లి

రాష్ట్రంలో టెంపుల్, హెల్త్, ఏకో టూరిజాలను తీసుకొస్తామని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలంలోని 150 ఎకరాల్లో ఉన్న ఎక్స్‌పీరియమ్‌ను మంగళవారం పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, సినీనటులు చిరంజీవి, ఎక్స్ పీరియమ్ చైర్మెన్ రామడుగు రాందేవ్‌రావు, పద్మశ్రీ వనజీవి రామయ్య, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, అనిల్ కుమార్, సీఎం రమేష్, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కాల యాదయ్య, మల్‌రెడ్డి రంగారెడ్డి, 70 ఎకరాల అడవిని సృష్టించిన దుశర్ల సత్యనారాయణ, రైటర్ విజయేంద్ర ప్రసాద్‌తో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఐటీ, ఫార్మా రంగాల్లో రాణించిందని, మౌలిక సదుపాయాల్లో దేశ, విదేశాల్లోని ప్రముఖ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి వస్తున్నాయని తెలిపారు. అయితే తెలంగాణలో టెంపుల్, హెల్త్, ఏకో టూరిజం రావాలన్నారు. వీటి వల్ల రాష్ట్రానికి గుర్తింపు, గౌరవం, ఆదాయం లభిస్తుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే టూరిజం పాలసీపై చర్చిస్తుందని, త్వరలో విధివిధానాలు తీసుకొస్తుందని తెలిపారు. ప్రస్తుతం శుభకార్యాలు చేయాలంటే ఇతర దేశాలు, ప్రాంతాలకు వెళ్లి చేసుకుంటున్నారని, మందిరాలు దర్శించాలంటే తమిళనాడు, ఇతర రాష్ట్రాలకు వెళ్తున్నారని, ప్రకృతిని ఆస్వాదించాలంటే మధ్యప్రదేశ్‌కు వెళ్తున్నారని అన్నారు. కాగా, భవిష్యత్తులో ఇవన్నీ ఇక్కడే చేసుకునేలా టూరిజం పాలసీని రూపొందిస్తామని తెలిపారు. ప్రముఖులు ఇల్లు కట్టుకుంటే గోదావరి జిల్లాల నుంచి మొక్కలు తెప్పించుకునే పరిస్థితి నుంచి నేడు ఎక్స్‌పీరియమ్ నుంచి మొక్కలు తెచ్చుకునేటట్టు చేశారని అన్నారు.

తెలంగాణలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మందిరాలు, ప్రకృతి వనరులు ఉన్నాయని అన్నారు. నల్లమల టైగర్ ఫారెస్ట్, కృష్ణానది జలాలు పారిస్తున్న ప్రాంతం మల్లెల తీర్థం వంటివి ఉన్నాయని, వీటికి తగిన ప్రాధాన్యత ఇవ్వకపోవడం వల్ల ఏకో టూరిజం వెనుక పడుతుందని చెప్పారు. వికారాబాద్‌లో సాధారణంగా చుట్టుపక్కల ప్రాంతాల కంటే రెండు డిగ్రీల ఉష్ణోగ్రత తక్కువగా ఉంటుందని, అందుకే ఇక్కడ టీవీ కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. అందుకే వికారాబాద్ ప్రాంతాన్ని ఏకో టూరిజంలో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయనున్నారని చెప్పారు. భవిష్యత్తులో ఏకో టూరిజానికి ఎక్స్‌పీరియమ్ ఒక ప్రతిపాదిక అవుతుందన్నారు. దీనికి రామడుగు రాందేవ్ రావును మనస్ఫూర్తిగా అభినంది స్తున్నట్టు చెప్పారు. ఈ ఎక్స్‌పీరియమ్ కేవలం ఒక వ్యాపార కేంద్రంగానే కాకుండా పర్యాటక క్షేత్రంగా అవతరిస్తుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. మన రైతులు కేవలం వరి పండించడమే కాదని, ఇలాంటి మొక్కలు కూడా పెంచేలా చేయాలనుకుంటున్నామని తెలిపారు. రెండూ మూడు సంవత్సరాలు నిండే వరకు మొక్కలు పెంచితే వాటిని తీసుకెళ్లి నాటితే ఎక్కువగా బతుకుతాయని, వాటిని ఒక సీజన్ కాపాడితే సరిపోతుందన్నారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వ విధివిధానాలను చర్చించి సవరించి ప్రకృతి పరిరక్షణ కోసం పాటుపడతామని హామీ ఇచ్చారు. వనజీవి రామయ్యకు భారత ప్రభుత్వం పద్మశ్రీ ఇచ్చిందని, మొక్కలు నాటడంలో రాణించినందుకు ఆయనకు ఈ గుర్తింపు వరించిందని అన్నారు. రామయ్య లాంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. 85 దేశాల నుంచి మొక్కలు తెచ్చి ఎక్స్‌పీరియమ్‌ను ఆహ్లాదకరంగా చేస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆసియాలోని అతిపెద్ద హంపి థియేటర్ వద్ద నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. ఎక్స్‌పీరియం గురించి సోషల్ పోస్ట్ డిజిటల్ మీడియా రూపొందించిన ఆడియో విజువల్‌ను సీఎం లాంచ్ చేశారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, ఆర్డీవో చంద్రకళ, శంకర్‌పల్లి తహసీల్దార్ సురేందర్, ఎంపీడీవో వెంకయ్య, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిర్బంధ నీడలో 'ఎన్టీపీసీ' ప్రజాభిప్రాయ సేకరణ



భారీగా పోలీస్ బలగాల మోహరింపు
రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకుల ముందస్తు అరెస్ట్

నవతెలంగాణ-గోదావరిఖని

పెద్దపల్లి జిల్లా రామగుండం వద్ద ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్ట్ రెండో దశ పనులకు సంబంధించి ప్రజాభిప్రాయ సేకరణ పోలీసు బందోబస్తు మధ్య సాగింది. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆధ్వర్యంలో మంగళవారం ఎన్టీపీసీ జ్యోతినగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టగా.. పోలీస్ బలగాలు భారీగా మోహరించాయి. సుమారు 3వేల మందికి పైగా ప్రజలు పాల్గొన్నారు. ప్రజాభిప్రాయ సేకరణకు రాతపూర్వకంగా దరఖాస్తులు తీసుకురాగా లోపలికి పంపించకుండా అడ్డుకున్నారని, పోలీసుల చర్యలపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక చిన్న కాగితం పట్టుకుపోతే లోపలికి పోనివ్వడం లేదని, ఇదేం ప్రజాభిప్రాయ సేకరణంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ వేదిక వద్దకు వచ్చే క్రమంలో గేటు వద్దనే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేయగా, బీజేపీ నాయకులు లావణ్య పునరావాసం, ఆరోగ్య సేవలు అందించాలని అభిప్రాయపడ్డారు. కలెక్టర్ కోయ శ్రీ హర్ష ప్రజల సూచనలు నమోదు చేసి సంబంధిత శాఖకు పంపుతున్నట్టు తెలిపారు. ఈ ప్రాజెక్టు రెండో దశ పూర్తయ్యాక రామగుండం దేశంలోనే అతిపెద్ద విద్యుత్ ప్లాంట్‌గా అవతరించనుందని చెప్పారు. రాజకీయ, ప్రజా సంఘాల నాయకులను ముందస్తు అరెస్టు చేశారు. సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు నాంసాని శంకర్, ఇతర నాయకులను జైపూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. జర్నలిస్టులను అడ్డుకోవడం పట్ల వారు నిరసన వ్యక్తం చేయగా, డీసీపీ జోక్యం చేసుకుని పరిష్కరించారు.



పదోన్నతుల్లో వివక్ష చూపొద్దు

టీజీవో ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ
వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయం వద్ద
ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల నిరసన



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో తెలంగాణ వాణిజ్య పన్నుల శాఖలో పదోన్నతుల్లో వివక్షను చూపొద్దని టీజీవో ప్రధాన కార్యదర్శి ఎ సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పదోన్నతుల్లో వివక్షను నిరసిస్తూ ఎస్సీ,ఎస్టీ ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లో భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శనను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధనకు తమ సంఘం ఎప్పుడూ అండగా ఉంటుందని చెప్పారు. పదోన్నతుల విషయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, వాణిజ్య పన్నుల శాఖ [illegible] ఉద్యమిస్తేనే హక్కులను సాధించుకుంటామని చెప్పారు. [illegible] శ్యామ్ మాట్లాడుతూ ఎస్సీ,ఎస్టీలు ఐక్యంగా ఉంటే ఆటలు సాగబోవని కొందరు భావించి విభేదాలు సృష్టిస్తున్నారని అన్నారు. సభ్యులంతా ఐక్యంగా ఉండాలని కోరారు. పోరాటాల ద్వారా మాత్రమే సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. అధ్యక్షత వహించిన సంఘం అధ్యక్షుడు కె భిక్యా మాట్లాడుతూ ఉద్యోగ విరమణ సమయానికి చేరుకున్న ఉద్యోగులు తమకు రావాల్సిన పదోన్నతులను అనవసరమైన ఆలస్యం ఎదుర్కొంటున్నారని అన్నారు. అనేక దశాబ్దాలుగా సేవలందించినప్పటికీ ఉద్యోగులు పదోన్నతులను పొందడం లేదన్నారు. అందుకోసం లాబీయింగ్ చేయాల్సిన పరిస్థితి రావడం విచారకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం ప్రధాన కార్యదర్శి కె నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

డిస్కంల రెవెన్యూ లోటు రూ.20,151 కోట్లు

ఐనా కరెంటు చార్జీల పెంపు లేదు :
టీజీఈఆర్సీకి 2025-26 ఏఆర్ఆర్‌ల సమర్పణ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలోని ఉత్తర, దక్షిణ ప్రాంతాల విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కంలు) 2025-26 ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ గ్యాప్ రూ.20,151 కోట్లు ఉంటుందని అంచనా వేశాయి. పై ఏడాదికి ఆదాయ అవసరాల ఆవశ్యకత (ఏఆర్ఆర్)ను రూ.65,849 కోట్లుగా నిర్ధారించారు. కానీ వచ్చే ఆదాయం రూ.45,698 కోట్లుగా లెక్కించారు. ప్రస్తుత టారిఫ్ ద్వారా రూ.45,641 కోట్లు, ఇతర మార్గాల ద్వారా మరో రూ.56.71 కోట్లు వస్తుందనీ, మొత్తం ఆదాయం రూ.45,698 ఉంటుందని పేర్కొన్నారు. పై ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఏఆర్ఆర్‌లను డిస్కంలు మంగళవారం తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (టీజీఈఆర్సీ)కి సమర్పించాయి. వాస్తవానికి ఏఆర్ఆర్‌లను గత ఏడాది నవంబర్‌లోనే ఈఆర్సీకి సమర్పించాల్సి ఉంది. వివిధ కారణాలతో వాయిదా పడుతూ వస్తుంది. ఇటీవల సీఎంతో పాటు విద్యుత్‌శాఖ మంత్రి కూడా కరెంటు చార్జీల పెంపు ఉండదని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో డిస్కంలు ఏఆర్ఆర్‌లలో ఆదాయ పెంపును ప్రతిపాదించలేదు. ఆదాయలోటును భర్తీ చేయడం కోసం ఈఆర్సీ ప్రభుత్వానికి లేఖ రాయాల్సి ఉంటుంది. దీనిపై ప్రభుత్వం ఇచ్చే హామీని బట్టి ఈఆర్సీ నిర్ణయం తీసుకుంటుంది

రెండు డిస్కంల పరిధిలో ప్రస్తుత టారిఫ్ ప్రకారం రెవెన్యూగ్యాప్ 30.60 శాతం ఉంటుందని అంచనా వేశారు. ఎస్పీడీసీఎల్ పరిధిలో 21.9 శాతం, ఎన్పీడీసీఎల్ పరిధిలో 52.4 శాతం ఆదాయ వ్యత్యాసం ఉంటుందని తెలిపారు. ఆదాయ ఆవశ్యకత టీజీఎస్పీడీసీఎల్ పరిధిలో ప్రస్తుత టారిఫ్ ప్రకారం రూ.36,220 కోట్లు, టీజీఎన్పీడీసీఎల్ పరిధిలో రూ.9,421 కోట్లు ఉంటుందని పేర్కొన్నారు. ఏఆర్ఆర్‌లపై ఈఆర్సీ ప్రజాభిప్రాయ సేకరణ జరిపి, ఈ ఏడాది మార్చి నెలాఖరునాటికి ప్రకటన చేయాల్సి ఉంటుంది.

ఆప్ పార్టీకి మద్దతుగా ఎస్పీ

- ప్రచారం చేయనున్న అఖిలేశ్ యాదవ్



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

మరికొద్ది రోజుల్లో ఢిల్లీ అసెంబ్లీకి ఎన్నికల పోలింగ్ జరగనున్నది. ఈ నేపథ్యంలో ప్రధాన రాజకీయ పార్టీలు తమ ప్రచారాన్ని ఉధృతం చేశాయి. అధికార ఆమాద్మీ పార్టీ (ఆప్)కి మద్దతుగా సమాజవాదీ పార్టీ(ఎస్పీ) అధినేత, యూపీ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్‌తోపాటు ఆ పార్టీ ఎంపీలు ఎన్నికల ప్రచారం చేయనున్నారు. ఈ మేరకు ఆప్ జాతీయ కన్వీనర్, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ మంగళవారం వెల్లడించారు. జనవరి 30న తాను రితాలలో రోడ్ షో నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. ఈ రోడ్ షోలో ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ పాల్గొంటారని చెప్పారు. అలాగే ఆ పార్టీకి చెందిన పలువురు ఎంపీలు.. ఈ ఎన్నికల్లో ఆప్‌నకు మద్దతుగా ప్రచారం చేస్తారని వివరించారు. ఆప్ ఎమ్మెల్యే అభ్యర్థులకు మద్దతుగా టీఎంసీ ఎంపీ, ప్రముఖ నటుడు శతృఘ్న సిన్హా ఫిబ్రవరి 1, 2వ తేదీల్లో ప్రచారం నిర్వహించనున్నారు. 70 స్థానాలున్న ఢిల్లీ అసెంబ్లీకి ఫిబ్రవరి 5న పోలింగ్ జరగనున్నది. ఈ ఎన్నికల ఫలితాలు ఫిబ్రవరి 8న వెల్లడవుతాయి.

సమరశీల పోరాటాలతో ప్రజలకు చేరువకండి

(మొదటిపేజీ తరువాయి)

దేశాల్లో ఆర్థిక మాంద్యం, ఆర్థిక సంక్షోభం నెలకొన్న నేపథ్యంలో ఆ ప్రభావం భారతదేశంపై ఎలా ఉండబోతున్నదనే అంశాన్ని ప్రజలకర్థమయ్యే రీతిలో విడమర్చి చెప్పాలని మార్గదర్శనం చేశారు. ఐటీ, ఇంజినీరింగ్ రంగాల్లో వస్తున్న మార్పులను సైతం అధ్యయనం చేయాలని సూచించారు. ఇలాంటి కృషి చేయడం ద్వారా తెలంగాణలో రాబోయే రోజుల్లో పార్టీ ప్రజా పునాదిని బలోపేతం చేయాలని రాఘవులు పిలుపునిచ్చారు.

ఉద్యోగాల వేటలో ఎంబీఏలు

టాప్ స్కూల్స్‌లో చదివినా వెంటాడుతున్న నిరుద్యోగం

నైపుణ్యం ఉంటేనే జాబ్ అంటున్న కంపెనీలు



న్యూఢిల్లీ : అంతర్జాతీయంగా పేరెన్నికగన్న బిజినెస్ స్కూల్స్‌లో విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న ఎంబీఏ పట్టభద్రులు ఇప్పుడు ఉద్యోగాల వేటలో పడ్డారు. మూడు నెలల గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న తర్వాత కూడా హార్వర్డ్ బిజినెస్ స్కూల్ నుండి వచ్చిన ఎంబీఏ పట్టభద్రుల్లో 23 శాతం మంది ఇంకా నిరుద్యోగులుగానే మిగిలిపోయారు. స్టాన్‌ఫర్డ్ గ్రాడ్యుయేట్ స్కూల్, వార్టన్ స్కూలులో విద్యాభ్యాసం చేసిన ఎంబీఏ పట్టభద్రులదీ అదే పరిస్థితి. టెక్నాలజీ, కన్సల్టింగ్ రంగాల్లో ఎంబీఏల నియామకం తగ్గిపోవడం ఈ పరిస్థితికి ఓ ప్రధాన కారణం. అనేక కంపెనీలు, సంస్థలు డిగ్రీలు చదివిన వారి కంటే నైపుణ్యం చూపుతున్న వారికే ఎక్కువగా ప్రాధాన్యత ఇస్తున్నాయి.

భారత్‌లో నైపుణ్యాభివృద్ధి సమస్య చాలా కాలం నుంచీ ఉన్నదే. అయితే ఈ సమస్య మన దేశానికి మాత్రమే పరిమితమై లేదు. అమెరికాలో సైతం ఎంబీఏ పూర్తి చేసుకున్న వారికి ఉద్యోగాలు దొరకడం లేదు. హార్వర్డ్, స్టాన్‌ఫర్డ్, వార్టన్ వంటి ఐవీ లీగ్ కళాశాలల నుండి ఎంబీఏ డిగ్రీలు పుచ్చుకున్న వారికే ఉద్యోగాలు లభించడం లేదంటే ఇక సాధారణ సంస్థల్లో చదివిన వారి గురించి చెప్పేదేముంది?

నిరుద్యోగం పెరుగుతోంది

హార్వర్డ్ బిజినెస్ స్కూల్‌లో (హెచ్‌బీఎస్) గత ఏడాది ఎంబీఏ పూర్తి చేసుకున్న వారిలో 23 శాతం మందికి మూడు నెలల గ్రాడ్యు యేషన్ తర్వాత కూడా ఉద్యోగాలు రాలేదు. 2022లో నిరుద్యోగ రేటు 10 శాతంగా, 2023లో 20 శాతంగా ఉంది.

అంటే నిరుద్యోగుల సంఖ్య ప్రతి సంవత్సరం పెరుగుతోందన్న మాట. ఐవీ పట్టభద్రులు సైతం ఇటీవలి కాలంలో ఇలాంటి సమస్యనే ఎదుర్కొంటున్నారు. అంతర్జాతీయ కార్మిక సంస్థ తాజా నివేదిక ప్రకారం 2023లో యువకుల్లో 13 శాతం మంది నిరుద్యోగులుగా ఉండిపోయారు. అంటే 64.9 మిలియన్ల మందికి ఉద్యోగాలు రాలేదన్న మాట. 2020లో ప్రపంచ ఆర్థిక ఫోరం ఇచ్చిన నివేదిక ప్రకారం ప్రతి నలుగురు మేనేజ్‌మెంట్ నిపుణుల్లో ఒకరు మాత్రమే ఉద్యోగాన్ని సంపాదించగలిగారు. అప్పటి నుండి పరిస్థితిలో పెద్దగా మెరుగుదల కన్పించలేదు.

ఏ సంస్థ చూసినా...

హార్వర్డ్ యూనివర్సిటీతో పాటు వార్టన్ (20 శాతం), స్టాన్‌ఫర్డ్ (22 శాతం) వంటి ప్రముఖ టయర్-బీ స్కూల్స్, న్యూయార్క్ యూనివర్సిటీకి చెందిన స్టెర్న్ స్కూల్ ఆఫ్ బిజినెస్ కూడా ఇదే సమస్యతో ఇబ్బంది పడుతున్నాయి. అక్కడ కొత్తగా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న వారికి ఉద్యోగాలు లభించడం కష్టంగా మారింది. ప్రపంచంలో పేరు ప్రఖ్యాతలు కలిగిన, ఖరీదైన సంస్థల విద్యార్థులు కూడా ఆర్థిక మాంద్యాన్ని, వైట్ కాలర్ జాబ్ పరిశ్రమను వెంటాడుతున్న సమస్యలను తప్పించుకోలేకపోవడం గమనార్హం. అమెరికాలోని ఇతర ప్రతిష్టాత్మక సంస్థల్లో ఎంబీఏ చదివిన వారికి కూడా ఉద్యోగాలు దొరకడం లేదు. యూనివర్సిటీ ఆఫ్ చికాగోకు చెందిన బూత్ స్కూల్, నార్త్‌వెస్టర్న్ యూనివర్సిటీకి చెందిన కెల్లాగ్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో నిరుద్యోగ గ్రాడ్యుయేట్ల సంఖ్య మూడింతలు పెరిగింది.

ఉద్యోగాల్లో కోత

గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్ వంటి ప్రముఖ టెక్ కంపెనీలు, మెకిన్సే, బీసీజీ వంటి పేరున్న కన్సల్టింగ్ సంస్థలు ఎంబీఏ గ్రాడ్యుయేట్లను ఉద్యోగాల్లోకి తీసుకోవడాన్ని తగ్గించాయి. 2023లో చాలా ఉద్యోగాలకు కోత పడింది. ముఖ్యంగా కోవిడ్ తర్వాత అనేక కంపెనీల్లో పని పద్ధతులు మారిపోయాయి. అవి చిన్న, మరింత సమర్థవంతమైన టీమ్స్ కోసం అన్వేషిస్తున్నాయి. ఏఐ, ఆటోమేషన్‌కు ప్రాధాన్యత పెరగడం కూడా సమస్యగా మారింది. బిజినెస్ నాలెడ్జ్‌తో పాటు టెక్నికల్ స్కిల్స్ ఉన్న ఎంబీఏ పట్టభద్రులకే కొద్దో గొప్పో ఉద్యోగాలు లభిస్తున్నాయి.

ముగిసిన సీపీఐ(ఎం) రాష్ట్ర నాలుగో మహాసభ

పోరాటాలకు పదును పెడుతూ.. స్ఫూర్తిదాయకంగా దిశానిర్దేశం



సంగారెడ్డి నుంచి బి.వి.యన్.పద్మరాజు

సంగారెడ్డి పట్టణంలో సీతారాం ఏచూరి నగర్‌లోని మల్లు స్వరాజ్యం ప్రాంగణంలో ఈ నెల 25 నుంచి నాలుగు రోజుల పాటు కొనసాగిన సీపీఐ(ఎం) రాష్ట్ర నాలుగో మహాసభలు మంగళవారం అత్యంత జయప్రదంగా ముగిశాయి. ప్రారంభం నుంచి ముగింపు వరకు మహాసభకు హాజరైన ప్రతినిధులు అత్యంత క్రమశిక్షణతో చర్చలు, కార్యకలాపాల్లో పాల్గొన్నారు. మొత్తం 49 అంశాలపై తీర్మానాలను ప్రతిపాదించి ఆమోదించారు. దేశ, రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై అగ్రనేతలు విశ్లేషణలు చేశారు. ముంచుకొస్తున్న మతోన్మాద ప్రమాదం, ప్రజలపై తీవ్రమైన భారాలు మోపుతున్న సరళీకృత, ఆర్థిక విధానాలు, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో శరవేగంగా దూసుకెళ్తున్న ప్రస్తుత తరుణంలోనూ రాష్ట్రంలో కొనసాగుతున్న కులవివక్ష, సామాజిక అణిచివేతపై మహాసభ అత్యంత ఆందోళన వ్యక్తం చేసింది.

వాటన్నింటినీ సమగ్ర అధ్యయనం చేయడం ద్వారా ప్రజలను సమీకరించి సమరశీల పోరాటాలకు రూపకల్పన చేయాలని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్‌కరత్, విజయరాఘవన్, రాఘవులు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మారిన రాజకీయ పరిస్థితులు, ఆ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు, వాటి అమలులో వైఫల్యాలు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పేరిట కాలయాపన, తదితర అంశాలను మాజీ కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సోదాహరణంగా వివరించారు.

మూడు రోజుల పాటు వివిధ రంగాల వారీగా చర్చలు జరిపిన ప్రతినిధులు జిల్లాల్లో ఉన్న వాస్తవ, క్షేత్రస్థాయి అంశాలను మహాసభ దృష్టికి తీసుకొచ్చారు. పోడుభూముల పోరాటం, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికుల సమస్యలు, అసంఘటిత కార్మికుల ఇక్కట్లు, కనీస మద్దతు ధరలు, కనీస వేతనాలు, మహిళలపై వివక్ష, అణిచివేత, దళితులు, గిరిజనుల పట్ల కొనసాగుతున్న దాడులు, మైనార్టీలపై అఘాయిత్యాలు, గురుకులాల్లోని సమస్యలు, జర్నలిస్టులపై దాడులు తదితర అంశాలను మహాసభ కూలంకుషంగా చర్చించింది. వాటిని లోతుగా అధ్యయనం చేయడం ద్వారా భవిష్యత్తు పోరాటాలకు రూపకల్పన చేయాలని నేతలు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

మరోవైపు పూర్తిగా శ్రామిక వర్గం ఇచ్చిన విరాళాల ఆధారంగానే అత్యంత జయప్రదంగా ముగిసిన సంగారెడ్డి మహాసభ భవిష్యత్తు కార్యక్రమాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచింది. సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ ఇచ్చిన సూచనలు, సలహాల ఆధారంగా పూర్తిగా కార్మికుల నుంచే విరాళాలు, చందాలు స్వీకరించి ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించడం అబ్బురపరిచింది. ప్రధానద్వారం వద్ద నుంచి చివరనున్న ప్రతినిధుల సభ వేదిక వరకూ అలంకరించిన తీరు ఆకట్టుకుంది. మార్క్స్, ఏంగెల్స్, లెనిన్, మావో, స్టాలిన్, చేగువేరా, హ్యూగోచావెజ్, కాస్ట్రో, తదితర అంతర్జాతీయ నేతల వ్యాఖ్యలతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు ప్రతినిధుల్లో చైతన్యాన్ని నింపాయి. ప్రధానద్వారం వద్ద తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుల చిత్రాలతో కూడిన హోర్డింగ్‌లు ఆ పోరాట స్ఫూర్తిని రగిలించాయి. వివిధ కమిటీలు ఎప్పటికప్పుడు సమావేశమై ప్రతినిధులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ప్రణాళికలు రూపొందించి అమలు చేశాయి. మూడు రోజుల పాటు ప్రతినిధులకు, అతిథులకు స్వయంగా కార్మికులే వాలంటీర్లుగా మారి పలు రకాల సేవలందించడం అభినందనీయం. వారిని వెనుక ఉండి నడిపించిన ఆహ్వాన సంఘం చైర్మెన్ చుక్క రాములు, ప్రధాన కార్యదర్శి జయరాజు.. ప్రతినిధుల ముగింపు సభ సందర్భంగా ఈ అంశాలను గుర్తుచేశారు. మహాసభల నిర్వహణకు ఆర్థిక, హార్థికంగా అండదండలుగా నిలిచిన ఆయా కంపెనీల కార్మికులకు వారు పేరుపేరునా విప్లవాభినందనలు తెలిపారు. శ్రామిక వర్గం ఇచ్చిన అండతో భవిష్యత్తులో ఎలాంటి కార్యకలాపాలనైనా నిర్వహించగలమనే ధైర్యం తమకు వచ్చిందని చెప్పారు. సంగారెడ్డిలో మహాసభలు నిర్వహించేందుకు అనుమతించిన కేంద్ర, రాష్ట్ర నాయకత్వాలకు ధన్యవాదాలు తెలిపారు. సహకరించిన మీడియా ప్రతినిధులకు కృతజ్ఞతలు చెప్పారు. ఇదే సమయంలో మహాసభలను అత్యంత జయప్రదంగా నిర్వహించిన ఆహ్వానసంఘాన్ని, ఉమ్మడి మెదక్ జిల్లా పార్టీ శ్రేణులను ఎ.విజయరాఘవన్, రాఘవులు, తమ్మినేని అభినందించారు. మొత్తంమీద రానున్న మూడేండ్ల పాటు నిర్వహించాల్సిన కర్తవ్యాలు, చేయాల్సిన పోరాటాల ప్రణాళికను భుజాన వేసుకుని ప్రతీ ప్రతినిధి అత్యంత స్ఫూర్తిదాయకంగా తమతమ ప్రాంతాలకు బయలుదేరి వెళ్లారు.



సంపాదకీయం

డోనాల్డ్ ట్రంప్ దుష్టాలోచన !



కుదిరిన ఒప్పందాన్ని ఏదో ఒక సాకుతో ఉల్లంఘించేందుకు, ఆ పేరుతో పాలస్తీనియన్లను అన్నివిధాలా ఇబ్బందులకు గురిచేసేందుకు ఇజ్రాయెల్ చూస్తున్నది. హమాస్, ఇతర సంస్థల వద్ద బందీలుగా ఉన్న తమవారిని విడిపించుకొనేంతవరకు చూసి తరువాత గాజాలోనే తిష్టవేసినా ఆశ్చర్యం లేదనే అనుమానాలు తలెత్తుతున్నాయి. ఇప్పటి వరకు అది సాగించిన మారణకాండలో వేలాది ప్రాణాలు పోగా గాజా సర్వనాశనమైంది. ఆ ప్రాంతాన్ని "శుభ్రం చేసే" పేరుతో మిగిలి ఉన్న లక్షలాది మందిని అక్కడి నుంచి బయటకు పంపే దుష్ట ఆలోచనను డోనాల్డ్ ట్రంప్ ముందుకు తెచ్చాడు. ఏనాడూ అక్కడ జరిగిన దుర్మార్గాన్ని తప్పు పట్టని ఆ పెద్దమనిషి నోటి నుంచి ఇలాంటి ప్రతిపాదన వచ్చిందంటే కచ్చితంగా అనుమానించాల్సిందే. అమెరికా నేతల మాటలకు అర్థాలే వేరులే అని వేరే చెప్పనవసరం లేదు. మాతృభూమి కోసం దశాబ్దాలుగా ప్రాణాలను తృణ ప్రాయంగా పరిగణిస్తున్న పాలస్తీనియన్లు సహజంగానే ఈ ప్రతిపాదనను నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. శుభ్రం అంటే మొత్తంగా వారిని ఆ ప్రాంతం నుంచి తొలగించటం తప్ప వేరు కాదు. పక్కనే ఉన్న ఈజిప్టు, జోర్డాన్‌కు జనాన్ని శాశ్వతంగా పంపివేయాలన్న దుష్ట ఆలోచన దీని వెనుక ఉంది. తరువాత ఏదో ఒక సాకుతో ఆ ప్రాంతాన్ని ఇజ్రాయెల్‌లో విలీనం చేయాలన్న ఎత్తుగడ ఉందని వేరే చెప్పనవసరం లేదు. గాజాలో జనవరి 18వ తేదీ అర్ధరాత్రి నుంచి కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చింది, దాని ప్రకారం రెండు దఫాలుగా బందీలు-ఖైదీల విడుదల జరిగింది. అయినప్పటికీ ఉత్తర గాజాలో తమ నివాస ప్రాంతాలకు తిరిగి వచ్చేందుకు పాలస్తీనియన్లను ఇజ్రాయెల్ మిలిటరీ జనవరి 27వ తేదీ వరకు అనుమతించలేదు. ఒక బందీని విడుదల చేయలేదంటూ సాకు చెప్పింది. నిజానికి ఆ బందీ హమాస్ వద్దలేదు, వేరే సంస్థ అధీనంలో ఉన్నాడు. తమకు సరైన సంకేతాలు అందని కారణంగా వదలి పెట్టలేదని వారు చెప్పారు. తరువాత వదలివేశారు. దాంతో విధిలేని స్థితిలో గేట్లు తెరవటంతో బుధవారం నాటికి మూడులక్షల మంది తిరిగి వచ్చారు. వారికి అక్కడ శిధిలాలు తప్ప మరొకటి కనిపించలేదు. ఒప్పందం ప్రకారం గాజాలో పాలస్తీనా ఖైదీలను వదలి పెడుతున్నప్పటికీ మరో ప్రాంతమైన పశ్చిమగట్టులో దాడులు జరిపి అంతకంటే ఎక్కువ సంఖ్యలో అరెస్టులు చేసి జైళ్లలో పెడుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇవన్నీ రెచ్చగొట్టే చర్యలు తప్ప మరొకటి కాదు. వీటిని సహించలేక ఎక్కడైనా ప్రతిదాడులకు దిగితే వాటిని సాకుగా చూపి ఒప్పందాన్ని నీరుగార్చే దుర్మార్గం వీటి వెనుక దాగుంది.

> **ఒప్పందం ప్రకారం గాజాలో పాలస్తీనా ఖైదీలను వదలి పెడుతున్నప్పటికీ మరో ప్రాంతమైన పశ్చిమగట్టులో దాడులు జరిపి అంతకంటే ఎక్కువ సంఖ్యలో అరెస్టులు చేసి జైళ్లలో పెడుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇవన్నీ రెచ్చగొట్టే చర్యలు తప్ప మరొకటి కాదు. వీటిని సహించలేక ఎక్కడైనా ప్రతిదాడులకు దిగితే వాటిని సాకుగా చూపి ఒప్పందాన్ని నీరుగార్చే దుర్మార్గం వీటి వెనుక దాగుంది.**

ఒప్పందం అమల్లోకి వచ్చిన తరువాత కూడా మరణించిన వారిని కలుపుకొంటే 47,317 మందిని ఇజ్రాయెల్ మిలిటరీ చంపివేసింది, 1,11,494 మందిని గాయపరచింది. మా జనం ఎట్టి పరిస్థితుల్లోనూ మా ప్రాంతాలను లేదా పవిత్ర స్థలాలను వదలి పెట్టరు. గతంలో జరిగిన ఘోరాలను పునరావృతం కానివ్వం అని పాలస్తీనా అధారిటీ వ్యాఖ్యానించింది. ఒప్పందం ప్రకారం ఇజ్రాయెల్ మిలిటరీని గాజా నుంచి ఖాళీ చేయించాలని ట్రంప్‌ను డిమాండ్ చేసింది. ఇజ్రాయెల్ పథకాలు, కుట్రలకు అనుగుణంగా చేసిన ఈ ప్రతిపాదనను అమెరికా వెనక్కు తీసుకోవాలని, మారణకాండనే ప్రతిఘటించిన తాము బలవంతంగా ఇరుగు పొరుగుదేశాలకు తరలిస్తామంటే ఎలా సహిస్తామని గాజాలో అధికారంలో ఉన్న హమాస్ స్పందించింది. హమాస్‌తో పాటు సాయుధ పోరాటం చేస్తున్న పాలస్తీనియన్ ఇస్లామిక్ జీహాద్ సంస్థ కూడా ట్రంప్ ప్రతిపాదనను ఖండించింది. యుద్ధ నేరాలను సమర్ధించటం తప్ప వేరు కాదని పేర్కొన్నది. గాజన్లను వారి ప్రాంతాల నుంచి తొలగించకూడదన్న తమ వైఖరిలో ఎలాంటి మార్పు ఉండదని, సర్వసత్తాక పాలస్తీనా ఏర్పాటు దిశగా ట్రంప్ యంత్రాంగంతో కలసి తాము పని చేస్తామని జోర్డాన్ ప్రకటించింది. ట్రంప్ ప్రతిపాదన ఏ మాత్రం ఆచరణ సాధ్యం కాదని, అరబ్ దేశాలు తిరస్కరిస్తాయని రిపబ్లికన్‌పార్టీ సెనెటర్ లిండ్సే గ్రాహమ్ అన్నాడు. ఎన్ని ప్రాణాలు తీసినా, ఎంత విధ్వంసం జరిపినా తమ మాతృభూమిలోనే తమ బతుకు, ఉన్నదే తింటాం, ఇళ్లు లేకపోతే గుడారాల్లోనే పడుంటాం తప్ప మరొక మాటలేదంటూ తిరిగి వచ్చిన వారు చెబుతున్నారు. పరాయి పంచలకు పోయి ప్రాణాలు కాపాడుకోవాలి, బతుకీడ్వాలంటే ఎప్పుడో వెళ్లిపోయి ఉండేవారం.. అలాంటి బతుకు మాకు వద్దు అంటున్నారంటే కనీవినీ ఎరుగని మారణకాండ జరిగినా అదరలేదు, బెదరలేదు, వారి స్థైర్యం చెక్కుచెదరలేదంటే వారికి వందనాలు చెప్పాల్సిందే !

సొంత నేలను
ముద్దాడటం
ఎవరికైనా
అన్నం ముద్ద
తినడం వంటిదే

గాలిలో దీపంలా
గాజులో శాంతిక్షణాలు

జన్మభూమికి జనవాహిని
తరంగాల్లా తరలి రావడం
మన కాలపు గొప్ప దృశ్యం

కోవిడ్‌లో చూశాం
మరల ఇప్పుడు..

పొట్ట చేతపట్టుకుని
ప్రవాసాలకు పోవడం ..
ప్రాణాలు గుప్పెట పట్టుకుని
సొంతగూటికి రావడం..

అదెంత జీవన సత్యమో
ఇదంత మౌలిక సత్యం

నవీన శ్రామికుడు



ఆ ఆకలికి
ఈ భయానికి
వారధి కడుతున్నాడు
నవీన శ్రామికుడి

ఆంక్షలు పెట్టేవాడు
కరుడుకట్టిన కారోరేటే
గోతికాడ నక్కలే
యుద్ధ ఊళలు విప్పిస్తుంటాయి
ఇక వెతుకులాట దేనికి ?

ఎటునుంచి ఏదైనా
మానవాళి జీవనయానం
అనంతం, అసిధారావ్రతం
అజరామరం.

కె .శాంతారావు
9959745723

అమెరికాకు ఇరాన్ అణుబాంబు భయం!



ఎం కోటేశ్వరరావు
8331013288

తనకు లొంగని దేశాలను కొండచిలువ మాదిరి అమాంతం మింగివేయాలని అమెరికా చూస్తుంది. అయితే దానికి సాధ్యం కావటం లేదు. అందుకే శతవిధాలుగా దెబ్బతీసేందుకు చేయని యత్నం ఉండదు. ఇరాన్ అణుకేంద్రాలపై దాడులు చేద్దామని ఇజ్రాయెల్ ప్రతిపాదిస్తే.. అమెరికా మాజీ అధ్యక్షుడు జో బైడెన్ వద్దని వారించినట్లు వార్తలు వచ్చాయి. ఎందుకు అన్న ప్రశ్న సహజంగానే తలెత్తుతుంది. నిజానికి గతంలోనే అలాంటి ప్రయత్నం జరిగింది. నాటంజ్ అణుకేంద్రంలో 2021లో సంభవించిన పేలుడు-విధ్వంసం వెనుక ఇజ్రాయెల్ హస్తం వుందన్నది బహిరంగ రహస్యం. అయితే ఏ మేరకు నష్టం జరిగిందన్నది ఇప్పటికీ వెల్లడి కాలేదు. అణుబాంబు తయారీ నుంచి ఇరాన్ వెనక్కు తగ్గాలంటూ 2015లో ఒక ఒప్పందం కుదిరింది. డోనాల్డ్ ట్రంప్ తొలిసారి అధికారానికి వచ్చిన తరువాత 2018 మే నెలలో దాన్నుంచి అమెరికా ఏకపక్షంగా తప్పుకుంది. దాంతో ఇరాన్ తన కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభించింది. ఎంత వేగంగా అణ్వాయుధాన్ని చేయగలదు, దానికి ఉన్న అవకాశాలు, అవరోధాలు ఏమిటని ఆ రంగ నిపుణులు తర్జన భర్జన పడుతున్నారు. అణుపరీక్ష జరిపితే అధికారికంగా గుర్తింపు పొందిన అమెరికా, రష్యా, చైనా, ఫ్రాన్సు, బ్రిటన్ దేశాలుగాక అణ్వాయుధాలు ఉన్నట్టు ప్రకటించిన భారత్, పాకిస్థాన్, ఇజ్రాయెల్, ఉత్తర కొరియా, సరసన అణ్వాయుధాలున్న పదవ దేశంగా ఇరాన్ అవతరిస్తుంది. ట్రంపు ఆ దిశగా నెట్టేట్లు కనిపిస్తున్నాడు.

కొందరి అంచనా ప్రకారం అణ్వాయుధ రూపకల్పనలో కీలకమైనది బాగా శుద్ధి చేసిన యురేనియం. దాన్ని సమకూర్చుకున్న తరువాత కొన్ని నెలలు లేదా గరిష్టంగా ఒక ఏడాది కాలంలో ఆయుధం అందుబాటులోకి వస్తుందని కొందరు చెబుతున్నారు. అయితే చైనా అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుంటే కేవలం మూడు నుంచి ఐదు వారాల్లోనే సిద్ధం చేయవచ్చన్నది ఒక అభిప్రాయం. ఏడాదైనా-ఐదు వారాలైనా ఇరాన్ అణ్వాయుధం తయారు చేయగలదన్నదే అమెరికాకు పట్టుకున్న భయం. అందుకే 2024లో అణుకేంద్రాలపై దాడి చేసేందుకు జో బైడెన్ సంశయించటం లేదా వద్దని వారించటం వెనుక ఉన్న అసలు కారణం అని చెప్పవచ్చు. ఆయుధ తయారీలో ఒకటి అణు సంబంధిత పదార్థాలు, రెండవది అణేతర పరికరాలు కావాలి. ముందు అణు పదార్ధాలు సమకూరిన తరువాతే ఇతర పరికరాలకు రూపకల్పన చేయటం అమెరికా, ఇతర దేశాల అనుభవం. అదే చైనా విషయానికి వస్తే రెండింటి తయారీ సమాంతరంగా ఏకకాలంలోనే ప్రారంభించి తక్కువ వ్యవధిలో రూపొందించి పరీక్ష చేయటం మరో ప్రక్రియ. ఇప్పుడు ఇరాన్ దీన్నే అనుసరిస్తోందని భావిస్తున్నారు. సమయ అవసరం ఉండదు.

అమెరికా, దానితో జతకట్టిన ఇతర దేశాల బెదిరింపుల పూర్వరంగంలో చైనా తనదైన శైలిలో అణ్వాయుధ రూపకల్పన చేసింది. బహిర్గతమైన సమాచారం ప్రకారం అణుబాంబు తయారీకి అవసరమైన యురేనియం 1964 జనవరి నాటికి సిద్ధమైంది. రెండు బాంబులు తయారు చేసేందుకు సమకూర్చుకుంది. దాన్ని ఆయుధంగా రూపొందించ టానికి అవసరమైన ఇతర పరికరాల తయారీ ప్రక్రియను 1963నాటికే సిద్ధం చేశారు. దీంతో 1964 మే ఒకటవ తేదీ నాటికి తొలి బాంబు తయారీకి అవసరమైన ఏర్పాట్లను శాస్త్రవేత్తలు-ఇంజనీర్లు సంయుక్తంగా రూపొందించారు. తరువాత అవసరమైన తనిఖీలు, తుది మెరుగులు దిద్ది ఆగస్టు 20 నాటికి రెండు బాంబుల రూపకల్పనకు రంగం సిద్ధం చేశారు. క్వింగ్‌హై అణ్వాయుధ కేంద్రంలో మొదటి బాంబును కేవలం మూడు రోజుల్లోనే తయారు చేశారు. తొలి ప్రయోగాల తరువాత దాన్ని విడదీశారు. చైనా తొలి అణుపరీక్ష కేంద్రానికి వాటిని తరలించిన తరువాత కేవలం పది గంటల్లోనే తిరిగి అమర్చి బాంబును తయారు చేశారు. బాంబు తయారీకి అవసరమైన విధంగా యురేనియంలో మార్పులు, ఇతర పరికరాల తయారీ, వాటిని ఒకదగ్గర చేర్చి బాంబుగా మార్చేందుకు మొత్తం పట్టిన సమయం మూడు నుంచి ఐదు వారాలు మాత్రమే. ఆరు దశాబ్దాల క్రితం చైనా వద్ద అవసరమైన ఆధునిక పరికరాలు లేనప్పటికీ స్వయం కృషితో వారాపని చేశారు. ఇప్పుడు ఇరాన్ లేదా మరొక దేశం ఏదైనా బాంబుల తయారీకి పూనుకుంటే అన్ని ఆటంకాలను ఎదుర్కోవాల్సిన అవసరం లేదు. చైనా తయారీ శాంతి కాలంలో జరిగింది. అదే ఇరాన్ ఇప్పుడు ఎదుర్కొంటున్న బెదిరింపుల వంటి పూర్వరంగంలో తలచుకుంటే మూడు వారాల్లోనే తయారు చేయవచ్చని చెబుతున్నారు.



> తమ పౌర అణుకార్యక్రమం గురించి ట్రంప్ ఈసారి మరింత ఆచరణాత్మక, వాస్తవ ప్రాతిపదికన వ్యవహరిస్తారని, తమతో సంప్రదింపులు ప్రారంభించాలని ఇరాన్ ఉపాధ్యక్షుడు, వ్యూహాత్మక వ్యవహారాలను చూసే నిపుణుడు మహమ్మద్ జావేద్ జరిఫ్ జనవరి మూడవ వారంలో బహిరంగా కోరాడు. దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక సమావేశంలో ఈ మాటలు చెప్పాడు. గతంలో తప్పుదారి పట్టించి మాజీ విదేశాంగ మంత్రి మైక్ పాంపియో, జాతీయ భద్రతా సలహాదారు జాన్ బోల్టన్‌లను దూరం పెట్టారని కూడా గుర్తు చేశాడు. అమెరికా వైదొలిగిన కారణంగానే తమ కార్యక్రమం మరింత వేగం పుంజుకుందని కూడా చెప్పాడు. తాము అణ్వాయుధాల నిర్మాణం చేయాలనుకోవటం లేదని, అలా అనుకొని ఉంటే ఎప్పుడో చేసి ఉండేవారమన్నాడు. ఇరాన్ వైపు నుంచి వచ్చిన ఈ అవకాశాన్ని డోనాల్డ్ ట్రంప్ వినియోగించుకుంటాడా? తలబిరుసుతనంతో మరింతగా రెచ్చగొట్టి మరో అణ్వాయుధ దేశాన్ని రంగంలోకి తెస్తాడా, బంతి ట్రంప్ కోర్టులో ఉంది.

గతంలో ఇజ్రాయెల్ సంపాదించినట్టు చెబుతున్న సమాచారం ప్రకారం 1999 నుంచి 2003వరకు అమద్ ప్లాన్ పేరుతో ఇరాన్ యురేనియం శుద్ధితో సమాంతరంగా బాంబుల తయారీకి అవసరమైన ఇతర ఆయుధ భాగాల రూపకల్పన చేపట్టింది. ఐదు అణ్వాయుధాలను తయారు చేయాలని, వాటిలో మూడింటిని సాహెబ్-3 ఖండాంతర క్షిపణులకు అమర్చాలని, ఒకదానితో భూగర్భంలో పరీక్ష జరపాలన్నది ఇరాన్ కార్యక్రమంలో ఉన్నట్టు చెప్పారు. ఇదే వాస్తవమైతే చైనా తొలి బాంబుల మాదిరే ఇరాన్ కార్యక్రమం కూడా ఉందని చెబుతున్నారు. పశ్చిమ దేశాల నిపుణుల విశ్లేషణల ప్రకారం అమెరికా 1945లో జపాన్‌లోని నాగసాకి పట్టణంపై వేసిన ఫాట్ మాన్ బాంబు మాదిరే చైనా తన తొలి బాంబుకు రూపకల్పన చేసినట్టు, ఇప్పుడు ఇరాన్ కూడా అదే మాదిరి పథకాలతో ఉందని భావిస్తున్నారు. అయితే చైనా తొలి రూపకల్పనకు, ఫాట్‌మాన్‌కు చాలా తేడా ఉందని కొందరు విబేధిస్తున్నారు. సాంకేతికపరమైన అంశాలు పాఠకులలో అత్యధికులకు అంతగా ఒక పట్టాన ఎక్కేవి కాదు గనుక వాటి జోలికి పోవటం లేదు. ఏ దేశం రూపొందించినా బాంబు బాంబే, దాన్ని ఎక్కడ ప్రయోగించినా అపారనష్టం కలిగిస్తుంది. అమెరికా తన దగ్గర ఎంతటి విధ్వంసక ఆయుధం ఉందో చూడండి అంటూ ప్రపంచాన్ని భయపెట్టేందుకు జపాన్ నగరాల మీద వేసింది తప్ప నిజానికి అవసరం లేదు. ఆ సమయానికి జపాన్ చేతులెత్తేసి లొంగుబాటలో ఉంది, యుద్ధం చివరి దశలో ఉంది. ఆ తరువాత అణుకార్యక్రమం చేపట్టిన దేశాలన్నీ కూడా మా ఇల్లు మీకెంత దూరమో మీ ఇల్లు కూడా మాకు అంతేదూరం కబడ్దార్ అమెరికా అని హెచ్చరించేందుకు బాంబులకు రూపకల్పన చేశాయి. ఆధిపత్యం కోసం అమెరికాచేస్తే, ఆత్మరక్షణకు మిగతా దేశాలు పూనుకున్నాయి. అందుకే ప్రతి దేశానికీ అణ్వాయుధం రూపొందించుకొనే హక్కు ఉందని, అణ్వస్త్ర వ్యాప్తి నిరోధ ఒప్పదం వివక్షతో కూడుకున్నదని అనేక దేశాలు భావిస్తున్నాయి. వాటిలో మనదేశం కూడా ఉన్నందున ఆ ఒప్పందం మీద సంతకం పెట్టేందుకు నిరాకరించింది.

ఇరాన్ బాంబుల రూపకల్పన గురించి ప్రపంచానికి అంతగా తెలియదు. ఎంతో రహస్యంగా జరుపుతున్నది. అణు పరిజ్ఞానం కూడా అంతర్జాతీయ బ్లాక్ మార్కెట్లో దొరుకుతున్నది. పాకిస్థాన్ అణుకార్యక్రమ పితామహుడిగా పరిగణించే అబ్దుల్ ఖాదిర్ ఖాన్ చైనా అణ్వాయుధం 548 నమూనాను లిబియాకు అందచేశాడన్న ఆరోపణ ఉంది.చైనా బాంబుల మాదిరే ఇరాన్ రూపకల్పన కూడా ఉందని కొందరు పోల్చుతున్నారు. అయితే ఇరాన్ కూడా అలా పొందిందా లేదా అన్నది తెలియదు. అణు విద్యుత్ కేంద్రాలున్న ప్రతి దేశమూ అణ్వాయుధాల తయారీకి అవసరమైన యురేనియం శుద్ధి చేపట్టే సామర్ధ్యం కలిగి ఉంటుందన్నది ఒక అభిప్రాయం. అందుకే అనేక దేశాల వద్ద అణుబాంబులు ఉన్నాయని చెబుతారు. ఏవిధంగా చూసినప్పటికీ ఇరాన్ వద్ద కావాల్సిన పరిజ్ఞానం ఇప్పటికే ఉన్నదని, ఏ క్షణంలోనైనా బాంబులను రూపొందించగలదని భావిస్తున్నారు. అమెరికా జాతీయ గూఢచార కార్యాలయ అంచనా ప్రకారం 2015 అణు ఒప్పందం జరగటానికి ముందు ఇరాన్ వద్ద అవసరమైన సాంకేతిక పరిజ్ఞానంలేదని అయితే 2024 జూలై నాటికి చూస్తే అణ్వాయుధ తయారీకి అవసరమైన పరిజ్ఞానంలో మెరుగైన స్థానంలో ఉందని, తలచుకొంటే ఆ పని చేస్తుందని పేర్కొన్నట్లు వార్తలు.అయితే బాంబులను తయారు చేసేదీ లేనిదీ ఇంతవరకు బహిరంగంగా ఇరాన్ సూచన ప్రాయంగా కూడా చెప్పలేదు. గత ఏడాది ఇజ్రాయెల్ చర్యలను, అమెరికా తీరుతెన్నులను చూసిన తరువాత, ముఖ్యంగా డోనాల్డ్ ట్రంప్ మరోసారి అదికారానికి వచ్చిన పూర్వరంగంలో ఆ కార్యక్రమాన్ని వేగవంతం చేయనుందని భావిస్తున్నారు. వివరాలతో నిమిత్తం లేకుండా 2022 నుంచి ఇరాన్ అధికారులు తమ అణుకార్యక్రమం గురించి బహిరంగంగా మాట్లాడటాన్ని పెంచారు.

> ఇరాన్ బాంబుల రూపకల్పన గురించి ప్రపంచానికి అంతగా తెలియదు. ఎంతో రహస్యంగా జరుపుతున్నది. అణు పరిజ్ఞానం కూడా అంతర్జాతీయ బ్లాక్ మార్కెట్లో దొరుకుతున్నది. పాకిస్థాన్ అణుకార్యక్రమ పితామహుడిగా పరిగణించే అబ్దుల్ ఖాదిర్ ఖాన్ చైనా అణ్వాయుధం 548 నమూనాను లిబియాకు అందచేశాడన్న ఆరోపణ ఉంది.చైనా బాంబుల మాదిరే ఇరాన్ రూపకల్పన కూడా ఉందని కొందరు పోల్చుతున్నారు. అయితే ఇరాన్ కూడా అలా పొందిందా లేదా అన్నది తెలియదు. అణు విద్యుత్ కేంద్రాలున్న ప్రతి దేశమూ అణ్వాయుధాల తయారీకి అవసరమైన యురేనియం శుద్ధి చేపట్టే సామర్థ్యం కలిగి ఉంటుందన్నది ఒక అభిప్రాయం. అందుకే అనేక దేశాల వద్ద అణుబాంబులు ఉన్నాయని చెబుతారు. ఏవిధంగా చూసినప్పటికీ ఇరాన్ వద్ద కావాల్సిన పరిజ్ఞానం ఇప్పటికే ఉన్నదని, ఏ క్షణంలోనైనా బాంబులను రూపొందించగలదని భావిస్తున్నారు.

కొన్ని నివేదికల ప్రకారం 70శాతం మంది ఇరాన్ పౌరులు అణ్వాయుధాలు కలిగి ఉండాలని భావిస్తున్నట్లు తేలింది.

తొలిసారిగా ఫాసిస్టు లక్షణాలు గలిగిన డోనాల్డ్ ట్రంప్‌ను అమెరికన్లు గతంలో ఒకసారి, ఇప్పుడు రెండవసారి ఎన్నుకున్నారు. ఇరాన్‌తో అణు ఒప్పందం నుంచి ఏకపక్షంగా వైదొలిగిన డోనాల్డ్ ట్రంప్ ఇప్పుడేం చేస్తారన్న చర్చ ప్రారంభమైంది. తిరిగి ఇరాన్‌తో అవగాహనకు వస్తాడా లేక బెదిరింపులతో నిరోధించేందుకు చూస్తాడా? అణుకేంద్రాల మీద దాడులు చేస్తే ఆ కార్యక్రమం నుంచి వైదొలుగుతుందని ఎవరూ భావించటం లేదు. అక్కడ ఉన్న పాలకులను మార్చి తొత్తులను గద్దెనెక్కించటం లేదా ఇరాన్‌ను భౌతికంగా ఆక్రమించుకోవటం తప్ప మరొక మార్గం లేదని కొందరు సూచిస్తున్నారు. అయితే ఇప్పుడున్న పరిస్థితిలో దీన్లో ఏదీ జరిగేది కాదు. ట్రంప్ వదరుబోతుతనం, ఉన్మాద చర్యలకు పాల్పడితే ఇరాన్ అణుకార్యక్రమం మరింత వేగం అందుకుంటుంది. ప్రచ్చన్న యుద్ధంలో తామే గెలిచామని అమెరికా చెప్పుకున్నప్పటి నుంచి అణ్వాయుధాలను మరింతగా పెంచుకుంటూ పోతున్నది. ట్రంప్ ఏలుబడిలో ఇంకా పెరిగి ఏటా రెండులక్షల కోట్ల డాలర్ల మేర ఖర్చు ఉండవచ్చని భావిస్తున్నారు. ఇటీవలి కాలంలో అమెరికా అనుకుంటున్నది ఒకటి జరుగుతున్నది మరొకటి అన్నట్లుగా పరిణామాలు ఉన్నాయి. అణు ఒప్పందం నుంచి వైదొలిగితే ఇరాన్‌లో ఉన్న పాలకులు అధికారాన్ని కోల్పోయి కొత్తవారు వస్తారనే తప్పుడు సలహాను ట్రంప్ బుర్రలోకి సలహాదారులు ఎక్కించిన కారణంగానే 2018లో వైదొలిగినట్లు ఒక అభిప్రాయం. అయితే దానికి భిన్నంగా అణుకార్యక్రమం మరింత వేగవంతమైంది, పట్టుదల పెరిగింది. తమ పౌర అణుకార్యక్రమం గురించి ట్రంప్ ఈసారి మరింత ఆచరణాత్మక, వాస్తవ ప్రాతిపదికన వ్యవహరిస్తారని, తమతో సంప్రదింపులు ప్రారంభించాలని ఇరాన్ ఉపాధ్యక్షుడు, వ్యూహాత్మక వ్యవహారాలను చూసే నిపుణుడు మహమ్మద్ జావేద్ జరిఫ్ జనవరి మూడవ వారంలో బహిరంగా కోరాడు. దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక సమావేశంలో ఈ మాటలు చెప్పాడు. గతంలో తప్పుదారి పట్టించి మాజీ విదేశాంగ మంత్రి మైక్ పాంపియో, జాతీయ భద్రతా సలహాదారు జాన్ బోల్టన్‌లను దూరం పెట్టారని కూడా గుర్తు చేశాడు. అమెరికా వైదొలిగిన కారణంగానే తమ కార్యక్రమం మరింత వేగం పుంజుకుందని కూడా చెప్పాడు. తాము అణ్వాయుధాల నిర్మాణం చేయాలనుకోవటం లేదని, అలా అనుకొని ఉంటే ఎప్పుడో చేసి ఉండేవారమన్నాడు. ఇరాన్ వైపు నుంచి వచ్చిన ఈ అవకాశాన్ని డోనాల్డ్ ట్రంప్ వినియోగించుకుంటాడా? తలబిరుసుతనంతో మరింతగా రెచ్చగొట్టి మరో అణ్వాయుధ దేశాన్ని రంగంలోకి తెస్తాడా, బంతి ట్రంప్ కోర్టులో ఉంది.

భారత దేశం మూడవ ఆర్థిక వ్యవస్థగా రూపు దిద్దుకుంటుందా?



సారంపల్లి మల్లారెడ్డి
9490098

బీజేపీ నాయకత్వాన అధికారానికి వచ్చిన ప్రధాని మోడీ 2018 నుండి "ప్రపంచలో భారతదేశాన్ని మూడవ ఆర్థిక వ్యవస్థగా" చేస్తానని పదేపదే ప్రకటించారు. అంతే కాక రైతుల ఆదాయాన్ని 2022 వరకు రెట్టింపు చెస్తానని అప్పుడే ప్రకటించాడు. ఈ రెండు ప్రకటనల అమలును విశ్లేషిస్తే ఇవి అమలుకావడం అసాధ్యంగా గోచరిస్తున్నది. ప్రజలను నమ్మించ డానికి చేసే ప్రయత్నం తప్ప మరొకటి కాదు. మేధావులు, ఆర్థికవేత్తలు, సాధారణ ప్రజలు ఇలాంటి ప్రచారాలను ఎంతకాలం నమ్ముతారు. గ్లోబల్ స్థూల ఉత్పత్తి 2024లో 3.2శాతం గ్రోత్ ఉండగా 2025లో 3.3శాతానికి పెరిగినట్లు అంచనా వేశారు. వాస్తవంగా దేశంలో జరుగుతున్న ఆర్థిక పరిస్థితిని పరిశీలించాలి. భారతదేశంలో 2023-24లో మొదటి క్వార్టర్ గ్రోత్ రేటు 8.2శాతం కాగా 4వ క్వార్టర్‌లో 7.8 శాతానికి తగ్గింది. 2024-25లో మొదటి క్వార్టర్ 6.4 శాతంగా 4వ క్వార్టర్‌లో 5.8 శాతానికి తగ్గింది. పై గణాంకాలు గమనిస్తే మన దేశ జిడిపి గ్రోత్‌రేటు తగ్గుతున్నది. ఉత్పత్తి రంగాలైన వ్యవసాయ రంగం గ్రోత్ రేటు 1.4శాతం మాత్రమే కానీ, దేశ స్థూల ఉత్పత్తికి 17.7శాతం సహకరిస్తున్నది. గత దశాబ్ద కాలంగా సగటు వ్యవసాయ రుద్ధిరేటు 4.18 శాతంగా నిర్ధారించారు. పారిశ్రామిక రంగం గ్రోత్ రేటు 6శాతం నుండి 2024 నవంబర్‌లో 5.2శాతానికి తగ్గింది. దేశ స్థూల ఉత్పత్తికి 27.60 శాతం మాత్రమే సహకరిస్తున్నది. సేవా రంగం స్థూల ఉత్పత్తికి 54.7శాతం సహకరించడం వల్ల కొంత నిరుద్యోగ సమస్య పరిష్కారమవుతున్నది. కానీ, సేవా రంగ అభివృద్ధి నీటి బుడగ లాంటిది ఉత్పత్తి రంగాలైన వ్యవసాయం, పారిశ్రామిక రంగాలు, స్థిర ఆర్థిక విధానం ఉండటంచే అవి అభివృద్ధిలో ఉండాలి. పారిశ్రామిక రంగం దేశ స్థూల ఉత్పత్తికి 60 శాతం కంట్రిబ్యూట్ చేయాలి. కానీ, అందులో 50శాతమే సహకరిస్తున్నది. చాలా వరకు సన్న మధ్య తరహా పరిశ్రమలే కాక భారీ పరిశ్రమలు కూడా మూతపడుతున్నాయి. దిగుమతులు యేటా పెరుగుతున్నాయి. ఎగుమతి - దిగుమతుల లోటు 15లక్షల కోట్లకు చేరుకుంది. విదేశీ మారక ద్రవ్యం లోటు కూడా పెరుగుతున్నది. వీటి ప్రభావంతో షేర్ మార్కెట్ పడిపోవడం, అందులో పొదుపు చేసుకున్న వారు లక్షల కోట్లలో దివాలా తీస్తున్నారు.

భారతదేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగాలు

1. ఐటి - ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ
2. ఇంధన రంగం - పునరుత్పాధకశక్తి
3. ఈకామర్స్-ఆన్‌లైన్ రీటేల్-డిజిటల్ చెల్లింపులు
4. ఆరోగ్యసంరక్షణ-బయోటెక్నాలజీ టెక్నాలజి.
5. టెలికమ్యూనికేషన్
6. ఆర్థిక సేవలు - ఫిన్‌టెక్

పై రంగాల పెరుగుదల వల్ల 20శాతం మేర నిరుద్యోగ సమస్య పరిష్కరించబడినప్పటికీ ఇంకా 8శాతం నిరుద్యోగం కొనసాగుతూనేవుంది. ప్రధానీ మోడీ దేశాన్ని 3వ ఆర్థిక దేశంగా 2025నాటికి చేస్తానని అనేక సందర్భాలలో చెప్పాడు. ప్రస్తుతం ప్రపంచంలో అమెరికా 29 ట్రిలియన్ డాలర్లతో మొదటి స్థానంలో ఉండగా 18.80 ట్రిలియన్ డాలర్లతో చైనా రెండోస్థానంలో ఉంది. జపాన్ 4.25 ట్రిలియన్ డాలర్లు, జర్మనీ 3.85 ట్రిలియన్ డాలర్లు, భారత్ 3.41 ట్రిలియన్ డాలర్లతో ఐదవ స్థానంలో ఉంది. 3వ స్థానానికి చేరడానికి ప్రస్తుతం ఉన్న దేశ స్థూల ఉత్పత్తికి మరో 2ట్రిలియన్ డాలర్ల ఉత్పత్తి పెరగాలి. 2025 ముగింపు నాటికి ఇది సాధ్యమేనా? గత అనుభవాన్ని బట్టి చూస్తే 1947 నుండి 2010 వరకు 63 సంవత్సరాలు దేశం ఒక ట్రిలియన్ డాలర్లకు చేరుకుంది. 2010 నుండి 2017వరకు రెండు ట్రిలియన్ డాలర్లకు, 2018నుండి 2020 వరకు మూడు ట్రిలియన్ డాలర్లకు చేరుకుంది. రానున్న ప్రతి 1.5 సంవత్సరాలకు ఒక ట్రిలియన్ డాలర్లకు పెరుగుతున్నది. ఈ లెక్కన 2 ట్రిలియన్ డాలర్లు పెరగాలంటే మరో 3 సంవత్సరాలు వేచి చూడాలి. అప్పటికీ 3వ, 4వ స్థానంలో ఉన్న జపాన్, జర్మనీ దేశాలు ఆర్థికంగా మరింత దూసుకుపోతాయి. మనదేశంలో ప్రస్తుతం పెరుగుతున్న ఎగుమతి - దిగుమతి లోటును తగ్గించకపోతే దేశ స్థూల ఉత్పత్తి పెరగదు. మన బడ్జెట్‌లో 25శాతం రుణ వడ్డీ చెల్లింపులకు వ్యయం చేస్తున్నాం. 2023 - 24లో రూ.173.82 లక్షల కోట్లు దేశ, విదేశీ అప్పులుండగా 2024-25 నాటికి 184.88 కోట్లకు చేరుకుంటుంది. నేటికి భారత ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయ రంగమే వెన్నెముకగా ఉంది. పారిశ్రామిక ఉత్పత్తి పెరగనంత వరకు దేశ స్థూల ఉత్పత్తి పెరగదు. పారిశ్రామిక రంగం అభివృద్ధి చెందడమంటే ఉత్పత్తి పెరుగుదలతో పాటు నిరుద్యోగ సమస్య తగ్గుతుంది. పరిశ్రమలు ఉత్పత్తి చేయాలంటే వాటి వ్యాపారం పెరగాలి. అనగా ప్రజల కొనుగోలు శక్తి పెరగాలి. అన్నింటికి మూలం ప్రజల కొనుగోలు శక్తి పెరిగినప్పుడే, దేశీయ వినియోగం పెరుగుతుంది. ప్రస్తుత 143 కోట్ల జనాభాలో 23.58శాతం మాత్రమే కొనుగోలు శక్తిని పెంచుకోగలుగు తున్నారు. దేశంలో శాశ్విత ఉద్యోగుల సంఖ్య 18.16 కోట్లు మాత్రమే. 15-64 సంవత్సరాల మధ్య వయస్సు గలిగినవారి ఉద్యోగితలో 60 దేశాల సర్వేలో మన దేశం 56వ దేశంగా ఉన్నట్లు ప్రపంచ బ్యాంక్ గణాంకాలు చెబుతున్నాయి.

వ్యవసాయ రంగంలో క్రమంగా మానవ శ్రమ తగ్గి యాంత్రికీకరణ పెరగాలి. అమెరికాలో 95శాతం, బ్రిజిల్ 75శాతం, చైనా 57శాతం, భారత్ 40.45శాతం (ఏప్రిల్ 2023 నాటికి) ఉంది. యాత్రీకరణ పెరగాలంటే సన్న చిన్న కారు రైతులకు ఉపయోగపడే యంత్రాలను జపాన్ తరహాలో తయారు చేసుకోవాలి. ప్రస్తుతం గ్రామాల నుండి పట్టణాలకు 20కోట్ల మంది వలసలు వెళ్లినట్లు కరోనా ద్వారా బహిర్గతమైంది. కరోన సందర్భంగా పట్టణాల నుండి తిరిగి గ్రామాలకు వెళ్లిన వారిలో 5కోట్ల మంది తిరిగి పట్టణాలకు వెళ్లినట్లు సర్వేలు చెపుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ అంచనా ప్రకారం 6.52కోట్ల కుటుంబాలు (32కోట్ల మంది) దారిద్ర్య రేఖకు దిగువనున్న వారిగా గుర్తించి వారికి రేషన్ ఇవ్వడం జరుగుతున్నది. ఇందులో 2.44 కుటుంబాలకు అన్నదాత అంత్యోదయ యోజన పథకం ద్వారా బియ్యం ఉచితంగా ఇస్తున్నారు. గత దశాబ్ద కాలంలో 20కోట్ల మంది ప్రజలు దారిద్ర్యరేఖ నుండి ఎగువకు చేరినట్లు ప్రధాని మోడీ ఒక వైపున ప్రకటిస్తూ మరోవైపున 80కోట్ల మందికి రానున్న 5సంవత్సరాలు (2029 వరకు) ప్రతి మనిషికి 5కిలోల బియ్యం ఉచితంగా ఇస్తానని ప్రకటించారు. దారిద్ర్య రేఖకు ఎగువకు చేరినప్పుడు కేంద్రం ఉచిత బియ్యం పథకాన్ని ఎందుకు అమలు జరుపుతున్నట్టు?

బడ్జెట్‌లను పరిశీలిస్తే ప్రభుత్వ ప్రకటనల్లోని లోపాలను గమనించవచ్చు. 2022-23లో వాస్తవ వ్యయం బడ్జెట్ ప్రకారం రూ.41,93,157 కోట్లు కాగా 2024-25 బడ్జెటు రూ.48,20,512 కోట్లకు పెరిగింది. బడ్జెట్‌తో పాటు దళిత గిరిజనులకు సబ్‌ప్లాన్ ప్రకారం రూ.3లక్షల కోట్లకు పెంచారు. ఈ నిధులను 102 ప్రభుత్వ శాఖలో వ్యయం చేస్తారు. దీనివల్ల ఆ వర్గాలకు ఒరిగే లాభం ఏమిలేదు. ఈ వర్గాలకే అంబరిల్లా పథకం కింద మరో 13,500 కోట్ల అంబరిల్లా పథకానికి కూడా కేటాయించారు. 2021-22 నుండి మైనార్టీలకు అమ్మరిల్లా పథకం కింద రూ.1,428కోట్లు కాగా 2024-25 నాటికి రూ.2,500ల కోట్లకు పెంచారు. అయినా ఈ వర్గాలు అభివృద్ధి కావడంలేదు. మైనార్టీలు, బీసీలు, దళితులు, గిరిజనుల కొనుగోలు శక్తి పెరగనందున "ఎక్కడ వేసిన గొంగళి అక్కడే" అన్నచందంగా ఉంది. అకలిలో భారతదేశం ప్రపంచదేశాల్లో 113వ స్థానంలో ఉంది. మనకన్న చిన్న దేశాలు ఎంతో అభివృద్ధిలో ఉన్నాయి. ఇంత వెనకబాటుతనమున్న దేశంలో బడ్జెట్‌లో ఉత్పత్తి రంగానికి కేటాయింపులు చేయకపోవడం వల్ల, ప్రణాళికా బద్ధమైన ఉత్పత్తి లేకపోవడంతో పెరుగుదలలో లోటు కనబడుతున్నది. కానీ, అదే సందర్భంలో కార్పొరేట్ సంస్థలు ఎలాంటి ఆటంకం లేకుండా తమ లాభాలను పెంచుకుం టున్నారు. అంతేకాక ప్రధాని మోడీ కార్పొరేట్లకు గత 10 సంవత్సరాలల్లో 15లక్షల కోట్ల లాభాలను కట్టబెట్టాడు. లాభాలలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను బుక్‌వ్యాల్యూకన్న తక్కువ ధరలకు కార్పొరేట్లకు కట్టబెడుతున్నారు.

బ్లాక్ మనిని పట్టుకొని ప్రతి కుటుంబానికి రూ.15లక్షలు బ్యాంక్‌లో వేస్తానని చెప్పడం వెనక మోసాన్ని ప్రజలు గుర్తిస్తున్నారు. ప్రపంచంలో కార్పొరేట్లపై 30-35 శాతం పన్ను విధిస్తుండగా మనదేశంలో 20శాతం లోపే పన్ను విధిస్తున్నారు. దీనిని బట్టి దేశ స్థూల ఉత్పత్తి ఏ మేరకు పెరుగుతుంది అన్నది ఆర్థికవేత్తలు ఆలోచించాలి. కొందరు కుహనా ఆర్థిక వేత్తలు దేశ ఆర్థిక ప్రగతి పెద్ద అంగలతో దూసుకుపోతున్నట్టు ప్రచారం చేస్తున్నారు. తలసరి ఆదాయం, సగటు ఆదాయం పెరిగినట్లు గణాంకాల ద్వారా ప్రచారం చేస్తున్నారు. కార్పొరేట్లు-పేదల ఆస్థులను కలిపి తలసరి ఆదాయం పెరిగినట్లు చెబుతున్నారు. గతంలో మిలియనీర్లుగా ఉన్నవారు నేడు బిలియనీర్లు అయ్యారు. త్వరలో ట్రిలియనీర్లుగా పెరగబోతున్నారు. ఆ విధంగా కార్పొరేట్ల ఆస్తుల పెరుగుదలను దేశ స్థూల ఉత్పత్తి పెరుగుదలలో గణించినప్పటికీ మరోవైపు దారిద్ర్యం, నిరుద్యోగం పెరుగుతూనే ఉంది. అందువల్ల ఫిబ్రవరి 4న ప్రవేశ పెట్టనున్న బడ్జెట్‌లో ఉత్పత్తి రంగానికి, పారిశ్రామిక రంగానికి ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రజల కొనుగోలు శక్తి పెరగడానికి పథకాలు రూపొందించాలి. భారతదేశంలో ఉన్న మౌలిక వసతులను వినియోగించుకొని అన్ని రంగాలల్లో ఉత్పత్తిని పెంచాలి. జి-7 దేశాల ఆదేశాలకు లొంగి ఉత్పత్తిని పెంచకుండా దిగుమతుల బాండాగారం చేసే విధానాలకు స్వస్తి పలకాలి. ప్రస్తుత అభివృద్ధిని శాస్త్రీయంగా పరిశీలించి తగు నిర్ణయాలు తీసుకోవాలి. ప్రస్తుతమున్న 5వ స్థానాన్నైనా కాపాడుకోవాలి.



నవ్వించే 'బద్మాషులు'

మహేష్ చింతల, విద్యాసాగర్ కారంపురి, మురళీధర్ గౌడ్ లీడ్ రోల్స్‌లో ఓ హిలేరియస్ ఎంటర్టైనర్ రూపొందుతోంది. తార స్టోరీ టెల్లర్స్ బ్యానర్ పై బి. బాలకృష్ణ, సి.రామ శంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శంకర్ చేగూరి దర్శకుడు. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ ఎంటర్‌టైనర్‌కి 'బద్మాషులు' అనే క్రేజీ టైటిల్‌ని మేకర్స్ ఖరారు చేశారు.

మహేష్ చింతల, విద్యాసాగర్ కారంపురి, మురళీధర్ గౌడ్ కనిపించిన ఫస్ట్ లుక్ పోస్టర్ చాలా ఇంట్రస్టింగ్‌గా ఉందిద. టైటిల్ డిజైన్ చాలా క్రియేటివ్‌గా ఉండి ఎట్రాక్ట్ చేస్తోంది. గ్రామీణ నేపథ్యంలో జరిగే హాస్య భరిత చిత్రమిది. ప్రతి సన్నివేశంలో కడుపుబ్బా నవ్వుకుని, ఆ అనుభూతిని నలుగురు పంచుకునే చిత్రం. ఈ చిత్రంలోని ప్రతి పాత్ర మీ నిజ జీవితంలో, మీ ఊరిలోని మీరు కలిసిన వారిలాగే ఉంటూ నవ్విస్తుంటాయి. కథనం పరంగా నవ్విస్తూనే గొప్ప సందేశాన్ని ఇస్తుంది అని చిత్ర బృందం తెలిపింది.

బలగం సుధాకర్ రెడ్డి, కవిత శ్రీరంగం, దీక్ష కోటేశ్వర్, అన్నుమన్, అంజి తదితరులు నటిస్తున్న ఈచిత్రానికి దర్శకత్వం-శంకర్ చేగూరి, సంగీత దర్శకులు- తేజ కూనూరు, సినిమాటోగ్రాఫర్- వినీత్ పబ్బతి, ఎడిటర్- గజ్జల రక్షిత్ కుమార్.

నవచిత్రం

ప్రేమికుల రోజు కానుకగా రిలీజ్



అమ్మ రాజశేఖర్ దర్శకత్వంలో ఆయన తనయుడు అమ్మ రాజ్ హీరోగా రూపొందిన చిత్రం 'తల'. అంకిత నాన్సర్ హీరోయిన్. మంగళవారం ఈ చిత్ర ట్రైలర్ లాంచ్ ఈవెంట్ ప్రసాద్ ల్యాబ్‌లో ఘనంగా జరిగింది.

ఈ సందర్భంగా హీరో అమ్మ రాజ్ మాట్లాడుతూ,'ఈ సినిమా ఫిబ్రవరి 14న విడుదల అవుతుంది. వాలంటైన్స్ డేకి వస్తున్న ఈ చిత్రం అందర్నీ అలస్తుంది. ఈ సినిమా మిమ్మల్ని ఎక్కడికో తీసుకెళుతుంది. యాక్షన్, సాంగ్స్ అన్నీ కంటెంట్‌లో భాగంగా ఆద్యంతం ఆసక్తికరంగా ఉంటాయి' అని అన్నారు. హీరోయిన్ అంకిత మాట్లాడుతూ,'నేను బెంగాలీ. ఇదినా ఫస్ట్ సినిమా. ఈ అవకాశం ఇచ్చినందుకు అమ్మ రాజశేఖర్‌కి థ్యాంక్స్. ప్రతి ఒక్కరూ సినిమా చూసి మమ్మల్ని సపోర్ట్ చేయండి' అని తెలిపారు.

'ఇండస్ట్రీలో అంతా అమ్మ రాజశేఖర్ ఫినిష్ అని చెప్పారు. ఇప్పుడు ఈ సినిమాతో వస్తున్నాను. నా కొడుకుతో సినిమా చేయాలనేది చిన్నప్పటి నుంచి నా కోరిక. శ్రీనివాస్ గౌడ్ నా దేవుడు. నా కుటుంబం మొత్తం రుణపడి ఉంటుంది. ఈ మూవీ కొని తెలుగు, తమిళ్‌లో గ్రాండ్‌గా రిలీస్ చేస్తున్నారంటే గట్స్ కావాలి' అని దర్శకుడు అమ్మ రాజశేఖర్ అన్నారు.

ఈ చిత్రానికి డీఓపీ: శ్యామ్ కె నాయుడు, సాంగ్: థమన్ ఎస్ఎస్, మ్యూజిక్ డైరెక్టర్: ధర్మ తేజ, అస్లాం కేఈ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: రాధ రాజశేఖర్, ఆర్ట్ డైరెక్టర్: రామకృష్ణ, లిరిసిస్ట్: ధర్మతేజ, ఎడిటర్ : శివ సామి.

మెప్పించే 'రాజా మార్కండేయ'



శ్రీ జగన్మాత రేణుకా క్రియేషన్స్, ఫోర్ ఫౌండర్స్ పతాకాలపై బన్నీ అశ్వంత్ దర్శకత్వంలో సామా శ్రీధర్, పంజాల వెంకట్ గౌడ్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'రాజా మార్కండేయ'. వేట మొదలైంది అనేది ఉప శీర్షిక.

యస్‌కె మీరావలి, రాయారావు విశ్వేశ్వరరావు, సత్యదీప్ సంగీతాన్ని అందించారు. తాజాగా ఈ చిత్ర ఆడియో ఆవిష్కరణ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో హీరో సుమన్, ప్రతాని రామకృష్ణ గౌడ్, హీరో తేజస్ వీరమాచినేని, హీరోయిన్స్ రోమి, దేవిక, ప్రత్యూష, దర్శకుడు బన్నీ ఆశ్వంత్, నిర్మాతలు సామా శ్రీధర్, పంజల వెంకట్ గౌడ్, సహ నిర్మాతలు గౌరిశెట్టి శ్రీనివాస్, మాజీ టూరిజం ఛైర్మెన్ శ్రీనివాస్ గుప్తా, హైకోర్ట్ అడ్వకేట్ రాపోలు భాస్కర్, హాస్యబ్రహ్మ శంకర్ నారాయణ, సామాజికవేత్త - ప్రొడ్యూసర్ డాక్టర్ మూసా అలీ ఖాన్, కటకం శ్రీనివాస్ గుప్తా, ఇన్నాఫేమ్ కవిరాజ్ దంపతులు, సామాజికవేత్త గంగాపురం పద్మా గౌడ్ తదితరులు పాల్గొన్నారు. విచ్చేసిన అతిథులు చిత్రంలోని ఒక్కో పాటను ఆవిష్కరించగా, టీజర్‌ను రాపోలు భాస్కర్ విడుదల చేశారు. సినిమా ట్రైలర్‌ను హీరో సుమన్ రిలీజ్ చేశారు.

ఈ సందర్భంగా దర్శకుడు బన్నీ ఆశ్వంత్ మాట్లాడుతూ,'ఈనాటి కలియుగంలో శివుడి భక్తుడైన మార్కండేయ జీవితంలో ఎలాంటి కష్టాలు ఎదురయ్యాయి?, వాటిని శివుడి అనుగ్రహంతో ఎలా అధిగమించాడు? అనేది కాన్సెప్ట్. మీరావలి మంచి సంగీతాన్ని అందించారు' అని అన్నారు.

'మా బన్నీ ఆశ్వంత్ వల్లే ఈ సినిమాని నిర్మించగలిగాం. కథని నమ్మి తీసిన సినిమా ఇది. సినిమా బాగా వచ్చింది. ఆడియెన్స్‌కి ఈ చిత్రం కచ్చితంగా నచ్చుతుంది' అని నిర్మాతల్లో ఒకరైన సామా శ్రీధర్ చెప్పారు.

ఛేదనలో చతికిల!

- మూడో టీ20లో ఇంగ్లాండ్‌దే పైచేయి
- హార్దిక్ పాండ్య ఒంటరి పోరాటం వృథా

పొట్టి ఫార్మాట్‌లో జోరుమీదున్న టీమ్ ఇండియాకు రాజ్‌కోట్‌లో చుక్కెదురైంది. 172 పరుగుల ఛేదనలో సూర్యసేన చతికిల పడింది. టాప్ ఆర్డర్ బ్యాటర్లు నిరాశపరచగా.. హార్దిక్ పాండ్య (40) ఒంటరి పోరాటం చేశాడు. 26 పరుగుల తేడాతో ఇంగ్లాండ్ ఘన విజయం సాధించింది. వరుణ్ చక్రవర్తి (5/24) మాయ చేయగా తొలుత ఇంగ్లాండ్ 171/9 పరుగులు చేసింది.

నవతెలంగాణ-రాజ్‌కోట్

టీ20 సిరీస్‌లో ఇంగ్లాండ్ ఆశలు సజీవం. కీలక మూడో టీ20లో భారత్‌పై 26 పరుగుల తేడాతో గెలుపొందిన ఇంగ్లాండ్ 1-2తో రేసులోకి వచ్చింది. బౌలర్లు సమిష్టిగా రాణించటంతో 172 పరుగుల ఛేదనలో భారత్‌ను ఇంగ్లాండ్ కట్టడి చేసింది. హార్దిక్ పాండ్య (40, 35 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్సలు) ఒంటరి పోరాటం వృథా అయ్యింది. సంజు శాంసన్ (3), అభిషేక్ శర్మ (24), సూర్యకుమార్ యాదవ్ (14), తిలక్ వర్మ (18)లు అంచనాలను అందుకోలేదు. 85 పరుగులే ఐదు వికెట్లు కోల్పోయిన భారత్ పీకల్లోతు కష్టాల్లో కూరుకుంది. వాషింగ్టన్ సుందర్ (6), అక్షర్ పటేల్ (15), ధ్రువ్ జురెల్ (2)లు ఆఖర్లో ఒత్తిడిని ఎదుర్కొని పరుగులు చేయటంలో తేలిపోయారు. 20 ఓవర్లలో 9 వికెట్లకు భారత్ 145 పరుగులే చేసింది. అంతకుముందు, వరుణ్ చక్రవర్తి (5/24) మాయజాలంతో ఇంగ్లాండ్‌ను విలవిల్లాడించాడు. ఓపెనర్ బెన్ డకెట్ (51, 28 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్సలు), జోశ్ బట్లర్ (24, 22 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్), లివింగ్‌స్టోన్ (43, 24 బంతుల్లో 1 ఫోర్, 5 సిక్సలు) రాణించారు. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 171 పరుగులు చేసింది.



డకెట్ అర్థ సెంచరీ

మంచు ప్రభావం ఎక్కువగా ఉండే పరిస్థితుల్లో టాస్ నెగ్గిన భారత్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. అర్షదీప్ సింగ్‌కు విశ్రాంతి దక్కగా.. సీనియర్ పేసర్ మహ్మద్ షమి తుది జట్టులో నిలిచాడు. షమితో కొత్త బంతిని పంచుకున్న హార్దిక్ పాండ్య.. ఓపెనర్ ఫిల్ సాల్ట్ (5) వికెట్‌తో బ్రేక్ అందించాడు. మరో ఓపెనర్ బెన్ డకెట్ (51), జోశ్ బట్లర్ (24) రెండో వికెట్‌కు 45 బంతుల్లో 76 పరుగులు జోడించారు. ఇంగ్లాండ్‌ను భారీ స్కోరు దిశగా నడిపించారు. ఏడు ఫోర్లు, రెండు సిక్సర్లతో 26 బంతుల్లోనే అర్థ సెంచరీ బాదిన బెన్ డకెట్.. ఆ తర్వాత మాయలో పడ్డాడు. ఓ ఫోర్, సిక్సర్‌తో ప్రమాదకరంగా మారుతున్న బట్లర్‌ను వరుణ్ చక్రవర్తి సాగనంపగా.. డకెట్‌ను అక్షర్ పటేల్ అవుట్ చేశాడు. హ్యారీ బ్రూక్ (8), స్మిత్ (6), ఓవర్టన్ (0), బ్రైడన్ (3), ఆర్చర్ (0)లు స్వల్ప స్కోర్లకే నిష్క్రమించారు. కానీ లియాం లివింగ్‌స్టోన్ (43) ధనాధన్ మెరుపులతో దంచికొట్టాడు. రవి బిష్ణోయ్ ఓవర్లో ఏకంగా మూడు సిక్సర్లు కొట్టాడు. కానీ హార్దిక్ పాండ్య అతడి కథను ముగించాడు. దీంతో 20 ఓవర్లలో 9 వికెట్లకు ఇంగ్లాండ్ 171 పరుగులు చేసింది.

మహబూబ్ నగర్, ఆదిలాబాద్ జోరు

టీడీసీఏ టీ20 క్రికెట్ టోర్నమెంట్



హైదరాబాద్ : తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం (టీడీసీఏ) నిర్వహిస్తున్న అండర్-17 టీ20 టోర్నమెంట్‌లో మహబూబ్ నగర్, ఆదిలాబాద్ జట్లు ముందంజ వేశాయి. మంగళవారం దోమలగూడలోని ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజ్ గ్రౌండ్‌లో జరిగిన తొలి మ్యాచ్‌లో మెదక్‌పై మహబూబ్ నగర్ 33 పరుగుల తేడాతో గెలుపొందింది. రవితేజ (82 నాటౌట్) అర్థ సెంచరీతో మహబూబ్ నగర్ తొలుత 20 ఓవర్లలో 178/8 పరుగులు చేసింది. ఛేదనలో మెదక్ 20 ఓవర్లలో 145/9 పరుగులే చేసింది. రెండో మ్యాచ్‌లో నిజామాబాద్ (127/10)పై టీడీసీఏ (169/8) ఎలెవన్ 42 పరుగుల తేడాతో విజయం సాధించింది. 18 ఓవర్ల మ్యాచ్‌లో ఆదిలాబాద్ 117/8 పరుగులు చేయగా.. వరంగల్ 15.4 ఓవర్లలో 84 పరుగులకే చేతులెత్తేసింది. 33 పరుగుల తేడాతో ఆదిలాబాద్ ఘన విజయం సాధించింది. రెండో రోజు పోటీలను టీడీసీఏ అధ్యక్షుడు అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి టాస్ వేసి ప్రారంభించారు.

త్రిష ధనాధన్ సెంచరీ

స్కాట్లాండ్‌పై భారత్ ఘన విజయం



కౌలాలంపూర్ : ఐసీసీ మహిళల అండర్-19 ప్రపంచకప్‌లో తెలంగాణ అమ్మాయి గొంగడి త్రిష సరికొత్త రికార్డు సాధించింది. ఈ టోర్నమెంట్‌లో సెంచరీ సాధించిన తొలి క్రికెటర్‌గా త్రిష నిలిచింది. సూపర్ సిక్స్‌లో స్కాట్లాండ్‌తో మ్యాచ్‌లో గొంగడి త్రిష (110 నాటౌట్, 59 బంతుల్లో 13 ఫోర్లు, 4 సిక్సలు) శివమెత్తింది. ఓపెనర్ కమలిని (51, 42 బంతుల్లో 9 ఫోర్లు) అర్థ సెంచరీతో మెరవగా తొలి వికెట్‌కు 147 పరుగులు జోడించారు. త్రిష 53 బంతుల్లోనే సెంచరీ బాదటంతో తొలుత భారత్ 20 ఓవర్లలో 208/1 పరుగుల భారీ స్కోరు సాధించింది. రికార్డు ఛేదనలో స్కాట్లాండ్ 14 ఓవర్లలో 58 పరుగులకు కుప్పకూలింది. ఆయుశి శుక్లా (4/8), గొంగడి త్రిష (3/6), వైష్ణవి శర్మ (3/5) కలిసి పది వికెట్లు పడగొట్టారు.

హైదరాబాద్‌లో రెండు కొత్త ఐటీ పార్కులు

- పరిశ్రమలకు భూకేటాయింపులపై ప్రత్యేక పాలసీ : రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్ నగర శివార్లలో కొత్తగా రెండు ఐటీ పార్కులను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. హైదరాబాద్‌లో రూ.100 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చిన "డ్యూ' సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రతినిధులతో మంగళవారం సచివాలయంలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. 'ఐటీ రంగంలో హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందుతున్నది. ప్రముఖ కంపెనీలు ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నాయి. అందుకే హైటెక్ సిటీ తరహాలోనే కొత్తగా మరో రెండు ఐటీ పార్కులను ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. వీటిని ఎంత విస్తీర్ణంలో ఏర్పాటు చేయాలి. ఏయే ప్రాంతాలు ఏర్పాటుకు అనుకూలంగా ఉన్నాయో సంబంధిత యంత్రాంగం అధ్యయనం చేస్తుంది' అని మంత్రి తెలిపారు. 'పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే పరిశ్రమలకు భూకేటాయింపులపై ఇప్పటి వరకు ప్రత్యేక పాలసీ అంటూ లేదు. దీని వల్ల పారిశ్రామికవేత్తలు ఇబ్బంది పడుతున్నారు. అందుకే ప్రత్యేక పాలసీని రూపొందించాలని నిర్ణయించాం. పెట్టుబడి, కల్పించే ఉద్యోగాల సంఖ్య ఆధారంగా భూమిని కేటాయిస్తాం' అని శ్రీధర్‌బాబు తెలిపారు. హైదరాబాద్‌లో రూ.100 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చిన డ్యూ సాఫ్ట్‌వేర్ కంపెనీకి ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా సహకరిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, టీజీఐఐసీ ఎండీ డా.విష్ణువర్ధన్‌రెడ్డి, టీజీఐఐసీ సీఈవో మధుసూదన్, "డ్యూ" వెంచర్స్ ప్రెసిడెంట్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రూ.లక్ష లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఎస్ఐ, కానిస్టేబుల్

- కేసు నుంచి తప్పించడానికి రూ.3 లక్షల డిమాండ్
- రూ.లక్షా 30 వేలకు సెటిల్‌మెంట్



నవతెలంగాణ-తిరుమలగిరి

పీడీఎస్ బియ్యం కేసు నుంచి తప్పించడానికి రూ.3 లక్షలు డిమాండ్ చేసి రూ.లక్ష లంచం తీసుకుంటూ ఎస్ఐ, కానిస్టేబుల్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఈ ఘటన మంగళవారం సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండల పోలీస్ స్టేషన్లో జరిగింది. వివరాల్లోకెళితే..

తిరుమలగిరి మండలం వడ్డేపల్లి గ్రామ మాజీ సర్పంచ్ చంద్రశేఖర్‌పై నమోదైన పీడీఎస్ బియ్యం కేసును తప్పించడానికి తిరుమలగిరి ఎస్ఐ సురేష్ రూ.3లక్షలు డిమాండ్ చేశారు. అంత ఇవ్వలేనని చంద్రశేఖర్ రూ.లక్షా 30వేలకు సెటిల్‌మెంట్ చేసుకున్నాడు. అందులో భాగంగా ఈనెల 25న సూర్యాపేటలోని శ్రీసాయి ఫిల్లింగ్ స్టేషన్ ఖాతాకు ఫోన్‌పే ద్వారా రూ.30వేలు, 28న కానిస్టేబుల్ నాగరాజుకు రూ.30వేలు వేయించుకున్నాడు. అరెస్టు నుంచి తప్పించడానికి మిగతా డబ్బులు ఇవ్వాలన్నారు. దాంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. ఎస్ఐ సురేష్ సమక్షంలో కానిస్టేబుల్ నాగరాజు రూ.70వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అంతకుముందు, 25న కానిస్టేబుల్ నాగరాజు కూడా ఫోన్‌పే ద్వారా మరో రూ.10వేలు లంచం తీసుకున్నాడు. మొత్తం రూ.1.40లక్షల(ఎస్ఐకి లక్ష, కానిస్టేబుల్‌కు రూ.40వేలు)ను సీజ్ చేశారు. వారిద్దరిని అరెస్టు చేసి నాంపల్లిలోని ఏసీబీ కోర్టులో హాజరు పరుచనున్నామని అధికారులు తెలిపారు. తన తమ్ముడు రత్నాకర్‌పై నమోదైన కేసులో తనను కూడా కావాలని ఇరికించారని బాధితుడు చంద్రశేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దాడిలో ఏసీబీ డీఎస్పీ జగదీష్ చందర్, సీఐ వెంకట్రావు, రామారావు, స్టాఫ్ శ్రీధర్, నరేష్ సంపత్‌తోపాటు మొత్తం 17 మంది పాల్గొన్నారు.

నా సర్వీస్‌లో ఇలాంటి కేసు చూడలేదు

మీర్‌పేట హత్య కేసులో నిందితుని అరెస్ట్

- ఇంట్లో గొడవల కారణంగా భార్య హత్య
- నిందితుడిలో కనపడని పశ్చాత్తాపం
- ఇంత క్రూరంగా మనిషిని చంపుతారా.. : రాచకొండ సీపీ సుధీర్‌బాబు ప్రెస్‌మీట్



నవతెలంగాణ-హయత్ నగర్

రాష్ట్రంలో సంచలనం సృష్టించిన మీర్‌పేట హత్యకేసులో నిందితుడు గురుమూర్తిని పోలీసులు మంగళవారం మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఒక మనిషిని ఇంత క్రూరంగా చంపుతారా.. మేమే నివ్వెరపోయామని సీపీ అన్నారు. భార్యను ఇంత దారుణంగా చంపిన గురుమూర్తిలో ఎలాంటి పశ్చాత్తాపమూ కనిపించలేదన్నారు. మీర్‌పేట పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన హత్య కేసును ఛేదించిన తీరును రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు మంగళవారం ఎల్‌బీ నగర్ సీపీ క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

బాలాపూర్ మండలంలోని జిల్లెలగూడలో పుట్ట వెంకటమాధవి, గురుమూర్తి దంపతులు నివాసమున్నారు. వారికి ఇద్దరు సంతానం. మాధవి స్వస్థలం ప్రకాశం జిల్లా, రాచర్ల మండలం, జెల్లీవారి పుల్లెల చెరువు గ్రామం. గురుమూర్తి ఆర్మీలో 15 సంవత్సరాలు జవాన్‌గా పనిచేసి రిటైర్ అయ్యాడు. ప్రస్తుతం ప్రయివేటు సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 15న సంక్రాంతికి బాలాపూర్ మండల పరిధిలో ఉండే మాధవి బంధువుల ఇంటికి పిల్లలను తీసుకుని వెళ్లారు. పిల్లలను అక్కడే వదిలేసిన భార్యాభర్తలు ఇంటికి వచ్చారు. 16న ఉదయం భార్యతో గురుమూర్తి అకారణంగా గొడవకు దిగాడు. ఈ క్రమంలో మాధవి తలను గోడకేసి బాదడంతో ఆమె కింద పడిపోయింది. ఆ తర్వాత గొంతు నులిమి చంపేశాడు. అనంతరం ఇంట్లో ఉన్న కత్తితో మృతదేహాన్ని ముక్కలు చేసి వాటర్ హీటర్‌తో నీల్లు మరిగించి శరీర భాగాలను అందులో ఉడకబెట్టాడు. ఆ తర్వాత గ్యాస్ పొయ్యిపై పెట్టి కాల్చాడు. మరలా రోకలితో పొడి చేశాడు. ఈ ప్రక్రియ అంతా ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు పూర్తి చేశాడు. పోలీసులకు ఎలాంటి ఆధారాలూ లభించకుండా ఆ పొడిని బకెట్‌లో వేసుకుని తీసుకెళ్లి జిల్లేలగూడ పెద్ద చెరువులో పడేశాడు.

సీసీ కెమెరాల ద్వారా చిక్కాడు

పండుగ కావడం వల్ల హత్య సమయంలో ఆ ఇంట్లో ఎవరూ లేరు. దాంతో నిందితుడు చేసిందంతా ఎవరికీ తెలియలేదని సీపీ చెప్పారు. భార్యను హత్య చేశాక ఇల్లంతా శుభ్రం చేసి, పిల్లలను ఇంటికి తీసుకొచ్చాడని తెలిపారు. అమ్మ ఎక్కడ అని అడగ్గా.. బయటకు వెళ్లిందని పిల్లలకు గురుమూర్తి చెప్పాడు. రెండ్రోజుల తర్వాత మృతురాలి తల్లిదండ్రులు వచ్చి అడిగితే మిస్సింగ్ అయిందని మీర్‌పేటలో అత్తతో వెళ్లి ఫిర్యాదు చేశాడు. అయితే, విచారణలో భాగంగా సీసీ కెమెరాలను పరిశీలిస్తే కొన్ని అనుమానాలు వచ్చాయని, దాంతో సీన్ రీ కన్‌స్ట్రక్షన్‌లో అతన్ని అదుపులోకి తీసుకుని విచారించామని వివరించారు. పోలీసులను కూడా తప్పుదోవ పట్టించాడని, నిందితుడి మేనమామకు అన్ని విషయాలూ తెలిపాడని అన్నారు. ఆధారాల కోసం పోలీసులు తీవ్రంగా శ్రమించారని, సాంకేతిక పరిజ్ఞానంతో కొన్ని ప్రాథమిక ఆధారాలను సేకరించి, గురుమూర్తిని మంగళవారం అరెస్టు చేసినట్టు సీపీ తెలిపారు. ఇంట్లో కత్తి, రోలర్, బకెట్, వాటర్ హీటర్, రెండు సెల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇది క్షణికావేశంలో చేసిన హత్యకాదు.. పథకం ప్రకారమే చేసినట్టు గుర్తించామని సీపీ తెలిపారు. భార్యను ఇంత దారుణంగా హత్యచేసిన నిందితుడిలో ఎలాంటి పశ్చాత్తాపమూ కనిపించడం లేదన్నారు. ఈ సమావేశంలో ఎల్‌బి నగర్ జోన్ డీసీపీ ప్రవీణ్ కుమార్, అడిషనల్ డీసీపీ కోటేశ్వరరావు, వనస్థలిపురం ఏసీపీ కాశీరెడ్డి, మీర్‌పేట ఇన్‌స్పెక్టర్ నాగరాజు తదితరులు ఉన్నారు.

వక్ఫ్ బిల్లు ఆమోదం అప్రజాస్వామికం

- ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్బాస్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వక్ఫ్ సవరణ బిల్లును జాయింట్ పార్లమెంటరీ కమిటీ ఏకపక్షంగా ఆమోదించటం అప్రజాస్వామికమని ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్బాస్ విమర్శించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ బిల్లుపై వక్ఫ్ జాయింట్ పార్లమెంటరీ కమిటీకి ప్రజలు పంపిన లక్షలాది అభిప్రాయాలను, ప్రతిపక్షాలు చేసిన సవరణలను నిరంకుశంగా తిరస్కరించి, ఏక పక్షంగా వక్ఫ్ చట్ట సవరణ బిల్లును ఆమోదించ డమేంటని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ఇలాంటి నిరంకుశ చర్యలను మానుకోవాలని హితవు పలికారు. ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ చట్టం 1995కి బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం 44 సవరణలు చేయాలని ప్రతిపాదించిందని తెలిపారు. ఈ సవరణలు వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు కాకుండా అధికార బలం ఉన్న వారు ఆక్రమించేందుకు ఉపయోగపడేలా ఉన్నాయని పేర్కొన్నారు. ఇప్పటికే అన్యాక్రాంతమవుతున్న వక్ఫ్ ఆస్తులు చట్ట సవరణ వల్ల మరింత ఆక్రమణలకు గురయ్యే ఆస్కారముందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక ఆస్తి వక్ఫ్ హోదాను గుర్తించే అధికారం కలెక్టర్లకి, ఎమ్మార్వోలకి కట్టబెట్టడమంటే స్థానిక రాజకీయాల జోక్యానికి ఆస్కారం ఇవ్వడమేనని తెలిపారు. సవరణ చేయడం ద్వారా సంక్రమించే అధికారాలతో ముస్లిం మైనారిటీలను వేధించడానికి, రాజకీయ లబ్ది పొందడానికి వాడుకోవాలని బీజేపీ చూస్తోందని విమర్శించారు. వక్ఫ్ ఆస్తుల చట్ట సవరణ బిల్లు పట్ల తెలుగు దేశం, జనతాదళ్ (యునైటెడ్) పార్టీలు అవకాశవాదంతో వ్యవహరిస్తున్నాయనీ, పార్లమెంటులో ఆ బిల్లును వ్యతిరేకించి, మైనార్టీల పట్ల తమ చిత్తశుద్ధిని చాటుకోవాలని డిమాండ్ చేశారు. మైనారిటీలను వేధిస్తూ, వారి స్మశానాలను, దర్గాలను, ఈద్గాలను, వక్ఫ్ ఆస్తులను స్వాధీనం చేసుకోవడానికి బీజేపీ కుట్రపూరితంగా తీసుకొస్తున్న వక్ఫ్ చట్ట సవరణ బిల్లును ప్రజలందరూ వ్యతిరేకించాలని విజ్ఞప్తి చేశారు.

హుస్సేన్‌సాగర్‌లో అజయ్ మృతదేహం లభ్యం

- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గణపతి పరిస్థితి విషమించి మృతి

నవతెలంగాణ-సిటీబ్యూరో/బంజారాహిల్స్

హైదరాబాద్ హుస్సేన్‌సాగర్‌లో గల్లంతైన యువకుడు అజయ్ మృతదేహం లభ్యమైంది. భారతమాతకు మహాహారతి కార్యక్రమం నేపథ్యంలో ఆదివారం రాత్రి హుస్సేన్‌సాగర్‌లో బాణసంచా కాల్చేటప్పుడు చోటుచేసుకున్న అగ్ని ప్రమాదంలో సిల్వేరు అజయ్(21) అదృశ్యమైన విషయం తెలిసిందే. అజయ్ జాడ కోసం గజ ఈతగాళ్ళు, ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది సోమవారం సాయంత్రం వరకు వెతికినా ఫలితం లేకపోయింది. తిరిగి మంగళవారం ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు ఒకదిక్కు గాలిస్తున్న సమయంలో సంజీవయ్య పార్క్ భారీ జాతీయ పతాకం వద్ద లేక్‌వ్యూ ఒడ్డుకు అజయ్ మృతదేహం కొట్టుకొచ్చింది. మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు గాంధీ ఆస్పత్రికి తరలించారు.


(ఫైల్)

అజయ్ తండ్రి జానకిరాములు నాగారంలో ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అజయ్‌ను బీటెక్ చదివించాడు.

మహాహారతి కార్యక్రమంలో వైజాగ్ వాసి మణికంఠ క్రాకర్స్ ఈవెంట్ బాధ్యతలు చూసుకుంటున్నట్టు తెలిసింది. గతంలో హైదరాబాద్‌కు చెందిన రాఘవేందర్‌కు అతడు క్రాకర్స్ సరఫరా చేశాడు. వాటి నగదు ఇవ్వడానికి రాఘవేందర్ తన ఫ్రెండ్స్ అజయ్, సాయి సందీప్‌ను తీసుకుని ఆదివారం నెక్లెస్ రోడ్డుకు వచ్చినట్టు సమాచారం. కాగా, ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన గణపతి సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు.

దురదృష్టకరం: భారతమాత ఫౌండేషన్

మహాహారతి క్రాకర్స్ షోలో ప్రమాదం దురదృష్టకరమని భారతమాత ఫౌండేషన్ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రమాదంలో గాయపడిన వారికి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెరుగైన చికిత్స అందిస్తున్నామని, బాధితులు, వారి కుటుంబాలకు అండగా ఉంటామని ఫౌండేషన్ కార్యాలయ కార్యదర్శి వికాస్ కుమార్ తెలిపారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

- అబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అబ్కారీ శాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఆ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. తెలంగాణ ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రూపొందించిన డైరీని నాంపల్లిలోని అబ్కారీ భవన్‌లో మంత్రి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బదిలీలు, పదోన్నతులపై త్వరలోనే ఉద్యోగ సంఘాలతో సమావేశం నిర్వహించి, అన్ని అంశాలపై చర్చిస్తానని భరోసానిచ్చారు. స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్‌ను తయారు చేసుకోవడం ద్వారా విధుల నిర్వహణలో సమర్థతను పెంచుకుని అనుకున్న లక్ష్యాలను సాధించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రతి ఉద్యోగి తన బాధ్యతలను నిబద్ధతతో, ప్రణాళికబద్ధంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సయ్యద్ అలీముర్తుజా రిజ్వీ, కమిషనర్ చెవ్వూరు హరికిరణ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ విబి.కమలాసన్‌రెడ్డి, అడిషనల్ కమిషనర్ అజయ్‌రావు, జాయింట్ కమిషనర్లు ఖురేషి, కేఏబీ శాస్త్రి, సురేష్, బేవరేజెస్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్లు అబ్రహం, కాశీనాథ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌పై నార్సింగి పీఎస్‌లో ఫిర్యాదు

- ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆర్ఎస్పీ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నార్సింగ్ పోలీస్ స్టేషన్లో మంగళవారం ఫిర్యాదు చేశారు. అనంతరం ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రిగా బాధ్యతాయుతమైన పాలన అందిస్తానని ప్రమాణం చేసిన రేవంత్‌రెడ్డి బంధువుల మీద అనురాగం, బీఆర్ఎస్‌పై పక్షపాతం చూపుతున్నారని ఆరోపించారు. నాలుగేండ్లు సాగాల్సిన ఈ కార్‌రేస్ రద్దు చేయడంతో రాష్ట్రానికి ఆర్థికంగా నష్టం జరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. సీఎంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ, బిఎన్ఎస్ సెక్షన్ 316 ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్ రేస్‌ను రేవంత్‌రెడ్డి వ్యక్తిగతంగా తీసుకుని దాన్ని రద్దు చేయడాన్ని ఆయన తప్పు పట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేషన్ ఛైర్మెన్లు కేతిరెడ్డి వాసుదేవరెడ్డి, రాకేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



'యూపీఎస్' ఉద్యోగి భవిష్యత్తుకు ఉరి

- మార్చి 2న చలో హైదరాబాద్ : టీఎస్‌సీపీఎస్‌ఈయూ అధ్యక్షులు స్థితప్రజ్ఞ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏప్రిల్ ఒకటి నుంచి అమలు చేయబోతున్న ఏకీకృత పెన్షన్ పథకం (యూపీఎస్) ఉద్యోగుల భవిష్యత్తుకు ఉరిలాంటిదని టీఎస్‌సీపీఎస్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు గంగాపురం స్థితప్రజ్ఞ విమర్శించారు. ఈనెల 24న కేంద్ర ఆర్థిక శాఖ తెచ్చిన యూపీఎస్ నోటిఫికేషన్‌ను వ్యతిరేకిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో ఉద్యోగులు, ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు. అందులో భాగంగా హైదరాబాద్‌లోని అబిడ్స్ బీమా భవన్‌లోని సీపీఎస్ రాష్ట్ర నోడల్ కార్యాలయం ముందు యూపీఎస్ ప్రతులను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థితప్రజ్ఞ మాట్లాడుతూ పాత పెన్షన్ విధానంలో ఉద్యోగి తన జీపీఎఫ్‌లో దాచుకున్న సొమ్మును ఉద్యోగ విరమణ చెందిన తర్వాత తిరిగి వంద శాతాన్ని తిరిగి పొందుతారని చెప్పారు. సీపీఎస్ విధానంలో 60 శాతం తిరిగి ఇస్తారని వివరించారు. కానీ కొత్తగా తీసుకురాబోతున్న యూపీఎస్‌లో మొత్తం సొమ్మును ప్రభుత్వమే తీసుకుంటుందని అన్నారు. ప్రతినెలా మూలవేతనం, డీఏలో పది శాతం చొప్పున ఉద్యోగి సర్వీసు కాలం 30 నుంచి 40 ఏండ్లు ఉద్యోగి దాచుకున్న మొత్తాన్ని ప్రభుత్వం ఎన్‌పీఎస్ ట్రస్ట్‌కు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. సర్వీస్ పెన్షన్ నిర్ణయం జరగకపోవడం అత్యంత దారుణమని విమర్శించారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని దేశవ్యాప్తంగా నిరసనలు చేస్తుంటే, ఈ యూపీఎస్ విధానాన్ని తీసుకురావడం అప్రజాస్వామికమని అన్నారు. కేంద్ర ఆర్థిక శాఖ జారీ చేసిన ఈ నోటిఫికేషన్‌పై రాష్ట్ర ప్రభుత్వం యూపీఎస్ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు. యూపీఎస్ విధానాన్ని వ్యతిరేకిస్తూ వచ్చేనెల ఏడో తేదీన బెంగళూరు ఫ్రీడమ్ పార్క్‌లో ధర్నా చేపడుతున్నామని అన్నారు. మార్చి 2న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామనీ, ఇందిరాపార్క్ వద్ద ధర్నాచౌక్‌లో నిరసన కార్యక్రమం ఉంటుందని వివరించారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌సీపీఎస్ ఈయూ ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, రాష్ట్ర కోశాధికారి నరేష్‌గౌడ్, రాష్ట్ర సహాధ్యక్షులు కోటకొండ పవన్, నటరాజ్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు నరేందర్‌రావు, కార్యదర్శి సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్‌రావు, శ్యాంసుందర్, అంజిరెడ్డి, శంకర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పల్లి రైతుల ఆందోళన

- ధర భారీగా తగ్గించడంపై నిరసన
- దళారులు, వ్యాపారులు కుమ్మక్కయ్యారని ఆగ్రహం
- మొన్న అచ్చంపేట.. నిన్న మహబూబ్‌నగర్ మార్కెట్ యార్డులో..

నవతెలంగాణ - మహబూబ్‌నగర్

రైతుల కష్టంతో సంబంధం లేని దళారులు, వ్యాపారులు కుమ్మక్కై మార్కెట్‌కు ఎక్కువ ధాన్యం వచ్చినప్పుడు ధరలో భారీగా తగ్గిస్తున్నారని పల్లి రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం అచ్చంపేట మార్కెట్‌లో ఇదే పరిస్థితి ఏర్పడగా, తాజాగా మంగళవారం మహబూబ్‌నగర్ మార్కెట్‌లోనూ ధర తగ్గింపుపై రైతులు ఆందోళనకు దిగారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డుకు భారీ మొత్తంలో వేరుశెనగ పంట వచ్చింది. ఇదే అదునుగా చేసుకొని వ్యాపారులు, మధ్య దళారులు కుమ్మక్కై ఒక్కసారిగా ధర తగ్గించారు. కార్యాలయం ముందు బోర్డులో ఉన్న ధర కన్నా రూ.1500 నుంచి 2000 వరకు తగ్గించి ధర నిర్ణయించడం అన్యాయం అంటూ రైతులు ఆందోళనకు దిగారు. ప్రభుత్వ మద్దతు ధర రూ.6,100 ఉండగా 3500 నుంచి 4 వేలకు మించి ఇవ్వడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. వ్యవసాయ మార్కెట్‌కు ప్రతిరోజూ 30 వేల నుంచి 50 వేల క్వింటాళ్ల వేరుశనగ పంట వస్తోందని రైతులు తెలిపారు. అధికారులు, చైర్మెన్ కూడా రైతులకు సపోర్ట్‌గా నిలబడటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

పల్లి తూకం అయిన తర్వాత రైతులు ఆందోళనకు దిగడంతో జిల్లా ఉన్నతాధికారులు, మార్కెట్ కమిటీ చైర్మెన్ బి.అనిత, కార్యదర్శి భాస్కర్ వ్యాపారులతో చర్చలు జరిపారు. రైతులకు పూర్తిస్థాయి మద్దతు ధర ఇచ్చేందుకు కృషి చేస్తానని చైర్మెన్ బేకరీ అనిత మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతం రూ.200నుంచి 300 వరకూ పెంచారని తెలిపారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు.

ఆరాంఘర్ ఫ్లైఓవర్‌పై ఘోర రోడ్డు ప్రమాదం


- డివైడర్‌ను ఢీకొట్టిన బైక్
- ముగ్గురు మైనర్లు మృతి

నవతెలంగాణ-రాజేంద్రనగర్

రంగారెడ్డి జిల్లాలో నూతనంగా ప్రారంభించిన ఆరాంఘర్ మన్మోహన్ సింగ్ ఫ్లై ఓవర్ పై బైక్‌పై వెళుతున్న ముగ్గురు మైనర్లు అతివేగంతో డివైడర్‌ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ముగ్గురూ అక్కడికక్కడే మృతిచెందారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గోల్కొండ ఫతే దర్వాజాకు చెందిన మాజ్(15), అహ్మద్(14), తలాబ్‌కట్టకు చెందిన సయ్యద్ ఇమ్రాన్(15) ముగ్గురు కలిసి బైక్‌పై ట్రిబుల్ రైడింగ్ చేస్తూ బహదూర్‌పూర్ నుంచి ఆరాంఘర్‌కు వెళ్తున్నారు. అయితే అతివేగంతో శివరాంపల్లి నేషనల్ పోలీస్ అకాడమీ వద్దకు రాగానే అతివేగంతో వెళ్తున్న బైక్ డివైడర్‌ను ఢీకొట్టింది. దాంతో బైక్‌పై ఉన్న ముగ్గురు ప్రమాదస్థలంలోనే మృతిచెందారు. ఇది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి అతివేగమే కారణమని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఆజంజాహీ మిల్లు కార్మిక భవన్ కూల్చివేతపై ఆగ్రహం

- కాసం ఓం నమశ్శివాయను అరెస్ట్ చేయాలి : వరంగల్ చౌరస్తాలో కార్మికుల నిరసన



నవతెలంగాణ-కాశిబుగ్గ

ఆజంజాహీ మిల్లు కార్మిక భవన్‌ను కూల్చివేసిన కాసం ఓం నమశ్శివాయను అరెస్టు చేయాలని కోరుతూ మంగళవారం ఆజంజాహీ మిల్లు కార్మికులు వరంగల్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ.. కాసం ఓం నమశ్శివాయ కార్మిక భవన్‌ను దౌర్జన్యంగా కూల్చి, అందులోని వస్తువులు, బీరువాలు, బెంచీలు, యూనియన్ పత్రాలు, ఆర్థిక సంబంధమైన డాక్యుమెంట్స్‌ను ఎత్తుకెళ్లారని తెలిపారు. తప్పుడు పత్రాలతో కార్మిక భవన్ ఆక్రమణకు ప్రయత్నించిన కాసం ఓం నమశ్శివాయను అరెస్ట్ చేయాలని, ఆజంజాహీ మిల్లు కార్మికులకు న్యాయం జరిగే వరకూ జిల్లాలో ఉన్న ఎమ్మెల్యేలు, ఎంపీలు కార్మికులకు అండగా ఉండాలని డిమాండ్ చేశారు. కార్మికుల ధర్నాకు ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ, సీటీవో ప్రజా సంఘాల నాయకులు మద్దతు తెలియజేశారు. ఆజంజాహీ మిల్లు యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఇనుముల శ్రీనివాస్, ఆరెల్లి కృష్ణ నాయకులు కాశీం, నర్ర ప్రతాప్, నున్న అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

మానుకోటకు పొంచి ఉన్న 'కరువు' ?

- చెరువులు, చెక్ డ్యామ్‌లకు మరమ్మతులు శూన్యం
- యాసంగికి తప్పని సాగునీటి పాట్లు
- జనవరి 26తో వరి నాట్లకు చెల్లు.. తగ్గుతున్న భూగర్భ జలాలు
- ఆందోళనలో అన్నదాతలు



నవతెలంగాణ-మహబూబాబాద్

కరువు ముంచుకొస్తోంది. సాగునీటి ఎద్దడి వెంటాడుతోంది. వాగులు ఎండిపోతున్నాయి. కట్టలు తెగిన చెరువులో చుక్కనీరు లేదు. యాసంగి సాగు కడగండ్ల పాలైంది. వరి సాగు పెరగనంటోంది. పచ్చని పొలాలు ఎడారులుగా మారుతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. ఇదంతా నాణేనికి ఒకవైపు.. మరోవైపు ఆకేరు, మున్నేరు, పాలేరు వాగుల్లో ఇసుక తోడేస్తున్నారు.. ఫలితంగా చలిమెలు ఎండిపోతున్నాయి. ఫలితంగా వరి పొలాలు బీటలు వారే పరిస్థితి రాగా అన్నదాత ఆశలు ఆవిరవుతున్నాయి. ఇదీ మహబూబాబాద్ జిల్లా రైతుల దీనస్థితి.

జిల్లావ్యాప్తంగా 18 మండలాలు, 487 గ్రామాలు, 4 మున్సిపాలిటీల పరిధిల్లో యాసంగి వరి సాగు గత వేసవితో పోలిస్తే ఈసారి గణనీయంగా తగ్గింది. 2023-24 యాసంగిలో 1,28,978 ఎకరాల్లో వరి సాగవగా, 2024-25 యాసంగిలో 1,49,353 ఎకరాల్లో వరి సాగవుతుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. జనవరి 27 నాటికి కేవలం 90,239 ఎకరాల వరి మాత్రమే సాగైంది. అధికారుల అంచనా ప్రకారం ఇప్పటికే 60,000 ఎకరాల వరి సాగు మైనస్‌లో ఉంది. మరో వారం రోజుల్లో 15వేల నుంచి 20వేల ఎకరాల్లో వరి సాగయ్యే అవకాశాలున్నప్పటికి గతేడాదితో పోలిస్తే 20వేల ఎకరాల్లో వరి సాగు తగ్గే పరిస్థితి నెలకొంది. ఇతర పంటలు గతేడాదిలో జిల్లావ్యాప్తంగా జొన్న, మొక్కజొన్న, వేరుశనగ, నువ్వులు, పొద్దుతిరుగుడు, మినుములు, పెసలు, ఉలవలు, బొబ్బర్లు మొత్తం కలిసి 1,82,072.57 ఎకరాల్లో సాగైంది. ఈ ఏడాది యాసంగిలో వ్యవసాయ అధికారులు 2,04,018 ఎకరాల్లో అన్ని పంటల సాగు వస్తుందని అంచనా వేశారు. కానీ, 1,30,467 ఎకరాల సాగు మాత్రమే వచ్చింది. గతేడాదితో పోలిస్తే సుమారు 50వేల ఎకరాల్లో అన్ని పంటల సాగు తగ్గింది. ప్రధానంగా సాగునీటి ఎద్దడితో పాటు, వాతావరణ పరిస్థితులు, విద్యుత్, పెట్టుబడి సమస్యలు కారణంగా కనిపిస్తున్నాయి.

నెలలు గడుస్తున్నా మరమ్మతులు కరువు

జిల్లావ్యాప్తంగా 1590 చెరువులు ఉన్నాయి. కాగా ఈ వానాకాలం సీజన్‌లో 147 చెరువులకు గండ్లు పడ్డాయి. అందులో 47 చెరువులకు పూర్తిగా గండ్లు పడి చుక్కనీరు లేకుండా పోయింది. మహబూబాబాద్ డివిజన్‌లో అయోధ్య, మహబూబాబాద్, రజాలిపేట, రామసముద్రం, దామర చెరువు, వీఎస్ లక్ష్మీపురం, ఆలేరు, వావిలాల, బీచ్‌రాజుపల్లి, ఉగ్గంపల్లి, ఎల్లంపేట, చిన్నగూడూరు తొర్రూరుతోపాటు భారీగా చెరువులకు గండ్లు పడి చుక్క నీరు లేదు. చెరువులకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టినా పూర్తిస్థాయిలో సమస్యలు పరిష్కరించలేదు. దాంతో యాసంగిలో సాగునీటి కరువు వెంటాడుతోంది.

అధ్వానంగా చెక్‌డ్యామ్‌లు

మహబూబాబాద్ జిల్లావ్యాప్తంగా ఆకేరు, మున్నేరు, పాలేరు వాగులపై నిర్మించిన చెక్‌డ్యామ్‌లు వర్షాకాలంలో భారీ వర్షాలకు కొట్టుకుపోయాయి. పాలేరువాగుపై మరిపెడ మండలం తానుచర్ల వద్ద చెక్‌డ్యామ్ నీటి మట్టం తగ్గిపోవడంతో 1000 ఎకరాల పంట సాగుకు ఆటంకం ఏర్పడింది. ఆకేరువాగుపై తొర్రూరు మండలం నాంచారిమడూరు వద్ద చిన్నగూడూరు మండలం చిన్నగూడూరు విస్సంపల్లి వద్ద, నరసింహుల పేట మండలం జయపురం, మరిపెడ మండలం ఉగ్గంపల్లి, బీచ్‌రాజ్‌పెల్లి పురుషోత్తమాయగూడెం వద్ద, కొరవి మండలం ములకలపల్లి వద్ద చెక్ డ్యామ్‌లు కొట్టుకుపోయాయి. సుమారు 10వేల ఎకరాల్లో వరి సాగుకు ఆటంకం ఏర్పడింది. అలాగే మున్నేరు వాగుపై రెడ్యాల కట్టు కాలువ, ఈదుల పూసపెల్లి కట్టు కాల్వ పెనుగొండ కట్టు కాల్వ, జమాన్లపెల్లి కట్టు వద్ద, కొరవి గుండ్రాతి మడుగు వద్ద కట్టు కాలువలకు, చెక్‌డ్యామ్‌లకు గండి పడి నష్టం జరిగింది. ఇక్కడ సుమారు 3వేల ఎకరాల్లో వరి సాగుకు ఆటంకం ఏర్పడింది. మొత్తం చెక్ డ్యామ్‌ల పరిధిలో సుమారు 10వేల ఎకరాల వరి సాగుకు ఆటంకం ఏర్పడింది.

మరమ్మతులు చేయాలి

జిల్లావ్యాప్తంగా వర్షాకాలంలో వచ్చిన వరదలకు కొట్టుకుపోయిన చెక్ డ్యామ్‌లకు తక్షణ మరమ్మతు చేయాలి. అవసరమైతే వచ్చే వానాకాలం నాటికి కొత్తవి నిర్మించాలి. అలాగే ఈ వేసవిలోనే చెరువుల్లో నీళ్ల లేనందున గండ్లు పడిన చెరువులను మరమ్మత్తు చేయాలి. కట్టలు తెగిన చెరువుల కింద సాగు చేయని భూములకు పరిహారం ఇవ్వాలి.



సాదుల శ్రీనివాస్, సీపీఐ(ఎం) మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి

ఎర్రజెండా పేరు చెబితే భూస్వాముల గుండెల్లో దడ

- గుడిసెలు వేసుకున్న నిరుపేదలకు పట్టాలు ఇవ్వాల్సిందే : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు
- ఎరుపుమయమైన చేవెళ్ల గడ్డ

నవతెలంగాణ-చేవెళ్ల



ఎర్రజెండాను చూస్తే నిరుపేదలు హత్తుకుంటారు.. అదే ఎర్రజెండాను చూస్తే భూస్వాములు, దోపిడిదారులు బెదురుకుంటారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండల కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కె.రామస్వామి అధ్యక్షతన జరిగిన చేవెళ్ల నియోజకవర్గం సీపీఐ జనరల్ బాడీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. భారత గడ్డపై 99 ఏండ్లు పూర్తి చేసుకుని 100 వసంతాల్లోకి అడుగుపెడుతున్న ఏకైక జెండా ఎర్రజెండా కమ్యూనిస్టు పార్టీ అని తెలిపారు.

కమ్యూనిస్టులకు అధికారం లేకపోయినా, పదవులు లేకపోయినా ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా ప్రజల కోసం ప్రాణ త్యాగాలు చేసిన గొప్ప సిద్ధాంతం కమ్యూనిజమని అన్నారు. కమ్యూనిజం సిద్ధాంతంతో అనేక దేశాల్లో సోషలిస్టు ప్రభుత్వాలు ఏర్పడ్డాయని తెలిపారు. భూమి కోసం, భుక్తి కోసం, పేదల విముక్తికై నిజాం రాజుకు వ్యతిరేకంగా, బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా నిలిచి పోరాడిన ఎర్రజెండా ఏనాడు ప్రభుత్వాలకు రాజీ పడలేని అన్నారు. ప్రజల సమస్యలను సమగ్రంగా చర్చించి పరిష్కరిం చడంలో గత ప్రభుత్వం విఫలమైందని, కాంగ్రెస్ ప్రభుత్వమైన పేదల సమస్యలు పరిష్కరించడానికి చొరవ చూపాలని అన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమకుల జంగయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోతు రవీంద్ర చారి, రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల యాదిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.ప్రభు లింగం, సామిడి శేఖర్‌రెడ్డి, టి.రామకృష్ణ, చేవెళ్ల సీపీఐ మండల కార్యదర్శి సత్తిరెడ్డి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శ్రీధర్‌బాబును సత్కరించిన పొంగులేటి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హైదరాబాద్‌లో మంగళవారం శాలువాతో సత్కరించారు. దావోస్ పర్యటనలో భాగంగా రాష్ట్రానికి రూ. 1.73 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించడంలో ప్రముఖ పాత్ర వహించారని ఈ సందర్భంగా తెలిపారు.

రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలి

- గోదాముల సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకోవాలి
- కొత్త గోదాముల నిర్మాణం చేపట్టాలి
- గోదాములపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి : హాకా అధికారులతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో డిమాండ్‌కు తగ్గ ఎరువులున్నాయనీ, రైతులకు ఇబ్బంది కలగకుండా తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని హాకా అధికారులను వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆయన హాకా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గోదాముల సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకోవాలనీ, కొత్త గోదాముల నిర్మాణం చేపట్టాలనీ, గోదాములపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మార్క్‌ఫెడ్ ఎండీ శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో 83,075 మెట్రిక్ టన్నుల సోయాబీన్ ను 42 కేంద్రాల ద్వారా 48,133 మంది రైతుల నుంచి సేకరించామనీ, 990 మెట్రిక్ టన్నులు పెసళ్లను 14 కేంద్రాల ద్వారా 1,607 మంది రైతుల నుంచి సేకరించినట్టు తెలిపారు. ప్రస్తుతం నాఫెడ్, ఎన్‌సీసీఎఫ్, కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీల ద్వారా రాష్ట్రంలో కందుల కొనుగోలు చేపట్టడం జరుగుతున్నదని వివరించారు. మార్క్‌ఫెడ్ ద్వారా 903 ప్రాథమిక సహకార సంఘాలు 416 ఆగ్రోస్ రైతు సేవ కేంద్రాలు 55 హాకా సేవా కేంద్రాల ద్వారా రైతులకు ఎరువుల సరఫరా నిరంతరంగా జరుగుతుందని తెలియజేసారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎరువుల సరఫరాలో ఎక్కడా పొరపాట్లకు తావివ్వకుండా, ప్రణాళికబద్ధంగా జరిగేటట్లుగా సరైన చర్యలు తీసుకోవాలనీ, రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. డిమాండ్‌కు అనుగుణంగా ఎరువుల నిల్వలు ఉన్నాయనీ, పంపిణీలో జాగ్రత్త వహించాలన్నారు. మార్క్‌ఫెడ్ వివిధ జిల్లాలలో 76 కొనుగోలు కేంద్రాలను ప్రతిపాదించి, ప్రస్తుతం 21 కేంద్రాలు ప్రారంభించిందనీ, రైతులు ప్రభుత్వం అందిస్తున్న మద్ధతు ధర రూ. 7,550కు తమ కంది పంటను అమ్ముకోవాలని కోరారు. మార్క్‌ఫెడ్ ద్వారా 79,000 మెట్రిక్ టన్నుల సామార్థ్యంతో గోదాముల నిర్మాణము జరిగిందనీ, వాటిని పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. అన్ని రకాల పంటల కొనుగోళ్ల కోసం అవసరమైన అన్ని చర్యలు ముందస్తుగానే తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. రెండు ప్రభుత్వ రంగ సంస్థలు వాటి నిరర్ధక ఆస్తులను వినియోగంలోకి తెచ్చేవిధంగా ప్రతిపాదనలు సిద్ధం చేసి, ప్రభుత్వానికి సమర్పించాల్సిందిగా ఆదేశించారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్ రావు, వ్యవసాయశాఖ సంచాలకులు గోపి, హాకా ఎండీ చంద్రశేఖర్ రెడ్డి , మార్క్‌ఫెడ్ ఎండి శ్రీనివాస రెడ్డితో పాటు ఆయా సంస్థల అధికారులు పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో 'ప్రీ ప్రైమరీ' తరగతులు

- ప్రభుత్వం సూత్రప్రాయ నిర్ణయం

వచ్చే విద్యాసంవత్సరం నుంచి అమలు..?

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులను ప్రారంభించాలని ప్రభుత్వం సమాలోచన చేస్తున్నది. వచ్చే విద్యాసంవత్సరం (2025-26) నుంచి అమలు చేయాలని సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. రాష్ట్రంలో ప్రస్తుతం విద్యాహక్కు చట్టం (ఆర్టీఈ-2009) ప్రకారం ప్రభుత్వ పాఠశాలల్లో ఐదేండ్లు నిండిన విద్యార్థులనే ఒకటి తరగతిలో ప్రవేశాలు కల్పిస్తున్నారు. ఆరు నుంచి 14 ఏండ్ల వరకు ఉచిత నిర్బంధ విద్యను అందించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలు మాత్రం ఐదేండ్లు నిండితేనే ప్రవేశాలు కల్పించాలన్న నిబంధనను పాటించడం లేదు. ప్రీప్రైమరీ తరగతులను యధేచ్ఛగా నిర్వహిస్తున్నాయి. మూడేండ్ల వయస్సు నుంచే పిల్లలను నర్సరీలో చేర్చుకుంటున్నాయి. దీంతో ఆ పిల్లలు నర్సరీ, ఎల్‌కేజీ (పీపీ-1), యూకేజీ (పీపీ-2) అయ్యాక ఒకటో తరగతిలోనూ అక్కడే చదువును కొనసాగి స్తున్నారు. నర్సరీ, పీపీ-1 లేదా పీపీ-2లో చేరిన విద్యార్థులు పదో తరగతి వరకు ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల్లో చదువుతున్నారు. ఫలితంగా వాటిలో విద్యార్థుల సంఖ్య ఏటా పెరుగుతున్నది. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతుల నిర్వహణకు అవకాశం లేదు. దీంతో ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య ఏటా తగ్గుతున్నది. ఇంకోవైపు పిల్లలకు మూడేండ్లు రాగానే బడికి పంపించకుండా తల్లిదండ్రులు ఉండడం లేదు. ఈ అవకాశం ప్రయివేటు పాఠశాలల్లోనే ఉంటున్నది. అందుకే ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ప్రీప్రైమరీ తరగతులను ప్రవేశపెట్టాలని పలు ఉపాధ్యాయ సంఘాలు, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి వచ్చే విద్యాసంవత్సరం నుంచి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులను నిర్వహించాలని భావిస్తున్నది. రాష్ట్రంలో ప్రస్తుత విద్యాసంవత్సరంలో 26,101 ప్రభుత్వ పాఠశాలల్లో 16,84,493 మంది విద్యార్థులు చదువుతున్నారు. 11,454 ప్రయివేటు పాఠశాలల్లో 36 లక్షల మంది చదువుతున్నారు. రాష్ట్రంలో గత విద్యాసంవత్సరం (2023-24)లో ప్రభుత్వ పాఠశాలల్లో 18.13 లక్షల మంది పిల్లలు చదివారు. ఈ ఏడాది 16.84 లక్షలకు తగ్గిపోయారు. అంటే 1.29 లక్షల మంది విద్యార్థు లు తగ్గారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో 6.06 లక్షల మంది ఒకటో తరగతిలో ప్రవేశాలు పొందారు. వారిలో ప్రభుత్వ బడుల్లో 1,97,842 మంది, ఎయిడెడ్ పాఠశాలల్లో 6,594 మంది ఉన్నారు. ప్రయివేటు పాఠశాలల్లో 4,01,564 మంది చదువుతున్నారు. అందుకే ప్రభుత్వ బడు ల్లోనూ విద్యార్థుల నమోదును పెంచే దిశగా సమాలోచన చేస్తున్నది. అందులో భాగంగానే ప్రీప్రైమరీ తరగతులను ప్రారంభించాలని భావిస్తున్నది.

సమ్మె నోటీసుతో మాకు సంబంధం లేదు

- టీజీఎస్‌ఆర్టీసీ జేఏసీ ప్రకటన


నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఈనెల 27వ తేదీ ఆర్టీసీ యాజమాన్యానికి జేఏసీ పేరుతో ఇచ్చిన సమ్మె నోటీసుకు తమకు ఎలాంటి సంబంధం లేదని టీజీఎస్‌ఆర్టీసీ జేఏసీ నాయకత్వం తెలిపింది. జేఏసీ చైర్మెన్ ఈ అశ్వత్థామరెడ్డి (టీఎమ్‌యూ), కన్వీనర్ ఎమ్ నరేందర్ (ఎన్ఎమ్‌యూ), కో కన్వీనర్లు ఎర్ర స్వామికుమార్ (బీఎమ్ఎస్), పున్న హరికిషన్ (ఎస్‌టీఎమ్‌యూ) మంగళవారంనాడొక పత్రికా ప్రకటనలో ఈ విషయం వెల్లడించారు. ఆర్టీసీలోని ఇతర సంఘాలతో ఎలాంటి చర్చలు జరపకుండా, ఏకపక్ష నిర్ణయాలతో సమ్మె నోటీసు ఇచ్చారని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వారి పంచన చేరి, ఏ యూనియన్ సర్టిఫికెట్ లేని ఓ వ్యక్తిని జేఏసీలో చేర్చుకోవడంతో సమ్మె విఫలమవుతుందనే తాము దీనికి దూరంగా ఉన్నామని వివరించారు. ఇప్పటికైనా అన్ని యూనియన్లతో చర్చించి, విశాల ఐక్యతతో జేఏసీని ఏర్పాటు చేసి, ప్రభుత్వం వద్దకు వెళ్లాలనీ, దీనికోసం అన్ని యూనియన్లు ఏకతాటిపైకి రావాలని కోరారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు విద్యార్థులు మృతి

- లారీ ఢీకొట్టడంతో బాలిక.. టిప్పర్ ఢీకొని బాలుడు

నవతెలంగాణ - బంజారా హిల్స్/బోడుప్పల్



(ఫైల్)

హైదరాబాద్‌లో వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో మంగళవారం ఇద్దరు విద్యార్థులు మృతిచెందారు. షేక్‌పేటలో బైక్‌ను లారీ ఢీకొట్టడంతో బాలిక, మేడిపల్లిలో ట్యూషన్‌కు వెళ్లి ద్విచక్ర వాహనంపై వస్తుండగా టిప్పర్ ఢీకొట్టడంతో పదో తరగతి విద్యార్థి మృతిచెందాడు. ఈ ఘటనలపై పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం గడ్డం హేమసుందర్ ఐదో తరగతి చదువుతున్న కుమార్తె(10)ను స్కూల్‌లో వదిలేందుకు బైక్‌పై వెళ్తున్నాడు. ఫిలింనగర్ వద్ద వేగంగా దూసుకొచ్చిన లారీ ముందున్న వారి బైక్‌ను ఢీకొట్టింది. దాంతో కింద పడిన బాలికపై లారీ వెనుక టైర్లు ఎక్కడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. గాయపడిన తండ్రిని ఫిల్మ్‌నగర్ పోలీసులు ఆస్పత్రికి తరలించారు. అతడు ఓ ప్రముఖ న్యూస్ ఛానల్ డిజిటల్ హెడ్‌గా పనిచేస్తున్నారని తెలిసింది.

బాలిక మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. లారీ డ్రైవర్ పరారీలో ఉన్నట్టు తెలిసింది.

టిప్పర్ ఢీకొని..

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి పీఎస్ పరిధిలో పదో తరగతి విద్యార్థి ట్యూషన్‌కు వెళ్లి ద్విచక్ర వాహనంపై వస్తుండగా.. టిప్పర్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్ఐ శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కాచవాణిసింగారం గ్రామానికి చెందిన మోతిరాం కుమారుడు తేజేష్ చౌదరి(15) ఉదయం స్థానికంగా ప్రయివేటు ట్యూషన్ కోసం వెళ్లి ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. స్పాంజీల కాలనీ వద్ద టిప్పర్ ఢీకొనడంతో బాలుడు అక్కడికక్కడే మృతిచెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు టిప్పర్ డ్రైవర్‌పై కేసు దర్యాప్తులో ఉంది.

బోధనలో ఏఐ టెక్నాలజీ వినియోగం

- నేడు బెంగుళూరుకు విద్యాశాఖ అధికారుల బృందం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని సర్కారు బడుల్లో ఉపాధ్యాయుల బోధనలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీని వినియోగించాలని ప్రభుత్వం భావిస్తున్నది. ఆ విధానాన్ని పరిశీలించేందుకు విద్యాశాఖ అధికారుల బృందం బుధవారం సాయంత్రం బెంగుళూరుకు బయలుదేరి వెళ్లనుంది. గురువారం ప్రభుత్వ పాఠశాలల్లో బోధనకు వినియోగిస్తున్న ఏఐ టెక్నాలజీ అమలు తీరును పరిశీలిస్తారు. ఉపాధ్యాయులు బోధనలో వినియోగిస్తున్న మెళకువలు, విద్యార్థులకు కలుగుతున్న ప్రయోజనాలను వారి అధ్యయనం చేస్తారు. అక్కడి విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులతోపాటు విద్యార్థులతో సమావేశమవుతారు. వివిధ అంశాల గురించి అడిగి తెలుసుకుంటారు. ఏఐ టెక్నాలజీ వినియోగం కోసం అయ్యే వ్యయం, ఇతర సామగ్రిని పరిశీలిస్తారు. ఏయే తరగతుల విద్యార్థులకు ఏఐ టెక్నాలజీ ద్వారా బోధన సాగిస్తున్నారని విషయాలనూ తెలుసుకుంటారు. మంగళవారం బెంగుళూరుకు బయలుదేరే బృందంలో విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డి, ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ రమేష్‌తోపాటు ఇతర అధికారులు ఉన్నారు.

గొంగడి త్రిషకు మంత్రి దామోదర రాజనర్సింహ అభినందనలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉమెన్స్ అండర్-9 క్రికెట్ కప్ చరిత్రలో మొట్టమొదటి సెంచరీని నమోదు చేసిన తెలంగాణ బిడ్డ గొంగడి త్రిషను వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అభినందించారు. ఈ మేరకు బుధవారం మంత్రి ట్వీట్ చేశారు. ఆమె మరింత ఉన్నతస్థాయికి వెళ్లాలనీ, అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యుత్తమ ప్లేయర్‌గా ఎదగాలని ఆకాంక్షించారు. త్రిష సాధించిన సెంచరీ, క్రీడల్లో రాణించాలనుకుంటున్న ఎంతోమంది ఆడబిడ్డలకు స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు.

ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిని కలసిన బీఆర్ఎస్ నాయకులు



నవతెలంగాణ-ఎల్బీనగర్

ఇటీవల వెన్నుముక శస్త్రచికిత్స చేయించుకొని విశ్రాంతిలో ఉన్న ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డిని మంగళవారం ఆయన నివాసంలో బీఆర్ఎస్ నాయకులు కలిశారు. తర్వాత ఎమ్మెల్యేను యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో గడ్డిఅన్నారం డివిజన్ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రమణారెడ్డి, వీక్కీ, బంటి, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

'మార్నింగ్ వాక్'లో డివిజన్‌లో పర్యటించిన కళ్లెం



నవతెలంగాణ-హయత్ నగర్

మార్నింగ్ వాక్ లో భాగంగా డివిజన్ లోని నర్సింహా రావు నగర్ లో మంగళవారం కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పర్యటించారు. తర్వాత కాలనీవాసులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు.. కాలనీలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో తరచూ డ్రైనేజీ పొంగుతుందని, దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కార్పొరేటర్ వెంటనే సంబంధిత డ్రైనేజీ సూపర్ వైజర్ ను ఘటనా స్థలానికి పిలించారు. సమస్యను వివరించి.. కాలనీవాసులకు ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు వేదికగా నిలిచిన 'చైతన్య'



నవతెలంగాణ -దిల్ సుఖ్ నగర్

నిరుద్యోగుల పాలిట దిల్ సుఖ్ నగర్ చైతన్య ఇన్ స్టిట్యూట్ ఒక వేదికగా నిలిచిందని గ్రూప్ 2 అధికారి పి.చైతన్య అన్నారు. చైతన్య ఇన్ స్టిట్యూట్ ఆఫ్ పోలీస్ కోచింగ్ సెంటర్ నాలుగో వార్షికోత్సవాన్ని మంగళవారం దిల్ సుఖ్ నగర్ లో నిర్వహించారు. ఈ వార్షికోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. గత మూడేళ్లలో గ్రూప్ 2, గ్రూప్ 4, ఎస్ ఐ, కానిస్టేబుల్స్ గా వందలాది మందికి చైతన్య ఇన్ స్టిట్యూట్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలు పొందారని వివరించారు. ధనార్జనే ధ్యేయంగా కాకుండా గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన వారికి పోటీ పరీక్షల పై అవగాహన తరగతులను చైతన్య ఇన్ స్టిట్యూట్ నిర్వహిస్తుందన్నారు. ప్రతి ఆదివారం కోచింగ్ సెంటర్లో మాక్ టెస్ట్ లు నిర్వహించడం ద్వారా విద్యార్థులు పోటీ పరీక్షల పై పట్టు సాధిస్తున్నారని అభిప్రాయపడ్డారు. రెండున్నర దశాబ్దాలుగా బయాలజీ సబ్జెక్టు పై పట్టున్న నర్సింహా రెడ్డి అధ్వర్యంలో ఈ ఇన్ స్టిట్యూట్ నడుస్తుందని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగం సాధించడానికి చాలా మంది అభ్యర్థులు లక్షలాది మంది పోటీ పడే పరీక్షల్లో ప్రతిభ చూపడం సాధ్యం కాదనే భావనలో ఉంటారని చైతన్య ఇన్ స్టిట్యూట్ ఆఫ్ పోలీస్ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ వై.నర్సింహా రెడ్డి అన్నారు. అయితే పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే ప్రతి ఒక్కరిలోనూ ఇదే ఆత్మన్యూనతా భావం ఉంటుందని పేర్కొన్నారు. సైకాలజికల్ గా ఈ భావనతో ఉన్న వారిని, ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్ లు, సంబంధిత పరీక్షలకు సంబంధించిన సిలబస్ పై కూడా పూర్తి స్థాయిలో కొంతమందికి అవగాహన ఉండదన్నారు. సిలబస్ పై అవగాహన లేని వారిని గుర్తించి, ప్రత్యేక శిక్షణ ఇస్తామని వెల్లడించారు. అనంతరం ఈ ఇన్ స్టిట్యూట్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన వారిని చైతన్య ఇన్ స్టిట్యూట్ యాజమాన్యం ఘనంగా సత్కరించారు. ప్రభుత్వ ఉద్యోగం పొందిన ఉద్యోగులు వారి అనుభవాలను ప్రస్తుతం పోటీ పడుతున్న అభ్యర్థులకు వివరించారు.

మల్‌రెడ్డి రాంరెడ్డికి ఆటో డ్రైవర్ల కృతజ్ఞతలు



నవతెలంగాణ-ఎల్బీనగర్

బీఎన్ రెడ్డి నగర్, ఎల్బీనగర్ నుండి ఐఎస్ సదన్ వరకు ఆటోలు నడుపుతున్న సుమారు 300 మంది ఆటో డ్రైవర్లు మంగళవారం రాష్ట్ర రోడ్ల అభివృద్ధి సంస్థ (టీజీఆర్డీసీ) చైర్మెన్ మల్‌రెడ్డి రాంరెడ్డి ని చైతన్యపురిలోని కాంగ్రెస్ కార్యాలయంలో మర్యాపూర్వకంగా కలిశారు. తర్వాత పుష్పగుచ్చాలు అందజేసి శాలువాలతో ఘనంగా సత్కరించి, కృతజ్ఞతలు తెలియజేశారు.కొన్ని రోజులుగా ట్రాఫిక్ పరిమితుల కారణంగా ఎస్ఎన్ రెడ్డి గార్డెన్, గ్రీన్‌పార్క్ కాలనీ వరకు మాత్రమే ఆటోలు నడుపుతుండడంతో ప్రయాణికుల సంఖ్య తగ్గి, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్న ఆటో డ్రైవర్లు.. తమ సమస్యను మల్‌రెడ్డి రాంరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. మల్‌రెడ్డి రాంరెడ్డి తక్షణమే పోలీసు అధికారులతో చర్చించారు. దీంతో డ్రైవర్లు మళ్లీ ఐఎస్ సదన్ వరకు సేవలు అందించడానికి అనుమతి పొందారు. దీంతో వారి ఆర్థిక ఇబ్బందులు దూరమయ్యాయి. తమ సమస్యను 24 గంటల్లోనే పరిష్కరించిన మల్‌రెడ్డి రాంరెడ్డి పై ఆటో డ్రైవర్లు హర్షం వ్యక్తం చేశారు. ఆయన సహాయసహకారాల వల్ల తమ కుటుంబాలు మళ్లీ ఆర్థికంగా బలపడుతాయి అని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లు, మల్‌రెడ్డి రాంరెడ్డి వేగవంతమైన చర్యలతోపాటు ఆయన సమర్థనేతృత్వాన్ని ప్రత్యేకంగా ప్రశంసిస్తూ, భవిష్యత్తులో ఆయనకు సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు సంతోష్ యాదవ్, శ్రీకాంత్, కాటం, చాన్ పాషా, అజీమ్, మహేందర్, నర్సింహా, లింగం తదితరులు పాల్గొన్నారు.

బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం కోఆర్డినేటర్‌గా గోర



నవతెలంగాణ-హయత్ నగర్

రాష్ట్రంలో బీసీ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయడంలో భాగంగా బీసీ ఇంటలెక్చ్యల్ ఫోరం కోఆర్డినేటర్లను నియమిస్తుంది.ఇందులో భాగంగా రంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్ గా ఎల్బీనగర్ మన్సూరాబాద్ కు చెందిన గోర శ్యామ్ సుందర్ గౌడ్ ను నియమించారు. ఈ మేరకు మంగళవారం ఫోరమ్ చైర్మెన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి టీ చిరంజీవులు గోర శ్యాంసుందర్ గౌడ్ కు నియామక పత్రం అందజేశారు.ఈ సందర్భంగా శ్యాంసుందర్ గౌడ్ మాట్లాడుతూ సాయుధ పోరాటాలు మొదలు కొని మొన్న జరిగిన తెలంగాణ సాధన పోరాటంలో బీసీలు ముందుండి పోరాడినట్లు తెలిపారు. అన్ని పోరాటలో ముందు ఉంటాం కానీ అధికారంలో మాత్రం వెనుక ఉంటున్నామన్నారు. అందుకే బీసీ రాజ్యాధికారం కోసం తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో బీసీల రాజ్యాధికారం కోసం ఒక బీసీ బిడ్డగా మరో ఫోరమ్ కోసం నిజాయితీ పరుడైన చిరంజీవి పైన నమ్మకంతో కలిసి ఉద్యమం చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు డాక్టర్ చెరుకు సుధాకర్ గౌడ్, సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షులు చామకురా రాజు, వేణు తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి



నవతెలంగాణ- నాగోల్

నాగోలు డివిజన్ లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి, అభివృద్ధికి తగినన్ని నిధులను మంజూరు చేయాలని కార్పొరేటర్ చింతల అరుణ సురేంద్రనాథ్ కోరారు. ఈ మేరకు మంగళవారం జీహెచ్ ఎంసీ కమిషనర్ ను జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నాగోల్ డివిజన్ అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. అదేవిధంగా నాగోల్ చెరువు సుందరీకరణ కు నిధులు విడుదల చేయాలన్నారు. పలు కాలనీలలో సీసీ రోడ్ల పనులు పెండింగ్ లో ఉన్నాయని, వాటికి కూడా తగిన నిధులను మంజూరు చేసి వేగవంతంగా పనులు పూర్తి అయ్యేలా చొరవ తీసుకోవాలన్నారు. సాహనుకూలంగా స్పందించిన కమిషనర్ ఇలంబర్తి డివిజన్ అభివృద్ధికి తన వంతు షి చేస్తానని హామీ ఇచ్చారు. వినతి పత్రం అందజేసిన వారిలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు పింకల సురేంద్రనాథ్ యాదవ్, నాగోల్ డివిజన్ అధ్యక్షులు పంగా శ్రీకాంత్, మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

యూజీసీ గైడ్ లైన్స్
సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం



ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి
సామిడి వంశీ వర్ధన్

నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్

యూజీసీ గైడ్ లైన్స్ విద్యార్థి సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సామిడి వంశీ వర్ధన్ అన్నారు. అబ్దుల్లాపూర్ మెట్ మండలం అఖిలభారత విద్యార్థి సమాఖ్య ప్రధాన కార్యదర్శి చింత వెంకటేష్ ఆధ్వర్యంలో రావి నారాయణ రెడ్డి కాలనీలో మంగళవారం కౌన్సిల్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వంశీ వర్ధన్ మాట్లాడుతూ కేంద్రం ఇటీవలే విడుదల చేసిన యూజీసీ గైడ్ లైన్స్ సర్క్యులర్ ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం వలన రాష్ట్రాలలో ఉన్న యూనివర్సిటీ లు తమ స్వభావం స్వయం ప్రతిపత్తిని కోల్పోతాయని, వీసీల నియామకాలలో రాజకీయ ప్రాబల్యం, డబ్బు ప్రమేయం ఉండే అవకాశం ఉంటుందన్నారు. విద్యావేత్తలను వైస్ ఛాన్స్ లర్స్ గా ఎంపిక చేయాలంటే కేంద్ర గైడ్ లైన్స్ ను వెంటనే రద్దు చేయాలన్నారు. లేదంటే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చెపడుతామని హెచ్చరించారు. విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తే విద్యార్థి లోకం చూస్తూ ఊరుకోదన్నారు.హక్కుల కోసం సంఘటితమై ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వట్టి కార్తీక్ రెడ్డి, కాటి శ్రావణి, సంకి పార్వతి, అరవింద్, చందు, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తా

మాజీ డిప్యూటీ మేయర్ ఇబ్రం శేఖర్



నవతెలంగాణ-బడంగ్ పేట్

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర బీఎస్పీ కో ఆర్డినేటర్, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ ఇబ్రం శేఖర్ అన్నారు. మంగళవారం మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ ఇబ్రం శేఖర్ తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. 2001 గ్రామ సర్పంచ్ నుండి రాజకీయ ప్రస్తావనం మొదలైనప్పటి నుండి నేడు డిప్యూటీ మేయర్ గా పేద ప్రజలకు జరుగుతున్న అన్యాయాలపై పోరాడుతూనే ఉన్నారన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలపై పేదలకు న్యాయం జరిగే వరకూ పోరాడుతానని తెలిపారు.,పేద ప్రజలకు విద్యతోనే సమాజంలో మంచి గుర్తింపు వస్తుందన్నారు. స్థానిక సంస్థలకు, స్మశాన వాటికలు, విద్యుత్ మరమ్మత్తులకు మున్సిపల్ కార్పొరేషన్ సమావేశంలో ఏ విధంగా నిధులు చెల్లిస్తారో అదే విధంగా చెరువుల అభివృద్ధికి నిధులు మంజూరు చేసే అధికారం ఎలా ఉంటుందో అదే విధంగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి నిధులు మంజూరు చేసే అధికారం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఎంతో కృషి చేశానని తెలిపారు. గడిచిన ఐదు సంవత్సరాలుగా మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధిలో అందరి సహకారంతో ముందుకు సాగడం జరిగిందన్నారు.

జీవితంలో ఒక భాగం
సంగీతం, సాహిత్యం, సంప్రదాయం

- చిలుక ఉపేందర్ రెడ్డి

నవతెలంగాణ- దిల్ సుఖ్ నగర్

సంగీతం, సాహిత్యం, సంప్రదాయం జీవితంలో ఒక భాగమని యువజన కాంగ్రెస్ నేత, ప్రజా సేవకులు చిలుక ఉపేందర్ రెడ్డి అన్నారు. సంకీర్తన అకాడమీ ఆఫ్ మ్యూజిక్ ఏడవ వార్షికోత్సవాన్ని మంగళవారం వాసవి కాలనీలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చిలుక ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ.. శాస్త్రీయ సంగీతం, సాహిత్యం, సంప్రదాయాలను నేర్పుతున్న సంకీర్తన అకాడమీని అభినందించారు. మట్టిలో



మాణిక్యం మాదిరిగా ప్రతిభ ఉన్న వారిని గుర్తించి తర్ఫీదు ఇస్తే జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించడానికి అవకాశం ఉంటుందన్నారు. సంగీతంతో పాటు సంప్రదాయాలు కూడా నేర్చుకొనే అవకాశం ఉండటంతో క్రమశిక్షణ, పెద్దలంటే గౌరవం కూడా అలవాటు అవుతుందని అభిప్రాయపడ్డారు. ప్రతిభ ఉన్న కళాకారులను ప్రోత్సహించడానికి తాను ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంగీత గురువు ఎం.సత్యవతి, కృష్ణారెడ్డి, నరసింహ రావు, నూకల జగదీశ్వరి, సోమయాజులు, మైసయ్య, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, మాధవరెడ్డి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ దొంగలను పట్టుకున్న నాగోల్ పోలీసులు



నవతెలంగాణ- నాగోల్

సెల్‌ఫోన్ దొంగలను పట్టుకున్న ఘటన నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. నాగోల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం నాగోలు బస్ స్టాప్, పరిసర ప్రాంతాలలో ఒక కేసు విచారణ నిమిత్తం నాగోల్ క్రైమ్ సిబ్బంది తిరుగుతుండగా.. నాగోల్ డివిజన్ పరిధిలోని బండ్లగూడ అయ్యప్ప నగర్ కాలనీకి చెందిన దీపక్ ప్రధాన్, ఒరిస్సా రాష్ట్రానికి చెందిన ధనరాజ్ ప్రధాన్‌లు అనుమానస్పద స్థితిలో తిరుగుతున్నారు. వాళ్లను పట్టుకుని విచారించగా గత కొంతకాలంగా నాగోలు పరిసర ప్రాంతాలలోని బస్టాండ్‌లలో, వీక్లీ మార్కెట్‌లలో తిరుగుతూ పిక్ పాకెటింగ్, సెల్ఫోన్ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తెలిసింది. దీంతో వారిని అదుపులోకి తీసుకొని విచారించి.. వారి వద్ద నుండి 16 సెల్ ఫోన్‌లను, ఓ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎల్బీనగర్ జోన్ డీసీపీ సిహెచ్ ప్రవీణ్ కుమార్ ఐపీఎస్, ఏసీపీ కృష్ణయ్యల ఆదేశాల మేరకు సీఐ ఏ. సూర్య నాయక్ ఆధ్వర్యంలో అరెస్ట్ చేసి రిమాండ్ తరలించినట్లు ఎస్సై రమేష్ తెలిపారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



నవాతెలంగాణ-తుర్కయంజాల్

తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని రాగన్నగూడ గ్రామం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పేదల కోసం చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని పలువురు నేతలు అభిప్రాయపడ్డారు. లయన్స్ క్లబ్ రాగన్నగూడ అధ్యక్షుడు సామ భీంరెడ్డి ఆధ్వర్యంలో తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి రాగన్నగూడ ఎస్ఎస్ఆర్ నగర్ కాలనీలోని బస్తీ దవాఖానాలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ క్యాంపును మంగళవారం నిర్వహించారు. సియాన్ క్యాన్సర్ క్లినిక్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో రోగులకు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సామ భీంరెడ్డి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తాని తెలిపారు. పేదలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి మర్రి అంజిరెడ్డి, కోశాధికారి పూజారి శంకరయ్య గౌడ్, నాయకులు కుంట గోపాల్ రెడ్డి, మర్రి మహేందర్ రెడ్డి, దాసరి సుధాకర్ రెడ్డి, రేవల్లె యాదగిరి, పన్నాల మధుసూదన్‌రెడ్డి, గోదాసు భద్రయ్య, జూపల్లి వెంకటేశ్వరరావు, గుత్తా మహేందర్ రెడ్డి, శ్యామ్ ప్రసాద్ రెడ్డి, ఎలిమినేటి వెంకటరెడ్డి, డిల్లి జగదీశ్వర్, డాక్టర్లు ఎం.లావణ్య, కె.సుజాత, మహిళా సంఘాల నాయకులు, హాస్పిటల్ సిబ్బంది, కాలనీ వాసులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-హయత్‌నగర్

బంజారా కాలనీలో ఉన్న బెల్ట్ షాపులపై చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరారు. ఈ మేరకు మంగళవారం కాలనీ వాసులు హయత్ నగర్ పోలీస్ స్టేషన్‌లో, అదేవిధంగా హయత్ నగర్ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో బంజారా నాయకులు మేగవత్ రఘుపతి నాయక్, మూడవత్ ఘశిరం నాయక్, కారంటోత్ పాండు నాయక్, మేగవత్ గోవర్ధన్ నాయక్, వర్త్య బలరాం నాయక్, కొర్ర గోపాల్ నాయక్ ,మెగావత్ నరేందర్, మేగవత్ శివకుమార్ నాయక్, రామావత్ శంకర్ నాయక్, రామావత్ మకట్లాల్ నాయక్, రామావత్ చిన్య నాయక్, వాంకుడోత్ రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలను అరికట్టడం అందరి బాధ్యత



నాగోల్ ఎస్‌హెచ్ఓ ఏ సూర్య నాయక్



నవతెలంగాణ- నాగోల్

రోడ్డు భద్రత నియమ నిబంధనలను పాటించాలని, రోడ్డు ప్రమాదాలను అరికట్టడం అందరీ బాధ్యత అని నాగోల్ పోలీస్ స్టేషన్ ఎస్హెచ్ఓ ఏ సూర్య నాయక్ అన్నారు. రోడ్డు భద్రత మాస ఉత్సవాల కార్య క్రమంలో భాగంగా మంగళవారం సాయం త్రం నాగోలు పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో నాగోలు చౌరస్తాలో ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రతపై, రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి డ్రైవరూ ట్రాఫిక్ నియమ నిబంధనలను పాటిస్తూ.. అప్రమత్తతో వాహనాలను నడపాలని సూచించారు. మద్యాన్ని సేవించి వాహనాలను నడపడం ప్రమాదకరమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాగోల్ ఇన్‌స్పెక్టర్ సూర్య నాయక్, ఎస్సై రమేష్, శ్రీనివాస్ రెడ్డి, సిబ్బంది, ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో
తన అనుభవాలను పంచుకున్న ఫజల్ ఆలం



నవతెలంగాణ-హయత్ నగర్

అంతర్జాతీయ క్రికెట్‌లో తన అపారమైన అనుభవాన్ని అంతర్జాతీయ క్రికెట్ ఆటగాడు ఫజల్ ఆలం తన అనుభవాలను విద్యార్థులతో కలిసి పంచుకున్నారు. మంగళవారం హయత్ నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో క్రికెట్ పై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. మంచి ఆటగాడిగా ఎలా మారాలి, మంచి జీవనశైలిని ఎలా నిర్వహించాలి, క్రీడలలో శారీరకంగా, మానసికంగా ఎలా దృఢంగా ఉండాలో విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. తర్వాత మైదానంలో యువ నైపుణ్యాలను ప్రదర్శించారు. విద్యార్థులు అడిగిన కొన్ని ప్రశ్నలకు సమాధానమిచ్చారు. ఫిబ్రవరి 9 నుండి 23, వరకు శ్రీలంకలో జరగనున్న 050 ప్రపంచ కప్‌లో అతను పాల్గొనబోతున్నాట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సురేష్ బాబు, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ అనిత, బోధనా సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జల్ పల్లి ప్రత్యేక అధికారికి అభినందనలు



నవతెలంగాణ- బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపల్ ప్రత్యేక అధికారి బి.శ్రీనివాస్‌కు మంగళవారం మున్సిపల్ కమిషనర్ బి. వేంకట్రామ్ పుష్పగుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశం మేరకు తన బాధ్యతలు నిర్వహించి ప్రజల సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుక వస్తే పరిష్కారం చేసేందుకు కృషి చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
8
మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్
బుధవారం | జనవరి 29, 2025 | www.navatelangana.com

రోడ్డుపై అక్రమంగా వేసిన మంచినీటి బోర్ సీజ్



నవతెలంగాణ- మేడ్చల్

మేడ్చల్ మండల పరిధిలోని పూడూరు గ్రామంలో ఓ వ్యక్తి ఆర్ అండ్ బీ రోడ్డుకు అనుకొని అక్రమంగా వేసిన మంచి నీటి బోరును మంగళవారం రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ మోహన్‌లు, వీఆర్ఎ శ్రీనివాస్, మున్సిపల్ సిబ్బంది మహేందర్‌లు అక్రమ బోరును సీజ్ చేసినట్లు తెలిపారు. ఇదే విషయమై పలువురు గ్రామస్తులు రోడ్డుపై అక్రమంగా అర్ధరాత్రి సమయంలో బోర్ వెయ్యడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి బోరును సీజ్ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

జెడ్పీహెచ్‌ఎస్ హై స్కూల్‌లో డైనింగ్ హాల్ ప్రారంభం



నవతెలంగాణ- మేడ్చల్

మండల పరిధిలోని పూడూరు గ్రామ జెడ్పీహెచ్ఎస్ హైస్కూల్‌లో పైప్ లైన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్మించిన డైనింగ్ హాల్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వై.శంకరయ్య, ఉపాధ్యాయులు మధుసూదన్ రెడ్డి, బద్రి నారాయణ, సాయప్ప, శేఖర్, రమకుమారి, రమాదేవి, పైప్ లైన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఏరియా మేనేజర్ రామ్ నరసింహ, సీనియర్ జనరల్ మేనేజర్ ప్రకాష్, సత్యనారాయణ, సాయికుమార్, రాజేశ్వరరావు, సంఘీరవు, మాజీ సర్పంచ్ బాబు యాదవ్, మాజీ వార్డు సభ్యులు శశి కుమార్, శ్రీకాంత్, పాఠశాల చైర్మెన్ మంజుల, ప్రాథమిక పాఠశాల ఏఏపీసీ చైర్మెన్ శ్రీలత విద్యార్థులు పాల్గొన్నారు.

ఉప్పల్ నియోజకవర్గానికి భారీగా నిధులు



- సీఎం ఆదేశాలతో అభివృద్ధి పనులకు మోక్షం

నవతెలంగాణ-కాప్రా

ఉప్పల్ నియోజకవర్గంలో ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న అండర్ గ్రౌండ్ డ్రయినేజీ, తాగునీటి సమస్యకు మోక్షం లభించనుంది. ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలోని సమస్యలను కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి చర్లపల్లి, కాప్రా డివిజన్ల కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి, స్వర్ణరాజ్‌తో కలిసి HMWSSB ఎండీ అశోక్ రెడ్డితో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో పెండింగ్ పనులు, కొత్త డ్రయినేజీల నిర్మాణం వేగవంతం చేయాలని చర్చించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు కొత్త తాగునీటి పైప్ లైన్లు, అండర్ గ్రౌండ్ డ్రయినేజీల అంచనాలు తయారు చేసి పనులు ప్రారంభిస్తామని ఎండీ అశోక్ రెడ్డి హామీ ఇచ్చారు. దీంతో సీఎం రేవంత్‌కు పరమేశ్వర్ రెడ్డి నియోజకవర్గ ప్రజల పక్షాన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాప్రా డివిజన్ గోపాల్ రెడ్డి నగర్, రాజీవ్ ఎన్‌క్లేవ్, బ్యాంకు కాలనీ, చలసాని హిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, ఉప్పల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకారపు అరుణ్, కాప్రా డివిజన్ అధ్యక్షులు నాగ శేషు, పడమటి మల్లారెడ్డి, నాగరాజ్, కిషోర్, సందీప్, పూర్ణ యాదవ్ ,రాకేష్ యాదవ్ ,శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

గ్రేటర్‌లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక దృష్టి

- అభివృద్ధిలో దూసుకెళ్తున్న చిల్కానగర్
- మేయర్ గద్వాల్ విజయలక్ష్మి
- కార్పొరేటర్ గీతకు మేయర్ అభినందన



నవతెలంగాణ-ఉప్పల్

గ్రేటర్‌లో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టినట్టు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. మంగళవారం ఉప్పల్ సర్కిల్ చిల్కానగర్ వార్డులో రూ.2 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన మోడల్ గ్రేవ్ యార్డ్‌ను డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్, జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ లతో కలిసి మేయర్ శంకుస్థాపన చేశారు. అనంతరం చిల్కానగర్‌లోని పలు కాలనీల సమస్యలపై కార్పొరేటర్ బన్నాల గీత మేయర్‌కు వివరించారు. సమస్యలను పరిశీలించిన మేయర్, డిప్యూటీ మేయర్, అభివృద్ధి పనులు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పిస్తా హౌస్ వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జితో పాటు అక్కడ ఉన్న ఖాళీ స్థలంలో పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బ్యాంకు కాలనీలో ఓపెన్ డ్రయినేజీ స్థానంలో బాక్స్ డ్రయినేజీ పనులకు అంచనాకు అనుగుణంగా నిధులు మంజూరు కాలేదని, ఇంతకుముందు ప్రతిపాదించిన అంచనా మేరకు నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ కోరగా అవసరమైన నిధుల మంజూరుకు నివేదిక పంపాలని జోనల్ ఎస్ఈని మేయర్ ఆదేశించారు. చిల్కానగర్ మెయిన్ రోడ్డు పోచమ్మ టెంపుల్ చౌరస్తా వద్ద బోడుప్పల్ మున్సిపాలిటీ నుండి స్ట్రామ్ వాటర్ డ్రైన్, ఇండస్ట్రియల్ స్ట్రామ్ వాటర్ ఓవర్ ఫ్లో నీరు కాలనీలోకి రావడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని కార్పొరేటర్ వివరించారు. ప్రధాన ట్యాంక్ లైన్ నిర్మాణం చేపట్టాలని కోరారు. దీంతో మేయర్ వాటిని పరిశీలించి వాటర్ వర్క్స్ ఎండీతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. నాచారం చెరువు మత్తడి నుండి ఓవర్ ఫ్లోతో కాలనీలోకి చెరువు నీరు రావడంతో ఇబ్బందులు పడుతున్నామని మల్లికార్జున్ నగర్ కాలనీవాసులు మేయర్‌కు విన్నవించగా వరద నివారణకు చర్యలు తీసుకోవాలని జోనల్ ఎస్ఈని ఆదేశించారు. అజాం పూర్ అలకపూరి నార్త్ కాలనీ వద్ద పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని ఓపెన్ జిమ్ ఏర్పాటుతో పాటు వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మిస్టాట్ ఎన్‌క్లేవ్ నాలా క్రాసింగ్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని, గతంలో ఉన్న క్రాసింగ్ బ్రిడ్జి వరద నీరు నిలిచి దెబ్బతిన్న నేపథ్యంలో ఎత్తయిన బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కాలనీవాసులు కోరారు. ఇందిరా నగర్ ప్రస్తుతం ఉన్న కమ్యూనిటీ హాల్ నిర్మాణం తొలగించి మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని మేయర్ కాలనీవాసులకు హామీ ఇచ్చారు. మేయర్ వెంట డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, జోనల్ ఎస్ఈ నిత్యానంద, ఉప్పల్ సర్కిల్ డీసీ ఆంజనేయులు,జోనల్ జాయింట్ సెక్రటరీ కృష్ణవేణి, తదితరులున్నారు.

మున్నూరు కాపు సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-కాప్రా

డాక్టర్ ఏస్‌రావునగర్ డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఉప్పల్ నియోజకవర్గ మున్నూరు కాపు సంఘం క్యాలెండర్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మున్నూరు కాపు సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గ మున్నూరు కాపు సంఘం కన్వీనర్ గంధం నాగేశ్వర్ రావు, చీఫ్ అడ్వైజరీ కందుల లక్ష్మీ నారాయణ పటేల్, అధ్యక్షుడు తిపిరి రాజ బాబు నాయకులు గడ్డం శ్రీనివాస్, పంతులు నరహింహా, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఆరోరా కళాశాలలో పొగాకు నియంత్రణపై ర్యాలీ



నవతెలంగాణ-బోడుప్పల్

పొగాకు కారణంతో దేశంలో అనేకమంది క్యాన్సర్ వ్యాధితో మృతి చెందుతున్నారని అందుకే ప్రజల్లో పొగాకు వాడకం నిషేధంపై చైతన్యం చెయ్యాలని ఆరోరా కళాశాల డైరెక్టర్ శ్రీకాంత్ జట్ల అన్నారు. మంగళవారం పీర్జాదిగూడ ఆరోరా కళాశాల జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) తరపున 250 మంది విద్యార్థులు పొగాకు నియంత్రణపై అవగాహన ర్యాలీని నిర్వహించారు కాలేజీ నుండి మొదలైన ర్యాలీ ఉప్పల్ డిపో వరకు సాగింది. పొగాకు నియంత్రణకు వ్యతిరేకంగా నినాదాలు చేసుకుంటూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ శ్రీకాంత్ జట్ల మాట్లాడుతూ పొగాకు వాడకం వల్ల కలిగే దుష్ప్రయోజనాలను వివరించారు. పొగాకు వాడకం వలన కాన్సర్ బారిన పడే ప్రమాదం ఉందన్నారు. పొగాకు లేని సమాజం ఏర్పాటు కావాలంటే యువత దురలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. పొగాకుతో మానసిక సమస్యలు ఉత్పన్నం అవుతాయన్నారు. పొగాకుతో వచ్చే అనార్థాలను ప్రజలకు వివరించాలని విద్యార్థులకు ప్రేరణ కలిగించారు.

భవన నిర్మాణ కార్మికుల కౌన్సిల్ సమావేశం



నవతెలంగాణ-కాప్రా

కాప్రాలోని నీలం రాజశేఖర్ రెడ్డి భవన్‌లో తెలంగాణ రాష్ట్ర బిల్డిగ్, కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ మల్కాజిగిరి జిల్లా కౌన్సిల్ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా బీఓసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారగోని ప్రవీణ్ కుమార్, ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షులు శంకర్‌రావు పాల్గొన్నారు. ఈ సమావేశం సందర్భంగా వారు మాట్లాడుతూ..భవన నిర్మాణ కార్మికుల కోసం హక్కుల కోసం కృషి చేయాలని చెప్పారు. కార్మిక చట్టాలతో కలిగే ప్రయోజనాలను కార్మికులకు వివరించాలని సూచించారు. ప్రతి అడ్డాలో అధిక సంఖ్యలో సభ్యత్వాలు పెంచుకోవాలన్నారు. ఈ సభ్యత్వాలను బట్టి జిల్లా మహాసభకు డెలిగేషన్ ఉంటుందన్నారు. ప్రతీ కార్మికుడు, కార్మికురాలు తప్పనిసరిగా లేబర్ కార్డు తీసుకోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే ప్రయోజనాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి అడ్డా యూనియన్ నాయకులు అడ్డా గుర్తింపు కార్డులను కార్మికులకు ఇవ్వాలన్నారు. పని ప్రదేశంలో, లేదా లేబర్ ఆఫీసులో సమస్యలు ఉంటే తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామని చెప్పారు. ఏప్రిల్ 21, 22న రాష్ట్ర మహాసభ, మార్చిలో మల్కాజిగిరి జిల్లా మహాసభ ఉన్నందున ఫిబ్రవరిలోగా జిల్లాలోని అన్ని అడ్డా మహాసభలు, మండల మహాసభలు పెట్టి కమిటీలు వేసుకోవాలని సూచించారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షులు వీరనాగప్ప, జిల్లా సహాయ కార్యదర్శి గోల్లూరి స్వామిదాసు, నాయకులు నర్సింగరావు, భిక్షపతి, స్వామిదాసు, నగేష్, యాకోబు, ఓంకార్, కృపాకర్, బంగారయ్య సాయిలు, జిల్లాలోని 13 మండలాల అడ్డాల అధ్యక్షులు, కార్యదర్శులు, కార్మికులు పాల్గొన్నారు.

డాక్టరేట్ అందుకున్న మోమిన్ బాషా



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మనం ఫౌండేషన్ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవం వేడుకలల్లో భాగంగా చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో ఇపికాజొ ప్రొఫెటిక్ బైబిల్ యూనివర్సిటీ ఆఫ్ సౌత్ ఆఫ్రికా వారు హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ ఆల్ ఇండియా తెలంగాణ స్టేట్ ప్రెసిడెంట్ మోమిన్ బాషాను డాక్టరేట్ అవార్డుకు ఎంపిక చేయగా సెంట్రల్ పోలీస్ ఆఫీసర్, రచయిత ఎలమంచిలి వెంకటరమణ ది డిగ్రీ సోషల్ ఆక్టివిస్ట్ డాక్టర్ ఫిలోసఫీ అవార్డును మోమిన్‌భాషాకు అందజేశారు. ఈ సందర్భంగా మోమిన్ బాషా మాట్లాడుతూ హ్యూమన్ రైట్స్ ద్వారా తాను చేస్తున్న సామజిక సేవా కార్యక్రమాలను గుర్తించి డాక్టరేట్ అందజేయడం సంతోషంగా ఉందన్నారు. ఇక ముందు పేదలకు మరిన్ని సేవా కార్యక్రమాలను చేస్తానన్నారు. అవార్డుకు తనను ఎంపిక చేసిన మనం ఫౌండేషన్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ ఆల్ ఇండియా అడ్వకేట్ నేషనల్ ప్రెసిడెంట్ ఫౌండర్ అయ్యప్ప, సౌత్ ఇండియన్ చైర్మెన్ ధనలక్ష్మి , తెలంగాణ స్టేట్ మహిళ అధ్యక్షురాలు శ్రీలత, తెలంగాణ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ నరేష్, తెలంగాణ స్టేట్ జనరల్ సెక్రెటరీ ఉదయ్ శంకర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు 100శాతం ఉత్తీర్ణత సాధించాలి



- జిల్లా కలెక్టర్ గౌతమ్
- శ్రీ రంగవరం, నూతన్‌కల్ గ్రామాల్లోని స్కూల్స్ తనిఖీ

నవతెలంగాణ- మేడ్చల్

పదో తరగతి విద్యార్థులు బాగా చదివి వందశాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా కలెక్టర్ గౌతమ్ విద్యార్థులకు సూచించారు. మంగళవారం మండలంలోని శ్రీరంగవరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిజిటల్ క్లాసులను పరిశీలించి ఇంగ్లీషు విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేలా చర్యలు తీసుకోవాలని హెచ్‌ఎం రాజశేఖర్‌కు సూచించారు. ఎలా చదువుతున్నారని, సిలబస్ పూర్తయిందా.. అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. స్కూల్‌లోని కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ, వంటగది, డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. ల్యాబ్‌లోని వినియోగంలోని పరికరాలను రిపేర్ చేయించాలన్నారు. అనంతరం అంగన్వాడీని సందర్శించి చిన్నారుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. చిన్నారులను చదువు, వారికి అందించే భోజనం గురించి తెలుసుకున్నారు. అనంతరం వెటర్నరీ ఆసుపత్రిని తనిఖీ చేసి వెటర్నరి డాక్టర్‌తో వివరాలు తెలుసుకున్నారు. అనంతరం నూతన్‌కల్‌లోని పల్లె దవఖానాను తనిఖీ చేశారు. పల్లె దవఖానాను పేద ప్రజలకు ఉపయోగపడేలా ఔట్ పేషెంట్స్ శాతాన్ని పెంచాలని ఆదేశించారు. ప్రతిరోజు ఎంతమంది పేషెంట్స్ వస్తున్నారని డాక్టరు, ఎఎన్ఎంలను అడిగి తెలుసుకున్నారు. రోజుకు 35 మంది ఔట్ పేషెంట్స్ వస్తారని డాక్టర్ తెలపడంతో ఓపీని పెంచాలని కలెక్టర్ ఆదేశించారు. దవాఖానాలోని రిజిష్టర్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఈవో విజయలక్ష్మి, డీఎంహెచ్‌వో రఘునాథ స్వామి, జిల్లా సంక్షేమాధికారి స్వర్ణలత, తహశీల్దార్ శైలజ, ఎంపీడీవో వసంత లక్ష్మి జెడ్పీసీఈవో కాంతమ్మ ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులున్నారు.

ఎఫ్‌పీజీఏ అధ్యక్షుడిగా సతీష్ గెలుపు



నవతెలంగాణ-కాప్రా,చర్లపల్లి

ఎఫ్‌పీజీఏ అధ్యక్షుడిగా సతీష్ గెలుపొందారు. కాప్రా సర్కిల్ ఫోటో గ్రఫీ అసోసియేషన్ ఎన్నికలు మంగళవారం చెక్రిపురం సిరి గార్డెన్‌లో నిర్వహించారు. ఈ ఎన్నికల్లో మొత్తం199 మంది సభ్యులు ఓటు హక్కును వినియోగించుకోగా సతీష్ ప్యానల్‌కు 99 ఓట్లు రావడంతో భారీ విజయం సాధించారు. కాగా ఉపాధ్యక్షుడుగా రాజు, ప్రధాన కార్యదర్శిగా నరేష్, ట్రెజరర్‌గా శివనారాయణ, జాయింట్ సెక్రటరీగా యాకయ్య విజయం సాధించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ ఎన్నికల వరకు మాత్రమే వర్గాలుగా విడిపోయినప్పటికీ ఇకపై అందరి అభిప్రాయాలను గౌరవిస్తూ ఒక కుటుంబ సభ్యుడిగా ఫోటో గ్రఫీ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రమణ శ్రీ, ప్రకాష్, ఆర్‌టి రమేష్, సాయి కుమార్, రవికుమార్, దాస్, నాగేందర్, రవి, చిన్నా, మదన్, రాము గౌడ్, హరి, భాను చందర్, దశరథ్, గోపి, రాజు, మురళి, మధు, పరమేష్, రవి, పాల్గొన్నారు.

బండి.. నీ తొండి మాటలు మానుకో

- ఉక్కు మహిళ ఇందిరా గాంధీపై ద్వేషం ఎందుకు
- గద్దర్ తెలంగాణ సబ్బండా వర్గాల గొంతుక
- యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొన్నం తరుణ్ గౌడ్



నవతెలంగాణ-బోడుప్పల్

కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ తొండి మాటలు మానుకోవాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొన్నం తరుణ్‌గౌడ్ అన్నారు. దేశంలోని పేదరికాన్ని నిర్మూలన చేయడానికి 'గరీబి హఠావో' అనే నినాదంతో అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి ఉక్కు మహిళగా పేరుగాంచిన ఇందిరాగాంధీపై బండి సంజయ్ చేసిన విద్వేషపూరిత వాఖ్యలు సరికాదని మండిపడ్డారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం ఉప్పల్ డిపో వద్ద కేంద్ర మంత్రి బండి సంజయ్ దిష్టి బొమ్మ దహనం చేశారు. అనంతరం ఆయన మాటాడుతూ..దేశానికి తొలి మహిళా ప్రధానిగా సేవలందించిన ఇందిరా గాంధీ బ్యాంక్‌లు సామాన్యులకు అందుబాటులో ఉండాలనే సంకల్పంతో జాతీయికరణ చేసిందన్నారు. నిమ్న వర్గాలకు భూముల పంచి దేశం కోసం ప్రాణాలర్పించిన ఉక్కు మహిళపై బండి సంజయ్ హేళన చేసే మాటలు మాట్లాడడం సరికాదన్నారు. ఇప్పటికై బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పద్మ అవార్డులను భాజపా కార్యాలయం ఇచ్చే అవార్డులు కావానీ, అవి భారత ప్రభుత్వం అత్యున్నత సేవా కార్యక్రమాలు చేసిన వ్యక్తుల ప్రతిభకు ఆధారంగా ఇచ్చేవని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. ప్రజా యుద్ధనౌకగా పేరొందిన గద్దర్ గురించి అవాకులు చెవాకులు పెలితే తెలంగాణ సమాజం చూస్తూ ఉరుకోదని అన్నారు. తెలంగాణ సమాజం చాలా చైతన్యవంతమైన సమాజమని ఎవరికి ఎప్పుడూ ఎది ఇవ్వాలో అదే ఇస్తారని గుర్తు ఉంచుకోవాలని అన్నారు. గద్దర్ లేకుండా తెలంగాణ ఉద్యమాన్ని ఊహించ జాలమా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా బండి సంజయ్ తొండి మాటలు బంద్ చేసుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర రాహుల్ యాదవ్, మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శులు చంద్రిక, సాయికిరణ్ రెడ్డి, సురేష్, మేడ్చల్,మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు అజయ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, అరవింద్, నియోజకవర్గం ఉపాధ్యక్షులు కార్తీక్ రెడ్డి,అంజన్ గౌడ్,మండల అధ్యక్షులు అజయ్ రెడ్డి చిలుముల, వినోద్, మునిసిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు శ్రీకాంత్ తదితరులున్నారు.

కీసరగుట్ట మహాశివరాత్రి జాతర ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ



నవతెలంగాణ-కీసర

కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఫిబ్రవరి 24 నుండి మార్చి ఒకటో తేదీ వరకు జరిగే మహాశివరాత్రి జాతర ఆహ్వాన పత్రికను ఆలయ చైర్మెన్ తాటకం నారాయణ శర్మ , ఆలయ ఈవో కట్ట సుధాకర్ రెడ్డిలు మంగళవారం ఆలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కీసరగుట్ట మహాశివరాత్రి జాతర ఆరు రోజులపాటు జరిగే పూజా కార్యక్రమాలకు సంబంధించి ఆహ్వాన పత్రికను ఆలయం తరపున ప్రముఖులందరికీ, దాతలకు, అధికారులకు అందజేస్తామన్నారు. జాతరను విజయవంతం చేయడానికి ప్రజలందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఫౌండర్ ఫ్యామిలీ సభ్యులు, అర్చకులు, పాల్గొన్నారు.

ఉత్తమ మెడికల్ అధికారి డాక్టర్ సాయి ఆకాంక్షకు సన్మానం



నవతెలంగాణ-కీసర

మేడ్చల్ జిల్లా నాగారం మున్సిపాలిటీలో నివసించే డాక్టర్ సాయి ఆకాంక్షకు ఉత్తమ మెడికల్ మెరిటోరియస్ అవార్డు రావడంతో నాగారం మున్సిపల్ మాజీ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, మాజీ కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్ గౌడ్‌లు మంగళవారం పుష్పగుచ్చం అందజేసి సన్మానించారు. జనవరి 26 జనవరి గణతంత్ర దినోత్సవం రోజున మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ చేతుల మీదుగా ఉత్తమ అవార్డు బెస్ట్ మెడికల్ ఆఫీసర్ మెరిటోరియస్ అవార్డు రావడం చాలా సంతోషం అన్నారు. ప్రజలకు ఉత్తమ సేవలు అందించిన వారికి గుర్తింపు ఉంటుందన్నారు.

ఈఎస్ఐని సొసైటీగా మార్చే ప్రయత్నం మానుకోవాలి



- నల్ల బ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన

నవతెలంగాణ - చర్లపల్లి

కేంద్ర ప్రభుత్వం నాచారం ఈఎస్ఐని సొసైటీగా మర్చే ప్రయత్నం మానుకోవాలని ఈఎస్ఐ జేఏసీ నాయకులు డాక్టర్ చీమ శ్రీనివాస్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో ఉన్న నాచారం ఈఎస్ఐ ఆస్పత్రిని ఈఎస్ఐ సొసైటీగా మార్చి కేంద్రం ఆధీనంలోకి తీసుకోవాలనే నిర్ణయాన్ని ఖండిస్తూ ఈఎస్ఐ జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలో ఉన్న ఈఎస్ఐని నిర్వీర్యం చేసే కుట్రలను మానుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అనేక ప్రభుత్వ రంగసంస్థలను ప్రయివేటీకరణ చేస్తూ, ఉద్యోగులకు వ్యతిరేకంగా పనిచేస్తుందన్నారు. కేంద్రం ఉద్యోగుల వ్యతిరేక వైఖరిని వీడాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రలను అడ్డుకొని తెలంగాణ ఈఎస్ఐను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకటేష్ బాబు, విక్టోరియా, ధనరామ్, కృష్ణ, డాక్టర్ గాలి విజయ కుమార్, డాక్టర్ అరుణ బాబు, డాక్టర్ సుధాకర్ తదితరులున్నారు.

బండి సంజయ్ దిష్టి బొమ్మ దహనం



నవతెలంగాణ-కీసర

మాజీ ప్రధాని ఇందిరా గాంధీ, తెలంగాణ పాటల గొంతుక గద్దర్ పైన అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ దిష్టి బొమ్మను నాగారం మున్సిపల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లరాళ్ల అభిలాష్‌రెడ్డి ఆధ్వర్యంలో దహనం చేశారు. కార్యక్రమలో నల్లోల కుమార్ ,ఎలాసాని బాలరాజ్ యాదవ్ , పొట్ట శ్రీశైలం , పొట్ట విఘ్నేష్ ,సోమిరెడ్డి, అరిగే రాములు ,కందాడి శివ రాంరెడ్డి , జగన్ , నవీన్, ఫయాజ్, శ్రవణ్, ఘనీ చింటూ, రాహుల్, మహేష్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ రోడ్డు నియమాలను పాటించాలి

- మల్కాజిగిరి జోన్ ట్రాఫిక్ ఏసీపీ ఎంవీ శ్రీనివాసరావు
- నాగారం సెరినిటీ పాఠశాలలో రహదారి భద్రత విద్యపై అవగాహన



నవతెలంగాణ-కీసర

ప్రతి ఒక్కరూ రోడ్డు నియమాలను పాటించాలని మల్కాజిగిరి జోన్ ట్రాఫిక్ ఏసీపీ ఎంవీ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం నాగారం సెరినిటి పాఠశాలలో రహదారి భద్రత విద్యపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పౌరులందరూ ట్రాఫిక్ నియమాలు పాటించి, హెల్మెంట్ ధరించాలన్నారు. కారులో సీటు బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. విద్యార్థులకు రహదారి భద్రత విద్య ఎంతో అవసరం అని తెలిపారు. మాట్లాడుతూ 18 ఏండ్లు నిండని వారు ఎవరూ వాహనాలు నడపరాదన్నారు. తల్లిదండ్రులు వాహనాలు ఇస్తే చట్ట రీత్యా నేరమని తెలిపారు. జవహర్ నగర్ ట్రాఫిక్ సీఐ శివ శంకర్ మాట్లాడుతూ.. డబ్బులు పో యినా, వస్తువులు పోయినా తిరిగి సంపాదిం చుకోగలమని, ప్రాణాలు పోతే తిరిగి రావని సూచించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నియమాల ను పాటిస్తూ హెల్మెంట్ ధరించాలన్నారు. పాఠశాల కరెస్పాండెంట్ నోముల జంగిరెడ్డి మాట్లడుతూ ప్రతి ఏడాది దాదాపు 150, 000 మంది రోడ్డు ప్రమాదాలలో చనిపోతు న్నారని అన్నారు. ఇది బాధాకరమని వాపో యారు. ప్రమదాలు అరికట్టాలంటే డ్రైవింగ్ లైసెన్స్ తోపాటు వాహనం నడిపేటప్పుడు రోడ్డు నియమాలను తప్పనిసరిగా పాంటించాలన్నారు. కార్యక్రమం లో పాఠశాల ప్రధాన కార్యదర్శి నోముల వసంత, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దొంగతనం కేసును ఛేదించిన పోలీసులు

- రూ.43,00,000 నగదు రికవరీ

నవతెలంగాణ - కుత్బుల్లాపూర్



పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధి కొంపల్లి లోని గేటెడ్ కమిటీ విలాస్ లో ఓ ఇంటి తాళం పగలగొట్టి బెడ్ రూమ్ కిటికీ గ్రిల్ తొలగించి లోపలికి ప్రవేశించి దాదాపు రూ.52,50,000 నగదును దొంగలు ఎత్తుకెళ్లినట్లు ఇంటి యజమానురాలు భవాని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పేట్ బషీరాబాద్ పోలీసులు దొంగతనం జరిగిన స్థలాన్ని సందర్శించి దర్యాప్తు చేసి సీసీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా నిందితుని గుర్తించారు.సోమవారం నిందితుడు ఆనంద్‌ను అదుపులోకి తీసుకొని రూ.43,00,000 నగదును స్వాధీనం చేసుకున్నారు.

మాజీ ఎమ్మెల్యేకు ఆర్యవైశ్య సంఘం ఆహ్వానం

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆత్మర్పన దినోత్సవం సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్‌ను గాజులరా మారం, షాపూర్ నగర్ ఆర్యవైశ్య సంఘం సభ్యులు మంగళ వారం ఆహ్వానించారు. అనంతరం కూన శ్రీశైలం గౌడ్ వారి ఆహ్వానన్ని స్వీకరించి.. వైశ్యకుల అభివద్ధి కోసం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్ర మంలో గాజులరామారం ఆర్యవైశ్య సంఘం ప్రెసిడెంట్ పవన్ కుమార్ గుప్తా, షాపూర్ నగర్ ఆర్యవైశ్య సంఘం ప్రెసిడెంట్ వాస శ్రీనివాస్ గుప్తా, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రసాద్ గుప్తా, శంకర్ గుప్తా, ప్రభాకర్ గుప్తా, జగదీష్, మూర్తి, సంతోష్, శేఖర్, ఉప్పలయ్య, హర్ష ప్రియాంక, కవిత, గీత, మమతతో పాటు తదితరులు పాల్గొన్నారు.

అల్లం చెరువులో మురుగునీరు కలవకుండా చర్యలు చేపట్టండి

- ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

నవతెలంగాణ - కుత్బుల్లాపూర్



132 - డివిజన్ అంగడిపేటలోని అల్లం చెరువులో మురుగునీరు కలవకుండా చర్యలు చేపట్టాలని అధికారులను కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ఆదేశించారు. అల్లం చెరువును మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఎమ్మెల్యే మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మిషన్ కాకతీయ పథకంలో భాగంగా సుమారు రూ .40 లక్షల వ్యయంతో సుందరీకరించిన అల్లం చెరువును సమీప కాలనీ వాసులకు ఆహ్లాద వాతావరణాన్ని అందించేందుకు సుందరీకరించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, రుద్ర అశోక్, పోలే శ్రీకాంత్, వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎత్తరి మారయ్య, నాయకులు అనిల్, పులి మహేష్, కష్ణ ముదిరాజ్, జి.హెచ్.ఎం.సి. ఈఈ లక్ష్మీ గణేష్, డిఈ పాపమ్మ, ఏఈ అనురాగ్, వాటర్ వర్క్స్ డీజీఎం రాజేష్, మేనేజర్ అనుషా తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 2న మెగా జాబ్ మేళా

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట.



నిరుద్యోగ యువతీ యువకులు ఆదిత్య అండ్ మ్యాజిక్ బస్ ఆధ్వర్యంలో చింతల్ డివిజన్ భగత్ సింగ్ నగర్ (మాడ్రన్ కళ్యాణమంటపం) మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లో ఫిబ్రవరి 2 న ఆదివారం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కోడి ఆదిత్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ తోపాటు వివిధ డిగ్రీలలో ఉత్తీర్ణత సాధించిన యువత కోసం సుమారు 15కు పైగా కంపెనీల ద్వారా దాదాపు 2 వేలకు పైగా ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా విప్రో, ఇన్ఫోసిస్, గూగుల్,జెన్ ప్యాక్ తదితర బహుళ కార్పొరేట్ సంస్థల ద్వారా ఈ అవకాశాన్ని కల్పిస్తున్నామన్నారు. ఆదివారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నామని,ఈ అవకాశాన్ని ఆసక్తిగల యువత 8309447458, 96520 98401 నెంబర్లకు ఫోన్ చేసి తమ పేర్లను లింకు https://docs.google.com/forms/d/1BGnKkvNR2nLvVYZH7Vt2wsD8b_ 4NK3UtGgQ JeM4Qek0/viewform? edit_requestedRtrue&hlRen_GB ద్వారా తప్పక నమోదు చేసుకోవాలని సూచించారు.

శ్మశాన వాటికలో అన్ని సదుపాయాలు కల్పించాలి

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- కార్పొరేటర్‌లతో కలిసి ఎమ్మెల్యే పర్యటన

నవతెలంగాణ-కూకట్ పల్లి



శ్మశాన వాటికలో అన్ని సదుపాయాలు కల్పించి మాడల్ స్మశాన వాటికగా తీర్చిదిద్దాలన్నారు. ఎమ్మెల్యే మాధవరం కష్ణారావు మంగళవారం కూకట్‌పల్లి డివిజన్ లోని దయార్ గూడ స్మశానవాటికను స్థానిక కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణతో కలిసి పరిశీలించారు. అధికారులకు ఎమ్మెల్యే పలు సూచనలు చేశారు. అన్ని మౌలిక సదుపాయాలు కల్పించి మోడల్ స్మశాన వాటికగా తీర్చిదిద్దాలని సూచించారు. అలాగే ప్రకాష్ నగర్ స్మశాన వాటికలో బాత్రూం సదుపాయం కల్పించి రోడ్లు, కాంపౌండ్ వాల్ నిర్మాణం చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా దోమల సమస్య అధికంగా ఉన్న యెడల అధికారులు ఎక్కడకక్కడ దోమల మందు పిచికారీ చేయాలని, శానిటేషన్ విషయంలో అలసత్వం వహించద్దని సూచించారు.ఈఈ గోవర్ధన్, డీఈ నిఖిల్ రెడ్డి, ఏఈ సునీల్, ప్రసన్న, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాలానగర్ డివిజన్ పరిధిలో

బాలానగర్ : బాలానగర్ డివిజన్ పరిధిలోని శ్మశానవాటికల పరిశీలనలో భాగంగా కళ్యాణ్ నగర్ శివాలయం దగ్గర నుంచి చరబండ రాజు కాలనీ శ్మశాన వాటిక, సాయి నగర్ జంగం వారి శ్మశాన వాటిక, గవర్నమెంట్ స్కూల్ పరిశీల న, దాసరి బస్తి శ్మశాన వాటిక, ఫిరోజ్ గూడ శ్మశాన వాటిక తదితర ప్రాంతాలను కార్పొరేటర్ రవీందర్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే పరిశీలిం చారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రోడ్లు, డ్రయి నేజీ, తాగునీరు, శ్మశాన వాటికల అభివృద్ధి, మౌలిక సుదపాయాలు కల్పించి ప్రజాభి మానం చూరగొందని తెలిపారు. అయితే 14 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం పనులకు నిధులు కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరనున్నట్టు పేర్కొ న్నారు.

చరబండ రాజు కాలనీలోని స్మశానవాటికలను పరిశీలించి అక్కడ మౌలిక సదుపాయాలపై ఎమ్మెల్యే ఆరా తీశారు. ముఖ్యంగా నీటి సదుపాయం లేదని, అలాగే స్మశాన వాటికల్లో పిచ్చి మొక్కలు అస్తవ్యస్తంగా పెరిగి చాలా ఇబ్బందిగా మారిందని స్థానికులు తెలిపారు. డివిజన్ పరిధిలో ప్రధానంగా దోమల సమస్య ఎక్కువగా ఉందని స్థానికులు తెలపగా వెంటనే అక్కడ ఉన్న ఇంజినీరింగ్ విభాగం అధికారులకు ఎమ్మెల్యే సూచనలు చేశారు, స్మశాన వాటికల చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించి పరిసరాలను శుభ్రం చేయాలని అన్నారు. అదేవిధంగా నీటి సదుపాయం కల్పించి, మూత్రశాలలను కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం వినాయక నగర్‌లోని స్మశాన వాటికను పరిశీలించిన ఎమ్మెల్యే అక్కడ కూడా మౌలిక సదుపాయాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎందుకు సరైన నిర్వహణ ఏర్పాట్లు చేయడం లేదని, వెంటనే నీటి సదుపాయాలు, మౌలిక వసతులు కల్పించి శానిటేషన్ విషయంలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు. ప్రధానంగా బాలానగర్ లోని నాలా పరిసర ప్రాంతాలు కాలనీలు బస్తీలలో దోమల బెడద అధికంగా ఉందని, అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికుల పిర్యాదుతో స్పందించిన ఎమ్మెల్యే శానిటేషన్ విభాగం అధికారులను, ఎంటమాలజీ విభాగం అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని, ఫాగింగ్ క్రమం తప్పకుండా చేయాలని ఆదేశించారు. బీఆర్ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి మమ్మద్ ఖాజా, నాయకులు అంబటి సునీల్ కుమార్, పంజా రామ్ చందర్ ముదిరాజ్, జేరిపోతుల రవీందర్ రావు, ఎడ్ల ప్రభాకర్, ఆదిమూల నాగేష్, మొగుడంపల్లి కిరణ్ కుమార్, మొహమ్మద్ బాబా, సుజాత గౌడ్, ఎడ్ల కవిత, సిద్ధిరాములు, పుష్ప రాజ్, బం డారి ప్రవీణ్ గౌడ్, స్వాతి, చింతల జ్యోతి, మహమ్మద్ అప్స ర, సూర్యనారాయణ, జీహెచ్ఎంసీ ఈఈ గోవర్ధన్ గౌడ్, ఏఈ సునీల్ కుమార్, వాటర్ వర్క్ మేనేజర్ అనిల్ కుమార్ శానిటేషన్ ఎస్సారెస్పీ నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు



నేటి విద్యార్థులపైనే రేపటి దేశ భవిత ఆధారం



- ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్
- ఘనంగా శ్రీనిధి గ్లోబల్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట.

నేటి విద్యార్థులపై రేపటి దేశభవిత ఆధారపడి ఉందని ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు. చింతల్ మాణిక్యనగర్ ప్రాంతంలో గల శ్రీనిధి గ్లోబల్ హై స్కూల్ వార్షికోత్సవ వేడుకలు సోమవారం సాయంత్రం ఐడీపీఎల్ సమీపంలోని ఎంపీఆర్ కన్వెన్షన్ హాల్‌లో విద్యార్థుల ఆటపాటల మధ్య ఉల్లాసంగా ఉత్సాహంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా ఆయనతో పాటు పాఠశాల చైర్మెన్ నల్లపాటి వెంకటేశ్వర రావు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యావ్యవస్థలో వస్తున్న మార్పులకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. విద్యతో పాటు క్రీడలు ఆసక్తికర రంగాలలో రాణించి మన దేశానికి, రాష్ట్రానికి,ప్రాంతానికి,పాఠశాలకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. మన చరిత్ర, సంస్కృతి - సాంప్రదాయాలను నాటక ప్రదర్శన ద్వారా నేటి తరానికి తెలిసేలా విద్యార్థులను ప్రోత్సహిస్తున్న పాఠశాల యాజమా న్యానికి అభినందనలు తెలిపారు. సాంస్కృతిక కార్యక్ర మాలలో భాగంగా 30 నిమిషాల నిడివితో ప్రదర్శించిన "సంపూర్ణ రామాయణం" నాటక ప్రదర్శన ఆహుతులను ఎంత గానో ఆకర్షించాయి. అనంతరం పాఠశాల నిర్వాహకులు ఎమ్మెల్యేను శాలువా, మెమెంటోతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్,వివిధ డివిజన్ ల అధ్యక్షులు రుద్ర అశోక్, పుప్పాల భాస్కర్, పోలే శ్రీకాంత్, నాయకులు ఎర్వ సాయికిరణ్, శ్రీనిధి గ్లోబల్ స్కూల్ అధ్యక్షులు నల్లపాటి రాజేశ్వరి,డైరెక్టర్ నల్లపాటి సాయినాథ్,ఉపాధ్యాయులు,విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి, డ్రయినేజీ సమస్యలను పరిష్కరించండి



- కార్పొరేటర్ చెరుకుపల్లి తారా చంద్రారెడ్డి

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 132 జీడిమెట్ల డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని స్థానిక కార్పొరేటర్ చెరుకుపల్లి తారా చంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం డివిజన్ పరిధిలోని అయోధ్య నగర్‌లో స్థానిక నాయకులతో కలిసి ఆమె పర్యటించారు.బస్తీ వాసులు మంచినీటి, డ్రయినేజీ సమస్యతో ఇబ్బంది పడుతున్నామని ఆమె దష్టికి తీసుకురాగా సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే డ్రయినేజీ, మంచినీటి సమస్యలను పరిష్కరించాలని కార్పొరేటర్ కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపి మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చేరుకుపల్లి భరత్ సింహ రెడ్డి, జాకి, అంజయ్య, వీరేశం, సింహాద్రి, పాపయ్య, వనజ,వెంకట్, క్రాంతి, అబిద్, శివ తదితరులు పాల్గొన్నారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం

నవతెలంగాణ-దుండిగల్

విద్యుత్ ఫీడర్ నిర్వహణ పనుల కారణంగా బుధవారం గండిమైసమ్మ ఫీడర్‌లో ఉదయం 10:00 గంటల నుంచి మధ్యాహ్నం 3:00గంటల వరకు ఆరెంజ్ ఇన్‌ఫ్రా, సతీష్ సొసైటీ పరిసర ప్రాంతాలలో విద్యుత్ అంతరాయం ఉంటుందని, ఈ అంతరాయానికి ప్రజలు సహకరించాలని డీపీ పల్లి విద్యుత్ శాఖ ఏఈ సురేందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.



బాలానగర్ పోలీసుల ఆధ్వర్యంలో సీసీటీవిపై విస్తృతంగా అవగాహన

నవతెలంగాణ - బాలానగర్

సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని బాలానగర్ పోలీసుల ఆధ్వర్యంలో నవజీవన్‌నగర్ సంక్షేమ సంఘం సహకారంతో సీసీటీవిపై అవగాహనా కార్యక్రమం మంగళవారం బాలానగర్ సీఐ నర్సింహా రాజు నిర్వహించారు. ఇందులో భాగంగా బాలానగర్ సీఐ నర్సింహా రాజు మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన తర్వాత అన్ని రంగాలతోపాటు పోలీసు వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం పటిష్టం చేసిందన్నారు. ప్రజల భద్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ఫ్రెండ్లీ పోలీసింగ్ వంటి అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టిందన్నారు. ఈ నేపథ్యంలో ప్రజల సహకారంతో నేరాలను అదుపు చేసేందుకు కృషి చేస్తుందని, ఇందు కోసం నూతన టెక్నాలజీ సీసీటీవీలను సైతం వినియోగించుకోవాలన్నారు. ఇందులో భాగంగా సీసీ కెమెరాల ఏర్పాటు ఆవశ్యకతపై స్థానిక ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసుల నిఘాతో సమానమని ఉదాహరణలతో ప్రజలకు వివరించారు. నేరాలు, దొంగతనాలు జరిగినప్పుడు నిందితులను గుర్తించేందుకు సీసీ కెమెరాల పాత్రను కీలకమని తెలిపారు. ప్రజాప్రతినిధులు, దాతలు, సంక్షేమ సంఘం కమిటీల సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. వ్యాపార, వాణిజ్య సముదాయాల్లోనూ యజమానులు సీసీ కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఐ నాగిరెడ్డి, పోలీసు సిబ్బంది, సంక్షేమ సంఘం సభ్యులు అరుణ్, భాస్కర్ రెడ్డి, శ్రీరామ మూర్తి, రమేష్ నాయుడు, సులోచన రెడ్డి, ఎస్. శ్రీనివాస్, సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనం లేక వెలవెలబోతున్న క్యాంపు కార్యాలయం

- కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ ఉపాధ్యక్షుడు ఎం.యుగంధర్ రెడ్డి

నవతెలంగాణ - బాలానగర్



కూకట్ పల్లి నియోజకవర్గం పరిధిలోని ప్రజలు కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గు చూపుతున్న తరుణంలో జనాలు లేక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వెలవెల బోతోందని, దిక్కుతోచని స్థితిలో ఏం చేయాలో అర్థం కాక తన ఉనికిని కాపాడుకోవటం కోసమే "నేను ఉన్నాను, ఎక్కడా పోలేదు" అనిచెబుతూ స్మశానాలు, కమ్యూనిటీ హాళ్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కష్టారావు పర్యటనలు చేస్తున్నాడని కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి ఏ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. గత ఐదేండ్లలో స్మశానవాటికలో అభివద్ధి చేయడానికి ఎమ్మెల్యే ఎందుకు వెనుకా డారో, ఇప్పుడు కొత్తగా ఓల్డ్ బోయిన్‌పల్లి బాలానగర్ డివిజ న్‌లలో స్మశానాలు తిరుగుతుండటం హాస్యాస్పదంగా ఉందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు చేయని అభివద్ధి, ఇప్పుడు తిరుగుతూ అక్కడ అభివద్ధి ఏమీ లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏమీ చేస్తలేదని దుమ్మెత్తి పోయడం ఒక్కటే పనిగా ఎమ్మెల్యే పెట్టుకున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ లోని అద్దె భవనంలో ఉన్న ఆరోగ్య కేంద్రాన్ని ఖాళీగా ఉన్న మోడల్ మార్కెట్ భవనంలోకి తరలించలేక పోవడం ఎమ్మెల్యే పనితీరుకు నిదర్శనంగా ఉందన్నారు. చిన్న చిన్న సమస్యలను ఎమ్మెల్యే భూతద్దంలో చూపిస్తూ అధికారులపై నోరు పారేసుకుంటున్నాడని పేర్కొన్నారు. తన మాట అధికారులు ఎవరూ వినడం లేదని స్మశానాల పేరుతో అధికారులను ఎమ్మెల్యే వెంట తిప్పుకునే ప్రయత్నమే చేస్తున్నాడు తప్ప తన పర్యటనతో ఒరిగిందేమీ లేదని ఎద్దేవా చేశారు. స్మశానాలలో తిరుగుతూ ప్రజలను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నాడని అన్నారు.

కొలను హనుమంత్ రెడ్డిని కలిసిన బేకు శ్రీనివాస్

నవతెలంగాణ-దుండిగల్



కాంగ్రెస్ 132వ డివిజన్ అధ్యక్షులు బేకు శ్రీనివాస్‌ను డాక్టరేట్‌తో పాటు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఎక్సలెన్స్ అవార్డుతో సత్కరించిన నేపథ్యంలో ఆయన మంగళవారం బాచుపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలను హనుమంత్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కొలను కొలను హనుమంత్ రెడ్డి ఆయనను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్య క్రమంలో ఆల్ ఇండియా దళిత సంఘం అధ్యక్షులు అవిజె జేమ్స్ కుత్బుల్లాపూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ లక్ష్మారెడ్డి, మహిపాల్ రెడ్డి, పుల్లం రాజు, చంద్రశేఖర్ ,శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించడం గర్వకారణం : ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ - కూకట్ పల్లి

బాలానగర్, రాజీవ్ గాంధీ నగర్ వెల్ఫేర్ క్రికెట్ టోర్నమెంట్, సీజన్ సేవన్‌లో విజేతగా నిలిచిన టీం స్ట్రైకర్స్ అభ్యర్థులను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అభినందించారు. ప్రెసిడెంట్ అబ్దుల్ అజీజ్, సెక్రటరీ నరేష్ లను అభినందిస్తూ, క్రీడల పట్ల పిల్లల్లో ప్రోత్సాహం నింపాలని, క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు, శారీరక దారుఢ్యానికి ఎంతో మేలు చేస్తాయని, కూకట్‌పల్లి నియోజకవర్గం లోని యువత క్రీడల్లో దేశంలోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో రాణించడం మనకు గర్వ కారణమని ఎమ్మెల్యే అన్నారు.



జర్నలిస్టుల పేరుతో వసూళ్లకు పాల్పడేవారిని కట్టడి చేయాలి

- ప్రజాప్రతినిధులకు జర్నలిస్టుల విజ్ఞప్తి

నవతెలంగాణ-కూకట్‌పల్లి

జర్నలిస్టుల పేరుతో భవన నిర్మాణదారుల వద్ద, నుంచి పెద్ద మొత్తంలో వసూళ్లకు పాల్పడుతున్న పార్టీల నాయకులను కట్టడి చేయాలని శాసనసభ్యులకు, రాజకీయ పార్టీల నేతలకు కూకట్ పల్లి ప్రెస్ క్లబ్ జర్నలిస్టులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వ పీఏసీ చైర్మెన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికేపూడి గాంధీ, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కష్ణారావు, కాంగ్రెస్ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్, బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకులు మాధవరం కాంతారావు, జనసేన కూకట్‌పల్లి ఇన్‌చార్జి ముమ్మారెడ్డి ప్రేమకుమార్ లకు వేరువేరుగా వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ డబ్బులు ఇవ్వాలని భవన నిర్మాణ దారులను జర్నలిస్టులకు పేరుతో కొందరు బెదిరిస్తూ పెద్ద మొత్తంలో వసూళ్లకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి వారి వల్ల సమాజంలో జర్నలిస్టుల పట్ల చులకన భావం ఏర్పడుతుం దన్నారు. మున్సిపల్ అధికారులు, కాలనీల సంక్షేమ సంఘం నేతలు సైతం జర్నలిస్టుల పేరు చెప్పి ఇండ్ల నిర్మాణ దారులను భయభ్రాంతులకు గురిచేసి డబ్బులు తీసుకుం టున్నారని అన్నారు. ఇటు రాజకీయ నాయకులను, అటు అధికారులను కట్టడి చేయాల్సిన అవసరం ఉందని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ యూనియన్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజు, యూనియన్ రాష్ట్ర నాయకులు తొట్ల పరమేష్, ఆర్కే దయాసాగర్, మామిడాల రవీందర్ రెడ్డి, నిమ్మల శ్రీనివాస్, కూకట్పల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎం ఏ కరీం, కార్యదర్శి రంజిత్ కుమార్, జర్నలిస్ట్ సంఘాల నాయకులు మాణిక్య రెడ్డి, గంగరాజు, నవీన్ రెడ్డి, లక్ష్మణ్, సదా మహేష్, హరిబాబు, నజీర్, నాగరాజు, బంటు ప్రవీణ్, శ్రీనివాస్ యాదవ్, చంద్ర, పవన్, తిరుపతి, భాస్కర్, నర్సింగరావు, వెంకట్రావు, సోమిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.





ఎవరైనా వసూళ్లకు పాల్పడొద్దు : ఎమ్మెల్యే గాంధీ

సామాన్యులను ఇబ్బంది పెట్టే విధంగా జర్నలిస్టుల పేరుతో వసూళ్లకు ఎవరు పాల్పడినా సహించేది లేదని ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ అన్నారు. జర్నలిస్టు సంఘం మూకుమ్మడిగా అందరూ కలిసి విజ్ఞప్తి చేయడం హర్షనీయమన్నారు. ఉన్నతాధికారుల దష్టికి తీసుకెళ్లి అక్రమాలకు పాల్పడుతున్న వారిపై తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



మంచి పరిణామం : ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్పల్లి ప్రెస్ క్లబ్ చేపట్టిన ఈ కార్యక్రమం శుభ పరిణామమని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కష్టారావు అన్నారు. సమాజంలో జర్నలిజం విలువలు దిగజార్చకుండా ఉండేందుకు కూకట్‌పల్లి ప్రెస్ క్లబ్ శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. మున్సిపల్ అధికారులతో జర్నలిస్టులతో కలిపి ఉమ్మడి సమావేశం నిర్వహిస్తానని తెలిపారు. జర్నలిస్టులను బద్నాం చేస్తూ డబ్బులు వసూలు చేసే వారు ఎవరైనా సరే వదిలి పెట్టొద్దని చెప్పారు.

అన్ని విధాలుగా సహకరిస్తా: బండి రమేష్

కూకట్‌పల్లి ప్రెస్ క్లబ్ సభ్యులందరికీ అన్ని విధాలుగా సహకరిస్తానని కాంగ్రెస్ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్ తెలిపారు. సామాన్యులను జర్నలిస్టుల పేరుతో ఎవరు ఇబ్బందులు పెట్టినా సరైందికాదన్నారు. ఇప్పటి నుంచైనా ఈ అంశంపై అందరం కలిసికట్టుగా ఎదుర్కొందామని తెలిపారు.



'కౌన్సిలర్ బాధ్యతా రాహిత్యంతో అభివృద్ధికి నష్టం'

నవతెలంగాణ-దుండిగల్



మున్సిపల్ కౌన్సిల్ తీర్మానంలో ఆమోదం పొందిన తరువాత కాంట్రాక్టర్లకు టెండర్లు పిలిచి అభివృద్ధి పనులను అప్పగించవలసి ఉంటుందని, పదవి పదవీకాలం ముగుస్తుండడంతో మూడు రోజుల ముందు హడావిడి చేస్తూ టెండర్లు పిలవకుండా అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం కౌన్సిలర్ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని దుండిగల్ మాజీ సర్పంచ్ కావలి గణేష్ తెలిపారు. మంగళవారం ఆయన దుండిగల్‌లోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుండిగల్ మున్సిపాలిటీ లో 3వ కౌన్సిలర్ ఇటీవల పదవీకాలం ముగిస్తుండడంతో మూడు రోజుల ముందు హడావిడిగా వార్డు అభివృద్ధిలో భాగంగా శంకు స్థాపన చేశారని తెలిపారు. అయితే అధికారుల నిర్లక్ష్యంతో కౌన్సిల్‌లో తీర్మానం పొందిన తన వార్డు పనులు జాప్యం చేయడం వల్లనే అభివృద్ధి పనులు నిలిచిపోయాయని, శంకుస్థాపన చేయడం పై కాంగ్రెస్ పార్టీ వారు తనపై ఆరోపణలు చేశారంటూ ఆయనే తెలపడం హాస్యాస్పదమని అన్నారు. సంవత్సరాల కొలది ప్రజల సమస్యలు పట్టించుకోకుండా పదవీ కాలం ముగిస్తుండడంతో కేవలం రాజకీయ ఎత్తుగడలతో మున్సిపల్ అధికారుల పై., కాంగ్రెస్ పార్టీ నాయకులపై బురదజల్లే ప్రయత్నం చేయడం సరికాదని, ప్రజా సమస్యలపై అవగాహన లేకుండా మాట్లాడితే ప్రజలు హర్షించరని తెలిపారు. టెండర్లు పిలువకుండా పాలక వర్గం తీర్మానం చేసిన పనులు కాలేదంటూ, పదవీ కాలం ముగుస్తుందనగా మూడు రోజుల ముందు 3వ వార్డు మాజీ కౌన్సిలర్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం ఆయన అవగాహన రాహిత్యానికి నిదర్శనం అన్నారు. వాస్తవాలను వెలుగులోకి తెస్తే పంచాయతీ పాలక వర్గంలో తీర్మానం పొందకుండా పనులు అప్పగిం చారంటూ ఎదురదాడి చేయడం ఏంటని ప్రశ్నించారు. 5 సంవత్సరాలలో చెయ్యలేని అభివృద్ధి కార్యక్రమాలను మూడు రోజుల ముందు హడావిడిగా శంకుస్థాపన చేయాల్సిన అవసరం ఏముందని, ప్రజా సమస్యలపై చర్చించే సోయలేకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రజలను మోసం చేసి సొమ్ము చేసుకునే సంస్కృతి ఆయనదేనని తెలిపారు. కాంట్రాక్టర్ రాజు నాయక్ మాట్లాడుతూ ప్రతి పనిని పంచాయతి తీర్మాణంతోనే చేసినట్టు చెప్పారు.

కాంగ్రెస్ దుండిగల్ అధ్యక్షుడికి పరామర్శ

నవతెలంగాణ-దుండిగల్



కాంగ్రెస్ దుండిగల్ మున్సిపాలిటీ అధ్యక్షులు మద్దికుంట నవీన్ రెడ్డి గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు.కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి కొలను హనుమంత రెడ్డి ఈ విషయం తెలుసుకొని మంగళవారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించి మనోధైర్యాన్నిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు గడ్డం రాజేందర్ రెడ్డి, కొలన్ రాజశేఖర్ రెడ్డి, బొంగునూరి కిశోర్ రెడ్డి, కొలన్ జీవన్ రెడ్డి, శామీర్ పెట్ ప్రకాష్ రావు, ఎండీ నయీమ్, అక్బర్, శ్రీకర్ పాల్గొన్నారు.

పద్మారావును పరామర్శించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఓయూ

ఇటీవల గుండె పోటుకు గురై చికిత్స పొంది కోలుకున్న సికింద్రాబాద్ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావుగౌడ్‌ను మంగళవారం మోండా మార్కెట్‌లోని తన నివాసంలో బీఆర్ఎస్ జనగాం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, పలువురు నాయకులు, అధికారులు కలుసుకొని పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

కేటీఆర్ టోర్నమెంట్ పోస్టర్స్ విడుదల



నవతెలంగాణ-ఓయూ

మాజీ సీఎం చంద్రశేఖర రావు జన్మదిన సందర్భంగా బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు జిల్లా నాగయ్య ఆధ్వర్యంలో త్వరలో ఓయూ ప్రాంగణంలో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. ఆ టోర్నమెంట్ సంబంధించి వాల్ పోస్టర్‌ను మంగళవారం బీఆర్ఎస్ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీమంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పల్లా ప్రవీణ్ రెడ్డి, వలమల్ల కృష్ణ, తొట్ల స్వామి, బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పడాల సతీష్ ఆవిష్కరించారు.

అభివృద్ధి పనులతోనే సమస్యలు పరిష్కారం



- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

నవతెలంగాణ-బేగంపేట్

అభివృద్ధి పనులతోనే ప్రజల సమస్యలు పరిష్కారం అవుతాయని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మంగళవారం బన్సీలాల్ పేట డివిజన్‌లోని మేకలమండిలో రూ.19.25 లక్షల వ్యయంతో చేపట్టనున్న డ్రయినేజీ రీమోడలింగ్ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రాంతాలలో రోడ్లు, డ్రయినేజీ వ్యవస్థలను ఎంతో అభివృద్ధి చేసి దీర్ఘకాలంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చేశామని చెప్పారు. అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం ధ్యేయంగా కృషి చేస్తున్నట్టు చెప్పారు. అవసరమైన ప్రాంతాలలో నూతన వాటర్, సీవరేజ్ పైపు లైన్‌లను ఏర్పాటు చేయడమే కాకుండా అనేక ప్రాంతాల్లో పాత పైపు లైన్‌ల సామర్థ్యం పెంచామని వివరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కుర్మ హేమలత, జీహెచ్ఎంసీ డీఈ ఆంజనేయులు, వాటర్ వర్క్స్ డీజీఎం ఆశిష్, శానిటేషన్ డీఈ వెంకటేష్, ఎలెక్ట్రికల్ ఎఈ శ్రీనివాస్ రెడ్డి, స్ట్రీట్ లైట్ ఎఈ అనూష, లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్ కుమార్ గౌడ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు వెంకటేషన్ రాజు, నాయకులు ఏసూరి మహేష్, లక్ష్మీపతి, రమణ, శ్రీకాంత్ రెడ్డి, ప్రేమ్ కుమార్, అంబులెన్స్ సురేష్, మహేందర్ గౌడ్, అరుణ్ గౌడ్, కుమార్ యాదవ్, అబ్బాస్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేసిన ప్రతాప్



నవతెలంగాణ-కంటోన్మెంట్

న్యూ బోయిన్‌పల్లి ప్రభుత్వ బాలుర పాఠశాలలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు పలు క్రీడా పోటీలను నిర్వహించారు. ఆ క్రీడలకి సంబంధించి మంగళవారం ప్రధానోపాధ్యాయులు చాముండేశ్వరి ఆధ్వర్యంలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి పంపిణీ చేసే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ ముఖ్య అతిథిగా హాజరై బహుమతులు ప్రదానం చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్ననాటి నుండే లక్ష్యాలను ఏర్పరచుకొని వాటిని చేరేందుకు చిత్తశుద్ధితో క్రమశిక్షణతో చదువుకోవాలని అన్నారు. అదేవిధంగా చదువుతో పాటు క్రీడల్లో సైతం విద్యార్థులు రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గౌస్ మోహిద్దీన్, వెంకట శ్యామల, రాజరాజేశ్వరీ, గాయత్రీ, అనిత, స్థానికులు సాయిబాబా యాదవ్, బండి శ్రీనివాస్, షకీబ్ హుస్సేన్, వరప్రసాద్, పవన్, రాజు, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు రహదారి భద్రతపై అవగాహన సదస్సు



నవతెలంగాణ-సిటీబ్యూరో

జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా మంగళవారం ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయంలో దాదాపు 200 మంది ఆటో డ్రైవర్లకు రహదారి భద్రతాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ మైనారిటీ కమిషన్ చైర్మెన్ తారీక్ అన్సారి, హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సి. రమేష్‌లు విచ్చేసి ఆటో డ్రైవర్‌కు ప్రయాణికులను తీసుకువెళ్లేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సలహాలు సూచనలు ఇచ్చారు. అనంతరం ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయం నుంచి పంజగుట్ట సర్కిల్ వరకు తిరిగి రవాణా శాఖ కార్యాలయం వరకు దాదాపు 200 మంది ఆటో రిక్షాలతో ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీని మైనారిటీ కమిషన్ చైర్మెన్ తారీక్ అన్సారి, జేటీసి రమేష్‌లు ప్రారంభించారు. ఆర్టీవోలు పురుషోత్తం రెడ్డి, సీపీ వెంకటేశ్వరరావు, తెలంగాణ ఆటో డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సలీం, ఎంవీఐ సురేష్ రెడ్డి, ఏఎంవీఐలు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నిరసన



నవతెలంగాణ-బేగంపేట్

బన్సీలాల్ పేట్ డివిజన్ మేకలమండిలో మాజీ మంత్రి ఎమ్మెల్యే తలసానికి జీహెచ్ఎంసీకి వ్యతిరేకంగా స్థానిక కాంగ్రెస్ నాయకులు నిరసన వ్యక్తపరిచారు. కొన్ని ఏండ్లుగా అభివృద్ధికి నోచుకోని మేకలమండి నుంచి గాంధీనగర్ వెళ్లే ప్రధాన రహదారిపై నిత్యం డ్రయినేజీ సమస్యతో పాటు రహదారి పైనే పెద్ద ఎత్తున చెత్తాచెదారం వేయడం వల్ల కాలనీవాసులకు పాదాచారులకు దుర్వాసన వెదజల్లుతూ వీధి కుక్కలు వీరంగం చేస్తున్నాయన్నారు. తీవ్ర సమస్యల వల్ల అనారోగ్యానికి గురవుతున్నామని, కాలనీ వాసులతో పాటు వివిధ పార్టీ వాళ్లు జీహెచ్ఎంసీకి వందల సంఖ్యలో ఫిర్యాదు చేసిన ఫలితం లేకపోయిందని తెలిపారు. ఉదయం తలసాని శ్రీనివాస్ యాదవ్ అభివృద్ధి పనులకు కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేయడానికి వచ్చే సందర్భంలో స్థానిక డివిజన్ అధ్యక్షుడు చిరంజీవి, జీఎల్. రమేష్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున "సొమ్మొకడిది సోకొకడిది" అని బ్యానర్లను చేత పట్టుకొని నినాదాలు చేస్తూ పెద్ద ఎత్తున నిరసన వ్యక్తపరిచి రోడ్డుపైనే బైఠాయించారు. జీహెచ్ఎంసీ అధికారులు జోనల్ కమిషనర్ ఎన్.రవికిరణ్, సర్కిల్ 30 డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య బీఆర్ఎస్ నాయకులకు తొత్తుగా మారారని వాపోయారు. ప్రోటో కాల్ పాటించకుండా అభివృద్ధి మేమే చేస్తున్నామని షో చేయడంలో బీఆర్ఎస్ నాయకత్వం ముందుందని ఆరోపించారు. హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో సనత్‌నగర్ నియోజకవర్గం ఇన్‌చార్జి డా. కోటా నీలిమ సహకారంతోనే ఈ అభివృద్ధి నోచుకుందని వెల్లడించారు. స్థానిక ఎమ్మెల్యే కొబ్బరికాయ కొట్టి షో చేయడంలో ముందు వరుసలో ఉంటారని వారు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నస్రీన్ బేగం, మధురవీరన్, కృష్ణ, అబ్దుల్ ఖలీమ్, మహేష్, సలీమ్, సాయి సందీప్, అనిత, శ్రవణ్, ఆగస్టిన్, శిల్ప, దీపిక, ఉమా, గజానంద్, శివలాల్, హరి, విశాల్ తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం

- గద్దర్ గురించి మాట్లాడే నైతిక హక్కు బండి సంజయ్‌కు లేదు
- ఓయూ విద్యార్థి సంఘాల నేతలు



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ ప్రాంగణంలో బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం చేసిన ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి సంఘాల నేతలు. అనంతరం వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో భూస్వామ్య వర్గాల దోపిడీ ఆధిపత్యం కొనసాగుతున్న ఆ కాలంలో శ్రీకాకుళం ఉద్యమ సమయంలో గద్దర్ కవి గాయకుడిగా తన విప్లవ జీవితం ఆరంభించి భూస్వామ్య దోపిడిదారులకు వ్యతిరేకంగా తన గలం విప్పి పీడత ప్రజల కోసం పోరాడిన వ్యక్తి గద్దర్. తన అట, పాటతో ఊరురా తిరిగి తెలంగాణ స్వరాష్ట్ర సాధన కోసం కాలికి గజ్జె కట్టి, గోసి గొంగడి వేసుకొని తెలంగాణ పల్లె పల్లె తిరుగుతూ తెలంగాణ గ్రామీణ నేపథ్యాన్ని పాటల రూపంలో ప్రజలందరికీ చెబుతూ తెలంగాణ ఉద్యమం కోసం తన రక్తాన్ని అర్పించిన గొప్ప వీర యోధుడు గద్దర్. ఉన్నతమైన చదువులు చదివి పీడిత వర్గాల కోసం ఆంధ్ర పాలకులకు ఎదురొడ్డి నిలబడ్డ వ్యక్తి గద్దర్. అలాంటి గద్దర్‌కు పద్మశ్రీ పద్మ విభీషణ్ అవార్డులు ఆయన కాలిగోటికి కూడా సరిపోవని ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి సంఘాల నేతలు శ్రీకాంత్, శ్రావణ్, నరసింహలు అన్నారు. తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయే వ్యక్తి గద్దర్ అన్నారు. ఒక వర్గానికి మాత్రమే ఎంపీగా వ్యవహరించే నీలాంటి వ్యక్తులు గద్దర్ గురించి మాట్లాడడం మీ అమాయకత్వానికి నిదర్శనమని బండి సంజయ్‌ను విమర్శించారు. గద్దర్ పీడిత వర్గాల వైపు నిలబడ్డారని, దోపిడి వర్గాలకు వ్యతిరేకంగా పోరాడారని పేర్కొన్నారు. గద్దర్‌పై చేసిన వ్యాఖ్యలను బండి సంజయ్ వెంటనే వెనక్కి తీసుకోవాలని వెల్లడించారు. లేదంటూ గద్దర్ అభిమానులుగా, విద్యార్థి సంఘాల నాయకులుగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నేతలు రఘు, దివాకర్, ప్రశాంత్, ఉదయ్, సతీష్, ప్రశాంత్‌లు పాల్గొన్నారు.

గ్రంథాలయ నిర్మాణాలను పరిశీలించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ నియోజకవర్గంలో నిర్మాణంలో ఉన్న గ్రంథాలయ పనులను మంగళవారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ పరిశీలించారు. బొల్లారం, తిరుమలగిరిలో నిర్మాణంలో జరుగుతున్న తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రంథాలయాలను అత్యున్నత ప్రమాణాలను నిర్మిస్తున్నామని, బహుళ అంతస్తులలో నిర్మించి ఒక అంతస్తులలో పుస్తకాలు, లాప్‌టాప్ లాంటి ఆధునిక వసతులు విద్యార్థులకు కల్పించడంతో పాటు పోటీపరీక్షలకు ప్రిపేర్ అవుతున్న విధ్యార్థులకు మరో అంతస్థులో అత్యున్నత ప్రమాణాలతో కూడిన క్యాలిఫైడ్ ఫాకల్టీతో లెక్చర్స్ గైడెన్స్ ఇచ్చే విధంగా ఏర్పాటు చేయనట్టు చెప్పారు. రాష్ట్రంలోనే ఆదర్శంగా ఈ గ్రంథాలయాలను తీర్చిదిద్దేందకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మెన్ శ్రీనివాస్ రెడ్డి, ఎఈ ప్రసాద్, డీఈ బుగ్గయ్యగౌడ్ పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడికి యత్నం.. 20 ఏండ్లు జైలు శిక్ష

నవతెలంగాణ-బేగంపేట్

బాలికపై లైంగిక దాడికి యత్నించిన వ్యక్తికి నాంపల్లి సెషన్స్ కోర్టు 20 ఏండ్లు జైలు శిక్ష, రూ.20వేలు జరిమానా విధిస్తూ తీర్పిచ్చింది. అలాగే బాధిత బాలికకు ప్రభుత్వం నుంచి రూ.5లక్షల నష్టపరిహారం మంజూరు చేసింది. కేసు వివరాలు.. సికింద్రాబాద్ రాణిగంజ్‌లో ఓ కుటుంబం తమ ఇద్దరుపిల్లలతో నివాసముంటోంది. వారిలో భర్త కూలిపనులు చేస్తుండగా, భార్య ఇండ్లల్లో పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అదే ప్రాంతంలో వారి ఇంటి పక్కింట్లో నివాసముంటున్న లింగాల దీపక్ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా 2023 నవంబరు 13న తల్లి ఐదేండ్ల కూతురును ఇంట్లోనే ఉంచి చిన్న కూతురును తీసుకుని అదే భవనంలోనిపై అంతస్తుకి వెళ్లి పనులు పూర్తి చేసుకుని వచ్చి చూడగా పెద్ద కూతురు కనిపించలేదు. దీంతో కంగారు పడుతూ అంత వెతకగా పక్క భవనంలో అమ్మాయి ఏడుస్తున్న ఏడుపులు వినిపించగా పరుగునవెళ్లి చూసింది. అక్కడ మెట్లపై తన కూతురు పడి ఉండగా పక్కనే దీపక్ నిలబడి ఉన్నాడు. ఆమె చూడగానే అక్కడ నుంచి పారిపోయాడు. తన కూతురును చూడగా ఆమెకు తీవ్ర రక్త స్రావం కావడంతో భర్తకు చెప్పి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి దీపక్‌ను రిమాండ్‌కు తరలించారు. అనంతరం చార్జ్ షీటు దాఖలు చేయగా, నాంపల్లి స్పెషల్ సెషన్స్ కోర్టు విచారణ చేపట్టి దీపక్‌ను దోషిగా నిర్ధారించింది. దీపక్‌కు స్పెషల్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి పుష్పలత 20 ఏండ్లు జైలు శిక్ష, రూ.20వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. ప్రభుత్వం నుంచి బాధితురాలికి రూ.5లక్షల నష్టపారిహారాన్ని మంజూరు చేస్తూ తీర్పిచ్చింది.

క్రీడలతో మానసిక ఆరోగ్య సంరక్షణ సులభతరం



- రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మెన్ శివసేన రెడ్డి

నవతెలంగాణ-బంజారాహిల్స్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడాలకు మొదటి ప్రాధాన్యతలిస్తూ క్రీడలతో మానసిక ఆరోగ్య సంరక్షణ ఎంతో సులభతరమని తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మెన్ శివసేన రెడ్డి తెలిపారు. 40వ నేషనల్ సీనియర్ క్యురుగి అండ్ 18వ నేషనల్ సీనియర్ పూమ్సే, 7వ నేషనల్ క్యాడెట్ క్యురుగి అండ్ పూమ్సే తైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీలును తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ యూసుఫ్‌గూడా కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో మంగళవారం నిర్వహించారు. ఈ క్రీడా పోటీలను తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మెన్ శివసేన రెడ్డి, ఎమ్మెల్యేలు రాజు టాగూర్, మురళి నాయక్, బీసీ నాయకుడు చిన్న శ్రీశైలం యాదవ్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పోర్ట్స్ అథారిటీ చైర్మెన్ శివసేన రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడాలకు మొదటి ప్రాధాన్యతలిస్తూ క్రీడలతో మానసిక ఆరోగ్య సంరక్షణ ఎంతో సులభతరమన్నారు. అనంతరం శ్రీనివాస్ మాటాడుతూ.. 8 ఏండ్ల నుంచి 50 ఏండ్ల వయస్సు ఉన్న 900 మంది క్రీడాకారులు ఈ టోర్నీలో పాల్గొంటున్నారని, 29 రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు ఈ క్రీడా మైదానంలో పాల్గొని బహుమతులు గెలుచుకోవడం జరుగుతుందన్నారు. గెలుపొందిన వారికి గురువారం రాత్రి బహుమతులు ప్రధానం చేయడంతో పాటు ప్రశంస పత్రం అందజేస్తామని తెలిపారు.

గద్దర్ జయంతిని విజయవంతం చేద్దాం..

- గద్దర్ కుమారుడు సూర్యం



నవతెలంగాణ-ఓయూ

ఈ నెల 31న రవీంద్ర భారతిలో జరిగే ప్రజా యుద్ధ నౌక గద్దర్ జయంతిని విజయవంతం చేయాలని మంగళవారం ఉస్మానియా యూనివర్సిటీలో కాంగ్రెస్ నాయకులు, విద్యార్థి సంఘాల నాయకులు, పీహెచ్డీ విద్యార్థులతో కలిసి గద్దర్ కొడుకు సూర్య కిరణ్ పోస్టర్స్‌ను ఆవిష్కరించారు. గద్దర్ జయంతిని రవీంద్రభారతిలో రాష్ట్రప్రభుత్వం, గద్దర్ ఫౌండేషన్ కలిసి నిర్వహిస్తున్న జయంతి సభను విజయవంతం చేయాలన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థిగా మొదలైన గద్దర్ ప్రస్థానం అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించారని, గద్దర్ ఎప్పుడు విద్యార్థుల పక్షపాతిగా ఉండేవారని విద్యార్థులు చదువుతూ ఆ చదివిన చదువును సమాజానికి అన్వయించాలని విద్యార్థులకు నిరంతరం చెప్పే వారని సూర్యం అన్నారు. ఓయూ విద్యార్థి నాయకుడు కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ కార్య నిర్వాహక సభ్యులు కోట శ్రీనివాస్ మాట్లాడుతూ.. గద్దర్ తెలంగాణ ఉద్యమ నిర్మాణ కర్త అని తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో విద్యార్థులను అందరిని గైడ్ చేస్తూ తెలంగాణా రాష్ట్ర సాధనలో ముఖ్య భూమిక పోషించారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గద్దర్ త్యాగన్ని గుర్తించి తన వర్ధంతి జయంతిలను అధికారికంగా చేయడమే కాకుండా అవార్డులను ప్రకటించడం గుర్వించదగ్గ విషయమని అన్నారు. విద్యార్థి ఉద్యమ నాయకుడు మందాల భాస్కర్ మాట్లాడుతూ.. గద్దర్ అన్న తెలంగాణ ఉద్యమంలో మా అందరికి ఉద్యమ సమయంలో అన్ని రకాలుగా అండగా ఉన్నారని, రాజ్యాంగ రక్షణ కోసం అందరం పాటు పడాలని నిరంతరం బోధించే వారన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్లు ఆర్ట్స్ కాలేజ్ వైస్ ప్రిన్సిపాల్ ప్రొ. కొండ నాగేశ్వర్, సౌడ సవీన్ తెలంగాణ ఉద్యమ సమయంలో గద్దర్‌తో ఉన్న ఉద్యమ అనుబంధాన్ని గుర్తు చేసుకొని గద్దర్ రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఒక లెజెండ్ అని, గద్దర్ మరణం తీరని లోటు అని తెలిపారు. ఈ నెల 31న రవీంద్ర భారతిలో జరిగే గద్దర్ జయంతిని రాజకీయాలకు అతీతంగా అందరూ హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ పోస్టర్ ఆవిష్కరణకు వివిధ విద్యార్థి సంఘాల, కాంగ్రెస్ పార్టీ నాయకులు పెంచాల సతీష్, కంచర్ల బద్రి, సునీల్ శెట్టి, వలిగొండ నర్సింహా, శరత్ నాయక్, మాసంపల్లి శ్రీకాంత్, పవన్ సంధ్య పోగు, జక్కుల మధు, రంగు సుధాకర్, ఉదయ్, సునీల్ నిరడి చంద్రశేఖర్, ఓయూ కాంట్రాక్ట్ ప్రొ. రవి పాల్గొన్నారు.

టీహెచ్‌సీ ప్రధాన కార్యదర్శిగా జయప్రకాశ్



నవతెలంగాణ-ఓయూ

తెలంగాణ చరిత్ర కాంగ్రెసు (టీహెచ్‌సీ) ప్రధాన కార్యదర్శిగా అంకం జయప్రకాశ్, అధ్యక్షుడిగా విశ్రాంత ఆచార్యులు ప్రొఫెసర్ వెంకట్రాజ్యం ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ప్రొ. అర్జున్ రావ్ కుతాడి, ప్రొ.ఈ. సుధారాణి, సంయుక్త కార్యదర్శులుగా డా. బండి శ్రీనివాస్, డా.పి రామకృష్ణ, కోశాధికారిగా డా.కిశోర్‌లతో పాటు పదిహేను మంది కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. తెలంగాణ ఏర్పాటుకు అనంతరం తెలంగాణ చరిత్రను ఒక క్రమ పద్ధతిలో క్రోడీకరించడంతో పాటు, భావి తరాలకు చరిత్రను అందించడం, చరిత్ర పరిశోధనలో భాగస్వాములను చేయడంలో టీహెచ్‌సీ కృషి చేస్తుందని తెలిపారు.

బీజేపీ అధికారంలోకి రావడం పగటికలే

- మాల సంఘాల జేఏసీ



నవతెలంగాణ-బంజారాహిల్స్

ఫిబ్రవరి 7వ తేదీన జరిగే వేల డప్పులు లక్షల గొంతులు కార్యక్రమంలో మందకృష్ణ మాదిగ మాలల చావు డబ్బులు కొడుతున్నామని చేసుకుంటున్న ప్రచారం, తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడం, వర్గీకరణ చేస్తానన్నడం పగటి కలయినని మాల సంఘాల జేఏసీ ఆరోపించింది. మంగళవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాల మహానాడు చెన్నయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో జేఏసీ నాయకులు మన్నే శ్రీధర్ రావు, పేరం బాలకిషన్, మంత్రి నరసింహ, రామచందర్‌లు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు ప్రకటించడం అభినందనీయమని అయితే కేంద్రంలోని బీజేపీ చేస్తున్న కుట్రలను మందకృష్ణ మాదిగ గుర్తించాలని వారు ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక నిధులు కేటాయించి వారి ఆర్థిక అభివృద్ధికి దోహదం చేయాలని అలాగే విద్యలో వెనుకబడ్డ వారి పోస్టులను ఓపెన్ కేటగిరీలో పెట్టి మోసం చేస్తున్న బీజేపీని మందకృష్ణ మాదిగ ప్రశ్నించగలడా ఒకవేళ ప్రశ్నిస్తే ఉషా మేర కమిటీ సుప్రీంకోర్టు ఆదేశాలు పట్టవ్ అన్నట్టు ఇష్టం 341 ఆర్టికల్‌పై కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి అందరూ అభివృద్ధికి దోహదం చేయాలని కోరారు. మనలో ఒకడైన గద్దర్‌పై బీజేపీ ఎంపీ బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను ఎందుకు ఖండించడం లేదు? ఎవరికోసం ఎవరి మెప్పుకోసం మందకృష్ణ మాదిగ పని చేస్తున్నాడో దళితులంతా గమనిస్తున్నన్నారు. మాల లను విమర్శించడమే పనిగా పెట్టుకోవద్దని హితవు పలికారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

- వినియోగదారులు సహకరించాలి
- బాలాజీ నగర్ ఏఈ సాంబశివ రావు



నవతెలంగాణ-జవహర్‌నగర్

సమ్మర్ యాక్షన్‌లో భాగంగా మరమ్మతులు చేస్తున్నందున 33/11 కెవి బాలాజీ నగర్ సబ్ స్టేషన్ పరిధిలో వెలువడే విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని బాలాజీ నగర్ ఏఈ సాంబశివరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 కెవి శివాజీ నగర్, 11 కెవి సంతోష్‌నగర్ ఫీడర్‌లో సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా సేఫ్టీ వర్పస్ డబల్ ఫీడింగ్ కారణంగా, బుధవారం రాత్రి 10 గంటల నుంచి 11 గంటల వరకు కేసీఆర్ మార్కెట్ అపోజిట్ రోడ్, సంతోష్ నగర్, సుక్కమ్మ కాలనీ, విగ్నేశ్వర కాలనీ, శివాజీ నగర్, సుభద్రమ్మ కాలనీ, భద్రయ్య వెంచర్, శ్రీరామ్ నగర్ కాలని, 11 కెవి సంతోష్ నగర్, అంబేద్కర్ నగర్, చంద్రబాబు కాలనీ, దొండ తోట, బిజెఆర్ నగర్, నందమురి నగర్, ప్రగతి నగర్, చెన్నపూర్, ఉద్యోగుల కాలనీ, జ్యోతి రావు పూలె కాలనీ, కేఎల్ఆర్ వాటర్ ప్లాంట్, హనుమన్ టెంపుల్, శివాలయం ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని ప్రజలు సహకరించాలని కోరారు.

హైడ్రా చర్యలు బాధాకరం

- ప్రజల స్వేచ్ఛను హరిస్తున్న హైడ్రా
- విద్యా సంస్థల అధినేత నల్ల మల్లారెడ్డి, దివ్యానగర్ ఫ్లాట్ ఓనర్స్ అసోసియేషన్ వాసులు



నవతెలంగాణ-బంజారాహిల్స్

ఏకపక్ష వైఖరితో మా గోడు వినకుండా, మా పట్టా భూములలోని ప్రహరీతో పాటు కోట్లు ఖర్చు చేసి అందంగా నిర్మించుకున్న కాలనీలోని డివైడర్లతో సహ పలు నిర్మాణాలను హైడ్రా అధికారులు కూల్చివేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని విద్యా సంస్థల అధినేత నల్ల మల్లారెడ్డి, దివ్యానగర్ ఫ్లాట్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మల్లారెడ్డితో పాటు విద్యానగర్ హౌస్ ఓనర్ ప్లాట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సంపత్ రెడ్డి, రాజా రెడ్డి, ఉషాకాంత్, ఎండీ హైదర్‌లతో కలసి మాట్లాడారు. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలం పోచారం మున్సిపాలిటీలోని కొర్రెముల, సింగరంలోని దివ్యానగర్‌లో 3500 ఫ్లాట్‌లలో 300 ఇండ్లలో కాలనీ వాసులు నివాసం ఉంటున్నారని, 1989లో రైల్వే, పోస్ట్ ఆఫీస్‌లలో పని చేస్తున్న ఉద్యోగులు ఇక్కడ స్థలాలను కొనుగోలు చేసుకొని స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారన్నారని తెలిపారు. ఈ కాలనీ మూడు వైపులా నిర్మానుష్య ప్రదేశం, అటవీ ప్రాంతం ఉండడంతో రక్షణ కోసం చుట్టూ నాలుగు కిలోమీటర్ల మేర ప్రహరీని నిర్మించుకున్నామని, కొన్ని కోట్ల రూపాయలు ఖర్చు చేసి కాలనీని అందంగా తీర్చిదిద్దుకున్నామని తెలిపారు. ఐతే గత మూడు రోజుల క్రితం కాలనీ ప్రహరీ, డివైడర్లను హైడ్రా అధికారులు కూల్చివేశారని తెలిపారు. హైడ్రా కమీషనర్‌ను ఇదే విషయమై ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారన్నారు. అక్కడి కొంతమంది స్థానిక నాయకులు చెప్పినట్టు వింటూ మావద్ద మా భూములకు సంబందించిన పత్రాలు అన్ని సరైనవే అని చెప్పినా వినకుండా అన్యాయంగా కూల్చివేతలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఈ విషయంపై కోర్టును సంప్రదించామని, త్వరలో మరోమారు తన పరువుకు భంగం కలిగేలా హైడ్రా అధికారులు ప్రవర్తించినందున పరువు నష్టం దావా వేయనున్నట్టు మల్లారెడ్డి తెలిపారు.

నేటి సినిమాలు వినోద ప్రాధాన్యం, నాణ్యత తక్కువ



- ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి

నవతెలంగాణ-కల్చరల్

ఒకనాటి సినిమాలలో కథ, నటన, సందేశంతో వినోదాన్ని అందించేవని, నేడు కేవలం వినోద ప్రదానంగా చిత్రాలు వుంటున్నాయనీ శాసన మండలి ప్రతిపక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి అన్నారు. జంధ్యాల అసభ్యత లేని హాస్య చిత్రాలు రూపొందిచారని చెప్పారు. మంగళవారం శ్రీత్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై కళా నిలయం సాంస్కృతిక సంస్థ నిర్వహణలో విఖ్యాత దర్శకుడు జంధ్యాల 74వ జయంతి వేడుకలు జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న మధుసూదనాచారి జంధ్యాల సినిమాల్లో నటించిన శంకర్ మేల్కోటే, వైశంకర్ జెన్నీలను సత్కరించి మాట్లాడారు. తెలుగు చిత్ర సీమలో ఎందరో ఉత్తమ నటీ నటులు వున్నారని వారి నటనను సరైన రీతిలో జంధ్యాల వంటి దర్శకులు మాత్రమే ఉపయోగించుకోగలరనీ పేర్కొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగించుకోవాలి



నవతెలంగాణ-బడంగ్‌పేట్

ప్రభుత్వ, ప్రయివేట్ ఆస్పత్రుల వారు నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను పేద ప్రజలు సద్వినియోగించుకోవాలని బీజేపీ రాష్ట్ర నాయకులు, మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ అన్నారు. మంగళవారం మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న అల్మాస్ గుడలోని మెట్రో ఆస్పత్రి సహకారంతో బీజేపీ 2 అధ్యక్షులు రామిడి వీరకర్ణా రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. వైద్యులు రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యువ మోర్చా రాష్ట్ర నాయకులు రామిడి శూరకర్ణ రెడ్డి, నాయకులు శశిధర్ రెడ్డి, కార్యకర్తలు అభిమానులు మహిళలు, వైద్య సిబ్బంది తదితరులున్నారు.

బీఆర్ఎస్ తమపై చేసిన ఆరోపణలు నిరాధరమైనవి

- కాంగ్రెస్ ఘట్కేసర్ మండల అధ్యక్షుడు కర్రే రాజేష్

నవతెలంగాణ-పోచారం

బీఆర్ఎస్ పార్టీ తమ పైన చేస్తున్న ఆరోపణలు అన్ని నిరాధారమని కాంగ్రెస్ ఘట్కేసర్ మండల అధ్యక్షుడు కర్రే రాజేష్ అన్నారు. పోచారం మున్సిపల్ పరిధిలోని అన్నోజిగూడలో కాంగ్రెస్ పోచారం మున్సిపాలిటీ అధ్యక్షుడు సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రైతుబంధు పేరు చెప్పుకొని బీఆర్ఎస్ నాయకులు పేద బడుగు బలహీన వర్గాలకు న్యాయం చేయలేకపోయారని, బడా బాబులకు దోచి పెట్టారన్నారు. ప్రజా పాలన 14 నెలల్లో ఎన్నికలలో ఇచ్చిన 6 హామీలను దశలవారీగా పూర్తి చేస్తుందని గుర్తు చేశారు. బీఆర్ఎస్ పార్టీ తమ పైన చేస్తున్న ఆరోపణలు అన్ని నిరాధారమని, రైతుబంధు పేరు చెప్పుకొని బీఆర్ఎస్ నాయకులు పేద బడుగు బలహీన వర్గాలకు న్యాయం చేయలేకపోయారని, బడా బాబులకు దోచి పెట్టారన్నారు. కాంగ్రెస్ ప్రజా పాలనలో బడుగు బలహీన వర్గాలకు, అర్హులకు మాత్రమే రైతు భరోసా వచ్చేలా చేస్తున్నామని తెలిపారు.

నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు బాంబు బెదిరింపు

- ఒకే నెలలో రెండు సార్లు బెదిరింపులు
- ఈ మెయిల్ పంపిన ఆగంతకులు
- ఫేక్‌గా నిర్ధారించిన పోలీసులు
- మల్క కొమురయ్య ఎన్నికల ప్రచారం
- ఎస్ఎఫ్ఐ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి రాథోడ్ సంతోష్





నవతెలంగాణ-చర్లపల్లి

నాచారంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు మంగళవారం బాంబు బెదిరింపులు వచ్చాయి. ఉదయం స్కూల్‌లో బాంబు పెట్టినట్టు అజ్ఞాత మెయిల్ ద్వారా యాజమాన్యానికి సమాచారం రావడంతో వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు విస్తృత్తంగా తనిఖీలు చేసి బాంబు లేనట్టుగా నిర్ధారించారు. పాఠశాల ఆవరణలో బాంబులు అమర్చామనీ, అవి ఏ క్షణంలోనైనా పేలుతాయని ఈ మెయిల్ పంపిన వ్యక్తి పేర్కొన్నాడు. ఈ మెయిల్ ఖాతాను తనిఖీ చేసిన పాఠశాల సిబ్బంది ఆ మెసేజ్‌ని చూసి పోలీసులకు సమాచారం అందించడంతో నాచారం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. రాచకొండ పోలీసుల బాంబు డిటెక్షన్ స్క్వాడ్ పాఠశాల ఆవరణం మొత్తాన్ని స్కాన్ చేసి బాంబు లేనట్టుగా నిర్ధారించారు. ఈ మెయిల్ మూలాన్ని పోలీసులు విచారిస్తున్నారు. మెయిల్ పంపిన వారిని పట్టుకోవడంలో రాచకొండ సైబర్ క్రైమ్ సెల్‌ను ఆశ్రయించారు.

మల్క కొమురయ్యను విచారించాలి : రాథోడ్ సంతోష్



నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో బాంబు బెదిరింపు ఘటనల మాటున స్కూల్ చైర్మెన్ మల్క కొమురయ్య ఎన్నికల ప్రచారం చేసుకుంటున్నారని ఎస్ఎఫ్ఐ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి రాథోడ్ సంతోష్ అన్నారు. కొమురయ్య బీజేపీ నుంచి ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారనీ, ఇలాంటి బూటకపు వాతావరణాలను సృష్టించి ఎన్నికల ప్రచారంతో ఏర్పాటు చేయడంతోపాటు రాజకీయ లబ్ది పొందాలని చూస్తున్నారని అనుమానం వ్యక్తం చేశారు. ఈ విషయమై స్కూల్ చైర్మెన్ కొమురయ్యను విచారించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఫేక్ ఘటనలు సృష్టించి కొమురయ్య రాజకీయ లబ్దిపొందాలని చూస్తున్నారని తెలిపారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతూ, వారి తల్లిదండ్రుల భయభ్రాంతులకు గురి చేస్తున్న మల్క కొమురయ్యపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇదే ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కి రెండోసారి ఈ మెయిల్, కాల్స్ ద్వారా బాంబ్ ఉన్నట్టు సమాచారం ఇస్తున్నప్పుడు పోలీసు యంత్రాంగం ఎందుకు విచారణ జరిపించి ఆగంతుకులపై కఠిన చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఈ మెయిల్స్, కాల్స్ ఎక్కడి నుంచి వస్తున్నాయో తెలుసుకుని వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాంబ్ పేరుతో విద్యార్థినీ, విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడొద్దని సూచించారు. ఇలాంటి ఘటనల నేపథ్యంలో విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం భద్రత పెంచాలని కోరారు. ఇలాంటి బెదిరంపులు ఇది రెండోసారి అనీ, ఈ మెయిల్స్, కాల్స్‌పై సమగ్ర విచారణ జరిపించాలన్నారు. ఈ మెయిల్స్, కాల్స్ ఎక్కడి నుంచి వస్తున్నాయో తెలుసుకునే టెక్నాలజీ పెరిగిన ఈ రోజుల్లో ఇలాంటి ఘటనల్లో ఆంగతుకులను పోలీసులు ఎందుకు బయట పెట్టలేకపోతున్నారని ప్రశ్నించారు. ఇలాంటి పరిస్థితుల్లో విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. విద్యార్థులు ధైర్యం కోల్పోకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందన్నారు. విద్యార్థినీ, విద్యార్థులను ఉదయాన్నే పాఠశాలకు పంపించి వారి తల్లిదండ్రులు రకరకాల పనుల నిమిత్తం వెళ్తుంటారనీ, ఇలాంటి పరిస్తితుల్లో వారికి ప్రతిసారి భయానికి గురి చేసే విధంగా సమాచారం ఇస్తున్నారని తెలిపారు. బాంబ్ పెట్టారని బెదిరిస్తున్న వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఆఫీస్ బేరర్స్ అరుణ్, జిల్లా కమిటీ సభ్యులు శ్యామ్‌రావు, జిల్లా నాయకులు మనీష్, ప్రశాంత్, నిఖిల్, తదితరులు పాల్గొన్నారు.

'నిమ్స్'కు ఎంపీ వద్దిరాజు ఎలక్ట్రిక్ బగ్గీ బహుకరణ





నవతెలంగాణ-సిటీబ్యూరో

రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తన దాతత్వాన్ని మరోసారి చాటుకున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ప్రముఖమైన, పెద్ద ఆస్పత్రి అయిన నిమ్స్‌కు ప్రతినిత్యం రోగులు, వారి సహాయకులు, సందర్శకులు వేల సంఖ్యలో వస్తూ, పోతూ ఉంటారు. వీరి సౌకర్యార్థం, సౌలభ్యం కోసం రవి చంద్ర తన ఎంపీ నిధుల నుంచి ఎలక్ట్రిక్ బగ్గీ అందజేశారు. దీన్ని ఎంపీ వద్దిరాజు నిమ్స్ అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ భాస్కర్‌తో కలిసి మంగళవారం సాయంత్రం ప్రారంభించారు. ఎంపీ రవిచంద్ర కొబ్బరికాయ కొట్టి, ఆకు పచ్చజెండా ఊపి, రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి బగ్గీని నడిపారు. ఎంపీ వద్దిరాజు ఈ ఆస్పత్రికి గతంలో కూడా రెండు బగ్గీలను సమ కూర్చారు. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్రను డాక్టర్ లక్ష్మీభాస్కర్, పీఆర్వోలు సత్యాగౌడ్, వరలక్ష్మీ, ఉషా, తదితరులు శాలువాలతో సత్కరించి హృదయ పూర్వక కతజ్ఞతలు తెలిపారు. ఈ బగ్గీని ప్రారంభించిన సందర్భంగా ఎంపీ వద్దిరాజు, డాక్టర్ లక్ష్మీ భాస్కర్‌లను యూత్ లీడర్ సూర్య విష్ణు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వద్దిరాజు అనుచరులు బండి సంజీవ్, యాదా క్రాంతి, బండారి అనిల్, అభిమానులు వెంకట్ గౌడ్, పి.శ్రీరామ్, జీ.అరుణ్, ఆస్పత్రి లేబర్ కాంట్రాక్ట్ సూపర్ వైజర్ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

- కాంగ్రెస్ సీనియర్ నాయకులు తేజ గౌడ్



నవతెలంగాణ-ముషీరాబాద్

ప్రజా యుద్ధనౌక గద్దర్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని కాంగ్రెస్ సీనియర్ నాయకులు తేజ గౌడ్ అన్నారు. నక్సలైట్లతో కలిసి బీజేపీ కార్యక ర్తలను చంపించిన గద్దర్‌కు పద్మ పురస్కారం ఎలా ఇస్తామంటూ బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై మంగళవారం పత్రిక ప్రకటన ద్వారా స్పందించారు. బీజేపీ భావజాలం ఉన్నవారికే అవార్డులు ఇస్తామన్నట్లుగా ఉన్న కేంద్ర మంత్రి వ్యాఖ్యలు రాజ్యాంగస్ఫూర్తికి విరుద్ధమని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగ సూత్రాలపై ప్రధా ని మోడీకి నమ్మకం ఉంటే ఆయనను వెంటనే కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో గద్దర్ సహా తెలంగాణ కవులు, కళాకారులను కించ పరిచేలా మాట్లాడిన బండి సంజయ్.. క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాషాయ కండువా కప్పుకున్నోళ్లకే పద్మ అవార్డులంటున్న బండి సంజయ్‌కి కేంద్ర మంత్రిగా కొనసాగే అర్హత లేదని విమర్శిం చారు. ఇందిరమ్మ ఇండ్లకు కేంద్రం నిధులిస్తే వచ్చేది కేవలం 10 శాతం మాత్రమేనని.. పూర్తి నిధులు ఇచ్చి నచ్చిన పేరు పెట్టు కోవాలని బండి సంజయ్‌కి సూచించారు. గద్దర్‌లాగే ఈటల రాజేందర్ కూడా వామపక్ష భావజాలం నుంచి వచ్చిన నాయకు డేనని, ఆయన మాత్రం బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవికి అర్హుడా అని ప్రశ్నించారు. వెంటనే బండి సంజయ్ బహిరంగ క్షమాపణ తెలియజేయాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున బీజేపీకి వ్యతిరేకంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు.

బంగారు ఆభరణాల దొంగ అరెస్ట్..

- 56 గ్రాముల బంగారు ఆభరణాలు, ఒక మొబైల్ ఫోన్ స్వాధీనం..



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

బంగారు ఆభరణాల దొంగను హైదరాబాద్ రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుండి రూ.4.50లక్షల విలువ చేసే 56 గ్రాముల బంగారు ఆభరణాలు, ఒక మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. రైల్వే పోలీ సులు తెలిపిన వివరాల ప్రకారం..నాంపల్లి ప్రభు త్వ రైల్వే పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బి.ప్రవీణ్ కుమార్ నేతృత్వంలో తన సిబ్బంది నర్సింగ్ రాథోడ్, జి.సాయి కుమార్, షకీల్ పాషా, ఇస్మాయిల్ శ్రీఫ్ సిబ్బందితో హైదరాబాద్‌లో సాధారణ తనిఖీని నిర్వహిస్తున్నారు. నగరంలో ఫతేనగర్ ఫ్లైఓవర్ వంతెన కింద సోఫా మరమ్మతుల పని చేసే మొ హమ్మద్ యూసుఫ్ ఘోరీ ఖైరతాబాద్ రాజ్‌భవన్, బడా బౌలి, నెక్లెస్ రోడ్, ఎంఎస్ మక్తా లో రైల్వే స్టేషన్‌లోని ప్లాట్ ఫాం 4లో ల్యాప్‌టాప్ బ్యాగ్‌తో అనుమానాస్పదంగా గుర్తించారు. వెంటనే రైల్వే పోలీసులు అనుమానంతో బ్యాగ్‌ని వెరిఫై చేశారు. అనుమానాస్పద రీతిలో కనిపించిన వ్యక్తిని వెంటనే అదుపులోకి తీసుకుని, క్షుణ్ణంగా విచారిం చారు. ఒక ఒప్పో మొబైల్ ఫోన్, గోల్డ్ షార్ట్ నెక్లెస్ (సుమారు-16 గ్రాములు), గోల్డ్ షార్ట్ బ్లాక్ బీడ్స్ చైన్ (10 గ్రాములు), గోల్డ్ 1బ్యాంగిల్ (సుమారు 16 గ్రాములు), గోల్డ్ ఇయర్ స్టడ్స్ (సుమారు 6 గ్రాములు), బంగారం బాబా లాకెట్ 8 గ్రాములతో కూడిన చిన్న గొలుసు, మొత్తం 4.50లక్షల విలువ చేసే సుమారు 56 గ్రాములు బంగారం దొరికింది. ఆర్పీఎఫ్ బి.ప్రవీణ్ కుమార్, హైదరాబాద్ సిబ్బందితో కలిసి నిందితుడిని ఐపీఎస్ సూపరింటెండెంట్ చందనా దీప్తి పర్యవేక్షణలో పట్టుకున్నారు. పోలీస్, రైల్వేస్, సికింద్రాబాద్ డీఎస్‌ఆర్పీ ఎస్.ఎన్.జావీద్, రైల్వేస్ అండ్ రోడ్ సేఫ్టీ, ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ కె. రమేష్ నాయుడులు.. రైల్వే హెడ్ కానిస్టేబుల్ మురళీకృష్ణ, కానిస్టేబుల్ సాయికుమార్, ఆర్పీఎఫ్ హైదరాబాద్ అధికారులను అభినందించారు. వారికి తగిన రివార్డులు అందజేశారు.

నూతన డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ స్టేట్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం మింట్ కాంపౌండ్ ప్రాంతంలో నూతన డైరీ క్యాలెండర్‌ను నాగర్‌కర్నూల్ పార్లమెంటు సభ్యుడు మల్లు రవి ముఖ్య అతిథిగా విచ్చేసి డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్యామ్ మనోహర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ మేడి, చంద్రయ్య, నాంపల్లి, వివిధ ప్రాంతాల నుంచి తెలంగాణ విద్యుత్ ఉద్యోగులు అధిక సంఖ్యలో ఉద్యోగస్తులు కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

నిరు పేదలకు అండగా ప్రభుత్వ పథకాలు

నవతెలంగాణ-దుండిగల్

కాంగ్రెస్ ప్రభుత్వం అందజేస్తున్న కల్యాణలక్ష్మీ, సీఎం రిలీఫ్ ఫండ్ పథకాలు నిరుపేదలకు అండగా నిలుస్తున్నాయని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలను హనుమంత రెడ్డి తెలిపారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి కాంగ్రెస్ కార్యాలయంలో అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన పలువురు పేదలకు రాష్ట్ర మంత్రివర్యులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు సహకరంతో సీఎం సహాయ నిధి మంజూరైన బాధితులకు శస్త్ర చికిత్స నిమిత్తం రూ. 60వేలు, రూ.46,000ల సీఎం సహాయనిధి(సీఎంఆర్‌ఎఫ్), 127 డివిజన్ ఇందిర గాంధీ నగర్, బాచుపల్లి సాయి నగర్ చెందిన వాసులు జన శిరోమణి రూ.60వేలు, ఉమా రూ.47,500ల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు, అలాగే 127 డివిజన్ ఇందిర గాంధీ నగర్ మమత రూ. 1,00116వేల కల్యాణ లక్ష్మి చెక్కునులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పెరికె శివ, తైలం శ్రీనివాస్, ఎన్ఎంసీ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, కొలన్ జీవన్ రెడ్డి, శామీర్ పెట్ ప్రకాష్ రావు, ప్రశాంత్ రెడ్డి, గొంగుల నవీన్, అది రెడ్డి, లక్ష్మి రెడ్డి, మాధవి రాణి, నీల గుప్తా, చిన్నమ్మ, జానకి, ధనలక్ష్మి, కోమల, తదితరులు పాల్గొన్నారు.

'భారతమాత ఫౌండేషన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి'



- అజయ్ కుటుంబానికి కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి రూ.2 కోట్ల పరిహారం చెల్లించాలి
- మాజీ ఎంపీ వి.హనుమంతరావు

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

'భారతమాత మహాహారతి' కార్యక్రమం సందర్భంగా ఆదివారం రాత్రి హుస్సేన్ సాగర్ లో జరిగిన బోటు ప్రమాదంలో భారతమాత ఫౌండేషన్ పై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీ వి.హనుమంత రావు డిమాండ్ చేశారు. మంగళవారం బషీర్ బాగ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వి.హనుమంత రావు మాట్లాడుతూ ఈ ప్రమాదంలో హుస్సేన్ సాగర్ లో గల్లంతైన ఇంజనీరింగ్ విద్యార్థి అజయ్ కుటుంబానికి కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి రూ.2 కోట్ల పరిహారం చెల్లిం చాలని డిమాండ్ చేశారు. అనుమతులు లేకుండా బాణా సంచా పేల్చడం వల్లే ఈ బోటు ప్రమాదం జరిగిందని ఆరోపించారు. గల్లంతైన అజయ్ తండ్రి నాగారంలో ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడని, ఆ కుటుంబానికి కేంద్ర ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వాలని, బోటులో బాణా సంచా పేలినప్పుడు హుస్సేన్ సాగర్ లో దూకిన సాయి చంద్, గణపతులకు గాయాలయ్యాయని, వారికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పుష్ప-2 సినిమా హీరోపై రాష్ట్ర ప్రభుత్వం ఏ విధంగా చర్యలు తీసుకుందో అదే తరహాలో భారతమాత ఫౌండేషన్ పై చర్యలు తీసుకోవాలన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు .బీజేపీ నేతలకు భారత రాజ్యాంగంపై ఎలాంటి గౌరవం లేదని, డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్‌ను నిత్యం అవమానపరుస్తున్నారని ఆరోపించారు. అంబేద్కర్‌ను అవమానించిన కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో లేబర్ బోర్డు మాజీ వైస్ చైర్మెన్ నాగభూషణం, టీపీసీసీ కార్యదర్శి శంభుల శ్రీకాంత్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణ గౌడ్, నాయకులు కె.శ్రీకాంత్, దాత్రిక్ చందూలాల్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ధూల్‌పేట్

ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ గోషామహల్ నాయకులు జంగయ్య అన్నారు. ఉస్మానియా ఆస్పత్రి ఆటో స్టాండ్ వద్ద ఆటో కార్మికులతో కలిసి జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ఆటో కార్మికులు పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. ప్రభుత్వం ఆటో కార్మికుల ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు షేక్ అక్తర్ అహ్మద్, షర్ఫు ఖాన్, ఎండీ గౌస్, కుందన్ సింగ్, ఎండీ షరీఫ్, ఎండీ అంజాద్, ఎండీ సలీం, అబ్దుల్ హకీం, ఎండీ హమీద్ తదితరులు పాల్గొన్నారు.

మంజూరైనా ట్రైకార్ సబ్సిడీ రుణాలు విడుదల చేయాలి

- బంజారా వెల్ఫేర్ కమిటీ ప్రెసిడెంట్ కృష్ణ నాయక్



నవతెలంగాణ-ధూల్‌పేట్

మంజూరైన ట్రైకార్ సబ్సిడీ రుణాల నిధులు వెంటనే విడుదల చేయాలని బంజారా వెల్ఫేర్ కమిటీ ప్రెసిడెంట్ కృష్ణ నాయక్ అన్నారు. సబ్సిడీ రుణాలు వెంటనే మంజూరు చేయాలని రవీందర్ నాయక్ నగర్ కాలనీ బంజారా వెల్ఫేర్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ట్రైకార్ జనరల్ మేనేజర్ శంకర్ రావ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2020-21 సంవత్సరం సబ్సిడీ రుణాలు ఇప్పటివరకు మంజూరు చేయలేదన్నారు. నిధులు విడుదల చేయడంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. అప్లికేషన్ పెట్టుకోని నాలుగేండ్లు కావొస్తో న్న నేటికీ బడ్జెట్ విడుదల చేయకపోవడం దుర్మార్గమన్నారు. గిరిజనులు ఆర్థికంగా వెనుకబడి ఉన్న వారికి సబ్సిడీ రుణాలతో కొంతవరకు జీవనం లభిస్తుందన్నారు. ఉపాధి లేని వారికి స్వయం ఉపాధిగా సహాయం చేసేందుకు ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. మంజూరైనా ట్రైకార్ రుణాల నిధులను వెంటనే విడుదల చేయాలని కోరారు. దీంతో రాష్ట్ర ట్రాకర్ చైర్మెన్ శంకర్ రావు సానుకూలంగా స్పందించారని, బడ్జెట్ రాగానే పనులు అందరికీ సబ్సిడీ రుణాలు చెల్లిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రవీంద్రనాథ్, కాలనీ నాయకులకు కిషన్, శ్రీను, సంతోష్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు యునాని వైద్యం మేలు..

- చలికాలంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలి
- ప్రభుత్వ యునాని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎండీ వహజుద్దీన్ ఖాన్



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

యునాని వైద్యంతో ప్రజలకు మేలు జరుగుతుందని ఆగాపుర ప్రభుత్వ యునాని డిస్పెన్సరీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎండి వహజుద్దీన్ ఖాన్ అన్నారు. మంగళవారం ఆగాపురాలోని యునాని డిస్పెన్సరీ ఆస్పత్రిలో ఆయన మాట్లాడుతూ.. చలికాలంలో వచ్చే ఆరోగ్య సమస్యలకు యునాని వైద్యంతో చికిత్సలు అందిస్తున్నామన్నారు. చలికాలంలో ప్రజలు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఆరోగ్యంగా ఉండడానికి శ్రమ వ్యాయమాలు అవసరమన్నారు. ప్రతిరోజు ఉదయం గోరువెచ్చని నీరు తీసుకోవాలన్నారు. చలిలో బయటికి వెళ్లేటప్పుడు తల, చెవులకు కప్పి ఉంచేలా నూలు దుస్తులు ధరించాలని సూచించారు. చేపలు, మాంసం కృతులను తీసుకోవాలని పండ్లు, ఆకుకూరలు, బలమైన ఆహారం తీసుకోవాలని సూచించారు. వృద్ధులు, చిన్నపిల్లలు, ఆస్తమా బాధపడే వారు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. జ్వరం, జలుబు, రుమ టాయిడ్, ఆర్థరైటిస్, ఆస్తమా, ఫైల్స్, ఫిస్టులా, వెన్నునొప్పి లాంటివ్యాధులకు మందులు అందిస్తున్నామన్నారు. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దని సూచించారు. రోగులకు ఉచితంగా యునాని మందులను అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఫార్మసిస్ట్ అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజారాజ్యం పార్టీ పోటీ'

- టికెట్ల కేటాయింపులో యువతకు అధిక ప్రాధాన్యత
- తెలంగాణ ప్రజారాజ్యం అధ్యక్షులు జిలుకర రవికుమార్



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

రాష్ట్రంలో త్వరలో జరగనున్న గ్రామ పంచాయితీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ అన్ని స్థానాలకు పోటీ చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు జిలుకర రవికుమార్ వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రవికుమార్ మాట్లాడుతూ యువత రాజకీయాల్లోకి వస్తేనే అవినీతి లేని ప్రభుత్వం సాధ్యమవుతుందని, స్థానిక సంస్థల ఎన్నికల టికెట్ల కేటాయింపులో యువతకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, తమ పార్టీ రాష్ట్రంలోని 12,769 గ్రామపంచాయతీలు, 5,817 ఎంపీటీసీ, 539 జడ్పీటీసీ స్థానాలకు పోటీ చేస్తుందని, అదే విధంగా ఈ ఏడాది డిసెంబర్ లో జరిగే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో తమ పార్టీ పోటీ చేస్తుందన్నారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసి 2028లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలోకి రావడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని, పార్టీ బలోపేతానికి గ్రామ, మండల, జిల్లా స్థాయి, రాష్ట్ర కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని, పార్టీ కమిటీలలో యువతకే ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. సామాజిక తెలంగాణ సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని, రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు ప్రజారాజ్యం పార్టీని ఆశీర్వదించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర నాయకులు చెరుకూరి రత్నరాజు, మేకల సారయ్య, ఉప్పుగళ్ల సోమన్న, మీదింటి సురేందర్, దాసరి శ్యామ్ రావు, కె.ఎస్.స్వామ్ ఇమ్మానియేల్, జి.సామ్యెల్, ఖమ్మం స్టీవెన్, ఉదయ్ కుమార్, కె.ప్రసంగి, గడ్డం బాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆపార్ తంటాలు..!

- ఆపార్ నమోదుకు అడ్డంకిగా మారిన ఆధార్‌లో తప్పులు, డేటాఫ్ బర్త్ పేర్లు..
- విద్యార్థులు, తల్లిదండ్రులకు తప్పని ఇబ్బందులు
- పట్టీ పట్టనట్టుగా ప్రయివేట్ విద్యాసంస్థలు..
- జిల్లాలో అసంపూర్ణంగానే ఆపార్ ఐడీ నమోదు ప్రక్రియ



నవతెలంగాణ-సిటీబ్యూరో

నూతన జాతీయ విద్యా విధానంలో భాగంగా ప్రతి విద్యార్థికి ఆపార్ (ఆటోమేటిక్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) సంఖ్యను కేంద్ర ప్రభుత్వం తప్పనిసరి చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ నమోదుకు ఆధార్ కార్డులో వివరాలు ఆటంకంగా మారుతున్నాయి. దీంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. వాస్తవంగా ఆధార్‌లో ఉన్న సమాచారం మేరకే ఆపార్ కార్డులు జారీ అవుతాయి. ఆధార్‌లో విద్యార్థుల వివరాలు తప్పుల తడకగా ఉండడం, జనన ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో ఆన్‌లైన్‌లో పొందుపర్చడానికి సమస్యలసు తలెత్తుతున్నాయి. మరోవైపు ఆధార్‌ను సరిచేసేందుకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు నానా అవస్థలు పడుతున్నారు. అపార్ నమోదుకు గడువు ముగిసే అవకాశం ఉందని అధికారులు చెబుతుండడంతో పనులన్నీ మానుకుని మీసేవ, ఆధార్ కేంద్రాలకు పరుగులు పెడుతున్నారు. మరోవైపు అపార్ ఐడీలను నమోదు చేయడంలో ప్రయివేట్ స్కూళ్లు, జూనియర్ కాలేజీల యాజమాన్యాలు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. దీంతో ఆపార్ నమోదు ఆశించిన స్థాయిలో లేదు.

హైదరాబాద్ జిల్లాలో మొత్తం 3,121 పాఠశాలల్లో దాదాపు 10.12లక్షల మంది విద్యార్థులు, 402జూనియర్ కాలేజీల్లో దాదాపు 80వేలకు పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. అయితే ఈ మొత్తం విద్యార్థుల్లో సగం మందికి కూడా ఆపార్ ఐడీలు నమోదు కాలేదు. హైదరాబాద్ జిల్లాలో కేవలం 21.48శాతం మంది విద్యార్థుల వివరాలు మాత్రమే ఆపార్‌లో నమోదయ్యాయి. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోనూ అదే పరిస్థితి కనిపిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఇది కేవలం 24.76శాతం మాత్రమే. ఆధార్లో ఇబ్బందులు ఒక వైపు, ప్రయివేట్ విద్యాసంస్థల యాజమాన్యం మరో వైపు నిర్లక్ష్యంగా వ్యవహరించడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది.

నమోదులో ఇబ్బందులు

వన్ నేషన్, వన్ ఐడి అనే నినాదంతో నూతన విద్యావిధానంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఆపార్‌ను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. అయితే తల్లిదండ్రులకు అవగాహన లోపం.. వివిధ కారణాలతో వారి పిల్లల జనన ధ్రువీకరణలో ఒక పేరు, స్కూల్లో అడ్మిషన్ తీసుకునే సమయంలో మరో పేరు నమోదు చేసిన వారు అనేక మంది ఉంటారు. అలాంటి వారు అపార్ నమోదు సందర్భంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థి పేరులో అక్షరం తప్పున్నా, విద్యార్థి తండ్రి పేరు, ఇతర వివరాలు తప్పున్నా ఆపార్‌లో ఆ విద్యార్థి వివరాలు నమోదు కావడం లేదు. దీంతో పాఠశాల నుంచి విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారమివ్వడంతో ఆధార్ అప్డేట్ కోసం వెళుతున్నారు. ముఖ్యంగా ఇతర రాష్ట్రాల నుంచి నగరానికి ఉపాధి కోసం వలస వచ్చినవారు ఆధార అప్డేట్ విషయంలో పెద్దగా ఆసక్తి చూపించడం లేదు. కారణం వారి రాష్ట్రంలో సంక్షేమ పథకాలకు దూరమవుతామనే అపోహతో కారణంగా అయిష్టం చూపిస్తున్నట్టు తెలిసింది. మరి కొంతమందికి అవగాహన లేకపోవడం వల్ల ఆధార్ అప్డేట్ నాపై శ్రద్ధ చూపడం లేదు. ఫలితంగా విద్యార్థికి కావలసిన ఆపార్ కార్డు నమోదు జాప్యం అవుతుంది.

ఒకే చోట సర్టిఫికెట్లన్నీ భద్రం..!

ఆపార్‌లోని డిజీ లాకర్‌లో విద్యార్థుల సర్టిఫికెట్లను భద్రపర్చుకునే వెసులుబాటు ఉంది. సర్టిఫికెట్లు, మెమోలు, తదితర విద్యార్థుల విద్యార్హత పత్రాలన్నీ ఒకే చోట భద్రపరుచుకోవచ్చు. ఇప్పటివరకు కాగిత రూపంలో జారీ చేస్తున్న సర్టిఫికెట్లు పాడైన, పోయినా డూప్లికేట్ తీసుకోవాల్సి వచ్చేది. ఆపార్ డీజే లాకర్‌లో సర్టిఫి కెట్లనే భద్రపరచుకోవడం వల్ల ఉద్యోగాల సందర్భంగా సులభంగా వెరిఫికేషన్ చేసే వెసులుబాటు ఉంటుంది. ఇది విద్యార్థుల భవిష్యత్‌కు ఉపయోగకరంగా ఉంటుంది. సర్టిఫికెట్లు పోయినప్పటికీ ఈ డీజీ లాకర్ ద్వారా సర్టిఫికెట్లను పొందే వెసులు బాటు ఉంటుంది. అంతే కాకుండా.. ప్రతీ సంవత్సరం విద్యార్థుల వివరాలను నమోదు చేయడం వల్ల విద్యార్హతలు, సర్టిఫికెట్లు వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకునే అవకాశం కూడా ఉంది. తమ పిల్లలు ఏం చదువుతున్నారనే విషయాన్ని ఇటు విద్యార్థుల తల్లిదండ్రులకు, విద్యాసంస్థలకు సైతం సులభంగా ఉంటుంది. ఆపార్ నమోదు చేసుకోకుంటే ఇవన్నీ కోల్పోయే ప్రమాదం లేకపోలేదు.

ఆపార్ ఐడి నమోదు ప్రక్రియపై రోజు వారీగా సమీక్ష

ఆర్.రోహిణి, డీ ఈ వో, హైదరాబాద్



ఆపార్ ఐడి నమోదు ప్రక్రియపై రోజు వారీగా సమీక్ష చేస్తున్నాం. మండలాధికారులకు రోజుకు 1000 మంది విద్యార్థుల ఆపార్ ఐడి జనరేట్ అయ్యేలా హెచ్ఎంలు, విద్యార్థుల తల్లిదండ్రులను మోటివేట్ చేసే విధంగా ఆదేశాలు ఇచ్చాం

అక్షరాలు, అంకెలు, ఆటపాటలతో కూడిన విద్య బోధన

ఎస్.రజిత, కోఆర్డినేటర్, హైదరాబాద్ జిల్లా



ఆపార్ జనరేట్ చేయడంలో కొన్ని సమస్యలు క్షేత్రస్థాయిలో వస్తున్న వాటిని అధిగమించడానికి ప్రయత్నం చేస్తున్నాం. మండలాల్లో వర్క్ షాప్ నిర్వహిస్తున్నాం. ఆధార్‌లో తప్పులుంటే సరి చేయటానికి స్టేట్ ఆఫీస్ నుంచి ఆధార ఆపరేటర్స్‌ని మండలాలకు కేటాయించాం. తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాలు కల్పించవలసిందిగా ఆదేశాలు ఇచ్చాం. ఆపార్ ఐడి జనరేషన్ వల్ల విద్యార్థులకు కలిగే లాభాలను తెలియజేస్తున్నాం.

ప్రశంసా పత్రం అందజేత



నవతెలంగాణ-సిటీబ్యూరో

గణతంత్ర దినోత్సవం సందర్భంగా విధి నిర్వహణలో ఉత్తమ సేవల గాను హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి చేతుల మీదుగా డీఈవో ఆర్.రోహిణి, సెక్టోరల్ ఆఫీసర్ రజిత, సూపరింటెండెంట్ డబ్ల్యూ.ప్రవీణ, రాణి ప్రశంసా పత్రాన్ని అందుకున్న విషయం తెలిసింది. అంకితభావం, కృషి, క్రమశిక్షణ కలిగిన ఉద్యోగులకు డీఈవో రోహిణి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. విజయలక్ష్మి, సుగుణ రెడ్డి, జయంతి రెడ్డి, ఫయాజ్, ముక్తాదర్, మొహమ్మద్ ముజాహిద్ అలీ, దేవిప్రసాద్, రమేష్, పవన్, పరమేష్ ఉన్నారు. ఈ సందర్భంగా టీఎస్‌జీటీఎస్ యూనియన్ హైదరాబాద్ అసోసియేట్ ప్రెసిడెంట్, స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ హైదరాబాద్ డిస్ట్రిక్ట్ ప్రెసిడెంట్ కె.ఆర్.రాజ్‌కుమార్, కార్యదర్శి ఎం.భాస్కర్, జాయింట్ సెక్రటరీ జయంతి రెడ్డి, ఆర్గనైజేషన్ సెక్రటరీ ఫిరోజ్ ఈసీ ముజాహిద్ అలీ, ప్రియదేవ్ ఠాకూర్‌తో పాటు వారి కార్యవర్గం ఆధ్వర్యంలో డీఈవోకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో రమేష్, అరుణ, లావణ్య, జి.రాజ్ కుమార్, విజయలక్ష్మి, ప్రవీణ, డి.శ్రీకాంత్, చంద్రశేఖర్‌రెడ్డి, సుగుణారెడ్డి, రామకష్టారెడ్డి, శ్రీకాంత్, అర్చన, రాజేందర్, రజిత, కనీజ్ ఫాతిమా, ఉమాదేవి, బసీర్ అహ్మద్, హేమాదేవి, ఒవైసీ, హైమావతి, యోగేందర్ , అలీ, అల్తాఫ్, సీపీ రెడ్డి, గిరిజ, అనిల్, రాణి, శ్రీకాంత్, సంతోష్, వెంకటేష్, జాకీర్, లక్ష్మీపతి, విజయ్ కుమార్, జంబయ్య, చైతన్య, సునీల్, పరమేష్ తదితరులున్నారు.

ట్రాఫిక్ నియమాలను పాటించాలి



నవతెలంగాణ-ధూల్‌పేట్

ట్రాఫిక్ నియమాలను పాటించాలని ట్రాఫిక్ సైఫాబాద్ సబ్ ఇన్‌స్పెక్టర్ మధు అన్నారు. బిర్లా మందిర్ ఆటో స్టాండ్ వద్ద సీఐటీయూ హైదారాబాద్ సౌత్ రవాణా సంఘ నాయకులు బాబా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటో కార్మికులకు అన్ని విధాల సహకారం ఉంటుందన్నారు. నిబంధనలు పాటించాలని సూచించారు. ఆటోలపై ఆధారపడి జీవనం సాగించే కార్మికుల పై చాలన్‌లు తగ్గించాలని సౌత్ రవాణా సంఘ నాయకులు బాబా కోరారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు ఎండి ఆశ్లం, సయ్యద్ అబ్దుల్ జబ్బార్, ఒమర్ ఖాన్, ఇబ్రహీం ఖాన్, ఎండీ చాంద్, ఎండీ రషీద్, అజామ్ అన్సర్, రూప సింగ్, ఎండీ గౌస్, గౌస్ ఖాన్, ఎండీ ఉస్మాన్, ఎండీ ఖాన్, సోయెబ్, ఖలీం, అబ్దుల్ నజిం తదితరులున్నారు.

వ్యభిచార గృహంపై దాడి.. నిర్వాహకుడి అరెస్ట్

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

అక్రమంగా వ్యవభిచార గృహం నిర్వహిస్తున్న ప్రధాన నిందితుడితో పాటు అతనికి సహకరిస్తున్న మరో ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటన సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసాచారి తెలిపిన వివరాల ప్రకారం.. పి.రాజేష్ కుమార్ (44) గత కొంత కాలంగా కోఠి ఇసామియాబజార్‌లోని ఓ భవనంలో మొదటి అంతస్తులో ఒ గదిని అద్దెకు తీసుకుని అక్రమంగా వ్యభిచారం నిర్వహిస్తున్నాడు. వ్యభిచార గృహం నిర్వహించేందుకు అతనికి రైసా అనే మహిళ సహకరిస్తూ, సెక్స్ వర్కర్లను పరిచయం చేసి, వారిని కస్టమర్ల వద్దకు పంపించినందుకు కమీషన్ తీసుకుంటుంది. దీంతో రాజేష్ కుమార్ గుట్టు చప్పుడు కాకుండా వ్యభిచారం నిర్వహిస్తూ, వచ్చే ఆదాయంతో జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం మంగళహాట్ లోని దూదానా దిల్వార్ గంజ్ ప్రాంతానికి చెందిన వినయ్ సింగ్ (25)కు వాట్సాప్ ద్వారా మహిళ ఫొటో పంపించి రూ.2 వేలకు బేరం కుదుర్చుకున్నాడు. డబ్బులు చెల్లించడంతో వినయ్ సింగ్ సెక్స్ వర్కర్‌తో గదిలోకి పంపించారు. ఈ మేరకు విశ్వసనీయ సమాచారం అందుకున్న సుల్తాన్ బజార్ పోలీసులు వ్యభిచారం నిర్వహిస్తున్న గృహంపై దాడి చేసి, విటుడు వినయ్ సింగ్, నిర్వాహకులు రాజేష్ కుమార్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా సెక్స్ వర్కర్‌ను హెూమ్‌కు తరలించారు. ఈ మేరకు సుల్తాన్‌బజార్ పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వైద్యశాఖలో ప్రమోషన్‌లు కల్పించాలని డీహెచ్‌కు వినతి



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

తెలంగాణ మెడికల్ అండ్ పబ్లిక్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ హెచ్1 ఐఎన్‌టీ యుసీ రాష్ట్ర అధ్యక్షులు కర్నాటి సాయి రెడ్డి ఆధ్వర్యంలో వివిధ జిల్లాల నుండి విచ్చేసిన మహిళా హెల్త్ అసిస్టెంట్లు, సూపర్‌వైజర్లు, పీహెచ్ఎన్‌లతో కలిసి డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ డాక్టర్ రవీందర్ నాయక్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వైద్య శాఖలో హెల్త్ అసిస్టెంట్లు సూపర్‌వైజర్లుగా, సూపర్‌వైజర్లుకు పిహెచ్ఎన్‌లుగా, పీహెచ్ఎన్‌లకు సీహెచ్ఓ ప్రమోషన్‌లు ఇవ్వాలని కోరారు. మహిళా హెల్త్ అసిస్టెంట్లకు వెంటనే ట్రైనింగ్ ఇచ్చి సూపర్‌వైజర్లుగా ప్రమోషన్ కల్పించాలని కోరమన్నారు. పబ్లిక్ హెల్త్ నర్సింగ్ ఆఫీసర్ పోస్టును వెంటనే అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం రాష్ట్ర కార్యాలయంలోమహిళా విభాగం హెచ్‌వన్ యూనియన్ ఎన్నికలు నిర్వహించి అధ్యక్ష,కార్యదర్శులను ఎన్నుకున్నారు. మహిళా విభాగం అధ్యక్షురాలిగా లూర్దు మేరీ, కార్యదర్శిగా యాదమ్మల ఎన్నుకున్నట్లు తెలిపారు. త్వరలోనే పూర్తిస్థాయి కమిటీని నియమిస్తామని అధ్యక్షులు కర్నాటి సాయి రెడ్డి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాజశేఖర్, సువర్ణ, పద్మశ్రీ, సుజాత, అమరేశ్వరి, వనకుమారి, శాంతాబాయి, శాంత, జయశీల, భారతి సుకుమారి, దయామని, పుష్పావతి, కే.వల్లి తదితరులు పెద్ద సంఖ్యలో మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవుల్లో నియోజకర్గ నాయకులకు స్థానం కల్పించాలి



- ఏఐసీసీ కార్యదర్శి పీసీ విష్ణునాథ్‌కు వినతి

నవతెలంగాణ-ధూల్‌పేట్

నామినేటెడ్ పదవుల్లో పార్టీ స్థానిక నియోజకవర్గాల నాయకులకు స్థానం కల్పించాలని బహదూర్‌పుర, చార్మినార్, యాకాత్‌పుర నియోజకవర్గాల ఇన్‌చార్జిలు పులిపాటిక్ రాజేశ్ కుమార్, ముజీబ్ ఉల్లాహ్ షరీఫ్, రవి రాజ్‌లు అన్నారు. ఏఐసీసీ కార్యదర్శి, తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి సెక్రటరీ పీసీ విష్ణునాథ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్టీ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, ప్రజలతో మమేకమై పని చేస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జిల నాయకులను గుర్తింపు కల్పించాలన్నారు. నామినేటెడ్ పదవుల్లో, పార్టీ పదవుల్లో హైదరాబాద్ పార్లమెంట్‌లో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో నుండి కాంగ్రెస్ పార్టీ నాయకులకి తగిన ప్రాధానత ఇవ్వాలని కోరారు. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం లో కాంగ్రెస్ ప్రణాళికలు ప్రజల పరిణామాలపై చర్చించడం జరిగిందన్నారు. దీంతో ఏఐసీసీ కార్యదర్శి సానుకూలంగా స్పందిస్తూ హైదరాబాద్ పార్లమెంట్ లోని కాంగ్రెస్ నాయకులకి తగిన ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

ఆటో కార్మికుల సమస్యలపై నిర్లక్ష్యం చేయొద్దు..

- సీఐటీయూ సౌత్ ట్రాన్స్‌పోర్ట్ ఆటో యూనియన్ నాయకులు బాబా..



నవతెలంగాణ-ధూల్‌పేట్

ఆటో కార్మికుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం చేయొద్దని సీఐటీయూ సౌత్ ట్రాన్స్ పోర్ట్ ఆటో యూనియన్ నాయకులు బాబా అన్నారు. ఎంజీబీఎస్ ఆటో స్టాండ్ వద్ద ఆటో కార్మికులతో జెండా ఆవిష్కరించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. ప్రస్తుతం దినదినం పూట గడవని పరిస్థితులు ఎదురవుతున్నాయన్నారు. ఇంటి అద్దెలు, దిన అవసరాలకు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వెంటనే ప్రభుత్వం ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షుడు సి సంతోష్, ప్రధాన కార్యదర్శి శివ, ఉపాధ్యక్షులు జాన్, ట్రెజరర్ కే సంతోష్, జాయింట్ సెక్రటరీ కృష్ణ, యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మనపై మనకు నమ్మకం ఉండాలి



అక్షలి షా... భారతదేశ పాడి పరిశ్రమను ఆధునీకరించేందుకు సిద్ధమయ్యారు. తండ్రి ప్రోత్సాహంతో ప్రపంచ పాల ఉత్పత్తులను అధ్యయనం చేశారు. మంచార్‌లోని తమ భాగ్యలక్ష్మి డైరీ ఫామ్‌లో మేనేజ్‌మెంట్ ట్రైనీగా ప్రవేశించిన నాటి నుండి అనేక అంశాల గురించి విస్తృతంగా అధ్యయనం చేశారు. అటు రైతులకు, ఇటు వినియోగదారులకు మేలు జరిగేలా తన సంస్థను ఆధునీకరించి మంచి వ్యాపార వేత్తగా గుర్తింపు తెచ్చుకున్నారు. దేశంలోనే పాల ఉత్పత్తుల తయారీలో తన సంస్థకు ఓ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. వ్యాపారంలోకి ప్రవేశించాలంటే మహిళలు ముందు తమలోని సామర్థ్యాలను తాము విశ్వసించాలని చెబుతున్న ఆమె పరిచయం...

పూణే సమీపంలోని చిన్న పట్టణమైనా మంచార్‌లో పుట్టి పెరిగిన అక్షలి షా చిన్నతనం గ్రామీణ జీవితంతో ముడిపడి వుంది. పరాగ్ మిల్క్ ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ భాగ్యలక్ష్మి డైరీ ఫామ్‌లో పెరిగిన ఆమె ప్రకృతిని గమనిస్తూ ఉండేది. డైరీలోని ఆవులను, సేంద్రీయ వ్యవసాయాన్ని చూస్తూ అమూల్యమైన పాఠాలను నేర్చుకున్నారు. 'ఆవు దూడలు, రైతులతో ఎక్కువ సమయం గడపడం వల్ల నమ్మకం, స్థిరత్వం, సమాజ శక్తి గురించి తెలుసుకునే అవకాశం దక్కింది' అని షా ఓ వెబ్‌సైట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో గుర్తుచేసుకున్నారు.

పాడిపరిశ్రమపై అభిమానంతో...

పాడి పరిశ్రమలో అవగాహన పెంచుకోవాలనే ఉద్దేశంతో షా తన పాఠశాల విద్యను పూణేలో కొనసాగించి, ఎస్‌పీ జైన్ గ్లోబల్ నుండి ఎంబీఏ పూర్తి చేశారు. పదమూడేండ్ల కిందట మేనేజ్‌మెంట్ ట్రైనీగా పరాగ్ మిల్క్ ఫుడ్స్‌లోకి ప్రవేశించింది. వ్యాపారంలోని ప్రతి విషయంపై అవగాహన పెంచుకునేందుకు కృషి చేశారు. 'నేను కుటుంబ వ్యాపారంలో చేరాలని మొదట్లోనే నిర్ణయించుకున్నాను' అని ఆమె చెప్పారు. సంస్థ వారసత్వాన్ని కాపాడుకుంటూ వ్యాపారాన్ని ఆధునీకరించాలనే తపనతో ఆమె తన ప్రయాణం ప్రారంభించారు. గ్రౌండ్ లెవల్ నుండి తన పని మొదలుపెట్టారు. కంపెనీ కార్యకలాపాలపై సూక్ష్మ అవగాహనను పెంచుకున్నారు. తాజా ఆలోచనలను వ్యాపారంలో మిళితం చేసుకునేందుకు కృషి చేశారు. దీనికోసం ఆమె చురుకైన నాయకత్వ పాత్రను పోషించారు.

ఆమె నాయకత్వంలో...



పరాగ్ మిల్క్ ఫుడ్స్ ప్రధానంగా అమ్మకాలపై ఆధారపడ్డ సంస్థ. ప్రారంభం నుండి ఆమె లక్ష్యం, దాన్ని బలమైన మార్కెటింగ్ పవర్‌హౌస్‌గా మార్చడం. 'సంస్థను వినూత్న ఆలోచనలతో నింపాలని, బలమైన బ్రాండ్ ఉనికిని సృష్టించాలని నేను కోరుకున్నాను' అని ఆమె చెప్పారు. ఆమె నాయకత్వంలో పరాగ్ మిల్క్ ఫుడ్స్ భారతదేశంలోని ప్రముఖ ప్రైవేట్ డెయిరీ ఖీవీజ+ కంపెనీలలో ఒకటిగా ఎదిగింది. ఇప్పుడు ఇది 20 కంటే ఎక్కువ దేశాలలో తన ఉనికిని నిలబెట్టుకుంది. అలాగే విభిన్న బ్రాండ్‌ల పోర్ట్‌ఫోలియోను కలిగి ఉంది. వీటిలో గోవర్ధన్, గో చీజ్, ప్రైడ్ ఆఫ్ కౌస్, అవ్వాటర్ ఉన్నాయి. మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, హర్యానాలోని కంపెనీ అత్యాధునిక సౌకర్యాలు, నాణ్యత, ఆవిష్కరణల కోసం షా ఎంతో నిబద్ధతతో పని చేశారు.

సవాళ్లను తెచ్చిపెట్టింది

షా వ్యవస్థాపక దృష్టి పాల ప్రాథమిక అంశాలకు మించి విస్తరించింది. అధిక-ప్రోటీన్ ఆహారాలు, ఆరోగ్య-కేంద్రీకృత ఉత్పత్తులకు పెరుగుతున్న డిమాండ్‌ను గుర్తించి ఆమె పరాగ్ మిల్క్ ఫుడ్స్‌ను అవ్వాటర్ వెయ్ ప్రోటీన్‌తో ఆరోగ్యం, పోషకాహార రంగంలోకి నడిపించింది. 'స్పెక్ట్రం అంతటా వినూత్న ప్రోటీన్ పరిష్కారాలను అందించే అవకాశాన్ని మేము చూశాము' అని ఆమె చెప్పింది. ఈ వ్యూహాత్మక వైవిధ్యీకరణ పరాగ్ మిల్క్ ఫుడ్స్‌ను ఆరోగ్యం, పోషకాహార సంస్థగా పరిణామం చెందింది. ఇది సాంప్రదాయ, ఆధునిక వినియోగదారులకు సేవలు అందిస్తుంది. పురుషాధిక్య పరిశ్రమలోకి ప్రవేశించడం షాకు కొన్ని సవాళ్లను తెచ్చి పెట్టింది. 'మహిళా నాయకురాలిగా నమ్మకం, విశ్వసనీయతను సంపాదించడం అంత సులభం కాదు' అని ఆమె పంచుకుంటుంది.



నాణ్యత పట్ల నిబద్ధత

అమ్మకాల నుండి మార్కెటింగ్‌కు కంపెనీ దృష్టిని మార్చేటప్పుడు ఆమె ప్రతిఘటనను కూడా ఎదుర్కొంది. సంస్థలో గణనీయమైన మార్పు అవసరం. ఆవిష్కరణను నడిపిస్తూ ఉత్పత్తి స్థిరత్వాన్ని కొనసాగించడం మరొక అడ్డంకి. 'పాడి పరిశ్రమలో, నమ్మకం, సంప్రదాయం చాలా ముఖ్యమైనవి' అని ఆమె చెప్పారు. అనుకూలత, నాణ్యత పట్ల నిబద్ధత ఈ సంక్లిష్టతలను అధిగమించడంలో ఆమెకు సహాయపడ్డాయని అన్నారు. షా నాయకత్వంలో, పరాగ్ మిల్క్ ఫుడ్స్ ఆదాయం 2021-22లో రూ.20,256 మిలియన్ల నుండి 2023-24లో రూ.30,898 మిలియన్లకు పెరిగింది. ఈ వృద్ధిలో ఎక్కువ భాగం స్థిరమైన, వినియోగదారు -కేంద్రీకృత వ్యూహాలు, వినూత్న ఉత్పత్తికి ఆమె రుణపడి ఉందని చెప్పాలి.

రైతులపై సానుకూలత

'మా బలమైన మౌలిక సదుపాయాలు, అధునాతన ఆహార సాంకేతికత, విశ్వసనీయ రైతు నెట్‌వర్క్, విస్తృత పంపిణీ మార్గాల బలం మాకు పునాదిగా ఉన్నాయి. ఇది పరిశ్రమలో మాకు ఒక ముద్ర వేయడానికి సహాయపడుతుంది' అని ఆమె పంచుకున్నారు. ఆర్థిక విజయాలకు మించి వినియోగదారులు, రైతులపై ఆమె చేసిన కృషి సానుకూల ప్రభావాన్ని చూడటంలో తాను గొప్ప సంతృప్తిని పొందానని షా చెప్పారు. 'మేము చేసిన వినూత్న ప్రయత్నాల వల్ల రైతులు కూడా ప్రయోజనాలు పొందుతున్నారు. అలాగే మా ఉత్పత్తులను విశ్వసించే వినియోగదారులు కూడా మా బలోపేతానికి కారణమయ్యారు' అంటూ ఆమె జతచేశారు.

ఇదే మంచి అవకాశం

వ్యవస్థాపక రంగంలో మహిళలకు ఇది సరైన సమయం అని ఆమె విశ్వసిస్తున్నారు. 'వనరులు, సహాయక విధానాలకు పెరుగుతున్న ప్రాధాన్యతతో మహిళలు కొత్త ఆవిష్కరణలు, ఆర్థిక వృద్ధిని నడిపించడానికి మంచి స్థితిలో ఉన్నారు' అని ఆమె నొక్కి చెబుతున్నారు. నిజానికి ఆమె పాత్ర తన కంపెనీకి మించి విస్తరించింది - మహిళా వ్యవస్థాపకులకు మద్దతు ఇచ్చేందుకు, లింగ అంతరాన్ని తగ్గించేందుకు అన్ని విధాల సహాయసహకారాలు అందించేందుకు, అందుకు తగ్గ వాతావరణం సృష్టించేందుకు ఆమె ఎప్పుడూ సిద్ధంగా ఉన్నారు. 'వ్యవస్థాపక ప్రపంచంలోకి ప్రవేశించాలనుకునే మహిళలు తమ సామర్థ్యాలను విశ్వసించాలి, ఆత్మవిశ్వాసంతో ప్రయాణాన్ని స్వీకరించాలి. ప్రతి అడ్డంకి ఆవిష్కరణలు, అభివృద్ధికి ఒక అవకాశం' అని ఆమె చెబుతున్నారు. 'మహిళలు తమ పరిసరాల నుండి ప్రేరణ పొందాలి, అడ్డంకులను అధిగమించాలి, నిబంధనలను పునర్నిర్వచించాలని నేను కోరుతున్నాను' అని ఆమె తన మాటలు ముగించారు.

- పాలపర్తి సంధ్యారాణి

సూర్యోదయానికి ముందే..



నేటి ఉరుకుల పరుగుల జీవితంలో చాలామంది రాత్రి లేటుగా నిద్రపోవడం, ఉదయం లేటుగానే నిద్రలేవడం జరుగుతుంది. దీనివల్ల ఎన్నో అనారోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని నిపుణులు చెబుతున్నారు. సమయానికి తినడం, నిద్రపోవడం వంటి క్రమశిక్షణతో కూడిన జీవితానికి చాలామంది ఇప్పుడు దూరమవుతున్నారనడంలో ఆశ్చర్యం లేదు. సూర్యోదయానికి ముందు ఒక గంట నిద్ర లేవడం వల్ల ఆరోజు చేయాల్సిన పనులను త్వరగా చేసుకోవడంతోపాటు, ఆరోగ్య ప్రయోజనాలు మెండుగా ఉన్నాయి అవేంటో తెలుసుకుందామా..!

- సూర్యోదయానికి ఒక గంట ముందు నిద్రలేచి.. కళ్లు మూసుకుని, కాసేపు నిటారుగా కూర్చుంటే.. ప్రేగు కదలికలు జరిగి శరీరంలోని వ్యర్థాలు తొలగిపోతాయి అని వైద్యులు చెబుతున్నారు. శరీరంలో వ్యర్థాలు తొలగిపోవడం వల్ల ఆరోగ్యానికి మంచిది.
- బ్యాక్టీరియా కానీ, ఆల్కహాల్, అరుగుదల కోసం వేసుకునే మందులు, మృతకణాలు కానీ ఇలా ఏవైనా.. శరీరం నుంచి తొలగిపోవడం వల్ల ఆరోగ్యానికి మంచిది.

ప్రతిరోజూ ఉదయాన్నే ఇలా చేయడం వల్ల రక్తంలో చక్కెరస్థాయిలు అదుపులో ఉంటాయని వైద్యులు చెబుతున్నారు.

ఆగుతూ.. సాగుతూ..!

(మొదటిపేజీ తరువాయి)

నిర్మితమయ్యే ఎంసీహెచ్‌సీ బ్లాక్‌కు 2023 మార్చి 27న అప్పటి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు శంకుస్థాపన చేశారు. మొదట్లో పనులు సజావుగానే సాగినా కొద్ది రోజులుగా ఎక్కడ వేసిన గొంగళి అన్న చందంగా మారాయి. భవన నిర్మాణంలో అంచనాలు కూడా తారుమారయ్యాయి. జీ-7 భవన సముదాయం కాస్త జీ-2కే పరిమితమైంది. దీంతో రూ.55 కోట్ల నిర్మాణ వ్యయంతో పనులు కొనసాగుతున్నాయి. ఈ పనులు కూడా కొంత కాలంగా ముందుకే సాగని పరిస్థితి.

నత్తనడకన సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ పనులు

ఎర్రగడ్డ మెంటల్ ఆస్పత్రిలో నిర్మిస్తున్న సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ భవన నిర్మాణ పనులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. పనులు ప్రారంభించి దాదాపు రెండేండ్లు కావస్తున్నా అసంపూర్తిగానే ఉన్నాయి. ఫ్లస్ వన్ పద్ధతిన రూ.20 కోట్లతో భవన నిర్మాణ పనులను చేపట్టినా.. నిధుల విడుదలలో జాప్యం జరుగుతుండటంతో ముందుకు సాగడం లేదు. ఇప్పటి వరకు దాదాపు రూ.3 కోట్లు మాత్రమే మంజూరైనట్టు తెలుస్తోంది.

ఫీవర్ ఆస్పత్రి నూతన భవనం అంతంతే..

నల్లకుంట ఫీవర్ ఆస్పత్రిలో రోగుల తాకిడి ఎక్కువ. ఇక్కడ కార్పొరేట్ తరహాలో వైద్యం అందించడానికి రూ.115 కోట్లతో నిర్మిస్తున్న నూతన ఓపీ భవన నిర్మాణ పనుల్లోనూ జాప్యం జరుగుతోంది. మూడంతస్తుల భవనం పనులు ప్రారంభించి దాదాపు రెండేండ్లు గడిచినా ఇంకా పూర్తి కాలేదు. మొదటి అంతస్తు పూర్తయి రెండో అంతస్తులో పిల్లర వరకు పూర్తయ్యాయి. గతేడాది మే లోనే పూర్తి కావాల్సి ఉండగా నిధులు విడుదల కాకపోవడంతో కాంట్రాక్టర్ పనులను మధ్యలో నిలిపివేసినట్టు సమాచారం.

రూపాయి దిగాలు..

(మొదటిపేజీ తరువాయి)

బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ మార్కెట్‌లో 86.53 వద్ద తెరుచుకున్న రూపాయి విలువ.. ఇంట్రాడేలో ఏకంగా 86.57 కనిష్ట స్థాయిని తాకింది. ఇంతక్రితం సెషన్‌లోనూ రూపాయి విలువ 11 పైసలు పతనమయ్యింది. గ్లోబల్ మార్కెట్‌లో ముడి చమురు బ్యారెల్ ధర 0.52 శాతం పెరిగి 77.48 డాలర్లకు చేరింది. సోమవారం సెషన్‌లో రూ.5,015 కోట్ల ఎఫ్‌ఐఐలు తరలిపోయాయి. విదేశీ సంస్థాగత పెట్టుబడులు తరలిపోవడం, స్టాక్ మార్కెట్ల పతనం, ఇతర దేశీయ బలహీన సూక్ష్మ ఆర్థికాంశాలు రూపాయి విలువను ఒత్తిడికి గురి చేస్తున్నాయని నిపుణులు పేర్కొంటున్నారు.

ఇసుక మాఫియాపై ఉక్కుపాదం

ఇందిరమ్మ ఇండ్లకు సరఫరాపై అధ్యయనం : ముఖ్యమంత్రి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇసుక మాఫియాపై ఉక్కుపాదం మోపాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి గనుల శాఖపై మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ఏటేటా నిర్మాణాలు పెరుగుతున్నా ఇసుక నుంచి ప్రభుత్వానికి ఆదాయం ఆశించినంత ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. వినియోగదారులకు తక్కువ ధరకే ఇసుక దక్కేలా చూడాలనీ, అదే సమయంలో ప్రభుత్వానికి ఆదాయం పెంచే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మేజర్, మైనర్ ఖనిజాల గనులకు వేసిన జరిమానాలు వసూలు కాకపోవడంపైనా అధికారులను ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక సరఫరాపై అధ్యయనం చేయాలని సీఎం ఆదేశించారు. రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్, ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రామ్స్ కమిషనర్ శశాంక, టీజీ ఎండీసీ మేనేజింగ్ డైరెక్టర్ సుశీల్‌కుమార్ సభ్యులుగా కమిటీ ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. వారంలోపు తమ అధ్యయనాన్ని పూర్తి చేసి సమగ్ర విధివిధానాలతో నివేదిక సమర్పించాలని ఆదేశించారు. రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ప్రారంభించనున్న నేపథ్యంలో లబ్ధిదారులకు ఇసుక సరఫరాపై సమగ్రంగా అధ్యయనం చేయాలని వారికి సూచించారు. సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్ రాజ్ పాల్గొన్నారు.

కేసీఆర్ ఆనవాళ్లు చెరిపే కుట్ర

(మొదటిపేజీ తరువాయి)

విమర్శించారు. కాంగ్రెస్ వస్తే రైతుబంధు ఆగిపోద్ది అన్నాం.. అన్నట్టే జరిగిందని అన్నారు. రేవంత్‌రెడ్డికి రైతుల యోగక్షేమాలు ముఖ్యం కాదు.. ప్రతిదీ రాజకీయం చేయడమే ఆయన లక్ష్యమని తెలిపారు. రుణమాఫీ 40శాతం మందికి మాత్రమే అయిందని చెప్పారు. ప్రజా పాలన గ్రామ సభల్లో ప్రజలు, రైతులు కాంగ్రెస్ నేతలను నిలదీస్తున్నారని, ఎక్కడికెళ్లినా దుమ్ము దులుపుతున్నారని అన్నారు. సంక్షేమ పథకాల కోసం పదే పదే దరఖాస్తులు అడుగుతూ..ప్రజలపై ఆర్థిక భారం వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వరి ధాన్యానికి బోనస్ ఇస్తామన్నారు.. అది లేదు.. తీరా సన్న ధాన్యం అని సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని విమర్శించారు. అన్ని రకాలుగా ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ వాళ్లను నిలదీయాలని పిలుపునిచ్చారు. అది నల్లగొండ నుంచే మొదలవ్వాలని, కాంగ్రెస్‌ను చీల్చి చెండాడాలని అన్నారు. కాంగ్రెస్ పాలనపై పోరాటం మొదలైందన్నారు. తెలంగాణ అంతా సర్వ నాశనం అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రులను ఎక్కడికక్కడా నిలదీయాలన్నారు.

నల్లగొండలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఓవర్ యాక్షన్ చేస్తుండు.. చాలా వల్గర్‌గా మాట్లాడుతున్నారు.. బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి.. కాంగ్రెస్ చేసిన దానిపై నల్లగొండ క్లాక్ టవర్ సెంటర్లో చర్చకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. కోమటిరెడ్డికి దమ్ముంటే ఉమ్మడి నల్లగొండ జిల్లాను ఏం అభివృద్ధి చేశారో, రైతులకు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్ హయాంలో నల్లగొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాల్లో మెడికల్ కళాశాలను నిర్మించామని, యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానాన్ని అభివృద్ధి చేశామని, థర్మల్ విద్యుత్ ప్లాంటు ఏర్పాటు చేసిన ఘనత కేసీఆర్‌ది అని వివరించారు. ప్రజా పాలనలో స్వేచ్ఛ లేదని, రైతులను మోసం చేసిన కాంగ్రెస్ పాలనపై నల్లగొండలో ధర్నా చేస్తామంటే కాంగ్రెస్ వాళ్ల లాగులు తడిశాయని విమర్శించారు. రైతుల పక్షాన బీఆర్ఎస్ పోరాటం సరైనదని ధర్నాకు రాష్ట్ర అత్యున్నత కోర్టు అనుమతించిందని, హైకోర్టుకు ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ కార్యకర్తల కంటే ఎక్కువగా అధికారులు ఓవరాక్షన్ చేశారని, అధికారుల్లారా జాగ్రత్త.. 'మళ్లీ మేమే వస్తాం.. అన్నీ చూసుకుంటాం.. అసలుకు వడ్డీతో సహా చెల్లిస్తాం' అని హెచ్చరించారు.

ఈ ధర్నాలో మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, నిరంజన్ రెడ్డి, ఎమ్మెల్సీలు కోటిరెడ్డి, మధుసూదనాచారి, ఎండీ మహమూద్ అలీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు రమావత్ రవీంద్రకుమార్, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్ రెడ్డి, గాదరి కిషోర్, భాస్కర్‌రావు, గొంగిడి సునీత, నోముల భగత్, ప్రభాకర్ రెడ్డి, చిరుమర్తి లింగయ్య, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, నల్లగొండ జెడ్పీ మాజీ చైర్మెన్ బండా నరేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మెన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మెన్ మందడి సైదిరెడ్డి పాల్గొన్నారు.

అమెరికాకు హాని కలిగిస్తే చర్యలే

వాషింగ్టన్ : అమెరికా ప్రయోజనాలకు హాని కలిగించే దేశాలపై పన్నులు విధిస్తానని అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. "అమెరికాకు హానికరంగా పరిణమించిన బయటి దేశాలపై, బయటి ప్రజలపై టారిఫ్‌లు విధించాల్సి వుంది. మౌలికంగా వారు వారి దేశానికి ప్రయోజనాలు చేకూర్చుకోవాలని భావిస్తున్నారు." అని ట్రంప్ వ్యాఖ్యానించారు. గత వారంలో రెండోసారి అధ్యక్షుడుగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత మొదటిసారిగా సోమవారం ప్రతినిధుల సభలో ట్రంప్ మాట్లాడారు. "వారేం చేస్తున్నారో చూడండి. చైనా, భారత్, బ్రెజిల్ ఇంకా చాలా దేశాలు అధికంగా సుంకాలు విధిస్తున్నాయి. కాబట్టి మనం అలా జరగడాన్ని ఇక ఎంత మాత్రమూ అనుమతించరాదు. అమెరికాను ప్రథమ స్థానంలో మనం నిలపాల్సి వుంది. మన ఖజానాలోకి డబ్బు వచ్చి పడే వ్యవస్థను మనం నెలకొల్పాలి. మరోసారి అమెరికా సుసంపన్నమైన దేశంగా నిలవాలి. అతి త్వరలోనే అది జరుగుతుంది." అని ట్రంప్ చెప్పారు. అమెరికాను మరింత సంపన్నమైన, శక్తివంతమైన దేశంగా తీర్చిదిద్దాలని, అటువంటి వ్యవస్థకు అమెరికా మళ్ళీ మళ్లాలని ట్రంప్ నొక్కి చెప్పారు. "విదేశాలను సుసంపన్నం చేసేందుకు మన పౌరులపై పన్నులు విధించే బదులు మన ప్రజలను సుసంపన్నులు చేసేందుకు విదేశాలపై పన్నులు విధించాలి." అని ట్రంప్ పేర్కొన్నారు. "అమెరికా మొదటి ఆర్థిక నమూనా ప్రకారం, ఇతర దేశాలపై విధించే సుంకాలు పెరగాలి. అమెరికన్ కార్మికులపై, వ్యాపారాలపై విధించే పన్నులు తగ్గాలి. పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు, ఫ్యాక్టరీలు స్వదేశానికి రావాలి." అని ట్రంప్ పేర్కొన్నారు. బ్రిక్స్ దేశాలపై వంద శాతమూ టారిఫ్‌లు విధించాలని ట్రంప్ గతంలో వ్యాఖ్యానించారు. టారిఫ్‌లను నివారించాలని భావించినట్లైతే అమెరికాకు వచ్చి తయారీ యూనిట్లు పెట్టాల్సిందిగా ట్రంప్ కంపెనీలను కోరారు. "పన్నుల లేదా టారిఫ్‌లు చెల్లించరాదని మీరు భావించినట్లైతే, అమెరికాలో మీరు ప్లాంట్ పెట్టుకోవాల్సి వుంటుంది. అది కూడా రికార్డు స్థాయిలో జరగాలి. ఇంతవరకు ఎవరూ ఊహించని రీతిలో చాలా తక్కువ వ్యవధిలోనే ఎక్కువ ఫ్యాక్టరీలు పెట్టబోతున్నాం. ఎందుకంటే వారికి ఎలాంటి టారిఫ్‌లు లేకపోగా ప్రోత్సాహకాలు వుంటాయి." అని ట్రంప్ పేర్కొన్నారు. ఫార్మాస్యూటికల్స్, సెమీ కండక్టర్లు, ఉక్కు వంటి రంగాల్లో కంపెనీలు పెట్టేందుకు అమెరికా మద్దతునిస్తుందన్నారు. అమెరికా మిలటరీకి అవసరమైన ఉక్కు, అల్యూమినియం, రాగి, ఇతర ఖనిజాలపై టారిఫ్‌లు విధించనున్నట్లు చెప్పారు. మళ్ళీ మన దేశానికి ఉత్పత్తిని తీసుకురావాల్సి వుందన్నారు. గతంలో రోజుకు ఒక ఓడ తయారుచేసిన రోజులు వున్నాయి, కానీ ఈనాడు మనం ఓడను నిర్మించలేకపోతున్నాం, ఏం జరుగుతోందో నాకు అర్థం కావడం లేదు. అన్నీ ఇతర ప్రాంతాలకు, దేశాలకు వెళ్ళిపోతున్నాయని ట్రంప్ వ్యాఖ్యానించారు.

ట్రంప్ కీలక నిర్ణయం.. ఫెడరల్ గ్రాంట్లు, రుణాల నిలిపివేత

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వం అందించే ఫెడరల్ గ్రాంట్లు, రుణాలను జనవరి 28 నుంచి నిలిపివేయాలని ఆదేశించారు.

పెట్టుబడులన్నీ పారదర్శకమే..

(మొదటిపేజీ తరువాయి)

రాలేదనీ, ప్రధానిగా పీవీ నర్సింహారావు తీసుకొచ్చిన ఆర్థిక సంస్కరణలు, మన్మోహన్‌సింగ్ హయాంలో వాటి కొనసాగింపులో భాగంగానే వచ్చాయని విశ్లేషించారు. రాష్ట్రానికి పెట్టుబడులు రావడం నిరంతర ప్రక్రియ అనీ, రాజకీయంగా ఎన్ని విభేదాలు ఉన్నా, రాష్ట్రాభివృద్ధిలో అందరూ కలిసిరావాలని కోరారు. వచ్చిన పెట్టుబడులకు సంబంధించి భూకేటాయింపులు, అనుమతుల మంజూరు ప్రక్రియను వేగవంతంగా చేస్తామన్నారు. నైపుణ్య శిక్షణ కోసం సింగపూర్‌లోని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎడ్యుకేషన్ (ఐటీఈఎస్) సంస్థతో ఇక్కడి యంగ్ ఇండియా యూనివర్సిటీ ఒప్పందం చేసుకుందని తెలిపారు. ఆ దేశంలో పదవ తరగతి పూర్తికాగానే విద్యార్థులకు సాంకేతిక శిక్షణ ఇస్తారనీ, దాన్నే ఇక్కడ కూడా అమల్లోకి తెస్తామన్నారు. దానితో పాటు ఆదేశ విద్యార్థులు ఇక్కడి యంగ్ ఇండియా యూనివర్సిటీలో విద్యను అభ్యసించేలా, ఇక్కడి విద్యార్థులు సింగపూర్‌లోని ఐటీఈఎస్‌లో శిక్షణ తీసుకొనేలా ఒప్పందం చేసుకున్నామని వివరించారు. గత ఏడాది దావోస్ నుంచి రూ.40వేల కోట్ల పెట్టుబడులు 28 కంపెనీలతో చేసుకున్నామనీ, దానిలో 15 కంపెనీలు యాక్టివ్‌లో ఉండగా, మరో పది ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయనీ, మరికొన్ని ఎర్లీ స్టేజ్‌లో ఉన్నాయని తెలిపారు. రాష్ట్రానికి పెట్టుబడుల్ని జీర్ణించుకోలేని కొందరు వ్యక్తుల మాటల్ని పట్టించుకోవాల్సిన అవసరం లేదని విలేకరులు అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో వచ్చిన పెట్టుబడులు, తమ ప్రభుత్వ హయాంలో వచ్చిన పెట్టుబడులపై 2028లో కాంపారిటెల్ టేబుల్ (పోలుస్తూ) తెస్తామన్నారు. అంతర్జాతీయ సంస్థలు రాష్ట్రంలో తమ కార్యాలయాలను ఏర్పాటు చేసినా, వాటిని విస్తరిస్తామంటూ ఒప్పందాలు చేసుకుంటే తప్పు ఏంటని ప్రశ్నించారు. ఈ ఏడాది దావోస్, సింగపూర్ పర్యటనలో 49,550 ఒప్పందాల ద్వారా రూ.1,82,950 కోట్ల పెట్టుబడులు వచ్చాయనీ, దీనివల్ల రాష్ట్రంలోని నిరుద్యోగులకు 51,400 ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని వివరించారు. తెలంగాణ రాష్ట్రాన్ని 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే దిశగానే తమ ప్రభుత్వ విధాన నిర్ణయాలు ఉంటాయని స్పష్టంచేశారు. దానిలో భాగంగానే క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ తెచ్చామన్నారు. ప్రపంచ దేశాలు చైనాకు వ్యతిరేక ఆర్థిక వ్యవస్థల కోసం అన్వేషిస్తున్నాయనీ, వారికి ప్రత్యామ్నాయంగా భారతదేశం కనిపిస్తున్నదనీ, అందులో తెలంగాణకు తొలి ప్రాధాన్యత ఉందని విశ్లేషించారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ఖజానాను కొల్లగొట్టి, విదేశాల్లో పెట్టుబడులు పెట్టారనీ, కానీ తమ ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి పెట్టుబడులు తెచ్చామని చెప్పారు. బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఫార్ములా ఈరేస్‌పై సీఎంకు వ్యతిరేకంగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడాన్ని విలేకరులు ప్రస్తావించగా, ఆయన బానిస సంకెళ్లు తెంచుకోవాలని తాను కోరుకుంటున్నాననీ, ఏడాది క్రితం అయన ఏం మాట్లాడాడో అందరికి తెలుసని సీఎం రేవంత్‌రెడ్డి కౌంటర్ ఇచ్చారు.

30న అఖిలపక్ష సమావేశం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఈనెల 30న(గురువారం) అఖిల పక్ష సమావేశం జరగనున్నది. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు జనవరి 31 నుంచి ప్రారంభం కానున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అఖిల పక్ష సమావేశం నిర్వహించనున్నది. తొలిరోజు శుక్రవారం పార్లమెంట్ ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగిస్తారు. పార్లమెంట్ సమావేశాలు రెండు విడుతల్లో జరుగనున్నాయి. తొలి విడత సమావేశాలు 31 నుంచి ఫిబ్రవరి 13 వరకు జరుగుతాయి. ఇక రెండో విడుత సమావేశాలు మార్చి 10న మొదలై.. ఏప్రిల్ 4 వరకు జరుగుతాయి. ఈ మేరకు పార్లమెంటరీ బులిటెన్ విడుదలైంది. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1న లోక్‌సభలో కేంద్ర బడ్జెట్-2025ను ప్రవేశపెడుతారు. అదే రోజు ఎకనామిక్ సర్వేను ప్రవేశపెడతారు. పార్లమెంట్ సమావేశాలకు ముందురోజు జనవరి 30న ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసిందని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. రాబోయే సమావేశాల్లో సభను సజావుగా నిర్వహించేందుకు అన్ని పార్టీలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా గతంలో సమావేశాలు జరిగిన తీరును ప్రస్తావించారు. రెండు సెషన్లలో పార్లమెంట్ సమావేశాల్లో గందరగోళం నెలకొంది. దాంతో పార్లమెంట్ ప్రతిష్ట దెబ్బతిన్నదనీ, ఈ సమావేశాల్లోనైనా ప్రతిపక్ష నాయకులు, ఇతర ఎంపీలు చర్చల్లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ప్రతిపక్షం సహకరిస్తేనే పార్లమెంట్ పని చేయడంతో పాటు చర్చలు జరుగుతాయన్నారు. ఈ సారి కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ సమతుల్య బడ్జెట్‌ను ప్రవేశపెడుతారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

బీజేపీ ఆదాయం 'ఫుల్లు'

(మొదటిపేజీ తరువాయి)

రూ.3,967 కోట్లు. ఇందులో ఎన్నికల బాండ్ల ద్వారా రూ.1,685.6 కోట్లు, ఆజీవాన్ సహయోగ్ నిధి ద్వారా రూ.236.3 కోట్లు, ఇతర విరాళాల ద్వారా రూ.2,042.7 కోట్లు సమకూరాయి. ఆ పార్టీకి వ్యక్తిగత దాతలు రూ.240 కోట్లు, కార్పొరేట్లు రూ.1,890 కోట్లు, సంస్థలు-సంక్షేమ సంఘాలు రూ.101.2 కోట్లు, ఇతరులు రూ.50 కోట్లు అందజేశారు. గత సంవత్సరం మార్చి 31 నాటికి బీజేపీకి చేతిలో రూ.109.2 కోట్లు, బ్యాంకుల్లో రూ.1,627.2 కోట్లు, ఫిక్స్‌డ్ డిపాజిట్ల రూపంలో 5.,377.3 కోట్లు ఉన్నాయి.

నాగోబాకు మహాజలాభిషేకం

(మొదటిపేజీ తరువాయి)

వాయిస్తూ.. కాగడాలను వెలిగిస్తూ పూజలు చేశారు. ఈ పూజలకు జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా, ఎస్పీ గౌస్ అలం, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్ తదితరులు హాజరయ్యారు. ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 2 వరకు జాతర అధికారికంగా కొనసాగనుంది. 31న జాతరలో గిరిజన దర్బార్ నిర్వహించనున్నారు. దీనికి మంత్రి, జిల్లా ఇన్‌చార్జి సీతక్కతో పాటు ఇతర మంత్రులు హాజరు కానున్నారు. జాతరకు ప్రభుత్వం తరపున ఏర్పాట్లు చేశారు.

నాగోబా జాతర భక్తులకు శుభాకాంక్షలు

టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నాగోబా జాతరకు విచ్చేస్తున్న భక్తులకు టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆదిశేషుని నాగోబా జాతర దేశంలోనే రెండో అతిపెద్ద గిరిజన జాతర అనీ, అత్యంత నియమ నిష్టలతో ఆదివాసీలందరూ నిర్వహించుకునే వేడుక అని తెలిపారు. ఆ జాతర గిరిజన సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పడుతుందనీ, మెస్రం వంశస్థుల ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు వైభవంగా జాతర జరుగుతుందని చెప్పారు. తెలంగాణ సంస్కృతి ఉట్టి పడేలా జాతరకు ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేసిందని పేర్కొన్నారు.

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శిగా జాన్‌వెస్లీ

15 మందితో రాష్ట్ర కార్యదర్శివర్గం | 60 మందితో రాష్ట్ర కమిటీ | కొత్తగా ఏడుగురికి చోటు

(మొదటిపేజీ తరువాయి)

పట్టణంలో గత నాలుగు రోజులుగా కొనసాగిన సీపీఐ(ఎం) రాష్ట్ర నాలుగో మహాసభలు అత్యంత జయప్రదంగా ముగిశాయి. చివరి రోజైన మంగళవారం కార్యదర్శి, నూతన రాష్ట్ర కమిటీ ఎన్నికతో మహాసభల ప్రక్రియ దిగ్విజయంగా ముగిసింది. నూతనంగా ఎన్నికైన రాష్ట్ర కార్యదర్శి, కార్యదర్శివర్గ సభ్యులను, రాష్ట్ర కమిటీ సభ్యులను పొలిట్‌బ్యూరో సభ్యులు ఎ.విజయరాఘవన్, బీవీ రాఘవులు, ఇప్పటివరకూ కార్యదర్శిగా పనిచేసి రిలీవ్ అయిన తమ్మినేని వీరభద్రం, తదితర నేతలు అభినందించారు. రాష్ట్రంలో సీపీఐ(ఎం)కు పూర్వవైభవాన్ని తీసుకురావాలని ఆకాంక్షించారు. ఆ కృషిలో నూతన రాష్ట్ర కమిటీ సఫలీకృతం కావాలన్నారు. అందుకు తమవైపు నుంచి సంపూర్ణ సహాయ సహకారాలు ఉంటాయని మహాసభ ప్రతినిధుల సాక్షిగా హామీనిచ్చారు. అనంతరం 'ఆకలిమంటలు.. మలమలమాడే అనాథలందరూ లేవండోయ్'..అనే అంతర్జాతీయ గీతంతో ప్రతినిధులు అత్యంత స్ఫూర్తిదాయకంగా తమతమ కార్యక్షేత్రాలకు బయలుదేరి వెళ్లారు.

సీపీఐ(ఎం) అఖిల భారత మహాసభలకు 28 మంది ప్రతినిధులు

ఏప్రిల్ మాసంలో తమిళనాడు రాష్ట్రంలోని మధురైలో జరిగే సీపీఐ(ఎం) అఖిల భారత మహాసభలకు హాజరయ్యే 28 మంది ప్రతినిధులతో పాటు ఏడుగురు ప్రత్యామ్నాయ ప్రతినిధులను మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకున్నది.



సీపీఐ(ఎం) రాష్ట్ర నూతన కార్యదర్శిగా ఎన్నికై మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వీరే..

రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగా 15 మంది ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అందులో జాన్‌వెస్లీ, జి.నాగయ్య, ఎస్.వీరయ్య, జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్‌రావు, చుక్క రాములు, టి.జ్యోతి, టి.సాగర్, ఎమ్‌డీ. అబ్బాస్, పాలడుగు భాస్కర్, మల్లు లక్ష్మి, పి.ప్రభాకర్, బండారు రవికుమార్, నున్నా నాగేశ్వర్‌రావు, ఎమ్‌డీ.జహంగీర్ ఉన్నారు. ఇప్పటిదాకా కార్యదర్శివర్గ సభ్యులుగా ఉన్న తమ్మినేని వీరభద్రం, చెరుపల్లి సీతారాములు, డీజీ.నర్సింహారావు రిలీవ్ అయ్యారు. వారిస్థానంలో కొత్తగా బండారు రవికుమార్, నున్నా నాగేశ్వర్‌రావు, ఎమ్‌డీ.జహంగీర్ ఎన్నికయ్యారు.

ప్రతినిధుల బృందంలో ఎస్.వీరయ్య, జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్, చుక్కరాములు, టి.జ్యోతి, జాన్‌వెస్లీ, టి.సాగర్, ఎమ్‌డీ.అబ్బాస్, పాలడుగు భాస్కర్, మల్లు లక్ష్మి, పి.ప్రభాకర్, బండారు రవికుమార్, నున్నా నాగేశ్వర్‌రావు, ఎమ్‌డీ.జహంగీర్, డీజీ.నర్సింహారావు, వై.కిరణ్‌చంద్ర, రవి, ఆర్.వెంకట్రాములు, ఎర్రా శ్రీకాంత్, మాచర్ల భారతి, ఎం.సుధాకర్‌రెడ్డి, తుమ్మల వీరారెడ్డి, మచ్చా వెంకటేశ్వర్లు, మల్లు నాగార్జునరెడ్డి, సాదుల శ్రీనివాస్, పగడాల యాదయ్య, ఎం.కనకారెడ్డి, ఎ.మల్లారెడ్డి ఉన్నారు. ప్రత్యామ్నాయ ప్రతినిధులుగా అన్నవరపు కనకయ్య, ఆనగంటి వెంకటేశ్, బి.సాంబశివ, ఎమ్‌డీ.నూర్జహాన్, ఎస్.రమ, కొండమడుగు నర్సింహ్మా, రాంపల్లి రమేశ్ ఉన్నారు.

రాష్ట్ర కమిటీ సభ్యులు వీరే

జె.వెంకటేశ్, ఎస్.రమ, భూపాల్, జయలక్ష్మి, రాంపల్లి రమేశ్, ఎ.నర్సిరెడ్డి, రవి, కె.హిమబిందు, ఎమ్‌వీ.రమణ, పి.ఆశయ్య, ఆర్.వెంకట్రాములు, బుర్రి ప్రసాద్, ఆర్.శ్రీరాంనాయక్, స్కైలాబ్‌బాబు, ఆర్.అరుణజ్యోతి, జె.బాబూరావు, పి.సచిన్, వై.శ్రీకాంత్, ఎం.భారతి, బండి రమేశ్, ఎం.సుధాకర్‌రెడ్డి, తుమ్మల వీరారెడ్డి, నారి అయిలయ్య, డబ్బీకార్ మల్లేశం, ఎం.నాగార్జునరెడ్డి, నెమ్మాది వెంకటేశ్వర్లు, కె.యాదగిరిరావు, కొండమడుగు నర్సింహ్మా, బి.అనురాధ, ఎ.కనకయ్య, మచ్చా వెంకటేశ్వర్లు, ఏజే.రమేశ్, సాదుల శ్రీనివాస్, ఎం.కనకారెడ్డి, పగడాల యాదయ్య, ఏ.మల్లారెడ్డి, బి.సాంబశివ, జి.ప్రభాకర్‌రెడ్డి, బందు సాయిలు, వి.పర్వతాలు, సీహెచ్.రంగయ్య, పి.సత్యం, ఎం.వెంకటేశ్, పుట్ట ఆంజనేయులు, జి.జయరాజు

ఆహ్వానితులు

నూర్జహాన్, ఆనందాచారి, ప్రవీణ్, అడివయ్య, లెల్లెల బాలకృష్ణ, ఉడుత రవీందర్, కళ్యాణం వెంకటేశ్వర్లు.

ప్రత్యేక ఆహ్వానితులు

చెరుపల్లి సీతారాములు, నంద్యాల నర్సింహారెడ్డి, ఎస్.కృష్ణారెడ్డి, ఆర్.సుధాభాస్కర్, బుగ్గవీటి సరళ

కంట్రోల్ కమిషన్ ఇదే..

కంట్రోల్ కమిషన్‌ను ఐదుగురు సభ్యులతో వేశారు. దానికి డీజీ నర్సింహారావు చైర్మెన్‌గా వ్యవహరించనున్నారు. సభ్యులుగా వంగూరు రాములు, కె.నరసమ్మ, మాటూరి బాలరాజుగౌడ్, ఎం.వాసుదేవరెడ్డి ఉండనున్నారు.

ఇదీ ప్రస్థానం..

పేరు	:	జాన్‌వెస్లీ
జననం	:	13 జనవరి 1964
తల్లిదండ్రులు	:	మోశన్న, బేతమ్మ
భార్య	:	భారతి
కుమారుడు	:	జై అంకుశ్
విద్యాభ్యాసం	:	డిగ్రీ
సొంతూరు	:	వనపర్తి జిల్లా అమరచింత



ఉద్యమ నేపథ్యం

- 1978లో వామపక్ష విద్యార్థి ఉద్యమాల వైపు ఆకర్షితులు
- 1996లో డీవైఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శిగా నియామకం
- 1998లో కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక
- 1997లో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీకి ఎన్నిక
- ప్రస్తుతం కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్ష బాధ్యతల్లో ఉన్నారు.
- రంగారెడ్డి జిల్లా తుర్కయంజాల్‌లో 2022లో జరిగిన పార్టీ రాష్ట్ర మూడో మహాసభలో కార్యదర్శి వర్గ సభ్యులుగా ఎన్నిక
- కుల వివక్షకు వ్యతిరేకంగా, దళితుల హక్కుల కోసం పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ.రాఘవులుతో కలిసి సైకిల్ యాత్ర చేపట్టారు.
- వెస్లీ నేతృత్వంలో కేవీపీఎస్ పోరాటాల ఫలితంగా రాష్ట్రంలో జస్టిస్ పున్నయ్య కమిషన్ ఏర్పాటు
- కేవీపీఎస్ పదేండ్ల పోరాటం ఫలితంగా రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ అమలు. దేశంలోనే తెలంగాణలో తొలిసారి అమలు.
- రాష్ట్రంలో సామాజిక న్యాయం, సమగ్రాభివృద్ధి కోసం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర బృందంలో సభ్యులు.

కమ్యూనిస్టులకు విశ్రాంతి లేదు

- రాష్ట్రంలో ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యం
- నిరంతర పోరాటాల ద్వారా బీజేపీని వెనక్కి నెడదాం : సీపీఐ(ఎం) శ్రేణులకు తమ్మినేని పిలుపు

సంగారెడ్డి నుంచి అచ్చిన ప్రశాంత్

కమ్యూనిస్టులకు రిలీవ్ అనేది ఉండదని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి బాధ్యతల నుంచి రిలీవ్ అయిన తమ్మినేని వీరభద్రం వ్యాఖ్యానించారు. మూడుసార్లు కార్యదర్శిగా పనిచేసిన తాను నిబంధనల ప్రకారం ఆ బాధ్యతల నుంచి మాత్రమే రిలీవ్ అయ్యాయని తెలిపారు. తెలంగాణలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకుపోవడం, బలోపేతం చేయడమే తమ లక్ష్యమని నొక్కి చెప్పారు. సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభల సందర్భంగా ప్రతినిధుల సభలో ఆయన కార్యదర్శి హోదాలో ముగింపు ఉపన్యాసం చేశారు. తెలంగాణలో రాబోయే రోజుల్లో కమ్యూనిస్టు పార్టీ సత్తా చూపిస్తామన్నారు. అయితే, అందుకోసం కార్యకర్తలందరూ కంకణబద్ధులై పనిచేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా పారిశ్రామిక రంగంలో క్షేత్రస్థాయి ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై అధ్యయనం చేయాలనీ, తద్వారా పోరాటాలకు రూపకల్పన చేయాలని సూచించారు. ప్రస్తుత పాలకులు అనుసరిస్తున్న ఆర్థిక విధానాల లోగుట్టును బట్టబయలు చేయాలని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్‌లపై విస్తృత చర్చలు నిర్వహించడం ద్వారా ఆయా ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు, వాటి అమలు కోసం కేటాయించిన నిధుల లెక్కలు తేల్చాలని విశదీకరించారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం ఇప్పటికే వామపక్షాలతో పని చేస్తున్నామనీ, రానున్న రోజుల్లో ఆ దిశగా మరింత కృషి జరగాలని సూచించారు. మతోన్మాదం, ఆర్థిక విధానాలు, కులవివక్ష, సామాజిక అణిచివేతపై ఎప్పటికప్పుడు పోరాటాలు నిర్వహించడం ద్వారా పార్టీని ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. మొత్తంగా తెలంగాణలో బీజేపీని వెనక్కి కొట్టడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలంటూ మార్గదర్శనం చేశారు.



దేశాన్ని కాపాడేది ఎర్రజెండానే

- తెలంగాణలో పార్టీకి పూర్వవైభవం తీసుకొద్దాం
- సీనియర్ల సలహాలు, సూచనలతో ముందుకెళ్తా: సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

మతోన్మాదం నుంచి దేశాన్ని కాపాడేది ఎర్రజెండా మాత్రమేనని సీపీఐ(ఎం) రాష్ట్ర నూతన కార్యదర్శి జాన్‌వెస్లీ నొక్కి చెప్పారు. ఈ క్రమంలో భారతదేశానికి కమ్యూనిస్టుల అవసరం ఎంతో ఉందని వ్యాఖ్యానించారు. సంగారెడ్డిలోని సీతారాం ఏచూరి నగర్‌లోని మల్లు స్వరాజ్యం ప్రాంగణంలో మంగళవారం ముగిసిన సీపీఐ(ఎం) రాష్ట్ర నాలుగో మహాసభలో రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన అనంతరం ఆయన ప్రతినిధులను ఉద్దేశించి ప్రసంగించారు. ఉమ్మడి రాష్ట్రంలో పార్టీకి సారథ్యం వహించిన బీవీ.రాఘవులు, తెలంగాణలో ఇప్పటివరకూ కార్యదర్శిగా సేవలందించిన తమ్మినేని వీరభద్రంతో పోలిస్తే తాను వారి దరిదాపుల్లో కూడా ఉండబోనని చెప్పారు. అయితే, వారు నడిచిన బాటలో నడవడం ద్వారా పార్టీకి రాష్ట్రంలో పూర్వవైభవం తీసుకొచ్చేందుకు శాయశక్తులా కృషి చేస్తానని ప్రతినబూనారు. వర్గసమస్యలు, సామాజిక పోరాటాలకు రూపకల్పన చేయడం ద్వారా మతోన్మాదానికి అడ్డుకట్ట వేస్తామని హెచ్చరించారు.



మహాసభలో రిలీవ్ అయిన తమ్మినేని, కార్యదర్శివర్గ సభ్యులు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎప్పటికప్పుడు తనకు దిశానిర్దేశం చేస్తూ ముందుకు నడిపించాలని కోరారు.









మహాసభ ప్రతినిధుల్లో 140 మంది యువత

- జైలు జీవితం గడిపినవారు 281 మంది
- 70ఏండ్ల పైబడినవారు 18మంది
- మహిళా ప్రతినిధులు 111 మంది

సంగారెడ్డి నుంచి అచ్చిన ప్రశాంత్

సీపీఐ(ఎం) రాష్ట్ర నాలుగో మహాసభకు మొత్తం 635 మంది హాజరుకాగా..అందులో ప్రతినిధులు 476 మంది, పరిశీలకులు 118 మంది, వెటరన్స్ 10 మంది, పీసీఎమ్స్ 31 మంది ఉన్నారు. ప్రతినిధులు, పరిశీలకుల్లో మహిళలు 111 మంది, పురుషులు 521 మంది, ఇతరులు ముగ్గురున్నారు. రాష్ట్ర కేంద్రం నుంచి 178 మంది ప్రతినిధులు హాజరుకాగా.. నల్లగొండ జిల్లా నుంచి అత్యధికంగా 51 మంది ప్రతినిధులు వచ్చారు. సూర్యాపేట నుంచి 41, యాదాద్రి భువనగిరి నుంచి 38, ఖమ్మం నుంచి 36, భద్రాద్రి కొత్తగూడెం నుంచి 34, సిద్దిపేట నుంచి 31 మంది చొప్పున హాజరయ్యారు. అతి తక్కువగా జగిత్యాల నుంచి ఒక్కరే హాజరయ్యారు. వికారాబాద్, కామారెడ్డి నుంచి ముగ్గురు చొప్పున హాజరయ్యారు. జోగులాంబ గద్వాల, మెదక్, నారాయణపేట, ఆదిలాబాద్, సిరిసిల్ల జిల్లాల నుంచి నలుగురు చొప్పున వచ్చారు. నిజామాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి ఐదుగురు చొప్పున ప్రతినిధులు హాజరయ్యారు.

మొత్తం సభ్యుల్లో పీజీ, ఆపైన ఉన్నతవిద్య అభ్యసించినవారు 111మంది, ప్రొఫెషనల్ విద్యను అభ్యసించినవారు 21 మంది, డిగ్రీ చదివినవారు 226 మంది, టెక్నికల్ విద్య చదివినవారు 16 మంది, ఇంటర్ చదివినవారు 127 మంది ఉన్నారు. పదో తరగతిలోపు చదివిన వారు 129 మంది కాగా..నిరక్షరాస్యులు ఐదుగురున్నారు. ఇండ్ల కోసం చేసిన పోరాటం, మతోన్మాద వ్యతిరేక ప్రచారం, పోడు భూముల పోరాటాల్లో 566 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

1970కి ముందు పార్టీలో చేరిన ప్రతినిధులు ఐదుగురున్నారు. మహాసభకు వచ్చిన ప్రతినిధుల్లో 1971-1980 మధ్యలో చేరినవారు 40 మంది, 1981-1990 మధ్యలో చేరినవారు 125 మంది, 1991-2000 మధ్యలో చేరినవారు 207 మంది, 2001-2010 మధ్యలో చేరినవారు 168 మంది, 2011-2021 మధ్యలో వచ్చినవారు 52 మంది, 2021-నుంచి ఇప్పటివరకూ 13 మంది చేరిన వారు ఉన్నారు.

మహాసభలో పాల్గొన్న ప్రతినిధుల్లో బీసీలు 216 మంది, ఎస్సీలు 159 మంది, ఎస్టీలు 40, మైనార్టీలు 64 మంది, ఇతరులు 156 మంది ఉన్నారు.

మహాసభ ప్రతినిధుల్లో హోల్‌టైమర్లు 394 మంది కాగా, రైతులు 34 మంది, వ్యవసాయ కార్మికులు 33మంది, కార్మికులు 21మంది, ఉద్యోగులు 58 మంది, విద్యార్థులు ముగ్గురు, నిరుద్యోగులు ముగ్గురు, వృత్తిదారులు పది మంది, ఇతరులు 79 మంది ఉన్నారు. ఏడాదిలోపు జైలు జీవితం గడిపిన వారు 279 మంది, రెండేండ్లు గడిపినవాళ్లు ఇద్దరున్నారు. ఏడేండ్లు, ఆపైగా అజ్ఞాన జీవితం గడిపినవారు ఒక్కరుకాగా..రెండేండ్ల నుంచి ఆరేండ్ల వరకు గడిపినవారు ఎనిమిది మంది, 15 రోజుల నుంచి ఏడాది వరకు అజ్ఞాన జీవితం గడిపినవారు 43 మంది ఉన్నారు.

మొత్తం ప్రతినిధుల్లో 21 నుంచి 30 ఏండ్లలోపు ఉన్నవారు 23 మంది, 31 నుంచి 40 ఏండ్లలోపు 117 మంది, 41 నుంచి 50 ఏండ్లలోపు 206 మంది, 51 నుంచి 60 ఏండ్లలోపు వాళ్లు 198 మంది, 61 నుంచి 70 ఏండ్లలోపు వారు 69 మంది, 71 నుంచి 80 ఏండ్లలోపు వారు 14 మంది, 81 నుంచి 90 మధ్య వయస్సు గలవారు నలుగురు ప్రతినిధులున్నారు.

ప్రతినిధుల సభకు హాజరైన వారిలో 1970కి ముందు నుంచి హోల్‌టైమర్లుగా ఉన్నవారు ఇద్దరు, 1971-1980 మధ్యలో 11మంది, 1981-1990 మధ్యలో 33 మంది, 1991-2000 మధ్యలో 134 మంది, 2001-2010 మధ్యలో 155 మంది, 2011-2020 మధ్యలో 71 మంది, 2021 తర్వాత 25 మంది ఉన్నారు. ప్రతినిధుల సభకు హాజరైన వారిలో 98 మంది సాధారణ సభ్యులు కాగా..28 మంది శాఖ కార్యదర్శులు, మండల, పట్టణ కమిటీల నుంచి 33 మంది, జిల్లా కమిటీల నుంచి 388 మంది, రాష్ట్ర కేంద్రం నుంచి 70 మంది, కేంద్ర కమిటీ నుంచి ముగ్గురు ఉన్నారు.


ట్రేడ్ యూనియన్ నుంచి

మహాసభ ప్రతినిధుల్లో ట్రేడ్ యూనియన్ నుంచి 166 మంది, వ్యవసాయ కార్మిక సంఘం నుంచి 79మంది, రైతు సంఘం నుంచి 77 మంది, మహిళా సంఘం నుంచి 68 మంది, యువజన సంఘం నుంచి 9 మంది, విద్యార్థి సంఘం నుంచి 12 మంది, చేతివృత్తుల నుంచి 29 మంది, గిరిజన సంఘం నుంచి 20 మంది, కేవీపీఎస్ నుంచి 22 మంది, మైనార్టీ రంగం నుంచి ఏడుగురు, కళారంగం నుంచి తొమ్మిది మంది, ఉపాధ్యాయ రంగం నుంచి 20 మంది, పత్రికారంగం నుంచి 32 మంది, వికలాంగ రంగం నుంచి ఐదుగురు, మధ్యతరగతి నుంచి 9 మంది, పార్టీ నుంచి 16 మంది ఉన్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

మాజీమంత్రి హరీశ్‌రావుకు ఊరట

అరెస్టు చేయద్దన్న ఉత్తర్వులు పొడిగించిన హైకోర్టు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తన ఫోన్లను ట్యాపింగ్ చేయించారంటూ రియల్ ఎస్టేట్ వ్యాపారి చక్రధర్ గౌడ్ చేసిన ఫిర్యాదు ఆధారంగా పంజాగుట్ట పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టేయాలని మాజీ మంత్రి హరీశ్‌రావు వేసిన పిటిషన్‌ను మంగళవారం హైకోర్టు విచారించింది. రాజకీయ లబ్ది పొందడానికే రియల్ ఎస్టేట్ వ్యాపారి చక్రధర్‌గౌడ్ తనపై పోలీసులకు తప్పుడు ఫిర్యాదు చేశారంటూ హరీశ్ వేసిన అఫిడవిట్‌పై వాదనలు వినిపించేందుకు సమయం కావాలని పోలీసులు తరపున పీపీ కోరారు. దీంతో విచారణ ఫిబ్రవరి 5కి వాయిదా పడింది. తదుపరి విచారణ వరకు పిటిషనర్ హరీశ్‌ను అరెస్టు చేయరాదని జస్టిస్ లక్ష్మణ్ మంగళవారం మధ్యంతర ఆదేశాలిచ్చారు.

తీర్పు రిజర్వు

హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ అండ్ మీడియేషన్ సెంటర్ (ఐఏఎంసీ)కి 3.7 ఎకరాల భూమిని కేటాయించడాన్ని సవాల్ చేసిన పిటిషన్‌పై హైకోర్టు తీర్పును వాయిదా వేసింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం రాయదుర్గ్‌లోని సర్వే నంబర్ 83/1 ప్లాట్ నంబర్ 27లోని 3.7 ఎకరాల ప్రభుత్వ భూమిని ఐఏఎంసీకి కేటాయిస్తూ 2021లో వెలువడిన జీవో 126ను కొట్టివేయాలంటూ లాయర్ కె.రఘునాథ్ రావు పిటిషన్ వేశారు. దీనిపై వాదనలు పూర్తి కావడంతో తీర్పు తర్వాత చెబుతామని జస్టిస్ లక్ష్మణ్ ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్ ప్రకటించింది.

ఆభూమిని అన్యాక్రాంతం కానివొద్దు

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కొంగరకలాన్‌లో కోట్లాది రూపాయల విలువైన 72 ఎకరాల అటవీ భూమిని అన్యాక్రాంతం కానివ్వరాదని హైకోర్టు ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. ఆ భూమిపై ఏవిధమైన లావాదేవీలు నిర్వహించరాదంది. వివాదస్పద అంశాలు ఉన్నందున తుది ఉత్తర్వులు వెలువడే వరకు భూమిలో మార్పులు చేయరాదని మధ్యంతర ఆదేశాలను జారీ చేసింది. అటవీ భూమిని డీనోటిఫై చేసి పట్టాలు మంజూరు చేసే అధికారం కలెక్టర్‌కు ఎలా వచ్చిందో చెప్పాలని ఆదేశించింది. నిషేధిత జాబితా నుంచి అటవీ భూమిని తొలగించి పట్టాలు జారీ చేయాలని కలెక్టర్ నిర్ణయం తీసుకునేందుకు అనుసరించిన చట్ట నిబంధనలను సమర్పించాలంది. విచారణను ఫిబ్రవరి 24కు వాయిదా వేస్తూ జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

ఐఏఎస్‌లకు కోర్టుధిక్కరణ నోటీసులు

కొమరం భీం కలెక్టర్ వెంకటేష్, సీసీఎల్‌ఏ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్‌లకు హైకోర్టు కోర్టుధిక్కరణ నోటీసులు జారీ చేసింది. కాగజ్‌నగర్ మండలం కొసిని గ్రామంలో కొనుగోలు చేసిన భూముల విషయంలో గతేడాది ఇచ్చిన ఉత్తర్వులు అమలు కాలేదంటూ ఆ ప్రాంతానికి చెందిన వ్యక్తి కోర్టు ధిక్కరణ పిటిషన్ వేశారు. మంగళవారం విచారణ చేపట్టిన జస్టిస్ లక్ష్మన్, మీపై కోర్టు దిక్కరణ కింద ఎందుకు చర్యలు తీసుకోరాదో చెప్పాలంటూ నోటీసులు జారీ చేస్తూ విచారణను ఫిబ్రవరి 14కి వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు

ఉస్మానియా ఆస్పత్రి తరలింపుపై స్టేకు నిరాకరణ

ఉస్మానియా ఆస్పత్రి తరలింపు ప్రక్రియను నిలుపుదల చేసేందుకు హైకోర్టు నిరాకరించింది. ఆస్పత్రి తరలింపును నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వుల జారీకి నిరాకరించింది. రోగులకు మెరుగైన వైద్యం అందించడానికి వీలుగా ఉస్మానియా ఆస్పత్రిని తరలించాలన్నది ప్రభుత్వ విధాన నిర్ణయమని చెప్పింది. ఈ వ్యవహారంపై సమగ్ర వివరాలను సమర్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఉస్మానియా ఆస్పత్రి తరలింపు నిర్ణయాన్ని సవాల్ చేస్తూ గౌలిగూడకు చెందిన ఆనంద్‌గౌడ్ వేసిన పిటిషన్‌పై విచారణను ఫిబ్రవరి 18కి వాయిదా వేస్తూ జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు

బండి సంజయ్‌వి దిగజారుడు మాటలు

టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గద్దర్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ తన ఉనికి కోసం దిగజారి వ్యాఖ్యలు చేశారని టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ ఖండించారు. ఈ మేరకు ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. ఎంతో మంది కరసేవకులను కాల్చి చంపిన వారికి అవార్డులిచ్చారని గుర్తుచేశారు. గద్దర్ త్యాగం మరువొద్దని హితవు పలికారు. మావోయిస్టు భావజాలం ఉన్న వారిని బీజేపీలో చేర్చుకున్నారని గుర్తుచేశారు. బండి సంజయ్ మాటల వల్ల పద్మశ్రీ అవార్డుల విలువ తగ్గుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. పద్మశ్రీ అవార్డులకు పార్టీ రంగును పులుముతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గద్దర్‌ను కించపరచడమంటే ప్రతి ఒక్క ఉద్యమకారున్ని కించపరిచినట్టేనన్నారు. గద్దర్ పాడిన పాటతో తెలంగాణ వచ్చిందని గతంలో బీజేపీ నాయకులు మాట్లాడారని గుర్తుచేశారు.

బండి క్షమాపణ చెప్పాలి : మెట్టు సాయికుమార్

గద్దర్ విలువ తెలియకుండా అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ క్షమాపణ చెప్పాలని ఫిషరీస్ ఛైర్మెన్ మెట్టు సాయికుమార్ డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారుల ప్రాణ త్యాగాల విలువ తెలియని బండి సంజయ్ వారిని అవమానించారని విమర్శించారు. పద్మశ్రీ అవార్డులు ఇచ్చేది బీజేపీనా? లేక కేంద్ర ప్రభుత్వమా? అని ఆయన ప్రశ్నించారు. మావోయిస్టులు అనే అర్హత బండి సంజయ్‌కు లేదనీ, బీజేపీలో ఉన్న ఈటల రాజేందర్ భావజాలం మావోయిస్టు భావజాలం కాదా? చెప్పాలన్నారు. ఇలాంటి వారిని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి నోరు అదుపులో పెట్టించాలని సూచించారు. త్వరలోనే బీజేపీకి ప్రజలు బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

బండి వ్యాఖ్యలు వ్యక్తిగతమా? బీజేపీ అభిప్రాయమా? : రవళిరెడ్డి

గద్దర్‌కు పద్మశ్రీ అవార్డు ఇవ్వకపోవడానికి మావోయిస్టు భావజాలమున్న వ్యక్తి కావడమే అన్నట్టు కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు వ్యక్తిగతమా? లేక బీజేపీ అభిప్రాయమా? అని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రవళి రెడ్డి ప్రశ్నించారు. బుధవారం హైదరాబాద్ గాంధీభవన్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు.

మెడకాయ మీద తలకాయ ఉన్న వారెవరూ బండి సంజయ్‌లా మాట్లాడరని విమర్శించారు. కేంద్రమంత్రిగా ఉన్న బండి మతాల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బొడిగే శోభ, ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ తదితరుల్లో ఏ భావజాలం ఉందని అధ్యక్షుని హోదాలో నాడు పార్టీలో చేర్చుకున్నారని బండిని ప్రశ్నించారు.

ఏమైనా నిబంధనలున్నాయా?: సరిత తిరుపతయ్య

బీజేపీ భావజాలమున్న వారికి, ఆ పార్టీ నేతలకు అవార్డులివ్వాలని ఏమైనా నిబంధనలున్నాయా? అని జెడ్పీ మాజీ చైర్ పర్సన్, కాంగ్రెస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జి సరిత తిరుపతయ్య ప్రశ్నించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలను తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. చరిత్రలో గద్దర్ పేరు చిరస్మరణీయమని తెలిపారు.

ఆన్‌లైన్‌లో తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తే నేరమే

- కొత్త చట్టాన్ని ఆమోదించిన పాకిస్తాన్
- తప్పుబడుతున్న జర్నలిస్టు సంఘాలు



ఇస్లామాబాద్ : ఇకపై ఆన్‌లైన్‌లో తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తే దాన్ని పాకిస్తాన్ నేరంగా పరిగణించనుంది. ఈ మేరకు మంగళవారం ఒక చట్టాన్ని ఆమోదించింది. ఈ తప్పుడు చర్యకు పాల్పడిన వారికి మూడేళ్ల వరకు జైలు శిక్ష కూడా విధించనున్నారు. కాగా జర్నలిస్టు సంఘాలు ఈ చర్యను తప్పుబడుతున్నాయి. అసమ్మతిని అణచివేసేందుకే ఈ చర్యలు ఉద్దేశించబడాయని విమర్శిస్తున్నారు. తప్పుడు లేదా బూటకపు సమాచారమని నమ్మడానికి కారణం వున్నా లేదా భయాందోళనలు, అశాంతి సృష్టించే కారణంతో ఇలాంటి సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారని భావించిన పక్షంలో అటువంటి సమాచారాన్ని ఉద్దేశ్యపూర్వకంగా వ్యాప్తి చేసే వారిని ఈ చట్టం లక్ష్యంగా చేసుకుంటుంది. గత వారం ఈ చట్టాన్ని నేషనల్ అసెంబ్లీ ఆమోదించగా మంగళవారం సెనెట్ ఆమోద ముద్ర వేసింది. కాగా గ్యాలరీలో కూర్చున్న జర్నలిస్టులు నిరసనగా బయటకు వాకౌట్ చేశారు. ఈ చట్టాన్ని ఆమోద ముద్ర వేసే ముందుగా విలేకర్లతో మాట్లాడతామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని, కానీ ఇప్పుడు మోసం చేసిందని, వెన్నుపోటు పొడిచిందని సీనియర్ జర్నలిస్ట్, పాకిస్తాన్ జర్నలిస్టుల సమాఖ్య సభ్యుడు అసిఫ్ బషీర్ చౌదరి విమర్శించారు. తప్పుడు సమాచారంపై చట్టాన్ని తేవాలని తాము కూడా నిజాయితీగానే కోరుకున్నామన్నారు. అయితే బహిరంగ, పారదర్శక చర్చల ద్వారా అది జరగని పక్షంలో అందుబాటులో వున్న ప్రతి వేదికపైనా తాము దాన్ని సవాలు చేయాల్సి వుంటుందని చెప్పారు. ఇమ్రాన్ ఖాన్ తెహ్రీక్ ఇ ఇన్సాఫ్ పార్టీ సభ్యుడు, సెనెటర్ అయిన సయ్యద్ షిబ్లి ఫరాజ్ మాట్లాడుతూ, ఈ కొత్త చట్టం అత్యంత అప్రజాస్వామికమైనదని వ్యాఖ్యానించారు. తమకార్యకర్తలపై రాజకీయ ప్రతీకారం తీర్చుకోవడానికి ఇది ఉపయోగపడుతుందని విమర్శించారు.

అవినీతి నిరసనల నేపథ్యంలో సెర్బియా ప్రధాని రాజీనామా



బెల్గ్రేడ్ : సెర్బియా ప్రధాని మిలోస్ వుసెవిక్ మంగళవారం తన పదవికి రాజీనామా చేశారు. నవంబరులో నిర్మాణంలో వున్న కాంక్రీట్ స్లాబ్ కూలిపోయి 15మంది మరణించిన ఘటనపై వారాల తరబడి కొనసాగుతున్న నిరసనల నేపథ్యంలో ఈ రాజీనామా వెలువడింది. నొవి శాడ్ నగరంలో చోటు చేసుకున్న ఈ సంఘటనతో ప్రజల్లో తీవ్ర ఆగ్రహావేశాలు పెల్లుబికాయి. పెద్ద ఎత్తున అవినీతి వ్యతిరేక నిరసనలు చోటు చేసుకున్నాయి. అధ్యక్షుడు అలెగ్జాండర్ వుసిక్ నియంత పాలన పట్ల ప్రజల్లో అసమ్మతి, అసంతృప్తిలు మరింత పెరిగాయి. సెర్బియాలో ప్రజాస్వామిక స్వేచ్ఛను అణగదొక్కుతున్నారనే ఆరోపణలు వచ్చాయి. సెర్బియాలో ఉద్రిక్తతలు తగ్గించడమే తన రాజీనామా ఉద్దేశమని వుసెవిక్ పత్రికా సమావేశంలో ప్రకటించారు. ఉద్రిక్తతలు, ఆగ్రహావేశాలను తగ్గించుకుని, తిరిగి చర్చలకు రావాలన్నదే తన విజ్ఞప్తి అని ఆయన వ్యాఖ్యానించారు. కాగా ప్రధాని రాజీనామాతో పార్లమెంటరీ ఎన్నికలు త్వరగా జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. సెర్బియా పార్లమెంట్ ఈ రాజీనామాను ఆమోదించాల్సి వుంది. 30రోజుల్లోగా కొత్త ప్రభుత్వాన్ని ఎంపిక చేయాల్సి వుంది లేదా మధ్యంతర ఎన్నిలకు పిలుపివ్వాల్సి వుంటుంది. రాజధాని బెల్గ్రేడ్‌లో సోమవారం వేలాదిమంది యూనివర్శిటీ విద్యార్థులు 24గంటల పాటు రహదారుల దిగ్బంధనం నిర్వహించారు. స్లాబ్ కూలిన ఘటనకు జవాబుదారీ వహించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వంలో విశృంఖలంగా అవినీతి పెచ్చరిల్లడం వల్లనే ఈ ఘటన చోటు చేసుకుందని విమర్శకులు పేర్కొంటున్నారు. నవంబరులో స్లాబ్ కూలిపోయిన ఘటన జరిగినప్పటి నుండి అదే సమయానికి ప్రతి రోజూ 15నిముషాల పాటు విద్యార్థులు దేశవ్యాప్తంగా దిగ్బంధన పాటిస్తున్నారు.

యమునాలో 'విషం' ఆరోపణలు..

- ఆధారాలు చూపాలని కేజ్రీవాల్‌కు ఈసీ లేఖ



న్యూఢిల్లీ: హర్యానాలోని అధికార బీజేపీ యమునా నదిలోకి కావాలనే పారిశ్రామిక వ్యర్థాలను వదులుతోందని ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ చేసిన ఆరోపణలపై ఎన్నికల సంఘం (ఈసీ) స్పందించింది. ఈ ఆరోపణలకు సంబంధించిన ఆధారాలు చూపించాలని పేర్కొంటూ ఆప్‌కు లేఖ రాసింది. బుధవారం రాత్రి (జనవరి 29) 8 గంటల్లోపు వీటిని అందించాలని డెడ్‌లైన్ విధించింది.హర్యానా నుంచి ఢిల్లీకి ప్రవహిస్తున్న యమునా నదిలో అమోనియం స్థాయిలు ఆరు రెట్లు అధికంగా ఉన్నాయని ఢిల్లీలోని ఆప్ ప్రభుత్వం వాదిస్తోంది. వీటివల్ల నగరవాసులకు ఆరోగ్య సమస్యలు వస్తాయని, ఈ విషయాలన్నీ హర్యానా ప్రభుత్వానికి తెలిసినప్పటికీ ఉద్దేశపూర్వకంగానే పారిశ్రామిక వ్యర్థాలను డంప్ చేస్తున్నారని ఆరోపిస్తోంది. ఈ క్రమంలో నదిలో విషం కలపడం ద్వారా ప్రజలను హతమార్చాలని హర్యానా చూస్తోందని ఆప్ అధినేత కేజ్రీవాల్ఇటీవల సంచలన ఆరోపణలు చేశారు. మరోవైపు ఢిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీ కూడా యమునను కలుషితం చేయడం 'జల ఉగ్రవాదం'గా పేర్కొన్నారు.యమునా వ్యర్థాల వివాదంపై హరియాణా ప్రభుత్వం నుంచి ఎన్నికల సంఘం ఇటీవల వివరణ కోరింది. అమోనియా స్థాయిలపై వాస్తవిక నివేదికను జనవరి 28లోగా అందజేయాలని ఆదేశించింది. తాజాగా ఆప్‌కు లేఖ రాసిన ఈసీ.. ఆరోపణలకు సంబంధించి ఆధారాలు అందించాలని పేర్కొంది. ఇదిలా ఉంటే, ఫిబ్రవరి 5న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా.. 8న ఓట్ల లెక్కింపు జరగనుంది.

భారత జాలర్లపై శ్రీలంక నేవీ కాల్పులు

- ఇద్దరికి తీవ్ర గాయాలు
- నిరసన వ్యక్తం చేసిన భారత్



న్యూఢిల్లీ : సముద్ర జలాల్లో చేపల వేట చేపడుతున్న భారత జాలర్లపై శ్రీలంక నేవీ కాల్పులకు పాల్పడింది. ఈ కాల్పుల్లో ఇద్దరు భారత జాలర్లు తీవ్రంగా గాయపడ్డారు. మరో ముగ్గురికి స్వల్ప గాయలయ్యాయి. వీరు ప్రస్తుతం జాఫ్నా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మంగళవారం తెల్లవారు జామున ఈ ఘటన జరిగింది. 13 మంది మత్స్యకారులతో ఉన్న ఫిషింగ్ నౌకపై శ్రీలంక కాల్పులకు దిగింది. నౌకను స్వాధీనం చేసుకుంది. ఈ ఘటనపై భారత్ తీవ్ర వ్యక్తం చేసింది. న్యూఢిల్లీలోని శ్రీలంక తాత్కాలిక హైకమిషనర్‌ను పిలిపించి ఘటనపై ప్రశ్నించినట్లు కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

అలాగే కొలంబోలోని భారత హైకమిషన్ కూడా శ్రీలంక విదేశాంగ మంత్రిత్వ శాఖ వద్ద ఈ ఘటన విషయాన్ని లేవనెత్తినట్లు ప్రకటనలో వెల్లడించింది. భారత జాలర్లకు జాఫ్నాలోని భారత కాన్సులేట్ అధికారులు అన్ని విధాలుగా సహాయాన్ని అందిస్తున్నట్లు తెలిపింది. 'బలాన్ని ఉపయోగించడం ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదయోగ్యం కాదు. ఈ విషయంలో రెండు ప్రభుత్వాల మధ్య ఉన్న అవగాహనలను ఖచ్చితంగా పాటించాలి' అని విదేశాంగ శాఖ ప్రకటనలో పేర్కొంది. మరోవైపు ఈ ఘటనపై శ్రీలంక నావికాదళం స్పందిస్తూ భారత జాలర్లు దూకుడుగా ప్రవర్తించారని అందుకే ఈ కాల్పుల ప్రక్రియ చోటు చేసుకుందని తెలిపింది.

యూసీసీ, వక్ఫ్ బిల్లుపై

పార్లమెంట్‌దే తుది నిర్ణయం : ఒమర్ అబ్దుల్లా



జమ్ము : ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ), వక్ఫ్ (సవరణ)బిల్లుపై పార్లమెంటే తుది నిర్ణయం తీసుకుంటుందని జమ్ముకాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తెలిపారు. బీజేపీ పాలిత రాష్ట్రం ఉత్తరాఖండ్‌లో సోమవారం నుంచి యూసీసీని అమలు చేయడం, వక్ఫ్ బిలుపై బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ సభ్యులు ప్రతిపాదించిన అన్ని సవరణలను జాయింట్ పార్లమెంటరీ కమిటీ ఆమోదించిన నేపథ్యంలో ఒమర్ అబ్దుల్లా ఈ వ్యాఖ్యలు చేశారు. 'దేశంలో అమలు చేయడం కోసం ఒక చట్టం వచ్చే వరకూ వారు చేయాలనుకున్నది చేయనివ్వండి. చివరికి పార్లమెంట్ దీనిపై నిర్ణయం తీసుకుంటుంది. వ్యక్తులు, రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు కాదు' అని అబ్దుల్లా చెప్పారు. వక్ఫ్ బిల్లుపై పార్లమెంటరీ కమిటీ ఇంకా చర్చలు జరుపుతోందని, ప్రభుత్వం ఏ చట్టాన్ని అమలు చేయడం లేదని అన్నారు.



రైల్వే కార్మికుల సమ్మెతో బంగ్లాదేశ్ వ్యాప్తంగా రద్దయిన రైళ్ళు

ఢాకా : అధిక పెన్షన్లు, ఇతర ప్రయోజనాలు కల్పించాలని కోరుతూ రైల్వే సిబ్బంది సమ్మెకు దిగడంతో మంగళవారం బంగ్లాదేశ్‌వ్యాప్తంగా రైళ్ళు రద్దయ్యాయి. ఫలితంగా వేలాదిమంది ప్రయాణికులు ఇబ్బందుల పాలయ్యారు. సరుకు రవాణాకు అంతరాయం కలిగింది. సిబ్బంది కోరుతున్న డిమాండ్ల పరిష్కారం కోసం మహ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వంతో సోమవారం పొద్దుపోయిన తర్వాత జరిగిన సమావేశం విఫలమవడంతో సమ్మెకు పిలుపిచ్చినట్లు బంగ్లాదేశ్ రైల్వే రన్నింగ్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ తాత్కాలిక అధ్యక్షుడు సైదుర్ రహమాన్ చెప్పారు. తమ డిమాండ్లు ప్రభుత్వం ఆమోదించని పక్షంలో సమ్మె కొనసాగుతుందని ఆయన తెలిపారు. ఏటా ఆరున్నర కోట్ల మంది ప్రయాణికులను గమ్య స్థానాలకు చేర్చే బంగ్లాదేశ్ రైల్వేలో 25వేల మంది ఉద్యోగులు వున్నారు. 36వేల కిలోమీటర్లకు పైగా రైల్వే నెట్‌వర్క్ వుంది. రాజధాని ఢాకాలోని ప్రధాన కమలాపూర్ రైల్వే స్టేషన్‌పై వందలాదిమంది ప్రయాణికులు దాడి చేశారు. వాయవ్య ప్రాంతంలోని రాజ్‌షాహి నగరంలో ఆగ్రహోదగ్రులైన ప్రయాణికులు స్టేషన్‌లోని ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. సిబ్బందిపై దాడి చేశారు. సమ్మె వార్త తెలియక వచ్చిన వారందరూ గంటల తరబడి చిక్కుకుపోవాల్సి వచ్చింది. కాగా అధికారులు ప్రత్యామ్నాయంగా బస్సులను ఏర్పాటు చేశారు. దేశంలోనే రెండవ అతిపెద్ద నగరమైన చట్టోగ్రామ్‌లో రైల్వే సిబ్బంది నిరసనలకు దిగారు.

బిజినెస్

క్యూ3లో రెట్టింపు లాభాలు



న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగంలోని భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (భెల్) ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. ఈ భారీ విద్యుత్ పరికరాల తయారీ సంస్థ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 135 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే క్యూ3లో రూ.60.3 కోట్ల లాభాలు నమోదు చేసింది. దీంతో పోల్చితే గడిచిన క్యూ3లో రెట్టింపు పైగా ప్రగతిని కనబర్చింది. సంస్థ రూ.121 కోట్ల లాభాలు ఆర్జించే అవకాశాలున్నాయని బ్లూమ్‌బర్గ్ వేసిన అంచనాలు మించి ప్రగతిని కనబర్చడం విశేషం. క్రితం క్యూ3లో భెల్ రెవెన్యూ 32.2 శాతం పెరిగి రూ.7,277 కోట్లకు చేరిందని ఆ కంపెనీ ఫైలింగ్‌లో తెలిపింది.

హ్యుందాయ్‌కి డిమాండ్ దెబ్బ

ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీ హ్యుందాయ్ ఇండియా 2024-25 డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 19 శాతం పతనంతో రూ.1,161 కోట్ల నికర లాభాలు నమోదు చేసింది. అంతర్జాతీయ భౌగోళిక ప్రతికూలాంశాలు, డిమాండ్ లేమి ఫలితాలపై ప్రభావం చూశాయి. దిగ్గజ కార్ల తయారీ కంపెనీ 2023-24 ఇదే క్యూ3లో రూ.1,425 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇదే సమయంలో రూ.16,875 కోట్లుగా ఉన్న రెవెన్యూ.. గడిచిన క్యూ3లో రూ.16,648 కోట్లకు తగ్గింది. ఇదే సమయంలో కంపెనీ అమ్మకాలు 2 శాతం తగ్గి 1,86,408 యూనిట్లకు పడిపోయాయి. మంగళవారం బీఎస్ఈలో హ్యుందాయ్ ఇండియా షేర్ 1.27 శాతం తగ్గి రూ.1,622.75 వద్ద ముగిసింది.

టీసీఐ లాభాల్లో 27 శాతం వృద్ధి

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (టీసీఐ) నికర లాభాలు ఏడాదికేడాదితో పోల్చితే 27 శాతం పెరిగి రూ.102 కోట్లకు చేరాయి. అదే సమయంలో కంపెనీ రెవెన్యూ 14 శాతం వృద్ధితో రూ.1,154 కోట్లుగా నమోదయ్యింది. చమురు ధరలు కొంత దిగిరావడం ఫలితాలకు మద్దతను అందించాయని టిసిఐ మేనేజింగ్ డైరెక్టర్ వినీత్ అగర్వాల్ పేర్కొన్నారు. అదే విధంగా తమ భాగస్వామ్య కంపెనీల నుంచి వచ్చిన డివిడెండ్లు సహాయం చేశాయన్నారు. ఈ నేపథ్యంలో మెరుగైన ఫలితాలు సాధించగలిగామన్నారు.

బజాజ్ ఆటోకు రూ.2,109 కోట్ల లాభాలు

బజాజ్ ఆటో 2024-25 డిసెంబర్ త్రైమాసికంలో 3 శాతం వృద్ధితో రూ.2,109 కోట్ల నికర లాభాలు సాధించింది. అదే సమయంలో కంపెనీ రెవెన్యూ 6 శాతం పెరిగి రూ.12,807 కోట్లకు చేరింది. గడిచిన క్యూ3లో కంపెనీ అమ్మకాలు 2 శాతం పెరిగి 12.24 లక్షల యూనిట్లుగా చోటు చేసుకున్నాయని వెల్లడించింది. దేశీయ మార్కెట్లు నిరాశపర్చినప్పటికీ ఎగుమతులు మద్దతును అందించాయని ఆ కంపెనీ వెల్లడించింది.

ఐదేండ్లలో రెట్టింపైన క్రెడిట్ కార్డులు : ఆర్బీఐ



న్యూఢిల్లీ : గడిచిన ఐదేళ్లలో క్రెడిట్ కార్డుల జారీ రెట్టింపు అయ్యిందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెల్లడించింది. డిసెంబర్ 2019లో 5 కోట్లుగా ఉన్న క్రెడిట్ కార్డులు ప్రస్తుతం 10.80 కోట్లకు చేరుకున్నాయని తెలిపింది. ఇదే సమయంలో డెబిట్ కార్డుల జారీలో మాత్రం పెద్దగా పెరుగుదల లేకపోవడం విశేషం. 2019 డిసెంబర్ నాటికి 80.53 కోట్లుగా ఉన్న డెబిట్ కార్డులు.. ప్రస్తుతం 99.08 కోట్లకు చేరాయి. ఆర్బీఐ రిపోర్ట్ ప్రకారం.. 2024లో 447.23 కోట్ల కార్డు చెల్లింపుల లావాదేవీలు జరిగాయి. కార్డు చెల్లింపుల్లో డెబిట్ కార్డులతో పోల్చితే క్రెడిట్ కార్డుల చెల్లింపులే 15 శాతం అదనంగా ఉండటం విశేషం. 2024 డిసెంబర్ ముగింపు నాటికి ప్రభుత్వ రంగ బ్యాంక్‌లు 2.57 కోట్ల క్రెడిట్ కార్డులను జారీ చేశాయి. ఐదేండ్ల క్రితం నాటి 1.22 కోట్ల కార్డులతో పోల్చితే 110 శాతం పెరుగుదల చోటు చేసుకుంది. ప్రయివేటు రంగ బ్యాంక్‌లు 7.66 కోట్ల క్రెడిట్ కార్డులతో 71 శాతం మార్కెట్ వాటాను కలిగి ఉన్నాయి. అధిక ఫీజుల వల్ల విదేశీ బ్యాంక్‌ల కార్డుల జారీ 65.79 లక్షల నుంచి 45.94 లక్షలకు పడిపోవడం ద్వారా వాటి మార్కెట్ వాటా కూడా 11.9 శాతం నుంచి 4.3 శాతానికి పరిమితమయ్యాయి.

క్రెడ్‌లో రూపీ డిజిటల్ కరెన్సీ

న్యూఢిల్లీ : ప్రముఖ ఫిన్‌టెక్ సంస్థ క్రెడ్‌లో ఈ-రూపీ వాలెట్‌ను అందిస్తోన్నట్టు ఆసంస్థ తెలిపింది. ఇందుకోసం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో డిజిటల్ కరెన్సీ పైలట్ ప్రాజెక్టులో భాగం అయినట్లు తెలిపింది. యెస్ బ్యాంక్‌తో కలిసి ఇ- రూపీ వాలెట్ బీటా వెర్షన్‌ను ప్రారంభించినట్టు వెల్లడించింది. దీంతో ఇ-రూపీ వాలెట్ అందిస్తున్న తొలి ఫిన్‌టెక్ సంస్థగా నిలువనుంది. వచ్చే కొన్ని నెలల్లో తమ క్రెడ్ వినియోగదారులందరికీ ఈ సదుపాయాన్ని అందించనున్నట్టు పేర్కొంది.

కంట్రీడిలైట్ నుంచి తేనే

హైదరాబాద్ : సహజ నిత్యావసరాల ఉత్పత్తుల బ్రాండ్ కంట్రీ డిలైట్ తాజాగా 100 శాతం స్వచ్ఛమైన వ్యవసాయ తేనెను అందుబాటులోకి తెచ్చినట్టు తెలిపింది. జర్మనీలోని న్యూక్లియర్ మాగ్నెటిక్ రెసోనెన్స్ (ఎన్ఎంఆర్) టెక్నాలజీ ద్వారా పరీక్షించినట్టు కంట్రీ డిలైట్ సిఇఒ, సహ వ్యవస్థాపకులు చక్రధర్ గాదె పేర్కొన్నారు. ఇది భారతీయ కుటుంబాలకు అందుబాటులో ఉన్న అత్యంత ప్రామాణికమైన, నమ్మదగిన వంటగది పదార్థాలలో ఒకటిగా నిలుస్తుందన్నారు. 17 నగరాల్లో లభించే ఈ 450 మిల్లీలీటర్ల తేనే ధరను ఆయా ప్రాంతాన్ని బట్టి రూ.196 రూ.233 మధ్య ఉంటుందన్నారు.

విక్రేతలకు అమెజాన్ అహ్వానం

న్యూఢిల్లీ : విక్రేతలు అమెజాన్‌లో నమోదు చేసుకోవడం ద్వారా భారత్‌లోనే కాకుండా విదేశాల్లోనూ లక్షలాది వినియోగదారులను పొందడానికి తాము ప్రోత్సహాన్ని అందించనున్నట్టు అమెజాన్ ఇండియా పేర్కొంది. ఇందుకోసం 'దిఖోగే తో బికోగే' క్యాంపెయిన్‌ను ప్రారంభించినట్టు పేర్కొంది. చిన్న వ్యాపారాలకు దాని డిజిటల్ మార్కెట్‌ప్లేస్‌లలో అమ్మకాలు ఎలా సరళమైనవి, ప్రభావవంతంగా ఉంటాయో అవగాహనను బలోపేతం కల్పించటానికి ఈ ప్రచారం దోహదం చేయనుందని పేర్కొంది. అంతర్జాతీయంగా 18 దేశాల్లో అవకాశాలను కల్పిస్తున్నట్టు తెలిపింది.

పేటీయం సీఈఓ నకుల్ జైన్ రాజీనామా



బెంగళూరు : ప్రముఖ డిజిటల్ చెల్లింపుల వేదిక పేటియం చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ) నకుల్ జైన్ రాజీనామా చేశారు. ఈ విషయాన్ని స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు తెలిపింది. ఆయన స్థానంలో కొత్త చీఫ్‌ను నియమించేందుకు తగు వ్యక్తి కోసం అన్వేషిస్తున్నామని పేర్కొంది. త్వరలోనే కొత్త పేరును ప్రకటిస్తామని వెల్లడించింది. నకుల్ సొంతంగా వ్యాపారాన్ని ప్రారంభించనున్నారని తెలుస్తోంది.

పర్యావరణ కాలుష్య నియంత్రణకు లక్ష్యాల నిర్దేశం మంచిదే


- సీఎస్ శాంతికుమారి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పర్యావరణ కాలుష్య నియంత్రణ కోసం రాబోయే కాలానికి తగిన లక్ష్యాలు నిర్దేశించుకోవటం మంచిదని సీఎస్ శాంతికుమారి తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో తెలంగాణా పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ (టీజీపీసీబీ) ఎంప్లాయీస్ అసోసియేషన్ డైరీ 2025ని ఆమె విడుదల చేశారు. సంస్థాగత సమన్వయాన్ని పెంపొందించడంలో, రాబోయే ఏడాదికి రాష్ట్ర పర్యావరణ లక్ష్యాలను నిర్దేశించుకోవటం మంచి పరిణామమన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీవాత్సవ, జనరల్ సెక్రెటరీ డి.కృపానంద్, జాయింట్ సెక్రెటరీ సుమతి జగన్నాద్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ స్వప్న, కల్చరల్ సెక్రెటరీ అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ సీఎం చంద్రబాబుకు ఊరట

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో



ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ఆయనపై నమోదైన కేసుల విచారణను సీఐడీ నుంచి సీబీఐకి బదిలీ చేయాలన్న పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. చంద్రబాబుపై నమోదైన ఏడు కేసులను సీబీఐకి బదిలీ చేయాలని హైకోర్టు న్యాయవాది బి. బాలయ్య సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బేలా ఎం.త్రివేది, జస్టిస్ బాలచంద్ర వరాలేలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది మణీందర్ సింగ్ వాదనలు వినిపించేందుకు ప్రయత్నించారు. ధర్మాసనం జోక్యం చేసుకుని ఇది పూర్తిగా పనికిమాలిన పిటిషన్ అని అన్నది. అయితే సీనియర్ న్యాయవాది మణీందర్ సింగ్ ఆగకుండా వాదనలు వినిపించడానికి సిద్ధమైయ్యారు. దీంతో ఆయనపై ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. ఈ పిటిషన్‌కు సంబంధించిన ఒక్క మాట మాట్లాడినా భారీ జరిమానా విధిస్తామని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇలాంటి కేసుల్లో కూడా మీలాంటి సీనియర్లు హాజరవుతారని అసలు ఊహించలేదని సీనియర్ న్యాయవాది మణీందర్ సింగ్‌ను ఉద్దేశించి ధర్మాసనం వ్యాఖ్యానించింది. దీంతో ఒక్క మాట కూడా వినకుండానే పిటిషన్‌ను ధర్మాసనం కొట్టివేసింది.

ఉద్యోగుల సమస్యలును పరిష్కరించండి

- సీఎస్ శాంతికుమారికి టీపీటీయూ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని టీపీటీయూ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) శాంతికుమారిని మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం రాధాకృష్ణారావు, ప్రధాన కార్యదర్శి పట్నోళ్ల చంద్రశేఖర్, అదనపు ప్రధాన కార్యదర్శి కె సారయ్య కలిసి వినతిపత్రం సమర్పించారు. పెండింగ్‌లో ఉన్న సప్లిమెంటరీ బిల్లులు, మెడికల్ సరెండర్ లీవులు, జీపీఎఫ్ వంటి వాటిని వెంటనే చెల్లించాలని కోరారు. ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రావాల్సిన అన్ని రకాల బెనిఫిట్లను వెంటనే విడుదల చేయాలని తెలిపారు. కొంత మంది ఉపాధ్యాయులకు వివిధ కారణాలతో పీఆర్సీ-2020 అమలు కాలేదని పేర్కొన్నారు. వారికి పీఆర్సీని అమలు చేయాలని కోరారు. ఉద్యోగుల కాంట్రిబ్యూషన్‌తో ఈహెచ్ఎస్‌ను అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో అమలయ్యేలా నగదు రహిత వైద్యం అందేలా విధానాన్ని రూపొందించాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను ఇవ్వాలనీ, పీఆర్సీ-2023ను అమలు చేయాలని పేర్కొన్నారు. 317 జీవో ద్వారా స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయ, ఉద్యోగులకు వారి సొంత జిల్లాలకు తేవాలని సూచించారు.

అవినీతి నిరసనల నేపథ్యంలో సెర్బియా ప్రధాని రాజీనామా

బెల్గ్రేడ్ : సెర్బియా ప్రధాని మిలోస్ వుసెవిక్ మంగళవారం తన పదవికి రాజీనామా చేశారు. నవంబరులో నిర్మాణంలో వున్న కాంక్రీట్ స్లాబ్ కూలిపోయి 15మంది మరణించిన ఘటనపై వారాల తరబడి కొనసాగుతున్న నిరసనల నేపథ్యంలో ఈ రాజీనామా వెలువడింది. నొవి శాడ్ నగరంలో చోటు చేసుకున్న ఈ సంఘటనతో ప్రజల్లో తీవ్ర ఆగ్రహావేశాలు పెల్లుబికాయి. పెద్ద ఎత్తున అవినీతి వ్యతిరేక నిరసనలు చోటు చేసుకున్నాయి. అధ్యక్షుడు అలెగ్జాండర్ వుసిక్ నియంత పాలన పట్ల ప్రజల్లో అసమ్మతి, అసంతృప్తిలు మరింత పెరిగాయి. సెర్బియాలో ప్రజాస్వామిక స్వేచ్ఛను అణగదొక్కుతున్నారనే ఆరోపణలు వచ్చాయి. సెర్బియాలో ఉద్రిక్తతలు తగ్గించడమే తన రాజీనామా ఉద్దేశమని వుసెవిక్ పత్రికా సమావేశంలో ప్రకటించారు. ఉద్రిక్తతలు, ఆగ్రహావేశాలను తగ్గించుకుని, తిరిగి చర్చలకు రావాలన్నదే తన విజ్ఞప్తి అని ఆయన వ్యాఖ్యానించారు. కాగా ప్రధాని రాజీనామాతో పార్లమెంటరీ ఎన్నికలు త్వరగా జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. సెర్బియా పార్లమెంట్ ఈ రాజీనామాను ఆమోదించాల్సి వుంది. 30రోజుల్లోగా కొత్త ప్రభుత్వాన్ని ఎంపిక చేయాల్సి వుంది లేదా మధ్యంతర ఎన్నిలకు పిలుపివ్వాల్సి వుంటుంది. రాజధాని బెల్గ్రేడ్‌లో సోమవారం వేలాదిమంది యూనివర్శిటీ విద్యార్థులు 24గంటల పాటు రహదారుల దిగ్బంధనం నిర్వహించారు. స్లాబ్ కూలిన ఘటనకు జవాబుదారీ వహించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వంలో విశృంఖలంగా అవినీతి పెచ్చరిల్లడం వల్లనే ఈ ఘటన చోటు చేసుకుందని విమర్శకులు పేర్కొంటున్నారు. నవంబరులో స్లాబ్ కూలిపోయిన ఘటన జరిగినప్పటి నుండి అదే సమయానికి ప్రతి రోజూ 15నిముషాల పాటు విద్యార్థులు దేశవ్యాప్తంగా దిగ్బంధన పాటిస్తున్నారు.

ముస్లిం సెక్యులర్ చట్టాలను అనుసరించవచ్చా లేక షరియానే పాటించాలా ?

- కేంద్రాన్ని ప్రశ్నించిన సుప్రీం కోర్టు



న్యూఢిల్లీ : ముస్లిం కుటుంబంలో జన్మించిన వ్యక్తి ఆస్తి వ్యవహారాలకు సంబంధించి సెక్యులర్ చట్టాలను అనుసరించవచ్చా లేక ముస్లిం పర్సనల్ లా అయిన షరియాకే కట్టుబడి వుండాలా అని సుప్రీం కోర్టు మంగళవారం కేంద్రాన్ని ప్రశ్నించింది. ఏకీకృత పౌర స్మృతి (యుసిసి)పై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న వేళ, ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని బెంచ్, కేంద్రానికి ఈ విషయమై సమాధానం చెప్పేందుకు నాలుగు వారాల గడువు ఇచ్చింది. తదుపరి విచారణను మే 5కి వాయిదా వేసింది. కేరళకు చెందిన సఫియా అనే మహిళ ఈ విషయమై పిటిషన్ దాఖలు చేసింది. తన మొత్తం ఆస్తిని తన కుమార్తెకే ఇవ్వాలనుకుంటున్నానని ఆమె తెలిపింది. తన కుమారుడు ఆటిజంతో బాధపడుతున్నాడని, అతడి బాగోగులు తన కుమార్తె చూసుకుంటుందని పిటిషనర్ తెలిపింది.

కానీ షరియా ప్రకారం, తల్లిదండ్రులు తమ ఆస్తిని విభజించాల్సి వస్తే కుమార్తె వాటా కన్నా రెట్టింపు కొడుకుకు లభించాల్సి వుంటుంది. ఇక్కడ తన కేసులో ఒకవేళ ఆటిజం (డౌన్ సిండ్రోమ్)తో బాధపడుతున్న తన కుమారుడు చనిపోతే తన కుమార్తెకు కేవలం మూడో వంతు మాత్రమే ఆస్తి దక్కుతుందని, మిగిలిన ఆస్తి అంతా బంధువుకు వెళ్ళిపోతుందని పిటిషనర్ పేర్కొంది.

ఢిల్లీ ఎన్నికల్లో దళితులు కీలకం

కాషాయపార్టీకి వ్యతిరేకంగా దళితుల

గత రెండు ఎన్నికల్లో ఒక్క రిజర్వ్‌డ్ స్థానం కూడా గెలవని కమలం

ఈసారి కూడా అదే జరగొచ్చంటున్న విశ్లేషణలు



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో అధికార ఆమాద్మీ పార్టీ(ఆప్), బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్య త్రిముఖ పోరు నెలకొన్నది. ఓటర్లను ఆకర్షించేందుకు మూడు ప్రధాన పార్టీలు పోటీపడుతున్నాయి. ముఖ్యంగా, ఈ ఎన్నికల్లో దళిత ఓట్లే కీలకంగా మారాయి. దాంతో ఆ వర్గం ఓట్ల కోసం మూడు పార్టీలు ప్రత్యేక దృష్టి పెట్టాయి. ఫలితంగా, ఈసారి ఢిల్లీలో దళితుల ఓట్లు మూడు పార్టీల మధ్య చీలిపోయే అవకాశమున్నదని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

బీజేపీకి వ్యతిరేకంగా దళితులు

ఢిల్లీలోని మొత్తం 70 అసెంబ్లీ స్థానాల్లో 12 ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానాలున్నాయి. అంతేగాక, మరో 30 నియోజకవర్గాల్లో అభ్యర్థుల గెలుపోటములను నిర్ణయించే స్థాయిలో దళితుల ఓట్లు ఉన్నాయి. ఢిల్లీలో గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లోనూ దళిత ఓటర్లు బీజేపీకి వ్యతిరేకంగా నిలబడ్డారు. 2015, 2020 అసెంబ్లీ ఎన్నికల్లో 12 ఎస్సీ నియోజకవర్గాల్లో ఒక్క స్థానం కూడా ఆ పార్టీ గెలవలేకపోయింది. అలాగే దళిత ఓట్లు గణనీయంగా ఉన్న నియోజకవర్గాల్లో కూడా బీజేపీ ఓటమి చవి చూసింది.

గత రెండు పర్యాయాలు ఆప్ వరుసగా అధికారంలోకి రావడంలో దళితుల ఓట్లు కీలకపాత్ర పోషించాయి. అయితే, రెండు సార్లు ఆప్‌నకు అధికారం కట్టబెట్టినా దళితులు ఈసారి ఎటువైపు ఉన్నారని చర్చ జరుగుతోంది. దళితుల్లో కొందరు ప్రస్తుతం ఆప్‌పై అసంతృప్తితో ఉన్నట్టు విశ్లేషణలు వెల్లడవుతోన్నాయి. అందుకే ఈ ఎన్నికల్లో ఆప్‌నకు దళితుల మద్దతు కొద్ది మేర తగ్గే అవకాశమున్నదని రాజకీయ విశ్లేషకులు చెబుతోన్నారు. అయితే, దళితులు ఆప్‌నకు పూర్తిగా దూరంగా లేరనీ, గతం కంటే కొద్దిగా దళిత ఓటర్ల మద్దతు ఆప్‌నకు తగ్గొచ్చని అంటున్నారు. ఇక బీజేపీకైతే దళితుల ఆదరణ లభించదదని విశ్లేషకులు కచ్చితంగా చెప్తున్నారు. అంబేద్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వివాదాస్పద వ్యాఖ్యలూ దళితులకు కోపాన్ని తెప్పిం చటమూ మరొక కారణంగా వారు వివరిస్తున్నారు. అయినప్పటికీ, కీలకంగా ఉన్న దళిత ఓటర్ల మనసు గెలువాలని ఆ పార్టీ ప్రణాళిలు సిద్ధం చేస్తోంది. దళితులను ఆకర్షించేందుకు అనేక వ్యూహాలను రచిస్తోంది. వారిని ఊరించే హామీలు గుప్పిస్తోంది. దళిత మెజారిటీ నియోజకవర్గాల్లో విస్తృతంగా ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తోంది. దళితుల ఓట్లను ఆకర్షించేందుకు గత కొన్ని నెలలుగా బీజేపీ ఎస్సీ మోర్చా ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తోంది.ఆప్‌నకు తగ్గిన ఆ కొద్ది మేర దళిత మద్దతు కాంగ్రెస్‌కు బదిలీ కానున్నదని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

వారి ఓట్లపై ప్రధాన పార్టీల గురి

ఆప్ పట్ల దళిత ఓటర్లు అసంతృప్తిగా ఉండటంతో తమకు ఎస్సీ నియోజ కవర్గాలు కలిసి వస్తాయని కాంగ్రెస్ పార్టీ లెక్కలు వేస్తోంది. కాంగ్రెస్‌కు ఆశాకిరణంగా ఉన్న రాహుల్ గాంధీ ప్రచారంతో కూడా కొద్దిమేర కాంగ్రెస్ లాభం పొందవచ్చం టున్నారు. కానీ, దళిత ఓటర్లను ఆకర్షించడంలో మాత్రం కాంగ్రెస్ ఆలస్యం చేస్తోందని అభిప్రాయ పడుతున్నారు. ఈ విషయాన్ని గతేడాది ఆప్ నుంచి బయటకు వచ్చి కాంగ్రెస్‌లో చేరిన మాజీ మంత్రి రాజేంద్ర పాల్ గౌతమే స్వయంగా ఈ విషయాన్ని చెప్పారు.

దళిత ఓటర్లను ఆకర్షించేలా ముందే ప్రచారం ప్రారంభించి ఉంటే మరింత మద్దతు పొందేవాళ్లమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ క్రమంలో ఆప్‌నకు దళితుల్లో ఆదరణ తగ్గినప్పటికీ.. మెజారిటీ దళిత ఓటర్లు 'చీపురు' వైపే మొగ్గే అవకాశం కనిపిస్తున్నదని తెలుస్తున్నది. ఎందుకంటే, బీజేపీపై ఢిల్లీ దళితుల్లో సదభిప్రాయం లేకపోవడం, కాంగ్రెస్ పార్టీ దళితులను ఆకర్షించడంలో కాస్త వెనకపడటం వంటి పరిణామాలు ఆప్‌నకు కలిసివచ్చేలా ఉన్నాయి. మూడు పార్టీలను పోల్చి చూస్తే తమకు ఆప్ మాత్రమే బెటర్ అనే ఆలోచనలో మెజారిటీ దళితులు ఉన్నట్టు విశ్లేషణలు వెల్లడిస్తున్నాయి.

బడ్జెట్‌లో ప్రాధాన్యం

- ఏపీ ప్రాజెక్టులకు నిధులు : ఎంపీలకు చంద్రబాబు దిశానిర్దేశం



అమరావతి : కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి సాధ్యమైనంత మేర ప్రాధాన్యం లభించేలా చూడాలని, అదే సమయంలో వివిధ ప్రాజెక్టులకు, పథకాలకు నిధులు సాధించాలని టిడిపి ఎంపిలకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దిశా నిర్దేశం చేశారు ఫిబ్రవరి1న కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో మంగళవారం ఉండవల్లిలోని ఆయన నివాసంలో టిడిపి పార్లమెంటరీ పార్టీ సమావేశం చంద్రబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో బాబు మాట్లాడుతూ నూతన రైల్వే ప్రాజెక్టుల సాధన కోసం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నడికుడి-కాళహస్తి రైల్వే లైన్, రేణిగుంట- గూడూరు, కోటిపల్లి- నర్సాపూర్, కడప- బెంగళూరు ప్రాజెక్టుల త్వరిత గతిన పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు కేటాయించేలా చూడాలన్నారు. దీనికి సంబంధించి ఎమ్మెల్యేలు, కలెక్టర్లుతో సమన్వయం చేసుకుని విజన్ డాక్యుమెంటు సిద్ధం చేయాలన్నారు. విశాఖపట్టణం, విజయవాడలకు మెట్రో రైలు ప్రాజెక్టులు వచ్చేలా చూడాలని సూచించారు. విభజన చట్టంలోని పెండింగ్ అంశాలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూడాలని చెప్పారు. దేశంలో ఏ రాష్ట్రానికి లేని సముద్ర తీరం మనకు ఉందని, పోర్టుల నిర్మాణం ద్వారా సద్వినియోగం చేసుకుంటే పెద్దఎత్తున ఉపాధి లభించడంతో పాటు సంపద సృష్టి జరుగుతుందన్నారు. కొత్త రహదారులు రాష్ట్రానికి కేటాయించేలా రహదారుల విస్తరణకు అనుమతులు వచ్చేలా పనిచేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన పాలసీలపై నూతన ఆవిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞానం విదేశాల్లో అమలవుతున్న ప్రాజెక్టులు, పాలసీలపై ఎంపిలు అవగాహన పెంచుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు రాష్ట్రానికి ఏ విధంగా ఉపయోగపడతాయో అధ్యయనం చేసి సంబంధిత మంత్రులకు తెలపాలన్నారు. గోదావరి- బనకచర్ల ప్రాజెక్టు గేమ్ ఛేంజర్‌లా పనిచేస్తుందని, అది పూర్తయితే రాష్ట్ర రైతాంగానికి పెద్ద ఎత్తున ప్రయోజనం చేకూరుతుందని సిఎం అభిప్రాయపడ్డారు. ఉపాధిహామీ వంటి పథకాలకు అనుమతులిచ్చే విషయంపై స్థానిక ఎమ్మెల్యేలతో సంప్రదించి కేటాయించాలని చంద్రబాబునాయుడు సూచించారు. సిఎస్ఆర్ నిధులు ఖర్చు చేసేటప్పుడు జిఎస్‌టి లేకుండా చూడాలని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రస్తావించగా సిఎం సానుకూలంగా స్పందించారు. టిడిపిపార్లమెంటరీ పార్టీ నాయకుడు లావు శ్రీకృష్ణ దేవరాయలు మాట్లాడుతూ వక్ఫ్ అమెండ్‌మెంట్ బిల్లు -2024 జాయింట్ పార్లమెంట్ కమిటీకి వెళ్లడానికి టిడిపి ఎంపిల కృషే కారణమని, బిల్లుకు 14 సవరణలు ఆమోదించగా ఇందులో 4 టిడిపి ప్రతిపాదించినవే అని అన్నారు. పార్లమెంట్ సమావేశాలకు ఎంపీలు హాజరు దేశ వ్యాప్తంగా ఉన్న సగటు కంటే ఎపి టిడిపి ఎంపిలు హాజరు అధికంగా ఉందన్నారు. అదే విధంగా సభ్యులు ప్రశ్నలు అడగడంలో జాతీయ సగటు 9శాతం ఉంటే రాష్ట్రానిది 20శాతంఉందని సిఎం తెలిపారు. ఎంపిల సమావేశంలో రాష్ట్ర విద్యాశాఖమంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. సమావేశంలో రాష్ట్రరాజకీయాలు, విజయసాయిరెడ్డి రాజీనామాతో పాటు దావోస్ పర్యటన తదితర అంశాలు ఈ సమావేశంలో ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం.

శిధిలాల్లో జీవన పోరాటం !

స్వస్థలాలకు చేరిన 3లక్షలమంది పాలస్తీనియన్లు !

గాజా, జెరూసలేం : కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చిన తర్వాత దక్షిణ గాజా నుండి మూడు లక్షలమందికి పైగా పాలస్తీనియన్లు ఉత్తర గాజాకు చేరుకున్నారు. స్వస్థలాలకు రావాలనే ఉత్సాహంతో వచ్చినా ఇక్కడి రాళ్ళు రప్పల మధ్య బతుకు ఎలా కొనసాగించాలో తెలియని అయోమయ పరిస్థితి ఏర్పడింది. తమ ఇళ్ళు ధ్వంసమైన ఆ శిధిలాల్లోనే వారు తాత్కాలిక ఆశ్రయాలు ఏర్పాటు చేసుకునేందుకు ప్రయత్నాలు చేయడం కనిపిస్తోంది. మరోసారి తమ జీవితాన్ని మొదటి నుండి ఆరంభించేందుకు వారు సమాయత్తమవుతున్నారని మీడియా వర్గాలు తెలిపాయి. 15మాసాల తర్వాత మొదటిసారిగా గాజాకు వంట గ్యాస్ వచ్చింది. పరిమిత స్థాయిలోనే అయినప్పటికీ రావడం ఆరంభమైందని ప్రభుత్వ మీడియా కార్యాలయం తెలిపింది.

కాగా మరోవైపు ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో పాస్తీనియన్లపై ఇజ్రాయిల్ అణచివేత చర్యలకు కనుచూపు మేరలో అంతం కనిపించడం లేదు. గత 48గంటల్లో గాజాలోని ఆస్పత్రులకు 48 మృతదేహాలు వచ్చాయని ఆరోగ్య శాఖ వర్గాలు తెలిపాయి. ఇదిలావుండగా కాల్పుల విరమణ ఒప్పందాన్ని హమాస్ సాధించిన విజయంగా ఇరాన్ మత పెద్ద ఆయతుల్లా అలీ ఖమేని వ్యాఖ్యానించారు. ఈ ఒప్పందంతో ఇజ్రాయిల్ తలలు వంచిందని అన్నారు.

యుఎన్ఆర్‌డబ్ల్యుఎతో సంబంధాలు తెగతెంపులు

పాలస్తీనా శరణార్థుల కోసం పనిచేస్తున్న ఐక్యరాజ్య సమితి సహాయక సంస్థ యుఎన్ఆర్‌డబ్ల్యుఎతో అన్ని సంబంధాలను తెగతెంపులు చేసుకోనున్నట్లు ఇజ్రాయిల్ రాయబారి ఐక్యరాజ్య సమితికి మంగళవారం తెలిపారు. ఈ సంస్థ తమ భద్రతకు విఘాతం కలిగిస్తోందని ఇజ్రాయిల్ పదే పదే ఆరోపిస్తూ వస్తోంది. ఆ సంస్థతో లేదా ఆ సంస్థతో సంబంధాలు కలిగిన మరే ఇతర సంస్థతోనూ తాము సంబంధాలు కొనసాగించలేమని స్పష్టం చేసింది. కమ్యూనికేషన్, సహకార సంబంధాలు మొత్తంగా రద్దవుతాయని రాయబారి డేనీ డానన్ తెలియచేశారు. ఇదే అంశంపై ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి సమావేశం కానున్న నేపథ్యంలో ఈ ప్రకటన వెలువడింది.

టీచర్లకు ఒక్కటే యాప్

త్వరలో సిద్ధం చేయండి

ఎపి మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ బ్లూప్రింట్‌పై ప్రజాభిప్రాయం :

సమీక్షలో లోకేష్



అమరావతి : ఉపాధ్యాయులకు యాప్‌ల భారం తొలగించే ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా పూర్తిచేయాలని అధికారులను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. ఉండవల్లిలోని ఆయన నివాసంలో పాఠశాల, ఇంటర్మీడియట్ విద్యపై అధికారులతో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు ఇప్పుడున్న అనేక యాప్‌ల స్థానంలో ఒకే యాప్‌ను రూపొందించాలంటూ గతంలో జారీ చేసిన ఆదేశాలను గుర్తు చేశారు. ఆ ప్రక్రియ ఎంత వరకు వచ్చిందో అడిగి తెలుసుకున్నారు. సాధ్యమైంత త్వరలో ఒకే యాప్‌ను రూపొందించి అందచేయాలని ఆదేశించారు. ఎపి మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ బ్లూ ప్రింట్‌పై ప్రజాభిప్రాయం సేకరించాలని, దీనికోసం బ్లూ ప్రింట్‌ను త్వరగా సిద్ధం చేయాలని చెప్పారు. ఉపాధ్యాయ బదిలీ చట్టంపైన ఉపాధ్యాయులు, సంఘాల నుంచి అభిప్రాయాలను సేకరించాలని మంత్రి అధికారులకు సూచించారు. సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో ఉపాధ్యాయులకు ఉపయోగపడే విధంగా పిల్లల్లో అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి శనివారం "నో బ్యాగ్ డే" గా ప్రకటించి విద్యార్థులకు కరిక్యులమ్ యాక్టివిటీస్ రూపొందించాలని ఆదేశించారు. పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల వాస్తవ సంఖ్యను నిర్ధారించేందుకు ఆపార్‌ఐడిని అనుసంధానించే కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. పాఠశాల విద్యలో గత వైసిపి ప్రభుత్వం అనాలోచితంగా తీసుకొచ్చిన జీఓ నెంబరు 117 ఉప సంహరణపై క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయులు, వివిధ సంఘాల నుంచిఅభిప్రాయసేకరణ చేసిన తర్వాత అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని సూచించాలని అన్నారు. ఈ సమవేశంలో పాఠశాల విద్య కార్యదర్శి కోన శశిధర్, డైరెక్టర్ వి.విజయ్‌రామరాజు, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ కృతికా శుక్లా, సమగ్ర శిక్ష ఎస్‌పిడి బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గీతంలో కంటెంట్ రైటింగ్ వర్క్‌షాప్ ప్రారంభం

- నాలుగు రోజుల పాటు కొనసాగనున్న కార్యశాల
- నైపుణ్యాలను పెంపొందించనున్న పరిశ్రమ నిపుణులు



నవతెలంగాణ-పటాన్‌చెరు

కంటెంట్ సృష్టి, వేగంగా అభివృద్ధి చెందుతున్న కమ్యూనికేషన్ రంగంతో కంటెంట్‌ను సృష్టించేలా విద్యార్థులకు అవసరమైన నైపుణ్యాలతో సన్నద్ధం చేయడమే లక్ష్యంగా గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (జీఎస్ హెచ్ఎస్) క్యాంపస్‌లో నాలుగు రోజుల పాటు 'కంటెంట్ రైటింగ్ వర్క్‌షాప్'ను నిర్వహించారు. మీడియా స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో జీఎస్ హెచ్ఎస్ డైరెక్టర్ ప్రొఫెసర్ సన్నీ గోస్మాన్ జోస్ ఈ వర్క్‌షాప్‌ను మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల వ్యక్తిగత, వృత్తిపరమైన అభివృద్ధిని పెంపొందించడమే ఈ వర్క్‌షాప్ లక్ష్యమని తెలిపారు. సాంకేతికత పరిజ్ఞానంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా కంటెంట్ రైటింగ్ వృత్తిపై కృత్రిమ మేధస్సు ప్రభావాన్ని స్వీకరించడం ప్రాముఖ్యతను వివరించారు. ఈ వర్క్‌షాప్.. క్యాంపస్ నియామకాలకు సిద్ధం కావడం గురించి మాత్రమే కాదని, కాలానుగుణంగా విద్యార్థులు అభివృద్ధి చెందేలా రూపొందించామని అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రాణించాలని విద్యార్థులకు సూచించారు. కెరీర్ గైడెన్స్ కేంద్రం డైరెక్టర్ డాక్టర్ మమతారెడ్డి మాట్లాడుతూ.. మిమ్మల్ని ప్రత్యేకంగా నిలబెట్టే ఒక ప్రత్యేక ఆలోచనా విధానాన్ని విద్యార్థులు అభివృద్ధి చేసుకోవడం చాలా ముఖ్యమని తెలిపారు. ఈ వర్క్‌షాప్ నిరంతర అభ్యాస సంస్కృతిని పెంపొందిం చడంలో నిర్వాహకుల దూరదృష్టికి నిదర్శనంగా అభివర్ణిం చారు.

మొదటి సెషన్ రిసోర్స్ పర్సన్‌గా జియో మారియా పాల్గొని, కంటెంట్ రైటింగ్ ప్రాథమిక అంశాలు, కంటెంట్ రకాలు, ఎస్ఈవో టెక్నిక్ వంటి కీలక అంశాలను విద్యార్థులకు పరి చయం చేశారు.

రెండో సెషన్‌లో కంటెంట్ కమ్యూ నికేషన్, వ్యక్తిగత బ్రాం డింగ్ వంటి వాటిని వివరిం చారు. మూడు రోజులు కొనసాగే ఈ కార్య క్రమంలో పరిశ్రమ నిపుణు లు పాల్గొని ఆయా అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమం లో ఆంగ్ల విభాగాధి పతి డాక్టర్ సయంతన్ మండల్, మీడియా స్టడీస్ విభాగాధిపతి ఎస్ఆర్ సంజీవ్ కుమార్, దాదాపు 40 మంది యూజీ, పీజీ విద్యార్థులు పాల్గొంటున్నారు.

లైంగిక వేధింపుల విచారణకు ప్రత్యేక సెషన్ కోర్టులు

ప్రతి జిల్లాలో సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ : డిజిపి



శ్రీకాకుళం : మహిళలు, వృద్ధులు, చిన్నారులపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న నేరస్థులకు వెంటనే శిక్ష పడేలా ప్రత్యేక సెషన్ కోర్టులు ఏర్పాటు చేసే ప్రతిపాదన ఉన్నట్లు డిజిపి ద్వారకా తిరుమలరావు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన ఎస్‌పి కార్యాయలంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా జిల్లాకు ఒక సైబర్ పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేయడానికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అనుభవంగల సైబర్ నిపుణులు ఈ పోలీస్‌స్టేషన్‌లో నియమిస్తామని, దీనివల్ల పెండింగ్‌లో ఉన్న కేసులను ఛేదించేందుకు అవకాశం ఉంటుందన్నారు. అవగాహన ద్వారా మాత్రమే సైబర్ నేరాలు అరికట్టగాలమని చెప్పారు. డిజిటల్ అరెస్టు అనేది చట్ట ప్రకారం లేదని స్పష్టం చేశారు. గంజాయి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఇందులో భాగంగా ఈగల్ టాస్క్‌ఫోర్సు ఏర్పాటు చేశామన్నారు. అనకాపల్లి జిల్లా పరవాడలో మంగళవారం 39 వేల కేజీల గంజాయిని నిర్వీర్యం చేశామని తెలిపారు. ప్రతి నేరం రికార్డు అయ్యేందుకు సిసి కెమెరాలు చాలా ఉపయోగపడతాయని, రాష్ట్ర వ్యాప్తంగా గుర్తించిన స్పాట్లలో ప్రజలు, దాతల సహకారంతో రెండు లక్షల కెమెరాలను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. పొరుగు రాష్ట్రాల్లో మావోయిస్టుల ఏరివేతతో ఆంధ్ర, ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో తలదాచుకునేందుకు వచ్చే అవకాశం లేదని, రాష్ట్ర పోలీసు శాఖ అంత అసమర్థంగా ఏమీ లేదని ఒక ప్రశ్నకు బదులుగా చెప్పారు. సమావేశంలో డిఐజి గోపినాథ్ జెట్టి, ఎస్‌పి కె.వి మహేశ్వరరెడ్డి, అదనపు ఎస్‌పిలు పి.శ్రీనివాసరావు, కె.వి రమణ, ఆర్‌టిసి విజయనగరం జోన్ ఇడి ఎ.విజయ్‌కుమార్, విశాఖ డిపిటిఒ బి.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఒలింపిక్స్ నిర్వహణతో అనేక అవకాశాలు

భారత క్రీడలు ఉన్నత శిఖరాలకు విశ్వక్రీడ దోహదం : మోడీ



డెహ్రాడూన్: భారత్‌లో 2036 ఒలింపిక్స్ నిర్వహిణ హక్కులను దక్కించుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నామని ప్రధాని మోడీ పేర్కొన్నారు. విశ్వక్రీడల నిర్వహణ భారతీయ క్రీడలను ఉన్నత శిఖరాలకు తీసుకెళు ందన్నారు. డెహ్రాడూన్‌లో జరుగుతున్న 38వ జాతీయ క్రీడలను ప్రారంభించిన ఆయన.. ఒలింపిక్స్ వల్ల అనేక రంగాల్లో విస్త ృత అవకాశాలు వస్తాయన్నారు.

"ఒలింపిక్స్ 2036 నిర్వహణ హక్కుల కోసం అన్ని ప్రయత్నాలు చేస్తున్నాం. కేవలం ఇవి క్రీడలకే పరిమితం కాదు.. ఇవి జరిగిన చోట అన్ని రంగాలు లాభపడతాయి. క్రీడాకారులతోపాటు ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది భారత్‌కు వస్తారు. ఇక్కడి క్రీడాకారులకు అనేక వసతులు అందుబాటులోకి వస్తాయి. నిర్మాణ రంగానికి ఊతమిస్తుంది. రవాణా వసతులు, ముఖ్యంగా పర్యాటకం మెరుగుపడుతుంది" అని ప్రధాని మోడీ పేర్కొన్నారు.

యూసీసీ అమలుపై హర్షం

రాజ్యాంగ, ప్రజాస్వామ్య స్ఫూర్తిని ఉమ్మడి పౌరస్మ ృతి (యూసీసీ) బలోపేతం చేస్తుందని ప్రధాని మోడీ పేర్కొన్నారు. యూసీసీని అమలు చేస్తున్న ఉత్తరాఖండ్‌ను అభినందించిన ఆయన.. ఈ చట్టాన్ని సెక్యులర్ సివిల్ కోడ్‌గా అభివర్ణించారు. క్రీడల మాదిరిగానే యూసీసీ కూడా జట్టు స్ఫూర్తితో కూడుకున్నదని, ఎవరిపైనా వివక్ష లేదన్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి ఇద్దరు మృతి

కూలిన రెండు ఇండ్ల పై కప్పులు

ఎనిమిది మందికి తీవ్ర గాయాలు

నంద్యాల: గ్యాస్ సిలిండర్ పేలి ఇద్దరు మృతి చెందిన ఘటన నంద్యాల జిల్లా నంద్యాల మండలం చాపిరేవుల గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. నంద్యాల రూరల్ తహశీల్దార్ సత్య శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. చాపిరేవుల గ్రామంలోని భీమవరం సుబ్బరాయుడు ఇంటిలో రాత్రంతా గ్యాస్‌లీక్ అయ్యింది. ఇల్లంతా గ్యాస్‌తో నిండిపోయింది. మంగళవారం తెల్లవారుజామున నాలుగు గంటలకు కుటుంబ సభ్యులు నిద్ర నుండి లేచారు. పనులు చేసుకోవడానికి లైట్ వేయగా గ్యాస్ సిలిండర్ పేలింది. దీంతో సుబ్బరాయుడు ఇంటితో పాటు పక్కనే ఉన్న భీమవరం లింగమయ్య ఇంటి పైకప్పులు కూలిపోయాయి.